

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹6.00

సంపుటి: 10
సంచిక: 321

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మీ కుట్రలు సాగనివ్వం

టీడీపీ వైఖరిపై నిప్పులు చెరిగిన బీజేపీ నేతలు

- అసెంబ్లీ సీట్లు పెంచనందుకేనా కుట్ర?: సోము వీర్రాజు
- కేంద్రంలో అధికారం అనుభవిస్తూ పార్లమెంటులో నిరసనలా?
- సోనియాతో టీడీపీ ఎంపీల బృందం ఎలా భేటీ అవుతుంది?
- లెక్కలు చెప్పకుండా నిధులెలా ఇస్తారు?
- వెనకబడిన జిల్లాలకిచ్చిన 900కోట్లు ఏమయ్యాయి?
- మమ్మల్ని ముంచాలని చూస్తే మీరే మునిగిపోతారు: కన్నా
- కేంద్రం సాయంపై నివేదిక విడుదల చేసిన హరిబాబు
- పొత్తుపై తేల్చుకోవాల్సింది టీడీపీయేనని కుండబద్దలు
- రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టొద్దు: జీవీఎల్
- బీజేపీపై ఉద్దేశపూర్వకంగానే విమర్శలు: విష్ణుకుమార్‌రాజు
- టీడీపీపై ప్రశ్నలతో విరుచుకుపడ్డ బీజేపీ నేతలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పరిపాలనలో ఘోర వైఫల్యం, అవినీతి అక్రమాలతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న తెలుగుదేశం పార్టీ ఆ తప్పంతా కేంద్రంపై నెట్టివేసి తప్పుకోవాలని చూస్తోం దంటూ భారతీయ జనతా పార్టీ నేతలు విరుచు కుపడ్డారు. నాలుగేళ్ల పాటు కేంద్రంలోని ఎన్డీయే ప్రభు త్వంలో భాగస్వామిగా ఉంటూ, కేంద్ర మంత్రి పదవులు అనుభవిస్తూ వచ్చిన టీడీపీ ఎన్నికల సంవత్సరం దగ్గరపడుతున్న సమయంలో కుట్రలు చేస్తోం దంటూ మండిపడ్డారు. ఎన్నికల ముందు కేంద్రాన్ని దోషిగా చూపించి లబ్ధి పొందా లన్న ఎత్తుగడలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ నేతలకు ఆ పార్టీ అధిష్టానం సూచనలు జారీచేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు

మిగతా 2వ పేజీలో ▶

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం బోడగుడిపాడు బహిరంగసభలో అశేషజనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



హోదా కోసం
ఊపిరున్నంత వరకూ
పోరాడుతా..

బోడగుడిపాడు సభలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- వివరాలు 6లో

కదం తొక్కిన ఉద్యోగులు

సీపీఎస్ రద్దు చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

- సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలంటూ ధర్నాలు, ర్యాలీలు
- సీపీఎస్ రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్

5లో

మహిళాభ్యున్నతికి 'సాక్షి' సంతకం..

> తూటాలకు గాయపడిన వ్యక్తిగా నన్ను గుర్తించాలని అనుకోవడం లేదు.. ఆ తూటాలకు ఎదురొడ్డిన శక్తిగా గుర్తించాలని కోరుకుంటున్నా.
> – మలాలా యూసఫ్ జాయ్

ప్రతి మహిళా ఓ శక్తి స్వరూపిణి! అనేకానేక ఘర్షణల మధ్య, అసమానతల మధ్య తనను తాను నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్న మహిళలెందరో. ఈ అణచివేతలు.. అసమానతలు ఛేదించుకొని మహిళలు ఓ మహోజ్వల శక్తిగా వెలగాలన్నది 'సాక్షి' సంకల్పం.

ఈ క్రమంలో మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల చుట్టూ అల్లుకున్న సమస్యలను, పరిష్కారాలను పాఠకుల ముందుంచేందుకు మా తరఫు ప్రయత్నమే 'నేను శక్తి'.

ఈ విషయాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలని మా సంస్థలోని మహిళా ఉద్యోగులం, ఇతర ఎడిటోరియల్ సభ్యులతో కూర్చొని చర్చించాం. ప్రతీ మహిళా ఉద్యోగి తన అనుభవాలను పంచుకున్నారు. సలహాలు, సూచనలు ఇచ్చారు. వీటన్నింటినీ చర్చించి, సమీక్షించి, ఏవి పాఠకుల ముందు ఉంచాలో ఆలోచించాం. చివరికి నాలుగు అంశాలపై దృష్టి పెట్టాలని సంకల్పించాం. అవి

- **లింగ వివక్ష**
- **గృహ హింస**
- **వేధింపులు**
- **సాధికారత**

మనలో ఎందరో పై సమస్యలతో సతమత మవుతున్నారు. వారికి వారి హక్కులేమిటో, ఇప్పుడున్న క్లిష్టపరిస్థితి నుంచి ఏవిధంగా బయటపడవచ్చో తెలపాలని అనుకున్నాం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నవారు వాటి నుంచి ఎలా గట్టెక్కగలిగారో తెలియజేయాలని భావించాం.

అలాగే మనలో కొంతమందికి ఇంత పెద్ద సమస్యలు అనుభవంలోకి రాకపోవచ్చు, కనబడకపోవచ్చు. అటువంటి వారికి విజ్ఞప్తి ఒక్కటే. మాకు సంబంధం లేదంటూ దూరంగా ఉండకండి. సాటి స్త్రీలపైన జరుగుతున్న నేరాలను నిరోధించేందుకు మీరు ఏమి చేయగలరో ఆలోచించండి. గృహ హింస నిరోధించడానికి కాలింగ్‌బెల్ నొక్కి 'లోపల ఏమి జరుగుతోంది?' అని గట్టిగా ప్రశ్నించడం వంటి చిన్న చొరవ సైతం మహోపకారమే అవుతుంది. సమాజంలోని ప్రతి ఒక్కరం మనం చేయగలిగింది చేస్తేనే.. అఘాయిత్యాలను, అసమానతలను ఆపగలుగుతాం.

కొంతమంది పురుషులకు ఇవేవీ వారికి సంబంధించిన విషయంగా అన్పించకపోవచ్చు. కానీ ప్రతి పురుషుడి జీవితం తనను ప్రేమించే తల్లి, తాను ప్రేమించే చెల్లి, కూతురు, భార్య, స్నేహితురాలు.. వీరందరి చుట్టూనే పెనవేసుకుపోయింది. వీరందరిపట్ల పురుషుడికి బాధ్యత కూడా ఉంటుంది.

ఈ మాటలు రాస్తున్న సమయంలో 'మహిళలు చేస్తున్న నేరాల మాటేమిటి?' అంటూ ప్రశ్నించేవారుంటారని తెలుసు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో స్వాతి అనే మహిళ పథకం ప్రకారం భర్తను హత్య చేసిన ఘటన వంటి దురంతాలను గుర్తించకుండా ఎట్లా ఉండగలం? అవును. అటువంటి దారుణాలు జరుగుతున్న మాట నిజమే. వాటినీ నివారించవలసిన అవసరం ఉంది. కానీ మనం ప్రస్తుతం పరిశీలిస్తున్న అంశాలు వేరు.

చివరిగా నా తోటి మహిళలకు చిన్న నివేదన.. ఏ హక్కు కూడా తిరుగులేనిదీ, షరతులు లేనిదీ కాదు. హక్కులతోనే బాధ్యతలూ పెనవేసుకొని ఉంటాయి. భార్యాభర్తల మధ్య కావచ్చు, తల్లిదండ్రులూ, కుమార్తెల మధ్య కావచ్చు, అత్తమామలూ, కోడళ్ల మధ్య కావచ్చు. బాధ్యతలు లేని హక్కులను మేము సమర్థించం. ఎప్పుడూ అవధులూ, అడ్డుగోడలూ లేకుండా హక్కులూ, బాధ్యతలూ సమపాళ్లతో కలసి సంసారసాగరంలో మన జీవననౌకలను ఒడిదుడుకులు లేకుండా హాయిగా నడిపిస్తాయో అప్పుడే ఆరోగ్యవంతమైన కుటుంబ వ్యవస్థ సాధ్యం. భద్రమైన, న్యాయమైన సమాజానికి ఆరోగ్యవంతమైన కుటుంబమే పునాది. అసమానతలు లేని ఆదర్శవంతమైన సమాజం సాధ్యమా అన్న ప్రశ్నకు సమాధానం.. చాలా వరకూ సాధ్యమే. ఈ ఆదర్శాన్ని సుసాధ్యం చేయడం మన చేతుల్లో పని.

రండి.. కలసి ఉద్యమిద్దాం. లక్ష్యాలను సాధిద్దాం.

- వైఎస్ భారతి
చైర్‌పర్సన్, సాక్షి



నేటి నుంచి సాక్షి ఫ్యామిలీలో ప్రత్యేక కథనాలు

నేటి ఉదయం గం॥ 10.30 ని॥లకు సాక్షి టీవీలో ప్రత్యేక కార్యక్రమం

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర, రాష్ట్ర బీజేపీ నేతలు టీడీపీ వైఖరిపై విమర్శనాస్త్రాలు సంధించారు. గత నాలుగేళ్లుగా కేంద్రం అందించిన సాయం వివరాలతో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు 27 పేజీల నివేదికను ఢిల్లీలో విడుదల చేశారు. కేంద్రం సహాయం చేయడంలేదన్న టీడీపీ వాదనలకు గణాంకాలతో చెక్ పెట్టారు. పొత్తులపై తేల్చుకోవాల్సింది టీడీపీయేనంటూ కుండబద్దలు కొట్టారు. రాజకీయ ప్రయోజనాలకోసం ప్రజలను రెచ్చగొట్టవద్దని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంచలేమన్నందుకే మాపై కుట్ర చేస్తున్నారా? అంటూ బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజమెత్తారు. కేంద్రం ఎంతో సాయం చేస్తుందంటూ నాలుగేళ్లుగా పొగిడిన చంద్రబాబు ఇప్పుడెందుకు ప్లేటు ఫిరాయించారంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో టీడీపీ ఎంపీలు ఎలా భేటీ అవుతారంటూ నిలదీశారు. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పకుండా గొడవ చేస్తున్నారంటూ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. తమను ముంచాలని చూస్తే చంద్రబాబే మునిగిపోతారని హెచ్చరించారు. కేంద్రం ఎంత ఇచ్చిందో, ఎంత ఖర్చుచేశారో బహిరంగ ప్రకటన చేయాలంటూ చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఈవెంట్ల పేరుతో, సదస్సుల పేరుతో ఫైవ్‌స్టార్ హోటళ్లకు కోట్లాది రూపాయలు తగలేస్తున్న టీడీపీ ప్రభుత్వం ఏపీకి నిధుల లోటు ఉందంటే ప్రజలు కూడా నమ్మబోరని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు ఎద్దేవా చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం దుబారాపై చర్చకు సిద్ధమా? అంటూ బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. టీడీపీ కేంద్రంలో అధికారంలో కొనసాగుతూ... ప్రభుత్వ నిర్ణయాలను ఒకవైపు ఆమోదిస్తూ... మరోవైపు ప్రజలను మభ్యపెట్టడానికి సభలో నిరసనలకు దిగుతున్నారనే అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు బీజేపీ నేతలు అస్త్రాలను సన్నద్ధం చేసుకుంటున్నారు.

బీజేపీ లేకపోతే టీడీపీకి అధికారమెక్కడిది?

మిత్రపక్షంగా ఉంటూనే బీజేపీని నిర్వీర్యం చేయడానికి తెలుగుదేశం తెరవెనుక కుట్రలు చేస్తోందని ఆ పార్టీ నేతలు ఎప్పటినుంచో గుర్రుగా ఉన్నారు. బీజేపీ నేతల నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌ఛార్జులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తమ వారికి పనులు కూడా చేయనివ్వకుండా అధికారులకు ఆదేశాలిచ్చారని చెబుతున్నారు. ఇదంతా రాజకీయంగా దెబ్బతీసేందుకు చంద్రబాబునాయుడు తెరవెనుక ఆడిన నాటకమని పేర్కొంటున్నారు. కాకినాడ ఎన్నికల్లో వెన్నుపోటు పొడిచారని గుర్తుచేస్తున్నారు. 'బీజేపీకి రాష్ట్రంలో స్వతంత్రంగా 18 శాతం ఓట్లు సాధించుకొనే సత్తా ఉంది. గతంలో ఇది నిరూపితమైంది. 2014 ఎన్నికల్లో టీడీపీ గెలిచిందంటే అది మా చలవే. టీడీపీ వైఎస్సార్‌సీపీకి కేవలం ఓట్ల తేడా ఐదు లక్షల ఓట్లే. మా వల్ల అధికారంలోకి వచ్చిన టీడీపీ ఇప్పుడు మమ్మల్నే అణగదొక్కాలని చూస్తోంది' అని బీజేపీ సీనియర్ నేత ఒకరు మండిపడ్డారు. 'రాష్ట్ర బీజేపీ పార్టీనే కాకుండా జాతీయ పార్టీని, ప్రధాని మోడీని కూడా రాష్ట్ర ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలని చూస్తోంది. దీనిని మేమెంత మాత్రం సహించబోము. మా తడాఖా ఏమిటో మేమూ చూపిస్తాం' అని మరో బీజేపీ నేత చెప్పారు.

మీ కుట్రలు సాగనివ్వం

లెక్కలు చెప్పడానికి భయమెందుకు?

''టీడీపీ నేతలు నాలుగేళ్లుగా కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తూ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం రాలేదని ఇప్పుడు చెబుతున్నారు. అసలు ఇప్పటివరకు కేంద్రం ఇచ్చిన వాటికి లెక్కలు కూడా చెప్పడం లేదు. పోలవరానికి ఇచ్చిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. యూసీలు ఇవ్వడానికి ఎందుకు అంత భయం? అక్కడ జరిగిన అవినీతి బయటపడుతుందని భయమా? రాజధాని నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చిన నిధుల పరిస్థితీ అలాగే ఉంది. శాశ్వత నిర్మాణాలు కాకుండా తాత్కాలిక నిర్మాణాలంటూ ఆ నిధులు వృధా చేస్తున్నారు. తెరవెనుక లాలూచీలతో ఇవన్నీ తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు అప్పగించి అవినీతికి పాల్పడుతున్నారు. వీటన్నిటిలో ఎంత అవినీతి జరిగిందో అందరికీ తెలుసు. నిధులు కేంద్రం నుంచి సహాయం రావాలంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి తగిన రిపోర్టులు ఉండాలి. ఇతర రాష్ట్రాలు త్వరితంగా డీపీఆర్‌లు పంపించి నిధులు రప్పించుకుంటుండగా ఇక్కడ మాత్రం అలా చేయడం లేదు. వారి వైఫల్యాలకు కేంద్రంపై, బీజేపీపై నిందలు వేస్తున్నారు'' అని బీజేపీ రాష్ట్రనేత ఒకరు అభిప్రాయపడ్డారు.

రాజీనామాలు ఎందుకు చేయడం లేదు?

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. రెండు ఎకరాల ఆసామి రెండు వేల కోట్లకు పైగా ఆస్తులు ఎలా సమకూరాయని కూడా ఆయన పరోక్షంగా సీఎం చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించడం కలకలం రేపింది. ఆ సమయంలో టీడీపీ నేతలు వీర్రాజు ఇంటిపై దాడికి తెగబడ్డారు. మరోవైపు పార్టీ అధినేత ఆదేశాలతో వీర్రాజుపై ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న విమర్శలు గుప్పించారు. చంద్రబాబును విమర్శించే ముందు వీర్రాజు తమ పార్టీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిని వదులుకోవాలని డిమాండ్ చేశారు. అలాగైతే కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై విమర్శలు చేస్తున్న తెలుగుదేశం నేతలు కేంద్ర మంత్రి పదవులకు ఎందుకు రాజీనామాలు చేయలేకపోతున్నారని బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. పదవుల్లో కొనసాగుతూ ప్రశ్నించే అర్హత టీడీపీ వారికి లేనేలేదని, ఇదే అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నదే తమ వ్యూహమని చెబుతున్నారు. అదే సమయంలో ఈ నాలుగేళ్లలో కేంద్రం నుంచి ఇచ్చిన నిధులను, ఇతర ప్రాజెక్టులను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నామని పేర్కొంటున్నారు. కేంద్రం ఇచ్చిన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం సరిగా వినియోగించడం లేదని, అవినీతి అక్రమాలను పాల్పడిందని, వాటినీ ప్రజలకు వివరిస్తామని చెబుతున్నారు. పోలవరం, రాజధాని నిధులే కాకుండా వివిధ పథకాల కింద వచ్చే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వ నేతలు పక్కదారి పట్టిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ పథకం వంటివి వారు ఉదహరిస్తున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి నియోజకవర్గంలోనే రూ.10 కోట్లమేర ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి పట్టిన వైనాన్ని వారు గుర్తుచేస్తున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు పేర్లు మార్చి తన సొంత పథకాలుగా చంద్రబాబు ప్రచారం చేసుకుంటూ లబ్ధి పొందుతున్నారని, కనీసం ప్రధాని ఫొటో కూడా పెట్టడం లేదని ఇప్పటికే బీజేపీ నేతలు మండిపడుతున్నారు. సోము వీర్రాజు ప్రకటనల తరువాత బీజేపీ రాష్ట్ర నేతల ప్రచారాలు ప్రజల్లోకి వెళ్లకుండా కట్టడికి తెలుగుదేశం నేతలు కొన్ని లీకులు ఇప్పించి సోము వీర్రాజును ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా మందలించినట్లు తమ మీడియాలో ప్రచారం చేయించారు. భారతీయ జనతా పార్టీ నేతలు వాటిని ఖండించడమే కాకుండా ఇప్పుడు మరింత ఉధృతంగా టీడీపీపై విమర్శల దాడి పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు. సాక్షాత్తూ అమిత్‌షానే తమకు మార్గనిర్దేశం చేసినందున జిల్లా స్థాయి వరకు తెలుగుదేశం పార్టీ మోసపూరిత నిరసన నాటకాన్ని ప్రజల ముందు ఎండగట్టాలని బీజేపీ నేతలు నిర్ణయించారు.


@ysjagan

హోదాను తాకట్టు పెట్టే హక్కు చంద్రబాబుకి ఎవరిచ్చారు?

ట్విట్టర్‌లో ప్రశ్నించిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు హక్కుగా లభించిన ప్రత్యేక హోదాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ నైతిక హక్కుతో తాకట్టు పెట్టారంటూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా రాజకీయ పరిస్థితులపై వైఎస్ జగన్ శనివారం ట్వీట్ చేశారు. 'రాష్ట్ర విభజన చేసినప్పుడే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్రం ప్రకటించింది. పార్లమెంట్ వేదికగా అప్పటి పాలక, విపక్షాలు కలిసి ఇచ్చిన మాటకు అనుగుణంగా మార్చి 2014లో ఇదే అంశాన్ని నాటి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. ఆ తర్వాత ప్రత్యేక హోదా అమలు అంశాన్ని ప్రణాళికా సంఘానికి కూడా పంపారు. ఇలా రాష్ట్ర ప్రజలకు హక్కుగా లభించిన ప్రత్యేక హోదాను చంద్రబాబు ఏ నైతిక హక్కుతో తాకట్టు పెట్టారు?' అని వైఎస్ జగన్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. 'ఏముందో కూడా తెలియని ప్రత్యేక ప్యాకేజీ కోసం ప్రత్యేక హోదాను తాకట్టు పెడతారా? ఇకనైనా మీ కంటి తుడుపు మాటలు ఆపండి. ఏం చేయదలుచుకున్నారో రాష్ట్ర ప్రజలకు చెప్పండి' అని ట్వీట్ చేశారు.



అసెంబ్లీ సీట్లు పెంచనందుకేనా కుట్ర?

సోము వీర్రాజు, బీజేపీ ఎమ్మెల్సీ



ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 175 నుంచి 225కి పెరుగుతాయని కొన్నాళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వం లీకులిస్తోంది. కానీ ఇప్పుడు అది సాధ్యం కాదని ఏమైనా సమాచారం వచ్చిందా? అందుకేనా ఈ గొడవ? ఏపీకి మించి ఏ రాష్ట్రానికీ కేంద్రం అంత సహకరించలేదని నాలుగేళ్లుగా చెప్పుకున్న చంద్రబాబు ఇప్పుడు ఉన్నట్టుండి ఎందుకు ప్లేటు ఫిరాయించారు..? ప్రత్యేక ప్యాకేజీ లో భాగంగా 16వేల రూ.కోట్లు రావాలని లెక్క అడుగుతున్నారు. అసలు ఆ నిధులు ఖర్చు పెట్టేందుకు సమగ్ర ప్రణాళిక ఏమైనా ఉందా? ఇప్పటివరకు వెనుకబడిన జిల్లాలకు రూ.900కోట్ల నిధులు విడుదల చేస్తే... ఎక్కడ ఖర్చు చేశారు? పోలవరం నిర్మాణానికి తాజాగా ఇచ్చిన రూ.400 కోట్లతో కలిపి ఇప్పటివరకు రూ.5,000 కోట్లు ఇచ్చారు. ఆ నిధుల లెక్క ఎక్కడ? ఈ ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానం చెప్పకుండా యాగీ చేయడంలో అర్థమేమిటి? రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ అంశాలు పరిశీలనలో ఉన్నాయి. విభజన చట్టం బిల్లు ప్రకారం 2022 వరకు సమయముంది. కానీ ఈలోగానే గొడవ చేయడం కుట్రపూరితమే. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులవల్లే రాష్ట్రం ఇలా ఉంది. దాని గురించి చంద్రబాబు మాట్లాడకపోగా... సోనియాగాంధీతో టీడీపీ ఎంపీల బృందం ఎలా భేటీ అవుతుంది?

బీజేపీపై ఉద్దేశపూర్వక కుట్ర



రాష్ట్రంలో బీజేపీపై ఉద్దేశపూర్వకంగానే టీడీపీ కుట్ర చేస్తోంది. అందుకే బడ్జెట్ సాకుతో ఢిల్లీ సాక్షిగా ఆ పార్టీ ఎంపీలు డ్రామాలాడుతున్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే రూ.2500 కోట్లు ఇచ్చింది. సాధారణంగా ఇల్లు నిర్మించాలంటే భూమి ఖరీదు కాకుండా చదరపు అడుగుకి రూ.1500 నిర్మాణ ఖర్చు అవుతుంది. అన్ని వసతులతో కూడిన రాజధాని కాబట్టి చదరపు అడుగుకి రూ.2500 చొప్పున భావించినా కేంద్రం ఇచ్చిన నిధులతో కోటి చదరపు అడుగుల భవనాల్ని కట్టుకోవచ్చు. కానీ ఒక్క భవనం కూడా నిర్మాణం కాలేదు. ఉత్సవాలు, పండగల పేరుతో ఈవెంట్ మేనేజర్లకు, సదస్సుల పేరుతో ఫైవ్ స్టార్ హోటళ్లకు కోట్లాది రూపాయలు తగలేస్తున్న ఏపీకి డబ్బులోటు ఉందంటే ప్రజలకు కూడా అనుమానం వస్తోంది. ఏపీ ప్రభుత్వం రూ.16 వేల కోట్లు లోటు బడ్జెట్ చూపిస్తోంది. కానీ అందులో తమ పార్టీ మనుగడ కోసం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ, ఐదు రెట్లు పింఛను పెంపునకు అయ్యే ఖర్చులను కూడా చూపించడం హాస్యాస్పదం.

– విష్ణుకుమార్ రాజు, బీజేపీ శాసనసభాపక్ష నేత

పొత్తులపై టీడీపీయే తేల్చుకోవాలి

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. ఏపీని కేంద్రం అన్ని విధాలుగా ఆదుకుంటోంది. చట్టంలోని హామీల అమలుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీడీపీ ఎంపీలు యాగీ చేయడం సరికాదు.. వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. కేంద్రం, రాష్ట్రం ఒకదానికొకటి సహకరించుకుంటేనే రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరుతాయి. ఇప్పటివరకు మంజూరైన ప్రాజెక్టులన్నీ అలాగే సాకారమయ్యాయి. కేంద్రం అనేక సంస్థలను మంజూరు చేసింది. కానీ వాటి ఏర్పాటుకు అవసరమైన భూమి ఇవ్వాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ ఉన్నంతవరకూ, రాష్ట్ర మంత్రివర్గంలో బీజేపీ ఉన్నంతవరకూ రెండు పార్టీలు మిత్రపక్షాలే. కాదనుకుంటే పొత్తుపై తేల్చుకోవాల్సింది టీడీపీయే.

– కంభంపాటి హరిబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు,

కేంద్రం ఎంత ఇచ్చిందో బహిరంగంగా ప్రకటించండి

కన్నా లక్ష్మీ నారాయణ, బీజేపీ నేత



రాష్ట్రంలో బీజేపీని ముంచాలని చూస్తే ముందుగా చంద్రబాబే మునిగిపోతారు. నాలుగేళ్ళలో కేంద్రం రాష్ట్రానికి ఎంత ఇచ్చిందో, ఎంత ఖర్చు చేశారో బాబు బహిరంగ ప్రకటన చేయాలి. అసలు రాజధాని అమరావతి నిర్మాణానికి ఇంతవరకు డిజైన్‌లు ఖరారు కాలేదు.. మాస్టర్ ప్లాన్ అప్రూవల్ కాలేదు.. పర్యావరణ కేసులు పరిష్కారం కాలేదు.. భూ వివాదాలు సెటిల్ కాలేదు.. అయినా రాజధాని నిర్మాణం పేరిట కేంద్రం ఇప్పటివరకు రూ.2500 కోట్లు ఇస్తే లెక్క చెప్పలేదు. మాటిమాటికీ బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌ల మెట్రో రైళ్ల ప్రాజెక్టులు ప్రస్తావిస్తున్నారు. అసలు ఆ నగరాల జనాభా ఎంత? అమరావతి జనాభా ఎంత? విభజన చట్టంలో పేర్కొన్న హామీలకు సంబంధించి 80శాతం హామీలు అమలయ్యాయి.. మిగతావి పరిశీలనలో ఉన్నాయి. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినందుకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీకి ధన్యవాదాల తీర్మానం ప్రవేశపెట్టిన చంద్రబాబు ఇప్పుడెలా విమర్శలు చేస్తారు? జనం ఏమనుకుంటారన్న స్పృహ కూడా బాబుకు లేదా?

ప్రజలను రెచ్చగొట్టొద్దు



జీవీఎల్ నరసింహారావు, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి

అభివృద్ధి విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎక్కడా రాజకీయం చేయలేదు. అన్ని రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తూ టీం ఇండియా స్ఫూర్తితో ముందుకెళ్తోంది. ఏపీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇచ్చిన హామీలను అమలు చేస్తోంది. కానీ, కేంద్ర సాయంతోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందిన దాఖలాలు లేవు. రాష్ట్ర అభివృద్ధికి ప్రజలే కారణం. వారిని రెచ్చగొట్టడం, తప్పుదోవ పట్టించడం సరికాదు. ఒక విజన్‌తో రాష్ట్ర ప్రజలను అభివృద్ధి వైపు నడిపించడం సరైన నాయకుడి లక్ష్యం. కేంద్రం నుంచి రావాల్సిన నిధులన్నీ వస్తాయి. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టొద్దు.

బహిరంగ చర్చకు సిద్ధమా?



మాధవ్, బీజేపీ ఎమ్మెల్సీ

ఈ నాలుగేళ్ళలో కేంద్ర ప్రభుత్వం... రాష్ట్రానికి ఎన్ని నిధులు ఇచ్చింది.. చంద్రబాబు సర్కారు ఎంత ఖర్చు చేసింది... అందులో సద్వినియోగం జరిగింది ఎంత.. దుబారా, ఆడంబరపు ఖర్చులు ఎంత... ఈ విషయాలపై బహిరంగ చర్చకు టీడీపీ నేతలు సిద్ధమేనా? టీడీపీ నేతలు ఓ పథకం ప్రకారం బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇన్నిరోజుల పాటు కేంద్రం సహకరిస్తోందని చెప్పి, చివరి ఏడాదిలో ఏమీ చేయడం లేదని డ్రామాలు ఆడితే.. ఎవరేంటో ప్రజలు అర్థం చేసుకుంటారు.

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై కేంద్రం అసంతృప్తి

- విధాన నిర్ణయాల జాప్యం వల్లే సాయం ఆలస్యం
- మెట్రోలు, పోలవరం నిధుల విడుదలలో అందుకే జాప్యం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం తీవ్ర అసంతృప్తితో ఉంది. పలు విధాన నిర్ణయాల్లో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం వల్లే కేంద్ర సాయం ప్రకటనల్లో జాప్యం జరుగుతోందని కేంద్ర పెద్దలు రాష్ట్ర బీజేపీ నేతల వద్ద వ్యాఖ్యానించినట్టు సమాచారం. డబ్బులు ఇవ్వాలని కేంద్రానికి ఉన్నా.. ఇవ్వడానికి అనువైన వాతావరణం రాష్ట్రం కల్పించడం లేదన్నది కేంద్ర ప్రభుత్వ వాదనగా తెలుస్తోంది. ముఖ్యంగా మెట్రోలు, పోలవరం ప్రాజెక్టు, స్టీలు ప్లాంటు, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, దుగరాజపట్నం పోర్టు తదితర విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వ స్పందన సరైన రీతిలో లేదని కేంద్రంలోని పెద్దలు వ్యాఖ్యానించినట్టు సమాచారం. మెట్రోల విషయంలో గానీ, ఇతర సంస్థల విషయంలో గానీ తాము ఇలా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కేంద్రం కాదనదని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఇచ్చిన నిధులకే లెక్కలు లేని పరిస్థితి ఉందని మరొక సీనియర్ నేత వ్యాఖ్యానించారు. 'విజయవాడ మెట్రో ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనుమానాస్పదంగా ఉంది. ఒక్కో సందర్భంలో ఒక్కో తీరుగా ప్రవర్తించింది. కేటాయింపులు చేసే పరిస్థితి ఎక్కడ కల్పించారు?' అని కేంద్ర మంత్రి ఒకరు రాష్ట్ర బీజేపీ నేతల వద్ద వ్యాఖ్యానించినట్టు సమాచారం. దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే మొత్తం నిధులు మేం భరిస్తామని నితిన్ గడ్కరీ పార్లమెంటులోనే స్పష్టం చేసినా రాష్ట్రం నుంచి సరైన స్పందన లేదని ఒక సీనియర్ నేత 'సాక్షి'తో వ్యాఖ్యానించారు. ఇక జాప్యంలో కేంద్రం పాత్ర ఎక్కడ ఉంది? అని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ సీట్ల పెంపుపై పట్టుపట్టుతున్నా.. చట్టంలో అందుకు వీలు లేకుండా పోయిందని తమ నిస్సహాయతను వ్యక్తంచేశారు. రైల్వే జోన్ ప్రకటనలో పొరుగు రాష్ట్రమైన ఒడిశాతో కొంత ఇబ్బంది ఉన్నా.. మన జిల్లాలన్నీ ఉండేలా రైల్వే జోన్ ప్రకటన చేసేందుకు కేంద్రానికి ఇబ్బంది ఉండకపోవచ్చునని ఒక సీనియర్ నాయకుడు తెలిపారు. ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఖర్చు పెట్టిన దాఖలాలు లేవని, పొత్తు బెడిసి కొడితే అన్ని విషయాలు బయటకు వస్తాయని బీజేపీ రాష్ట్ర నాయకులు భావిస్తున్నారు.

ఏపీకి ఎంతో ఇచ్చాం.. లెక్కలివిగో

ఢిల్లీలో 27 పేజీల నివేదిక విడుదల చేసిన హరిబాబు

- సంస్థల ఏర్పాటు, నిధుల మంజూరు ఒక్క రోజులోనే జరిగిపోవు
- హామీలు పదేళ్లలోపు అమలు చేయాలని చట్టమే చెబుతోంది
- రాష్ట్ర ప్రభుత్వాలకు సొంత విజన్ ఉండాలన్న జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ



మీడియాతో మాట్లాడుతున్న హరిబాబు, గంగరాజు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, ఆ మేరకు ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను వెల్లడించారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో శనివారం బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు, ఎంపీ గోకరాజు గంగరాజుతో కలిసి 27 పేజీల నివేదికను విడుదల చేశారు. ఏపీకి ఇచ్చిన హామీలను పదేళ్లలో అమలు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందన్నారు. సంస్థల ఏర్పాటు, నిధుల మంజూరు అన్నీ ఒక్క రోజులో జరిగిపోయేవి కావని, దశల వారీగా ఉంటాయని తెలిపారు. కేవలం కేంద్ర ప్రభుత్వంపైనే ఆధారపడి అభివృద్ధి చెందిన రాష్ట్రాలు దేశంలో ఎక్కడా లేవని, రాష్ట్రాలకు సొంత విజన్ ఉండాలని జీవీఎల్ చెప్పారు. రాష్ట్ర నాయకత్వం ఆ దిశగా ప్రజలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

పోర్టు నిర్మాణానికి కేంద్రం సిద్ధం

- అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం అంగీకరించింది. విజయవాడ మెట్రోరైల్‌కు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది.
- విశాఖపట్నం మెట్రోకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత కోరింది.
- దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు కేబినెట్ ఆర్థిక వ్యయ కమిటీ అంగీకరించింది. పోర్టుకు సమీపంలోనే ఉన్న 'ఇస్రో' భద్రతాపరమైన అంశాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా చూపించే పోర్టు నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉంది.
- కడప స్టీల్‌ప్లాంట్‌పై అధ్యయనం జరుగుతోంది. ప్రత్యేక రైల్వే జోన్‌పై త్వరలోనే ప్రకటన ఉంటుంది.
- పెట్రోలియం రంగంలో ఏపీలో రూ.1.40 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు చమురు సంస్థలు ముందుకొస్తున్నాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం 110 ప్రాజెక్టులను ఆమోదించి, 6.8 లక్షల ఇళ్లు మంజూరు చేసింది. దీనికి అయ్యే రూ.27,200 కోట్ల ఖర్చులో కేంద్రం రూ.10,200 కోట్లు భరిస్తుంది.
- స్మార్ట్ సిటీల కింద ఐదు నగరాలను ఎంపిక చేసింది. నేషనల్ వాటర్ వేస్‌లో భాగంగా బకింగ్‌హామ్ కాలువ అభివృద్ధికి రూ.7,015 కోట్ల నిధులతో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. రైల్వే ప్రాజెక్టుల్లోనూ ఏపీకి పెద్దపీట వేస్తోంది.


ఐఐఐటీ డీఅండ్‌ఎం-కర్నూలు	రూ.20 కోట్లు

అనంతపురం సెంట్రల్ వర్సిటీ, విజయనగరం గిరిజన వర్సిటీ ఏర్పాటుకు

ఒక్కొక్క దానికి రూ.10 కోట్లు (వీటి ఏర్పాటును పార్లమెంట్ ఆమోదించే ప్రకియ వేగంగా కొనసాగుతోంది)

ఇప్పటి వరకు ఇంత ఇచ్చాం

రాజధానికి రూ. 2,500 కోట్లు
త్వరలో మరో వెయ్యి కోట్లు





పోలవరం ప్రాజెక్టుకు రూ. 4,662 కోట్లు

రాష్ట్ర ఆర్థిక లోటు భర్తీకి రూ. 3,979 కోట్లు

2020 వరకు మొత్తం ఆర్థిక లోటు భర్తీకి ఇవ్వనున్న నిధులు రూ. 22,113 కోట్లు

తిరుపతి ఐఐటీకి 90.93 కోట్లు

ఐఐఎస్ఈఆర్‌కు 64 కోట్లు

తాడేపల్లి గూడెం నిట్‌కు 50 కోట్లు

విశాఖ ఐఐఎంకు 13 కోట్లు


జాతీయ రహదారులు రూ. 1,00,000 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులు



ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ కింద ఉచితంగా నిమ్స్ వైద్యుల చికిత్స

మూలకణ మార్పిడితో ఇద్దరికి పునర్జన్మ

సాక్షి, హైదరాబాద్: మూలకణ మార్పిడి చికిత్సతో ఇద్దరికి పునర్జన్మను ప్రసాదించారు నిమ్స్ వైద్యులు. ఖరీదైన ఈ చికిత్సను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ జాబితాలో చేర్చి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. నల్లగొండ జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని వి.లక్ష్మీప్రసన్న(21) కొంతకాలంగా రక్తసంబంధ సమస్యతో బాధపడుతోంది. చికిత్స కోసం ఎనిమిది నెలల క్రితం ఆమె నిమ్స్ హెమటాలజీ విభాగాధిపతి డాక్టర్ ఏఎంవీఆర్ నరేందర్‌ను సంప్రదించింది. ఇదే సమయంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఎంఎస్సీ విద్యార్థి రామకృష్ణ(26) కూడా నిమ్స్‌కు వచ్చాడు. వైద్య పరీక్షల్లో వీరిద్దరూ ఎప్లాస్టిక్ ఎనిమియాతో బాధపడుతున్నట్లు గుర్తించారు. మూలకణాల మార్పిడి చికిత్స ఒక్కటే దీనికి పరిష్కారమని సూచించారు. మూలకణాలను దానం చేసేందుకు బాధితుల సోదరులు ముందుకు రావడంతో వారి నుంచి కణాలు సేకరించారు. ప్రాసెస్ చేసిన తర్వాత బాధితులకు ఎక్కించారు. సాధారణంగా ఇలాంటి చికిత్సకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.20 లక్షలకుపైగా ఖర్చవుతుంది. నిమ్స్‌లో 2008 నుంచే మూలకణాల మార్పిడి చికిత్స చేస్తున్నారు. ఇప్పటి వరకు 120 చికిత్సలు చేశారు. అయితే ఆయా వైద్య ఖర్చులను రోగులే భరించాల్సి వచ్చేది. ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు చికిత్సకు నోచుకోలేక మృత్యువాతపడుతుండటంతో



రామకృష్ణ

హెమటాలజీ, మెడికల్ ఆంకాలజీ వైద్యుల సూచన మేరకు తెలంగాణ ప్రభుత్వం ఖరీదైన ఈ సేవలను ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ పథకాల్లో చేర్చింది. దీనిలో భాగంగా రూ.10 లక్షల వరకు వైద్య ఖర్చులు చెల్లిస్తోంది. లక్ష్మీప్రసన్నకు ఈహెచ్‌ఎస్ స్కీమ్ కింద, రామకృష్ణకు ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స అందించినట్లు డాక్టర్ నరేందర్ స్పష్టం చేశారు. నిమ్స్ ఆస్పత్రిలో ఈ తరహా చికిత్సలు ఉచితంగా చేయడం ఇదే ప్రథమమని ఆయన వెల్లడించారు.

బంగ్లాలకు రూ.440.58 కోట్లు

- అమరావతిలో మంత్రులు, జడ్జిల కోసం నిర్మాణం
- ఈపీసీలో టెండర్లను ఆహ్వానించిన సీఆర్‌డీఏ
- హైదరాబాద్‌ను తలదన్నేలా భారీ అంచనాలు



మంత్రులు, జడ్జిల కోసం	బంగ్లాలు–71 అంచనా వ్యయం రూ.203.56 కోట్లు
ఐఏఎస్‌ల కోసం	బంగ్లాలు–115 అంచనా వ్యయం రూ.237.02 కోట్లు

సాక్షి, అమరావతి: నూతన రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ఏ పని చేపట్టినా వ్యయం కళ్లు బైర్లు కమ్మేలా ఉంటోంది. అది తాత్కాలికమైనా శాశ్వత నిర్మాణమైనా ధరలు చుక్కలను తాకుతున్నాయి. మంత్రులు, జడ్జిల కోసం బంగ్లాల నిర్మాణం కోసం సీఆర్‌డీఏ శనివారం ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో టెండర్ ప్రకటన జారీ చేసింది. అయితే దేశంలో ఎక్కడా లేని రీతిలో వ్యయం చేస్తుండటంపై అధికార యంత్రాంగం సైతం విస్తుపోతోంది. స్థలం ఉచితమైనప్పటికీ ఒక్కో బంగ్లా నిర్మాణ వ్యయం ఏకంగా రూ.2.85 కోట్లుగా నిర్ణయించటం గమనార్హం. హైదరాబాద్‌లో స్థలంతో కలిపి కూడా ఇంత వ్యయం కావడం లేదని అధికారులంటున్నారు. నూతన రాజధాని ప్రాంతంలో చాలినంత ఇసుక ఉచితంగానే వస్తోంది. పక్కనే ఉన్నందున రవాణా వ్యయం పెద్దగా ఉండదు. తాము అభ్యంతరం వ్యక్తం చేయబోతే అంతర్జాతీయ ప్రమాణాలు అంటున్నారని ఓ అధికారి పేర్కొన్నారు.

71 బంగ్లాలకు రూ.203.56 కోట్లు

ఒక్కో బంగ్లాను 6,000 చదరపు అడుగుల్లో మంత్రులు, జడ్జిల కోసం 71 బంగ్లాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీ+1 తరహాలో 71 బంగ్లాల కోసం రూ.203.56 కోట్లు అవుతుందని సీఆర్‌డీఏ అంతర్గత అంచనాలో పేర్కొంది. హైదరాబాద్‌లో ఖరీదైన ప్రాంతంలో ఇంటి స్థలంతో పాటు పెద్ద విల్లాల నిర్మాణాల వ్యయం కూడా కోటిన్నర దాటటం లేదని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

ఐఏఎస్‌ల బంగ్లాలకు రూ. 237.02 కోట్లు

115 మంది ఐఏఎస్‌లకు 115 బంగ్లాల నిర్మాణం చేపట్టేందుకు ఈపీసీ విధానంలోనే సీఆర్‌డీఏ శనివారం టెండర్ ప్రకటన జారీ చేసింది. వీటి వ్యయం కూడా ఒక్కోటి ఏకంగా రూ.2 కోట్లకు పైగానే ఉండటం గమనార్హం. వీటి అంతర్గత అంచనా వ్యయం రూ.237.02 కోట్లుగా సీఆర్‌డీఏ పేర్కొంది. ఒక్కో బంగ్లాను 5,000 చదరపు అడుగుల్లో నిర్మిస్తారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఇ–ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్ డాక్యుమెంట్ అందుబాటులో ఉంటుందని, టెండర్ దాఖలుకు మార్చి 12 తుది గడువని సీఆర్‌డీఏ పేర్కొంది. అదే రోజు టెక్నికల్ బిడ్‌ను తెరవనున్నట్లు తెలిపింది.

విజయవాడకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ రంజన్ గొగోయ్

సతీసమేతంగా వచ్చిన న్యాయమూర్తి

విజయవాడ లీగల్: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ సతీసమేతంగా శనివారం విజయవాడకు విచ్చేశారు. నగరంలోని ఏ–1 కన్వెన్షన్ హాలులో బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగే జ్యుడీషియల్ ఎగ్జిబిషన్ బార్ 111వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం సాయంత్రం విమానంలో గన్నవరం వచ్చారు. ఆయనను బీబీఏ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఎయిర్ పోర్టులో కలుసుకున్నారు. జస్టిస్‌ను కలిసిన వారిలో బీబీఏ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోము కృష్ణమూర్తి, కందుల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు మాజీ అధ్యక్షుడు చోడిశెట్టి మన్మథరావు, గోగుశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా జయకర్ తదితరులు ఉన్నారు.



సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ రంజన్ గొగోయ్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న బీబీఏ ప్రతినిధులు

ఆన్‌లైన్‌లో అదనంగా రూ.300 టికెట్లు

- టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు వెల్లడి
- మే నెల గదుల ఆన్‌లైన్ కోటా విడుదల

సాక్షి, తిరుమల/విజయవాడ కల్చరల్: భక్తుల సౌకర్యార్థం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఆన్‌లైన్‌లో అదనంగా కేటాయిస్తామని టీటీడీ తిరుమల జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనం కోసం ఆన్‌లైన్‌లో ప్రస్తుతం వారానికి 1.25 లక్షల మేర రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు జారీ చేస్తున్నామన్నారు. విద్యార్థుల పరీక్షల సీజన్ నేపథ్యంలో ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు తిరుమలకు భక్తులు తక్కువగా వస్తారని, ఆ సమయంలో వారానికి 17వేలు చొప్పున అదనంగా టికెట్లు ఆన్‌లైన్‌లో ఉంచుతామన్నారు. ఈ రూ.300 టికెట్లతో వచ్చే భక్తులకు గరిష్టంగా 2 గంటల్లోపే శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్ల ఏప్రిల్‌కోటా ఒకటి రెండురోజుల్లో విడుదల చేస్తామన్నారు. మే నెలకు సంబంధించి గదుల ఆన్‌లైన్ కోటాను శనివారం ఉదయం 11 గంటలకు అందుబాటులో ఉంచామన్నారు. కాగా తిరుమల శ్రీవారి నిత్యాన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన శివప్రసాద్ రూ.10.99 లక్షల విరాళం ఇచ్చారు. డీడీని తిరుమలజేఈవో కేఎస్ శ్రీనివాసరాజుకు అందజేశారు.



జేఈవో శ్రీనివాసరాజుకు డీడీ అందజేస్తున్న శివప్రసాద్

శ్రీవారి లడ్డూప్రసాదాలకు తగ్గిన డిమాండ్

విజయవాడలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాల కౌంటర్లు భక్తులు లేక వెల వెల పోయాయి. రూ. 25 ఉన్న లడ్డూ ధరను టీటీడీ అధికారులు రూ. 50కి పెంచడంతో కొనుగోలు చేసేందుకు భక్తులు ముందుకు రాలేదు. విజయవాడ బందరురోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రతి నెలా రెండో శనివారం లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తారు.

ప్రత్యేక హోదా కోసం సీఎం ఉద్యమించాలి

- టీడీపీ మంత్రులు, ఎంపీల చేత రాజీనామా చేయించాలి
- ముద్రగడ పద్మనాభం డిమాండ్



సాక్షి ప్రతినిధి, తిరుపతి: ప్రత్యేక హోదా కోసం స్వయంగా సీఎం చంద్రబాబే ఉద్యమం చేయాలని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే టీడీపీ మంత్రులు, ఎంపీలతో రాజీనామా చేయించి రోడ్డు మీదకు రావాలని, అప్పుడే ఉద్యమం వేడెక్కుతుందని అన్నారు. శనివారం తిరుపతిలో జరిగిన కాపు నేతల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ముద్రగడ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 31 లోగా కాపులకు రిజర్వేషన్ అమలు చేయకపోతే మళ్లీ ఉద్యమం ఉవ్వెత్తున రేగడం ఖాయమని స్పష్టం చేశారు. ఉద్యమ పోరాటం నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు భయపడే ప్రసక్తే లేదని ముద్రగడ పేర్కొన్నారు. గవర్నర్ సంతకం పూర్తయిన బిల్లును అమలు పర్చే బాధ్యత సీఎందేనని న్యాయకోవిదులు చెబుతున్నారనీ, మార్చి 31 లోగా ఈ ప్రక్రియ అమల్లోకి రాకపోతే ప్రత్యామ్నాయ పద్ధతిలో చేపట్టే పోరాటాలు మళ్లీ మొదలవుతాయని హెచ్చరించారు.

పి.గౌతమ్‌రెడ్డి వైఎస్సార్ సీపీ సభ్యుడు కాదు

- ఆయన అభిప్రాయాలతో మా పార్టీకి సంబంధం లేదు
- వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ప్రకటన

విజయవాడ సిటీ: విజయవాడకు చెందిన పూనూరు గౌతమ్‌రెడ్డి తమ పార్టీ సభ్యుడు కాదని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి పేరుతో ఈమేరకు ప్రకటన విడుదలైంది. 'విజయవాడకు చెందిన పూనూరు గౌతమ్‌రెడ్డి వైఎస్సార్ సీపీ సభ్యుడు కారు. ఆయన్ను గతంలోనే మా పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. గౌతమ్‌రెడ్డి తనను వైఎస్సార్ సీపీ నాయకుడిగా పేర్కొంటూ కొద్ది రోజులుగా టీవీ చర్చల్లో పాల్గొంటున్న విషయం పార్టీ అధినాయకత్వం దృష్టికి వచ్చింది. గౌతమ్‌రెడ్డి వైఎస్సార్ సీపీ సభ్యుడు కానందున ఆయన అభిప్రాయాలతో పార్టీకి ఏ సంబంధమూ లేదు. ఆయన్ను మా పార్టీ సభ్యుడిగా పరిగణించరాదు. ఈ విషయాన్ని అన్ని మీడియా సంస్థలకూ వైఎస్సార్ సీపీ తరఫున తెలియజేస్తున్నాం' అని అందులో పేర్కొన్నారు.


ఇంకా డ్రామాలను నమ్మరు

- టీడీపీపై వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బొత్స విమర్శ
- ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి టీడీపీ వంచనకు పాల్పడింది
- కేసులు పక్కనపెట్టి, అసెంబ్లీ సీట్లు పెంచితే చాలన్నట్లుగా బాబు వ్యవహారం

సాక్షి, హైదరాబాద్: నాలుగేళ్లుగా బూటకపు మాటలు, మోసపూరిత డ్రామాలతో టీడీపీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ప్రజలను టీడీపీ వంచించిందని ధ్వజమెత్తారు. అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుని ఇంకా డ్రామాలతో రక్తి కట్టిద్దామనుకుంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

మళ్లీ మోసగించడానికే లీకులు..

'కేంద్ర బడ్జెట్ తొలిదశ పార్లమెంట్ సమావేశాలు పూర్తి కావడంతో అనుకూల మీడియాను అడ్డం పెట్టుకుని టీడీపీ కొత్త నాటకాలకు తెరలేపింది. జైట్లీతో సంప్రదింపులు జరుపుతున్నామని, అనుకూల ప్రకటన చేస్తారంటూ టీడీపీ ఇస్తున్న లీకులు మళ్లీ మోసగించడానికే' అని బొత్స పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజల సమస్యలను గుర్తు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పొంతన లేని సమాధానాలు చెబుతూ ఎదురు దాడి చేస్తోందని విమర్శించారు. ఉత్త మాటలు కాకుండా రాష్ట్రానికి మేలు చేసే చేతలను ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలో హామీ ఇచ్చిన ప్రకారం ఏపీలో కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు పది శాతం కూడా నిధులు ఇవ్వకున్నా ఎందుకు ఒత్తిడి తేవడం లేదో చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీశారు. ఓటుకు కోట్లు కేసుల భయంతో చంద్రబాబు నోరెత్తటం లేదని దుయ్యబట్టారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు.




హామీల అమలుకు పట్టుబడితే అభివృద్ధి నిరోధకులంటారా?

విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలు ద్వారా రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న తమపై అభివృద్ధి నిరోధకులని టీడీపీ ముద్ర వేస్తోందని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పోలవరం కట్టకున్నా, రైల్వే జోన్ ఇవ్వకున్నా, విభజన హామీలు నెరవేర్చకపోయినా పర్వాలేదు. టీడీపీ అవినీతి మీద ఎటువంటి దర్యాప్తు జరపకుండా, అసెంబ్లీ సీట్లను 225కు పెంచితే చాలు' అన్నట్లుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

సాక్షి
విజయవాడ
ఆదివారం । ఫిబ్రవరి । 11 । 2018
www.sakshi.com

‘అసాధారణ రాజకీయాలు’

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

ఉమ్రేదరాజ్ మాంగ్‌కర్ లాయాథా చార్‌దిన్
దో ఆర్జూమే కట్‌గయే, దో ఇంతెజార్‌మే

‘జీవిత పర్యంతం అల్లాహ్‌ని వేడుకొని నాలుగు రోజుల ఆయుష్షు అదనంగా సంపాదించుకున్నాను. కోర్కెలు కోరడంలో రెండు రోజులు గడిచిపోయాయి. ఆ కోర్కెలు తీరడం కోసం ఎదురుచూడటంలో మిగిలిన రెండు రోజులూ జరిగిపోయాయి,’ అంటూ వాపోయాడు జఫర్. మొఘల్ సామ్రాజ్యం ఆఖరి చక్రవర్తి బహదూర్ షా జఫర్ రంగూన్ జైలులో బందీగా ఉన్న సమయంలో ‘లగ్తానహీ దిల్ మేరా, ఉజ్డే దయార్‌మే’(నరసంచారంలేని ఈ శూన్య ప్రదేశంలో నా మనస్సు నిలవడం లేదు) అని నిర్వేదం వెలిబుచ్చుతూ రాసుకున్న కవితలోనివి పైన పేర్కొన్న రెండు పంక్తులు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిస్థితికి అవి అద్దం పడతాయి.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగేళ్ళలో సాధించింది చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడానికి కారణం ఏమిటి? ఎంత అసమర్థ ప్రభువైనా ఎన్నో కొన్ని మంచిపనులు చేస్తాడు. ‘అసాధారణ నేత’గా పేరు తెచ్చుకున్న చంద్రబాబు ఇంత విలువైన కాలం ఎందుకు వృథా చేశారు? బీజేపీతో నాలుగేళ్ళ చెలిమి రవ్వంత మేలు చేయలేదు. ఎందుకని? తొమ్మిదేళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కలిగిన చంద్రబాబు కొత్త రాష్ట్రానికి అవసరమైన హంగులు సమకూర్చగలుగుతారనే విశ్వాసంతో 2014లో ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్‌లో, మిత్రపక్షమైన బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంటే పరస్పరం సహకరించుకుంటాయనీ, అభివృద్ధి పనులు నల్లేరు మీద బండిలాగా చరచరా జరిగిపోతాయని కూడా ఆశించారు. నిజానికి, చంద్రబాబు నేలమీద నడిస్తే, ఆచరణ సాధ్యమైన ప్రతిపాదనలు చేస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటే, అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి అందరినీ సంప్రదించి అడుగులు వేసి ఉంటే రాజధాని సహా కొత్త రాష్ట్రానికి అవసరమైన హంగులలో అత్యధికం ఈ పాటికి సమకూరి ఉండేవి. లోగడ ముఖ్యమంత్రులు ప్రతిపక్షాలను సంప్రతించేవారు. మీడియా అనుభవజ్ఞులతో మాట్లాడేవారు. కానీ, తాను ‘అసాధారణ’ ప్రజ్ఞాశాలిననీ, అద్భుతమైన మేధావిననీ, శూన్యంలో నుంచి రాజప్రాసాదాలను సృష్టించే తెలివితేటలు తన సొంతమనీ భావించారు. చర్విత చర్వణమే అయినప్పటికీ చెప్పక తప్పదు. రాజధానికి అనువైన ప్రాంతం ఏదో సూచించేందుకు కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ నివేదికను అసెంబ్లీలో కానీ మంత్రివర్గ సమావేశంలో కానీ అఖిలపక్ష సభలో కానీ చర్చించకుండానే బుట్టదాఖలు చేశారు. తన బుర్రలో ఉన్న ఆలోచనలనే నివేదిక రూపంలో సమర్పించేందుకు అసమదీయులతో తన సొంత కమిటీ ఒకటి నియమించారు. కృష్ణ, గుంటూరు జిల్లాల పరిధిలో (శివరామకృష్ణన్ కమిటీ ఎక్కడ వద్దన్నదో అక్కడే) రాజధాని నిర్మాణం జరగాలని నిర్ణయించారు.

సలహాలు పెడచెవిన


ఐటీ రంగ ప్రముఖుడు త్రిపురనేని హనుమాన్ చౌదరి ఈ సందర్భంగా ఒక సూచన చేశారు. రాజధాని నిర్మాణం అంటే ఏమిటి? శాసనసభ, మండలి నిర్వహణకు తగిన భవనాలూ, సచివాలయానికీ, హైకోర్టుకూ కావలసిన భవన సముదాయం, ముఖ్యమంత్రికీ, మంత్రులకూ, శాసనసభ్యులకూ, ఉన్నతాధికారులకూ నివాస భవనాలూ ఉంటే సరిపోతుంది. తక్కిన నగరంలో రోడ్లు, విద్యుత్తు, నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తే నగరం తనంతట తానే అభివృద్ధి చెందుతుంది. ప్రపంచంలో మహానగరాలన్నీ విస్తరించింది ఆ విధంగానే. రాజధాని పేరుమీద 5,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక పెద్ద నిర్మాణ సంస్థకు అప్పగిస్తే, రాజధానికి అవసరమైన భవనాలను 2,500 ఎకరాల విస్తీర్ణంలో ఒకటి లేదా రెండు సంవత్సరాల వ్యవధిలో నిర్మించి ఇస్తుందనీ, తక్కిన 2,500 ఎకరాలతో ఆ సంస్థ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటుందనీ, ప్రభుత్వం నుంచి నయాపైసా ఆశించదనీ హనుమాన్ చౌదరి ప్రతిపాదన. సాధారణ ముఖ్యమంత్రి అయితే ఈ సలహాను పాటించేవారు. ఈ సరికి రాజధానికి కావలసిన భవనాలన్నీ (పక్కాభవనాలు. తాత్కాలికభవనాలు కాదు) సిద్ధమయ్యేవి.

చంద్రబాబు సాధారణ ముఖ్యమంత్రి కాదు. కనుక ఆయనకు సాధారణ రాజధాని పనికిరాదు. ఢిల్లీని మించిన ప్రపంచ స్థాయి రాజధాని నిర్మించాలని సంకల్పించారు. రైతులను కోటీశ్వరులను చేస్తానని హామీ ఇచ్చి వారి భూములను పూలింగ్ పేరిట 30 వేల ఎకరాలకు పైగా సేకరించారు. తాజ్‌మహల్, చార్‌మీనార్, కుతుబ్ మీనార్ వంటి అద్భుతమైన కట్టడాలు నిర్మించిన వాస్తుశిల్పుల వారసులు మన దేశంలో ఉన్నారు. భాక్రానంగల్, నాగార్జునసాగర్, నర్మదా డ్యాం వంటి మెగా ప్రాజెక్టులను నిర్మించిన ఇంజనీర్లకు కొదవ లేదు. అయినా సరే. సింగపూర్ సహకారంతో రాజధాని నిర్మించాలని చంద్రబాబు తాపత్రయం. అందుకోసం కొత్త కంపెనీలు పెట్టించీ, సరికొత్త నిబంధనలు సృష్టించీ, అడ్డగోలు ఒప్పందాలు కుదుర్చుకొనీ పడరాని పాట్లు పడుతూ, ప్రైవేటు విమానంలో ప్రపంచం అంతటా చక్కర్లు కొడుతూ రాష్ట్రం కోసం చెమటోడ్చుతున్నానంటూ, తెగ కష్టపడుతున్నానంటూ బాధపడిపోతున్నారు. ఆయనకు హితవు చెప్పే సాహసం కలిగినవారు ఆంధ్రప్రదేశ్‌లో ఎవ్వరూ లేరు. ‘ఆయన సింగపూర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇంతవరకూ డిజైన్లు సైతం ఖరారు చేయకుండా మమ్మల్ని నిందిస్తే మేము ఏమి చేస్తాం? అక్కడ ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. అందుకు మాదా బాధ్యత?’ అంటూ జైట్లీ మొన్న పార్లమెంటు సెంట్రల్‌హాల్‌లో వ్యాఖ్యానించారు. రాష్ట్రం అవతరించి నాలుగేళ్ళు పూర్తవుతున్నప్పటికీ రాజధాని స్వప్నంగానే మిగిలిపోయింది.

నెరవేరని పోల‘వరం’

ఇక రెండో ముఖ్యమైన అంశం పోలవరం. కాలువల నిర్మాణం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో దాదాపు పూర్తయింది. సాధారణ ముఖ్యమంత్రి అయితే పోలవరం బహుళార్థ ప్రాజెక్టు నిర్మాణం బాధ్యత విభజన చట్టం ప్రకారం కేంద్రానిది కాబట్టి సాధ్యమైనంత త్వరలో తక్కిన పనులు పూర్తి చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేయవలసిందిగా ప్రధానమంత్రిపైన ఒత్తిడి తెచ్చేవాడు. కానీ ‘అసాధారణ ముఖ్యమంత్రి’ కనుక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను స్వయంగా తన భుజస్కంధాలపైకి ఎత్తుకున్నారు. అన్నీ తానే చేయాలనీ, అంతా తనకే కావాలనే మనస్తత్వం ఇందుకు కారణం. నిర్మాణ వ్యయం అంచనాలను 2010–11 లెక్కల ప్రకారం రూ. 16 వేల కోట్ల నుంచి తాజాగా రూ. 58 వేల కోట్లకు పెంచివేశారు. మొదట 31 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్న కాఫర్‌డ్యామ్ ఎత్తును 42 మీటర్లకు పెంచి 2018 జూన్ నాటికే ఖరీఫ్ పంటకు గురుత్వాకర్షణ శక్తితో పోలవరం నీరు అందించాలనే వ్యూహం రచించారు. అదే సమయంలో తెలుగుదేశం ఎంపీ రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్ సంస్థను పోలవరం పనుల నుంచి తప్పించాలని అనుకున్నారు. రాయపాటి ఘనాపాటి కనుక చంద్రబాబు ఎదుట సన్నాయి నొక్కులు నొక్కుతూనే ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రి గడ్కరీని కలుసుకున్నారు. క్షేత్రంలో ఏమి జరుగుతోందో, జరగడం లేదో వివరించారు. కాఫర్‌డ్యామ్‌కు గడ్కరీ బ్రేక్ వేశారు. కథ అడ్డం తిరిగింది. పనులు ఆగిపోయాయి. తిరిగి ప్రారంభం కావడానికి సమయం పడుతుంది.

ఇక అన్నిటికంటే ప్రధానమైన హామీ ప్రత్యేక హోదా. విభజన బిల్లుపై రాజ్యసభలో చర్చ జరిగినప్పుడు ప్రత్యేక హోదా కావాలంటూ పట్టుబట్టిన వ్యక్తి వెంకయ్యానాయుడు. నాటి ప్రధాని అయిదేళ్ళ ప్రత్యేక హోదా ఇవ్వడానికి పార్లమెంటు సాక్షిగా అంగీకరించారు. అనంతరం మంత్రిమండలి సమావేశంలో దాన్ని ఆమోదించారు. ప్రత్యేక హోదా అమలు చేయమని ప్రణాళికా సంఘాన్ని ఆదేశించారు. యూపీఏ ప్రభుత్వం కొన్ని మంచిపనులు చేసింది. మరికొన్ని పాడుపనులు చేసింది. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని విభజించాలని నిర్ణయించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా నష్టపోయినప్పటికీ తెలంగాణలో లబ్ధి పొందుతామని కాంగ్రెస్ అగ్రనాయకత్వం భావించింది. ఉద్యమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావుతో నిర్లక్ష్యంగా వ్యవహరించేసరికి ఆయన అడ్డం తిరిగారు. తెలంగాణలోనూ తిరస్కారం తప్పలేదు. కోస్తాంధ్రలో భారీ మూల్యం చెల్లించింది. ఒక్క సీటు కూడా గెలుచుకోకుండా చావుదెబ్బ తిన్నది. తెలంగాణకు అభ్యంతరం లేదంటూ ప్రణబ్‌ముఖర్జీ కమిటీకి లేఖ ఇచ్చిన తెలుగుదేశం పార్టీకీ, విభజన బిల్లు ఆమోదంలో క్రియాశీలకంగా వ్యవహరించిన బీజేపీకీ ఆంధ్రులు అధికారం అప్పగించారు. హైదరాబాద్ తెలంగాణలో ఉండటం వల్ల కోస్తాంధ్రకు నష్టం కలుగుతుంది కనుక నష్టాన్ని పూడ్చేందుకు బిల్లులో కొన్ని అంశాలను యూపీఏ ప్రభుత్వం చేర్చించింది. వాటిని నాలుగేళ్ళపాటు అమలు జరపకుండా




విభజన పాపం కాంగ్రెస్‌దేనంటూ బీజేపీ, తెలుగుదేశం ధ్వజమెత్తడం ప్రహసన రాజకీయాలకు నిదర్శనం. ‘ప్రత్యేక హోదా వద్దు, ప్రత్యేక ప్యాకేజీ ముద్దు’ అంటూ చంద్రబాబు కొత్తపాట అందుకోవడం ఆంధ్రప్రదేశ్ ప్రజల నెత్తిన పడిన మొదటి పిడుగు. ప్రత్యేక హోదా అక్కర లేదని ఒప్పుకునే అధికారం తెలుగుదేశం ప్రభుత్వానికి లేదు. 14వ ఫైనాన్స్ కమిషన్ ప్రత్యేకహోదా ఇవ్వవద్దని సిఫార్సు చేసిందంటూ తాజాగా అరుణ్‌జైట్లీ పార్లమెంటులో ప్రకటించారు. ఇది సత్యదూరం. ఆ మాట తాము ఎక్కడా అనలేదని 14వ ఆర్థికసంఘం అధ్యక్షుడు వైవి రెడ్డి హైదరాబాద్‌లో మంథన్ నిర్వహించిన సభలో స్పష్టం చేశారు. ఆర్థికసంఘాన్ని అడ్డంపెట్టుకొని ప్రత్యేకహోదాను ఎగగొట్టడం వంచన. ప్రత్యేకహోదా లేక, ప్రత్యేక ప్యాకేజీ రాక రెండింటా చెడిన రేవడి చందంగా ఉంది ఆంధ్రప్రదేశ్ పరిస్థితి.

కాంగ్రెస్‌పై ప్రధాని ధ్వజం

విభజన చట్టంలో ఇచ్చిన హామీలలో రైల్వే జోన్ కూడా ముఖ్యమైనదే. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత చంద్రబాబు ఢిల్లీని ఇంతవరకూ 29 విడతల సందర్శించారు. ఎన్ని కబుర్లు చెప్పినప్పటికీ ప్రతిసారీ శూన్యహస్తాలతోనే తిరిగి వచ్చారు. విభజన చట్టం హామీల అమలు కోసం తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శనలు చేసిన రోజే ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహావేశాలతో నెహ్రూనూ, ఇందిరాగాంధీనీ, రాజీవ్‌గాంధీనీ, సోనియాగాంధీనీ రాహుల్‌గాంధీని ఉభయసభలలో కడిగిపారేశారు. ఆ హామీల గురించి ఒక్కమాట కూడా ప్రధాని నోట వెలువడలేదు. ఎన్నికల ప్రచారంలో తాను స్వయంగా చంద్రబాబు, వెంకయ్యనాయుడితో కలసి చేసిన హామీలను ప్రస్తావించడానికి సైతం ప్రధాని సిద్ధంగా లేరు. ఇది సైతం అసాధారణమే. జైట్లీ డొంక తిరుగుడు సరేసరి. అర్థంపర్థం లేని పాటను రాజ్యసభలో రెండుసార్లూ, లోక్‌సభలో ఒకసారీ పాడి వినిపించారు. ఇటువంటి అవమానకరమైన పరిస్థితులలో తెలుగుదేశం నాయకత్వానికి ఎన్‌టి రామారావునాటి ఆత్మగౌరవ నినాదం లీలగానైనా గుర్తు ఉంటే ఏమి చేయాలి? ఆనందగజపతి రాజునూ, సుజనాచౌదరినీ ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి విరమించుకోవాలి. శ్రీనివాస్‌కూ, మాణిక్యాలరావుకూ రాష్ట్ర మంత్రివర్గం నుంచి ఉద్వాసన చెప్పాలి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో స్పష్టంగా ప్రకటించాలి. ముఖ్యమంత్రిని వేధిస్తున్న భయసందేహాలు ఏమిటో తెలియదు కానీ అటువంటి ధైర్యమైన నిర్ణయం తీసుకోలేదు. ఏమి చేశారు? ప్రచ్ఛన్నయుద్ధం చేశారు. మీడియా సహకారంతో లీకుల రాజకీయం రసవత్తరంగా నడిపించారు. ఢిల్లీతో తెగించి పోరాడుతున్నారనే భ్రాంతికి తెలుగు పాఠకులనూ, ప్రేక్షకులనూ లోను చేశారు. ఈ లోగా సరదాగా దుబాయ్ వెళ్ళి వచ్చారు. కానీ జైట్లీ కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించి పది రోజులైనా చంద్రబాబు ప్రత్యక్షంగా నిరసన వెలిబుచ్చలేదు. కేంద్ర ప్రభుత్వానికి కానీ, బడ్జెట్‌కు కానీ వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. ఇది విచిత్రమైన పరిస్థితి. మామూలు ముఖ్యమంత్రి అయితే మీడియా సమావేశంలో మాట్లాడేవారు. ఆవేదన, ఆగ్రహం వెలిబుచ్చేవారు. అన్యాయం జరిగిందని చెప్పేవారు. తాను ఏం చేయదల్చుకున్నదీ ప్రకటించేవారు. అటువంటి పనులు ఏవీ చేయకపోయినా చంద్రబాబునే పోరాటయోధుడుగా రాష్ట్రంలోనూ, జాతీయ స్థాయిలోనూ చిత్రించడం అసాధారణ రాజకీయం. విభజన చట్టంలోని హామీలు నెరవేరతాయని నాలుగేళ్ళుగా ఎదురుచూస్తున్న ప్రజలు మరో సంవత్సరం మాత్రమే గడువు ఇస్తారు.

ప్రణయ రహిత ప్రపంచంలో ప్రేమికులు



కరణ్ థాపర్

ప్రేమలో పడ్డారు, ప్రేమను ఫీలవుతున్నారు అంటూ ఒక పాత పాట ప్రకటించి ఉండవచ్చు కానీ మన దేశానికి ఇది వర్తిస్తుందా అని నాకు సందేహం. కామసూత్ర రోజుల్లో చుంబనం, సరస సల్లాపాల కళలో మనం నిష్ణాతులమై ఉండవచ్చు కానీ ఆ అత్యున్నత కళా సాధన మనకు ఇప్పుడు చాలా దూరంలో ఉన్నట్లుంది. ఈరోజుల్లో లవ్ జిహాద్ వ్యతిరేక స్పందన, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి నియమించిన యాంటీ రోమియో దళాల ప్రయాస కలసి యువతీయువకుల ప్రేమాతురతను అణిచివేస్తూ ప్రణయ భావనను శృంఖలాబద్ధం చేస్తున్నాయి.

మన భారతీయ జూలియట్‌ల హృదయాలు ‘ఓ రోమియో, ఓ రోమియో! ఎందుచేత నీవు ప్రణయ మూర్తివి’ అంటూ విలపించవచ్చు. కానీ ఇప్పుడు అతడు ఆ ప్రణయ ప్రదర్శనకు సిద్ధపడతాడా అని నాకు సందేహం. ఇప్పుడు ప్రేమ స్థానంలో భయం ఆవహించింది. బహుశా రోమియో మమ్మీతో ఇంట్లో గడుపుతూ ఉండవచ్చు. కలవరం కలిగించే ఈ వాస్తవాలకేసి ఒకసారి చూడండి. యూపీ సీఎం యోగి నియమించిన యాంటీ రోమియో దళాలు ఇంతవరకు 21,37,520 మంది రోమియోలను ప్రశ్నించాయి. వీరిలో 9,33,099 మందిని హెచ్చరించి వదిలిపెట్టారు. మరో 3,003 మంది రోమియోలపై 1,706 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. 2017 మార్చి 22 నుంచి డిసెంబర్ 15 మధ్యన రోమియోలపై రోజుకు సగటున ఆరు కేసులు పెట్టారన్నమాట.

యాంటీ రోమియో దళంలో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉంటారు. వీరు ఉత్తరప్రదేశ్ యూనివర్సిటీలు, కాలేజీలు, సినిమా హాళ్లు, పార్కులు, బహిరంగ స్థలాల్లో గస్తీ తిరుగుతారు. దీనిఫలితంగా యువతీయువకుల మధ్య కౌగిలింతలు, చుంబన క్రియలకు తావు లేకుండా పోయింది. నవయవ్వనంలో పొంగిపొరలే ప్రేమోత్సాహానికి పూర్తిగా అడ్డుకట్టలేసినట్లయింది.

దీనికి భిన్నంగా, ప్రేమికుల దినోత్సవం నాడు నేను తొలిసారిగా అందుకున్న ఎర్రగులాబీ నాకు ఇప్పటికీ గుర్తుంది. ఇది ముప్పై ఏళ్ల క్రితం నాటిది. లండన్ వీకెండ్ టెలివిజన్‌లో నేను నిర్మాతగా ఉండేవాడిని. ఆ రోజు మధ్యాహ్నం ఫోన్ మోగింది. అది తొమ్మిది అంతస్తుల కింద ఉన్న రిసెప్షన్ నుంచి వచ్చింది.

‘కరణ్’ ఉత్సాహంతో కూడిన స్వరం వినిపించింది. ‘మీరు నమ్మలేకపోవచ్చు కానీ మీకోసం ఒక వేలంటైన్ ఎర్రగులాబీని ప్రత్యేకంగా పంపారు!’. నిమిషాలలోపే జిగేలుమంటూ రిసెప్షన్‌కి చెందిన ఓ యువతి నా వద్దకు నడుచుకుంటూ వచ్చింది. ఆమె కుడిచేతిని చాచింది. ఆ చేతిలో ఒక విడి ఎర్రగులాబీ ఉంది. గులాబీ కాడ నుంచి ఒక దళసరి కాగితం ముక్క వేలాడుతూ ఉంది. ‘ఎవరో ఊహించు?’ అని దానిపై రాసి ఉంది.

దాన్ని చూడగానే నాకు మతి పోలేదు కానీ నాలో ఏదో తుళ్లింత బయలుదేరింది. నన్ను రహస్యంగా ప్రేమించేవారు ఉన్నారన్నమాట అని నాకు నేను చెప్పుకున్నాను. నా సహోద్యోగులు నన్ను చూసి నవ్వడం, ఆటపట్టించడం ప్రారంభించారు. ‘దాన్ని ఎవరు పంపి ఉంటారని అనుకుంటున్నావు?’ అంటూ

ఆదిత్య హృదయం



ఊరించసాగారు. కానీ నా జీవితంలో అలాంటి అనుభవం లేదు.

నన్ను నేను నిగ్రహించుకోలేక వెంటనే ఫోన్ చేసి నిషాకు కాల్ చేశాను. ‘ఊరూ పేరూ లేని వ్యక్తి నాకు ఒక గులాబీ పంపారు. ఎవరు పంపి ఉంటారని అనుకుంటున్నావు? కాస్త ఊహించగలవా’ అని అడిగాను. నిషా వెంటనే నవ్వేసింది. ఆమె సంతోషంగా ఉన్నట్లనిపించింది. కానీ నా రహస్య ప్రేమికురాలు ఎవరై ఉంటారో ఆమెకు కూడా ఆలోచన లేనట్లుంది.

ఆ రోజంతా నాకు ఆకాశంలో తేలిపోయినట్లయింది. నాకు నేను పొంగిపోతున్నట్లు అనిపించింది. ఏ విషయంపైనా నేను దృష్టి పెట్టలేకపోయాను. ఆరోజు వేగంగా గడిచిపోయింది.

ఆ సాయంత్రం నేను ఇంటికెళ్లాక ఆ గులాబీని డ్రాయింగ్ రూమ్‌లోని బల్లపై గాజు పళ్లెంలో ఉంచాను. నా వెనుకే వచ్చిన నిషా వెంటనే ఆ గులాబీనీ చూసి ‘ఇప్పటికీ పులకరింతగానే ఉందా?’ అంటూ పెద్దగా నవ్వుతూ అడిగింది. ‘కావచ్చు. నాకూ ఒక ప్రేమికురాలు ఉంది. తను ఎవరా అని సంభ్రమంగా ఉంది’ అన్నాను.

నిషాకు నా సంభ్రమం కాస్త అతిగా తోచిందనుకుంటాను. ‘ఇడియట్. ఆ గులాబి పంపింది నేను. ప్రేమికుల దినాన నీకు గులాబి ఎవరు పంపుతారు?’ అనేసింది.

నేను దిగ్భ్రమ నుంచి తేరుకుంటూండగా, నిషా ఫోన్ అందుకుని ఈ కథను తన స్నేహితురాళ్లతో పంచుకోవడం మొదలెట్టింది. ఈ జోక్‌కి నేనే కారణం అయి ఉండవచ్చు. కానీ అంతకు ముందు ఆరుగంటల వరకు నాకు ఆ గులాబీ తుళ్లింత కలిగించడమే కాకుండా మధుర భావనలతో నన్ను ముంచెత్తింది మరి.

ఇది అమాయకత్వపు సరదా ఘటనయినా యోగి, లవ్ జిహాద్ నిరసనకారులకు ఒక ముగింపు పలకాల్సి ఉంటుంది. ముందు జరిగే పరిణామాలపై ఆందోళన చెందాల్సి వస్తే, ప్రేమించే కాంక్షను కూడా కోల్పోతారు. పోలీసు నిఘా వెంటాడుతున్నప్పుడు తరుణ వయస్కుల సరస సల్లాపాలు గాలికి ఎగిరిపోతాయి. ప్రియతమా! మన ప్రపంచం ఎంత ఆనంద రహితంగా మారుతుందో చూశావా?

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : karanthapar@itvindia.net

తబు (సినీ నటి)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కోల్‌కతాలో దిగాను. ముంబైలో ఎలా ఉందో, క్లైమేట్ ఇక్కడా అలాగే ఉంది. చలిగా లేదు. వెచ్చగా లేదు. బాగుంది.

డమ్‌డమ్‌లో ఫిల్మ్ ఫెస్టివల్. నాదే ఈసారి ఇనాగరేషన్. మొదటిది ఐదేళ్ల క్రితం జరిగింది. తర్వాత మూడేళ్లు బ్రేక్. లాస్ట్ ఇయర్ రెండోది. ఇది మూడోది.

బ్రేక్ లేకుండా ఈవెంట్స్, బ్రేకప్స్ లేకుండా రిలేషన్స్ ఉండవా అనిపిస్తుంది! మళ్లీ ఎవరో ఒకరు పూనుకోవాలేమో ఈవెంట్స్‌ని కొనసాగించడానికి, రిలేషన్స్‌ని కలపడానికి. ఈవెంట్‌ని ఎవరైనా కొనసాగించగలరు. రిలేషన్‌నే ఎవరికి వారు కలుపుకోవాలి. మధ్యలోకి మూడోవాళ్లు, నాలుగోవాళ్లు వచ్చి కూర్చుంటే రిలేషన్ కూడా ఈవెంట్ అయిపోతుంది.

ఎయిర్‌పోర్ట్‌కి మనిషిని పంపించారు బ్రత్యాబసు. మినిస్టర్ ఆయన. డమ్‌డమ్ ఎమ్మెల్యే. డైరెక్టర్, యాక్టర్ కూడా. సినిమాలంటే ఇష్టం. సినిమాల్లోంచి పాలిటిక్స్‌లోకి వచ్చారు. సినిమాలన్నీ తీసేసి, అలసటతో పాలిటిక్స్‌లోకి రాలేదు. “ఐ లవ్ టు ఎంజాయ్ యువర్ యాక్టింగ్ తబూజీ” అన్నారు, ఫోన్‌లో ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి నన్ను ఇన్వైట్ చేసినప్పుడు.



“థ్యాంక్యూ బ్రత్యాజీ” అన్నాను నవ్వుతూ. బ్రత్యాజీ మూవీ లవర్. మమతాజీ నుంచి టైమ్ తీసుకున్నారట.. ఫిల్మ్ ఫెస్టివల్‌ని ఆర్గనైజ్ చేయించడానికి.

“మీలా నేనూ సినిమాల్లోనే ఉండిపోతే, మీలా నాకూ సినిమాల్లో పాతికేళ్ల కెరియర్ ఉండేది తబూజీ” అన్నారు నవ్వుతూ బ్రత్యాజీ.. సాయంత్రం మేం కలుసుకున్నప్పుడు! సినిమా అంటే ఆయనకు అఫెక్షన్. రెండు సినిమాలు కూడా డైరెక్ట్ చేశారు. గొప్ప సినిమాలేం కావవి అంటారు బ్రత్యాజీ నవ్వుతూ. సినిమా గొప్పగా రాకపోవచ్చు. థీమ్ నాకు గొప్పగా అనిపించింది.

“ఎలా చేస్తారు.. మీరు అంత గొప్పగా..” అన్నారు బ్రత్యాజీ చిన్న మట్టి పాత్రలోని టీని నా చేతికి అందిస్తూ.

“గొప్పగా చెయ్యడం ఉంటుందా బ్రత్యాజీ, గొప్పగా చేయిస్తాయి అనుకుంటాను.. ఆ పాత్రలు, ఆ డైరెక్టర్..” అని నవ్వాను. ‘అస్తిత్వ’ గురించి, ‘చండీబార్’ గురించి ఆయన మాట్లాడారు. ‘అస్తిత్వ’లో నమ్రతా శిరోద్కర్‌కు అత్తగారిలా, ‘హైదర్’లో షాహిద్ కపూర్‌కు తల్లిగా చేయడం గురించి కూడా మాట్లాడారు. ఎక్కువసేపు ఉండలేదు. వెళ్లిపోయారు.

తర్వాత మీడియా నుంచి ఎవరో వచ్చారు.

“మీ లైఫ్‌లో బ్రేకప్స్ ఉన్నాయా? సింగిల్ ఉమన్‌గా ఎందుకు ఉండిపోయారు?’.. ఎప్పటిలా చివరి రెండు ప్రశ్నలు.

నవ్వాను. ఏం చెప్పాలి? జీవితంతో నాకున్న ఏ రిలేషన్‌నీ నేను బ్రేక్ చేసుకోను. ఎప్పుడూ ఇవే ప్రశ్నల్ని అడుగుతుండే సమాజంతో కూడా. అభిమానం ఉంటేనే కదా ఎవరైనా అడుగుతారు.

కల్లోల కశ్మీర్‌లో ఎవరి హక్కులు గల్లంతవుతున్నాయి?

మనమంతా బాధపడవలసిన సంగతి మరొకటుంది– మన సైన్యం ఇతర భారతీయుల నుంచి తనకు రక్షణ కల్పించమని పిల్లలను ఉపయోగించుకుని డిమాండ్ చేస్తోంది. ఈ దేశ పౌరులు ఈ దేశ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే, ఇక్కడి పోలీసులే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తే, ఈ దేశ న్యాయస్థానాల్లో ఇక్కడి న్యాయమూర్తులే విచారణ జరుపుతుంటే మన సైన్యం భయసందేహాలు వ్యక్తం చేస్తోంది. నిజానికిది బాధపడాల్సిన విషయం కాదు... కలవరపడాల్సిన విషయం.

అవలోకనం



ఆకార్ పటేల్

ఈసారి నేను కశ్మీర్ హింసపై రాస్తున్నాను. ఆ హింస గురించి కేవలం ఒక కోణంలో మాత్రమే తెలిసిన పిల్లలనుద్దేశించి దీన్ని రాస్తున్నాను. కశ్మీర్‌లో ముగ్గురు పౌరులను కాల్చి చంపిన సైనికులపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు కావడంపై ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఆ సైనికుల పిల్లలు కూడా కొన్ని చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వెలువడిన కథనం వివరాలివి: సైనికులపై ఎఫ్ఐఆర్ దాఖలైన సమయంలో రాళ్లు విసిరిన ఆందోళనకారులపై కేసులు ఉపసంహరించుకోవడంపై జమ్మూ–కశ్మీర్‌లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సైనికుల పిల్లలు జాతీయ మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించారు. ఆందోళనకారులవల్ల సైనికులు కోల్పోతున్న మానవ హక్కుల్ని కాపాడాలని కోరారు. ఇద్దరు లెఫ్టినెంట్ కల్నల్ హోదా అధికారుల పిల్లలు ప్రీతి, కాజల్, ప్రభవ్, రిటైర్డ్ నాయబ్ సుబేదార్ హక్కుల సంఘం చైర్మన్ హెచ్ఎల్ దత్తుకు ఈ ఫిర్యాదు ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో స్థానికుల హక్కుల కోసం ‘అలుపెరుగక శ్రమిస్తున్నందుకు’ సంఘాన్ని, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను అందులో ప్రశంసించారు. కానీ రాళ్లు విసిరే గుంపు వల్ల హక్కులు కోల్పోతున్న సైన్యం దీన స్థితి గురించి కళ్లు మూసుకుంటున్నాయని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి అక్కడ చిన్నపాటి యుద్ధం జరుగుతున్నదని, ప్రభుత్వ యంత్రాంగానికి సాయపడేందుకు సైన్యాన్ని రప్పించి వారి కోసం సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టం(ఏఎఫ్ఎస్‌పీఏ)ను అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని ఆ ఫిర్యాదులో వారు వివరించారు.

వీటిని ఇంతకుమించి వివరించనవసరం లేదు. ఈ సందర్భంగా మరికొన్ని సంగతులు తెలుసుకోవాలని కోరుతున్నాను. గత నెలలో పార్లమెంటులో అడిగిన ఒక ప్రశ్న వివరాలు చూద్దాం. ఏ) ఏఎఫ్ఎస్‌పీఏ కింద సాయుధ దళాలను ప్రాసిక్యూట్ చేయాలంటూ కేంద్రానికి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? బి) ఎన్నిటికి అనుమతి మంజూరు చేశారు, ఎన్నిటిని తిరస్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? సి) ప్రతి ఒక్క ఫిర్యాదు విషయంలోనూ విడివిడిగా– ఫిర్యాదు వచ్చిన సంవత్సరం, ఆరోపించిన నేరాలు, వాటిపై జరిగిన దర్యాప్తు ఫలితాలు, అనుమతి మంజూరుపై ప్రస్తుత స్థితి. డి) ప్రాసిక్యూషన్‌కు నిరాకరించిన లేదా పెండింగ్‌లో ఉంచిన పక్షంలో అందుకు గల కారణాలు. ఈ ప్రశ్నకు రక్షణ శాఖ సహాయమంత్రి



ఇచ్చిన జవాబు ఇలా ఉంది: ఏ) సైనికులపై మొత్తం 50 కేసుల విషయంలో ఏఎఫ్ఎస్‌పీఏకింద ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరు చేయమని రాష్ట్ర ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయి. బి,సి) సంవత్సరాలవారీగా కేసుల సంఖ్య, వాటిలో పేర్కొన్న ఆరోపణలు, ఆ కేసుల ప్రస్తుత స్థితిగతులు–అవి పెండింగ్‌లో ఉన్నాయా, అనుమతి మంజూరైందా, తిరస్కరించారా అన్న వివరాలు ఈ జవాబుతో జత చేశాం. డి) ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరించడం లేదా పెండింగ్‌లో ఉంచడానికి వాటిల్లో తగిన ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకపోవడమే కారణం.

జవాన్లపై వచ్చిన కేసుల వివరాలివి: 2001–కాల్చి చంపిన కేసులో ఒక ఎఫ్ఐఆర్(ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరణ). 2005– కాల్చిచంపిన ఘటనల్లో 2 ఎఫ్ఐఆర్‌లు(అనుమతి నిరాకరణ). 2006–మొత్తం 17 ఎఫ్ఐఆర్‌లు. ఒక అత్యాచారం, మహిళలతో అసభ్య ప్రవర్తన కేసు, ఆరుగురి అపహరణ, హత్య ఘటన, మిగిలినవన్నీ కాల్చిచంపిన కేసులు(ఒక అపహరణ కేసు మినహా మిగిలినవాటికి అనుమతి నిరాకరణ. ఆ ఒక్క కేసు పెండింగ్‌లో ఉంది). 2007–మొత్తం 13 ఎఫ్ఐఆర్‌లు. ఒక అత్యాచారం, చిత్రహింసలతో ఒకరి హత్య, మిగిలినవన్నీ కాల్చిచంపిన ఘటనలు(అన్నిటికీ అనుమతి నిరాకరణ). 2008– 3 ఎఫ్ఐఆర్‌లు. ఒక అత్యాచారం, దొంగతనం, హత్య కేసులు(అన్నిటికీ అనుమతి నిరాకరణ). 2009– 2 ఎఫ్ఐఆర్‌లు. ఒక హత్య కేసు, ఒక అపహరణ కేసు(రెండింటికీ అనుమతి నిరాకరణ). 2010– 4 ఎఫ్ఐఆర్‌లు. అన్నీ హత్య కేసులు(అన్నిటికీ అనుమతి నిరాకరణ). 2011– 2 ఎఫ్ఐఆర్‌లు. ఒకటి హత్య కేసు(అనుమతి నిరాకరణ), రెండోది అపహరణ కేసు(పెండింగ్). 2013– 3 ఎఫ్ఐఆర్‌లు. అన్నీ హత్య కేసులు(అన్నిటికీ అనుమతి నిరాకరణ). 2014– 2 ఎఫ్ఐఆర్‌లు. ఈ రెండూ కాల్చిచంపిన కేసులు (ఒక కేసులో అనుమతి నిరాకరణ, మరొకటి పెండింగ్). 2016– కాల్చి చంపిన కేసులో ఒక ఎఫ్ఐఆర్ (అనుమతి నిరాకరణ).

ఏతావాతా కశ్మీర్‌లో జరిగిన నేరాలకు విచారణను ఎదుర్కొన్న సైనికుల సంఖ్య–సున్నా. జవాన్లపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడం వల్ల వారి పిల్లల మనోభావాలు దెబ్బతిని ఉండొచ్చు. కేవలం వాటివల్ల అయ్యేదేమీ లేదని, కశ్మీర్ పౌరులకు న్యాయం లభించడంలేదని పై వివరాలు గమనిస్తే అర్థమవుతుంది. ఇందుకు మనమంతా బాధపడాలి. తన సైనిక న్యాయస్థానాల్లో బాధితులకు న్యాయం చేస్తున్నట్టు సైన్యం వాదించవచ్చు. కానీ వాటిల్లో బాధితులకు, వారి కుటుంబాలకు ప్రవేశం ఉండదు. ఈ మార్గంలో జవాన్లు ఎలా నిర్దోషులవుతున్నారో తెలుసుకోవాలన్న ఆసక్తి ఉంటే పత్రిబల్, మాఛిల్ కేసుల్లో ఏమైందో తెలుసుకోండి.

మనమంతా బాధపడవలసిన విషయం మరొకటుంది. మన సైన్యం ఇతర భారతీయుల నుంచి తనకు రక్షణ కల్పించమని పిల్లలను ఉపయోగించుకుని డిమాండ్ చేస్తోంది. ఈ దేశ పౌరులు ఈ దేశ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే, ఇక్కడి పోలీసులే కేసులు నమోదు చేసి దర్యాప్తుచేస్తే, ఈ దేశ న్యాయస్థానాల్లో, ఇక్కడి న్యాయమూర్తులే విచారణ జరుపుతుంటే మన సైన్యం భయసందేహాలు వ్యక్తం చేస్తోంది. నిజానికిది బాధపడాల్సిన విషయం కాదు... కలవరపడాల్సిన విషయం. ఎలాంటి నేరారోపణలొచ్చినా, కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా మన సైన్యం విచారణ నుంచి తప్పించుకుంటోంది. జవాన్లు అత్యాచారం చేసినా, హత్యలు చేసినా, కిడ్నాప్‌లకు పాల్పడినా, పౌరుల్ని చిత్రహింసలకు గురిచేసినా, వాటిపై ఫిర్యాదులొచ్చినా ప్రభుత్వాలు ‘నిరాకరణ’ లేదా ‘పెండింగ్’లో ఉంచుతాయి తప్ప ‘అనుమతి’ మంజూరు చేయవు. ఆ పిల్లలు, వారితోపాటు మనమంతా అసలు వేలాదిమంది కశ్మీర్ పౌరులు రాళ్లెందుకు విసురుతున్నారో అప్పుడప్పుడైనా ఆలోచించకతప్పదు.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత । a a


సౌదీ స్త్రీలకు శుభవార్త

సౌదీ అరేబియాలో మహిళల వస్త్రధారణకు సంబంధించి ఆధునికత దిశగా మరో ముందడుగు పడింది. మహిళలు ‘అబయా’ అని పిలిచే దుస్తు కచ్చితంగా ధరించాలని ఒత్తిడి చేయవలసిన అవసరం లేదని సీనియర్ ముస్లిం మత పండితుడు షేక్ అబ్దుల్లా అల్ ముత్లాక్ ఒక టీవీ చానల్‌లో మాట్లాడుతూ చెప్పారు. ఒదులుగా, పొడవుగా ఉండే దుస్తునే అబయా అని అంటారు. ముస్లిం ప్రపంచంలో మర్యాద కలిగిన 90 శాతం మహిళలు అబయా ధరించరని కూడా షేక్ అబ్దుల్లా గుర్తు చేశారు. అబయా కాకుండా హుందాగా ఉండే దుస్తులు ఏవైనా కూడా ముస్లిం మహిళలు ధరించవచ్చునని ఆ మత పెద్ద హితవు చెప్పారు. ఇలాంటి అంశం మీద అనుభవజ్ఞుడైన ఒక ముస్లిం పండితుడు తన అభిప్రాయం వెల్లడించడం ఇదే మొదటిసారి. మహ్మద్ బిన్ సల్మాన్ సౌదీ యువరాజైన తరువాత రాజ్యంలో కొన్ని మార్పులకు శ్రీకారం చుడుతున్నారు.

గ్రహం అనుగ్రహం


శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి బ.ఏకాదశి సా.6.20 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం మూల రా.11.56 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం ఉ.6.17 నుంచి 8.03 వరకు, తదుపరి రా.10.11 నుంచి 11.57 వరకు, దుర్ముహూర్తం సా.4.23 నుంచి 5.10 వరకు అమృతఘడియలు సా.4.55 నుంచి 6.04 వరకు.

నమాజ్ వేళలు



ఫజర్	:	5.31
జొహార్	:	12.30
అసర్	:	4.40
మగ్రీబ్	:	6.16
ఇషా	:	7.30

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు



టాంగ్.. ఐఫోన్.. ఓ మందుపార్టీ

చైనాలోని గొంక్సీలో ఓ వ్యక్తి తన ఐఫోన్ కోసం చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. టాంగ్ అనే యువకుడు గత వారం స్థానిక ఓ హోటల్‌లో స్నేహితులతో కలసి మందు పార్టీ చేసుకున్నాడు. పార్టీ అయిపోయే సమయానికి తూగుతూ తూగుతూ బాత్‌రూం వెళ్లిన టాంగ్‌కి తన ఫోన్ గుర్తుకొచ్చింది. వెంటనే లేచి చూసుకుంటుండగా ఫోన్ కాస్త పక్కనే ఉన్న టాయిలెట్ రంధ్రంలో పడిపోయింది. ఒక్కసారిగా షాక్‌కు గురైన టాంగ్.. ఫోన్ కోసం ఆ రంధ్రంలో చేయి పెట్టి ప్రయత్నించడం మొదలుపెట్టాడు. అరచేతి నుంచి మోచేయి.. అటు నుంచి భుజం వరకు రంధ్రంలో పెట్టి వెతికాడు. ఎంత ప్రయత్నించినా ఫోన్ చేతికందలేదు సరికదా.. రంధ్రంలో ఇరుక్కున్న చేయి కాస్త గీసుకోపోయి గాయాలయ్యాయి. 20 నిమిషాల పాటు తీవ్రంగా ప్రయత్నించిన అతడు.. ఫోన్ పోతే పోయింది.. చేయి బయటికి వస్తే చాలనే స్థితికొచ్చాడు. సాయం కోసం అరిచాడు. ఈ విషయం గమనించిన ఓ వ్యక్తి.. టాంగ్ చేయి తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. అతడివల్లా కాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. వారు బాత్‌రూం బద్దలు కొట్టి చేతిని బయటకు తీశారు. ఫోన్ మాత్రం దొరకలేదండోయ్. ఈ విషయమై విచారం వ్యక్తం చేసిన హోటల్ యాజమాన్యం.. పోగొట్టుకున్న ఫోన్ ధర (రూ.83,625) చెల్లించేందుకు అంగీకరించింది. ఈ డబ్బుతో టాంగ్ ఏ ఫోన్ కొంటాడో చూడాలి మరి.



సాక్షి
రాష్ట్రీయం
విజయవాడ
ఆదివారం | ఫిబ్రవరి | 11 | 2018
www.sakshi.com

5 ద్రవ ఇంధన రాకెట్‌ను కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టిన తొలి ప్రైవేట్ సంస్థ స్పేస్ ఎక్స్.. 2008లో ఫాల్కన్-1 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది స్పేస్ ఎక్స్.



జేఈఈ మెయిన్, నీట్, ఎంసెట్ విద్యార్థుల కోసం..

సాక్షి మాక్ టెస్టులు

హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో అడ్మిషన్ పొందేలా చేయూతనిచ్చేందుకు 'సాక్షి' ముందుకు వచ్చింది. నిపుణుల ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్, ఎంసెట్, నీట్ పరీక్షలకు మాక్ టెస్టులు నిర్వహించనుంది. పరీక్షకు కొద్ది రోజుల ముందుగా వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకోవచ్చు. ప్రిపరేషన్‌ను మరింత మెరుగు పరుచుకోవచ్చు. అంతేకాకుండా సాక్షి మాక్ టెస్టుల్లో ఉత్తమ ప్రతిభను చూపడం ద్వారా టాప్ టెన్ ర్యాంకర్లు ఆకర్షణీయ బహుమతులు గెలుచుకోవచ్చు.

- సాక్షి మాక్ జేఈఈ మెయిన్ పరీక్ష 25–03–2018 (ఆదివారం)న ఆఫ్‌లైన్‌లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుంది. రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ 15–3–2018
- సాక్షి మాక్ ఎంసెట్ (ఇంజనీరింగ్) పరీక్ష 15–4–2018 (ఆదివారం)న ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొదటి సెషన్ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు; రెండో సెషన్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 5:00 గంటల వరకు జరుగుతుంది. రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ 5–4–2018
- సాక్షి మాక్ నీట్ పరీక్ష 22–4–2018 (ఆదివారం)న ఆఫ్‌లైన్‌లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుంది. రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ 15–4–2018
- ఒక్కో పరీక్షకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150. అభ్యర్థులు www.sakshieducation.com ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు పరీక్షకు పది రోజుల ముందు తమ హాల్‌టికెట్‌ను www.sakshieducation.com ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు

చిత్తూరు, కర్నూలు, కడప	9666697219
అనంతపురం, నెల్లూరు	9505139111
విజయవాడ, వరంగల్, గుంటూరు	9666372301
తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి	9948977455
వైజాగ్, శ్రీకాకుళం, విజయనగరం	9666283534
తెలంగాణ	9505514424
గ్రేటర్ హైదరాబాద్	9666421880, 9505981114, 9505834448

తలెత్తుకోలేం!

- అధినేత తీరుపై టీడీపీ నేతల్లో అంతర్మథనం
- పార్లమెంట్‌లో ఆందోళనలతో ఏం సాధించాం?
- ఫలితం శూన్యం... జనానికి జవాబు చెప్పుకోలేం
- 'హోదా' వదులుకుని భారీ మూల్యం చెల్లించాం



సాక్షి, అమరావతి: పార్లమెంట్‌లో వారం రోజులపాటు నిరసనలు, ధర్నాలు, ప్లకార్డులు ప్రదర్శించినా కేంద్ర ప్రభుత్వం కనీసం ఊరడింపు చర్యలైనా ప్రకటించకపోవడంతో టీడీపీలో అంతర్మథనం మొదలైంది. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ నాలుగేళ్లుగా అధికారాన్ని అనుభవిస్తున్న తాము బడ్జెట్‌లో ఏమీ సాధించుకోలేకపోవడంపై టీడీపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించడంపై ఆందోళన చేసి ఎలాంటి ప్రయోజనం సాధించలేకపోవటం కచ్చితంగా పార్టీ వైఫల్యమేనని వాపోతున్నారు. తమ అధినేత చంద్రబాబు సరైన వ్యూహం లేకుండా వ్యవహరించడమే దీనికంతటికీ కారణమనే వాదన టీడీపీలో మొదలైంది.

ఎదురు దాడికి సిద్ధమైన బీజేపీ

పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న టీడీపీ ఎంపీలు, మంత్రులు, ముఖ్య నేతలు లోలోన మాత్రం అభాసుపాలయ్యామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన వ్యూహం తలకిందులవడంతో ఏం చేయాలో పాలుపోక ముఖ్యమంత్రి చంద్రబాబు మథన పడుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ లభించకపోగా రాష్ట్రానికి ఇప్పటివరకూ ఏం చేశామనే అంశంపై బీజేపీ 27 పేజీల నివేదిక విడుదల చేసి ప్రజల్లోనే తేల్చుకునేందుకు సిద్ధం కావటం టీడీపీని ఇరుకున పెడుతోంది.

ఆ ప్రచారం అంతా ఉత్తదే

తమ డిమాండ్లపై పార్లమెంట్‌లో హామీ ఇవ్వకపోయినా ఆ తర్వాత ప్రైవేట్ సమావేశంలో అన్నీ ఇచ్చేయడానికి అరుణ్ జైట్లీ అంగీకరించినట్లు టీడీపీ నాయకులు శుక్రవారం రాత్రి నుంచి విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ దీనిపై కేంద్రం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రకటన రాకపోగా టీడీపీ ఎత్తుల్ని చిత్తు చేసేలా తాము ఇప్పటివరకూ ఏపీకి ఏం ఇచ్చామనే వివరాలు వెల్లడించడం టీడీపీకి మింగుడు పడటం లేదు. అనుకూల మీడియాలో టీడీపీ చేసుకుంటున్న ప్రచారం ఉత్తదేనని తేలిపోయింది.

తప్పుల మీద తప్పులు

రాష్ట్రానికి మేలు జరిగే అవకాశాలను కాలదన్ని నాలుగేళ్లు తప్పిదాలు చేశామనే ఆందోళన టీడీపీ నాయకుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రానికి నిధుల గురించి ఒత్తిడి చేయకుండా, అధినేత ఢిల్లీ వెళ్లినప్పుడల్లా అసెంబ్లీ సీట్ల పెంపుపైనే దృష్టి సారించడంతో కేంద్రం దృష్టిలో చులకనైపోయామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. రాజధాని నిర్మాణానికి ఎన్ని నిధులు కావాలో ఇప్పటికీ కేంద్రాన్ని అడగకవడం పెద్ద లోపమని చెబుతున్నారు.

నాడు పొగిడి ఇప్పుడు విమర్శలా?

రాజధాని డిజైన్ల పేరుతో కాలయాపన చేయడం, డీపీఆర్ ఇవ్వకపోవడం, ఇచ్చిన నిధుల్ని తాత్కాలిక నిర్మాణాల కోసం భారీగా ధారపోయటం, లెక్కలు చెప్పటం లేదనే ఆరోపణలకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోవటంపై టీడీపీ నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో నిధులు అడిగే అవకాశం లేకుండా పోయిందనే వాదన ఆ పార్టీలో వినిపిస్తోంది. మరోవైపు ప్రతి సందర్భంలోనూ కేంద్రాన్ని పొగిడి రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందని చేసుకున్న ప్రచారం టీడీపీకి ఇబ్బందికరంగా మారినట్లు రాయలసీమకు చెందిన ఒక మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి ఏ రాష్ట్రం తేనన్ని నిధులు తెచ్చామని, ఇవ్వాల్సినవన్నీ ఇచ్చేసిందని పదేపదే చెప్పడంతోపాటు ప్రధానికి ధన్యవాదాలు తెలపడాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ప్లేటు ఫిరాయించి రాష్ట్రానికి అన్యాయం జరిగిందని పార్లమెంట్‌లో ఆందోళన చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆ పార్టీ నాయకులే అంటున్నారు.

హోదాను ఎందుకు వదులుకున్నట్లు?

అన్నింటికీ మించి రాష్ట్రానికి సంజీవినిగా చెప్పిన ప్రత్యేక హోదాను వదులుకుని దాని స్థానంలో ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకోవడం తమ అధినేత చేసిన తప్పుల్లో అతి పెద్దదని టీడీపీ వర్గాలు వాపోతున్నాయి. ఎన్నికల సమయంలో ప్రత్యేక హోదా కావాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత అది వద్దు ప్యాకేజీ చాలని రాష్ట్రమంతా సంబరాలు జరిపించుకోవటం, సన్మానాలు చేయించుకోవడం తమకు శాపంగా మారాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ప్యాకేజీతో ఏ రాష్ట్రానికి కేంద్రం ఇంతకు మించి ఇవ్వలేదని చెప్పి అత్యుత్సాహం ప్రదర్శించారని, కానీ ఇప్పటివరకూ నయాపైసా తేలేకపోయారనే విమర్శలకు సమాధానం చెప్పలేకపోతున్నామని పలువురు ఎంపీలు ఆవేదన చెందుతున్నారు. ప్యాకేజీ కింద ఈఏపీ ప్రాజెక్టులకు ఒప్పుకుని ఆ తర్వాత అవి వద్దు నాబార్డు ద్వారా నిధులిప్పించాలని సీఎం చంద్రబాబు స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. ప్యాకేజీకి ఒప్పుకోకపోయి ఉంటే హోదా కోసం గట్టిగా అడిగే అవకాశం ఉండేదని, కానీ ఇప్పుడు దాని గురించి మాటాడే అవకాశం కూడా లేకుండా పోయిందని వాపోతున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం పోలవరం నిర్మాణ బాధ్యత కేంద్రానిది కాగా తామే పట్టుబట్టి దక్కించుకోవటం కూడా ఇబ్బందికరంగా మారిందంటున్నారు.

ఇప్పుడు ఏ దారిలో వెళ్లాలి?

రాజధాని నిర్మాణం, పోలవరం, ఈఏపీ ప్రాజెక్టులు, అసెంబ్లీ సీట్ల పెంపు తదితర వ్యవహారాల్లో తప్పుల మీద తప్పులు చేసి కేంద్రానికి దొరికిపోయి ప్రజలకు సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఉన్నామని టీడీపీ అనుకుంటోంది. కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందంటూ నిరసనలకు దిగి మరింత అభాసుపాలయ్యామని మథనపడుతున్నారు.

గుణదల మరియమాత ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు


హాజరైన భక్తులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): గుణదల మేరీమాత మహోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో గుణదల పోటెత్తింది. కొండ మార్గాలన్నీ జనసంద్రంగా మారాయి. మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం జరిగిన ప్రార్థనల్లో కర్నూలు మేత్రాసనం బిషప్ పూల ఆంథోని ముఖ్య అతిథిగా పాల్గొని వాక్యోపదేశం ఇచ్చారు. ఏసు ప్రేమతత్వంతో మూర్తీభవించిన తల్లి మరియమాత అని, ఆ తల్లిని వేడుకుంటే వెన్నంటే ఉండి రక్షణగా నిలుస్తుందని చెప్పారు. సాయంత్రం గుంటూరు మేత్రాసనం పూర్వ బిషప్ గాలి బాలి, విజయవాడ మేత్రాసనం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, విజయవాడ కతోలిక పీఠానికి చెందిన గురువులు దివ్యపూజాబలి సమర్పించారు. మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టార్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ పసల తోమస్, ఫాదర్ ఇంటి ఆంతోని, ఫాదర్ ఎస్ డేవిడ్‌రాజు తదితర గురువులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విదేశీ పెట్టుబడులు ఆహ్వానించేవారు దేశభక్తులా?

ప్రొఫెసర్ హరగోపాల్

నెల్లూరు రూరల్: విదేశీపెట్టుబడులను ఆహ్వానించేవారు దేశభక్తులా అని ప్రొఫెసర్ హరగోపాల్ ప్రశ్నించారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం 18వ రాష్ట్ర మహాసభలు శనివారం జరిగాయి. తొలుత అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్యాగాలు చేయకుండా మెరుగైన సమాజాన్ని రూపుదిద్దలేమన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, హిందురాజ్యం అనే భావాలను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో అసాంఘిక శక్తులు పెరిగిపోతున్నాయని, వీటిని ఎదుర్కోవాల్సి ఉందన్నారు. మోడి ఆర్థిక విధానాలు, ప్రజా స్వామిక హక్కుల గురించి ప్రొఫెసర్ శేషయ్య మాట్లాడారు. ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం, కర్తవ్యాల గురించి ప్రొఫెసర్ అనంద్ తేల్ తుంబ్డే వివరించారు. పీడీఎస్‌యు, కేఎన్‌పీఎస్, ప్రజా ఐక్యవేదిక నాయకులు సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు అబ్బాయిరెడ్డి, రాష్ట్ర నాయకులు వేడంగి చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్, జిల్లా నాయకులు ఎల్లంకి వెంకటేశ్వర్లు, సాగర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ

ముస్లింలంతా ఐక్య పోరు సాగించాలి

- ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్లీనరీలో అధ్యక్షుడు నద్వీ పిలుపు

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ముస్లిం పర్సనల్ లా బోర్డు జాతీయ అధ్యక్షుడు మౌలానా రాబె హసనీ నద్వీ విమర్శించారు. కేంద్రం అవలంబిస్తున్న వైఖరిపై ముస్లిం సముదాయంలోని అన్ని వర్గాలు సంఘటితమై తీవ్ర స్థాయిలో పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని సాలారే మిల్లత్ ఆడిటోరియంలో జరుగుతున్న ముస్లిం పర్సనల్ లా ప్లీనరీ సమావేశాల్లో శనివారం బోర్డు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నద్వీ సభ్యులనుద్దేశించి మాట్లాడారు. ముస్లింల ధార్మిక, షరియత్ హక్కులను మార్చడానికి కేంద్రం తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను ముస్లిం సముదాయం తిప్పికొట్టాలన్నారు. కేంద్ర వైఖరిపై ముస్లిం సమాజం, ముస్లిం సంస్థలు, బోర్డులు మౌనం పాటించడం సరికాదన్నారు. కేంద్రం వైఖరికి వ్యతిరేకంగా శాంతియుత పోరాటాలు చేయడం అందరి బాధ్యత అన్నారు. ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. బాబ్రీ మసీదు శతాబ్దాలుగా ముస్లింల మసీదుగానే ఉందని, ప్రభుత్వాలు దీన్ని మార్చడానికి తీవ్ర స్థాయిలో ప్రయత్నించడం సరికాదన్నారు.

నీట్ నిబంధనలతో అభ్యర్థులకు కష్టాలు

- ఓపెన్ స్కూళ్ల అభ్యర్థులు నీట్‌కు అర్హులు కాదు
- బయాలజీ అదనపు సబ్జెక్టుగా ఉన్నా అనుమతి నిరాకరణ
- 25 ఏళ్ల వయసు దాటినా అనర్హులే

సాక్షి, అమరావతి: జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) కొత్త నిబంధనలతో లక్షలాదిమంది అభ్యర్థులు పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోనున్నారు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. తాజా నోటిఫికేషన్‌లో 25 ఏళ్లు మించితే నీట్ రాయడానికి అర్హులు కాదని ప్రకటించారు. ఎంబీబీఎస్ సీట్లు తక్కువగా ఉండటం, పోటీ తీవ్రంగా ఉండటంతో అభ్యర్థులు నాలుగైదుసార్లు పరీక్ష రాస్తుంటారు. తాజా నిబంధనతో పదే పదే ప్రవేశ పరీక్ష రాసే అర్హత కోల్పోయారు. దీంతోపాటు ఓపెన్ స్కూల్ విధానంలో ఇంటర్మీడియట్ చదివినవారు అర్హులు కాదని తేల్చడంతో వారు కూడా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఎక్కడ నుంచైనా, ఎవరైనా చదువుకోవచ్చనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టిందని వారంటున్నారు. ఇంటర్మీడియట్‌లో బయాలజీ లేదా బయోటెక్నాలజీ సబ్జెక్టులను అదనపు సబ్జెక్టులుగా చదివినవారు కూడా నీట్‌కు అర్హులు కాదని చెప్పడంతో విజయమే లక్ష్యంగా సిద్ధమవుతున్న అభ్యర్థులు నీరుగారిపోయారు. ఈ నిబంధనలను సవరించాలని పలువురు అభ్యర్థులు ఇప్పటికే పరీక్ష నిర్వహిస్తున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)కి ఫిర్యాదులు చేసినట్టు తెలిసింది.

మాకు ఫిర్యాదులు రాలేదు

నీట్ నోటిఫికేషన్‌లో నిబంధనలు చేర్చింది వాస్తవమే. కానీ వీటిపై ఇప్పటివరకూ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఎలాంటి ఫిర్యాదులూ రాలేదు. ఫిర్యాదులు వస్తే వాటిని సీబీఎస్ఈ పరిశీలనకు పంపిస్తాం. దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం మాకు లేదు.

–డా.ఎస్.అప్పలనాయుడు, రిజిస్ట్రార్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

వయసు నిబంధన నష్టమే

పాతికేళ్లు దాటితే నీట్ రాసేందుకు అనర్హులంటూ పెట్టిన నిబంధన నష్టపరిచేదే. సీట్లు తక్కువగా ఉండటంతో నాలుగైదుసార్లు పరీక్ష రాస్తున్నా సీటు రావడం లేదు. ఈ నేపథ్యంలో 25 ఏళ్లు దాటితే అభ్యర్థి వేదన వర్ణించలేం.

–డా.వికాస్, హౌస్‌సర్జన్, సిద్ధార్థ వైద్యకళాశాల, విజయవాడ

ఏఐసీటీఈ నిబంధనలే సుప్రీం

- ఇష్టారాజ్యంగా ప్రవేశాలు, ఫీజులు ఇక కుదరవు
- డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీలకు మినహాయింపులు రద్దు
- ఏప్రిల్ 10తో అనుమతుల మంజూరు ప్రక్రియ ముగింపు

సాక్షి, అమరావతి: సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అందించే అన్ని విద్యాసంస్థలు ఇకపై జాతీయ సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందే. ఏఐసీటీఈ ఆమోదిస్తేనే ఆయా సంస్థలు కోర్సులు, ప్రవేశాలను నిర్వహించాల్సి ఉంటుంది. అడ్మిషన్ల విషయంలో ఇప్పటివరకు డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ యూనివర్సిటీలకు ఉన్న కొన్ని మినహాయింపులు ఇకపై వర్తించవు. దేశంలో ప్రొఫెషనల్, టెక్నికల్ కోర్సులు అందించే అన్ని విద్యా సంస్థలను ఏఐసీటీఈ పరిధిలో చేర్చాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో జాతీయ విద్యామండలి తాజాగా కొత్త నిబంధనావళిని అమల్లోకి తెచ్చింది. 2018–19 విద్యా సంవత్సరానికి ఆయా సంస్థలకు అనుమతి మంజూరుకు కొద్దిరోజుల క్రితం 'పబ్లిక్ నోటీస్' జారీ చేసింది. ఇప్పటివరకు డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ యూనివర్సిటీలు ఇన్‌టేక్ సంఖ్యతో సంబంధం లేకుండా ఎన్ని సీట్లయినా భర్తీ చేసుకుంటున్నాయి. డిమాండ్‌ను బట్టి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో సీట్ల భర్తీ విషయంలో ఇష్టారాజ్యానికి బ్రేకులు పడనున్నాయి. ఏఐసీటీఈ అనుమతుల మేరకే ఆయా సంస్థలు సీట్లను భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది.

అనుమతులు పొందాల్సిందే

సాంకేతిక, మేనేజ్‌మెంట్ కోర్సులు నిర్వహించే విద్యా సంస్థలు, కొత్తగా ఏర్పాటు చేసే సంస్థలు ఏఐసీటీఈ అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి. కొత్త విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్–టెక్నాలజీ, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ప్లానింగ్, అప్లయిడ్ ఆర్ట్స్, క్రాఫ్ట్, హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ/మేనేజ్‌మెంట్, ఎంసీఏ కోర్సుల్లో డిప్లొమా, పోస్టు డిప్లొమా, యూజీ, పీజీ, పీజీ డిప్లొమా అందించే ఆయా వర్సిటీలు, బోర్డుల అప్రూవల్ ఉన్న సంస్థలు కూడా తొలిసారిగా ఏఐసీటీఈ అనుమతులు తీసుకోవాల్సిందే. ఆర్కిటెక్చర్ కౌన్సిల్ అనుమతులతో కొనసాగుతున్న సంస్థలు, ఎంసీఏ, ఎంబీఏ తదిరత సాంకేతికేతర కోర్సుల సంస్థలు కూడా ఏఐసీటీఈ నుంచి అనుమతులు పొందాలి. సుప్రీంకోర్టు ఇంతకు ముందు ఇచ్చిన తీర్పు మేరకు డీమ్డ్ వర్సిటీలు, ప్రైవేట్ వర్సిటీలు కూడా ఏఐసీటీఈకి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. వర్సిటీల విభాగాలు, ప్రైవేట్ వర్సిటీలు కూడా కొత్త సాంకేతిక విద్యాసంస్థల మాదిరిగా ఏఐసీటీఈకి దరఖాస్తు చేయాలి. విద్యాసంస్థలు మరో చోటుకు మారినా, మూసివేయాలని నిర్ణయించినా, మహిళా విద్యాసంస్థలను కో–ఎడ్యుకేషన్ సంస్థలుగా మార్చాలన్నా, మహిళా విద్యాలయాలుగా మార్చాలన్నా, ఇన్‌టేక్ పెంపు తదితర అంశాలకు ఏఐసీటీఈ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. అనుమతుల మంజూరు ప్రక్రియ ఏప్రిల్ 10వ తేదీతో ముగియనుంది.


శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి


విజయవాడలో జరిగిన ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు



కదం తొక్కిన ఉద్యోగులు

- సీపీఎస్ రద్దు చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలంటూ ధర్నాలు, ర్యాలీలు
- సీపీఎస్ రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్
- సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు


అనంతపురంలో జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు చేయాలంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు శనివారం రాష్ట్రవ్యాప్తంగా కదంతొక్కారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ పెద్ద ఎత్తున నినదించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కృష్ణా జిల్లా విజయవాడలో జరిగిన ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీగా పాల్గొన్నారు. వీరికి వైఎస్సార్‌సీపీ నాయకులు కొలుసు పార్థసారథి, మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్సీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పెన్షన్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని, దీనిని తొలగించే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బాజి మాట్లాడుతూ.. ఉద్యోగులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వాలు నామరూపాలు లేకుండా పోతాయన్నారు. మరోవైపు కర్నూలు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో రెండు వేల మంది ఉద్యోగులు పాల్గొన్నారు. పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో విశాఖ జీవీఎంసీ గాంధీ పార్క్‌లో జరిగిన ధర్నాలో 28 సంఘాలకు చెందిన ఉద్యోగులు పాల్గొనగా.. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం మెడలు వంచి ఉద్యోగుల హక్కులను సాధిస్తామని చెప్పారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్‌కు బానిసగా వ్యవహరిస్తూ ఉద్యోగులకు అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ జిల్లా కడపలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని నాయకులు జయరామకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, శివారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగులతో ఆడుకుంటున్న టీడీపీ నాయకులకు రాజకీయ సమాధి కట్టాలని అనంతపురం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు పిలుపునిచ్చారు. విజయనగరం, శ్రీకాకుళంలో జరిగిన ఆందోళనల్లో 120 సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలను సముద్రంలో కలిపివేయాలని నాయకుడు ప్రభుజీ పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్‌తో ఉద్యోగుల జీవితాలకు భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల అనేక కుటుంబాలు పింఛన్ లేక ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడ్డాయన్నారు.

అధికారంలోకి రాగానే సీపీఎస్ రద్దు చేస్తాం

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి కొలుసు పార్థసారథి

మేము అధికారంలోకి రాగానే సీపీఎస్‌ను రద్దు చేస్తాం. పాత పింఛన్ విధానాన్నే కొనసాగిస్తాం. మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇప్పటికే ఈ విషయాన్ని ప్రకటించారు. ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.

సీపీఎస్ రద్దు చేస్తానన్న పార్టీలకే మా మద్దతు

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు

సీపీఎస్ రద్దు అంశం తమ పరిధిలోది కాదంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులను దగా చేస్తున్నాయి. ఏ రాజకీయ పార్టీ అయితే సీపీఎస్‌ను రద్దు చేస్తామని ప్రకటిస్తుందో ఆ పార్టీకే మేము మద్దతిస్తాం. ఈ నెల 18న జరిగే సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం.

ప్రజాసంకల్ప యాత్ర



బోడగుడిపాడు బహిరంగసభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం


మనుబోలుపాడు వద్ద దివ్యాంగురాలు సుజాతమ్మను ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రతిపక్ష నేత, బోడగుడిపాడులో అభిమానులు ఏర్పాటు చేసిన పూల బాటపై ముందుకు సాగుతున్న జగన్

ఊపిరున్నంత వరకూ పోరాడుతా..

'ఏ రాజకీయ నాయకుడిలోనైనా విశ్వసనీయత, నిజాయితీ, చిత్తశుద్ధితో పాటు పట్టుదల ఉండాలి. ఇవి లేనపుడు ఆ నాయకుడు చంద్రబాబే అవుతారు. ఒక్కసారి హోదా వస్తే ఉద్యోగాల విప్లవం వస్తుంది. దానిని సాధించి తీరుతాం. ప్రతి జిల్లా ఒక హైదరాబాద్ అవుతుంది. మన రాష్ట్రంలోనే పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి.' – వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రానికి సంజీవని అయిన ప్రత్యేక హోదా కోసం తాను ఊపిరున్నంత వరకూ పోరాడుతానని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. విభజన సమయంలో ఇచ్చిన ప్రధాన హామీ అయిన హోదా కోసం నాలుగేళ్లుగా తాము పోరాడుతుంటే అడుగడుగునా అడ్డుతగిలిన చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలు ఇప్పుడు మొసలి కన్నీళ్లు కారుస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి అన్ని విధాలా మేలు చేసే ప్రత్యేక హోదాను సాధించి తీరుతామన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శనివారం 83వ రోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని బోడగుడిపాడు వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంతో గొప్పగా చేసిందని, రాష్ట్రానికి రావాల్సిన వన్నీ వచ్చేశాయని ఊదరగొట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరో ఏడాదిలో ఎన్నికలొస్తున్న నేపథ్యంలో బడ్జెట్‌లో అన్యాయం జరిగిందంటూ మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. రాష్ట్రానికి కేంద్రం ఎంతో మేలు చేసిందని పలు సందర్భాల్లో చంద్రబాబు చేసిన ప్రకటనలను ఉదహరిస్తూ తూర్పారబట్టారు. ఈ సభలో జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..

ఎక్కడికెళ్తే అక్కడిలా రాష్ట్రాన్ని మార్చేస్తానంటారు..

''సింగపూర్, కొరియా, స్విట్జర్లాండ్.. ఇలా చంద్రబాబు ఏ దేశానికి వెళితే అక్కడి మాదిరిగా రాష్ట్రాన్ని మార్చేస్తానంటారు. ఇలా చెప్పడం తప్ప నిరుద్యోగులైన పిల్లలకు ఉద్యోగాలు తేవాలన్న తాపత్రయమే లేదు. ఏ దేశానికి పోతే ఆ దేశం మన ఏపీని దత్తత తీసుకుందని చెప్పి మభ్య పెడతారు. 'మా ఊరి పొలిమేరల్లో నాలుగు కొండలు పెట్టి వాటిపై మంచు కురిపిస్తా' అని చెప్పలేదు.. అందుకు సంతోషిద్దాం. అసలు చంద్రబాబు విదేశాలకు వెళ్లేది ఉద్యోగాల కోసం కాదు.. పెట్టుబడుల కోసమూ కాదు. తన అవినీతి సొమ్మును అక్కడ దాచుకునేందుకే వెళతారు. దీనికి కలరింగ్ ఇచ్చుకుంటారు. ఆ కలరింగ్ ఏంటంటే.. మొదటిసారి వెళ్లినపుడు మైక్రోసాఫ్ట్ రాష్ట్రానికి వస్తోందని, రెండోసారి వెళ్లినపుడు ఎయిర్ బస్ వస్తోందని, మూడో సారి వెళ్లినపుడు రాష్ట్రానికి ఏకంగా బుల్లెట్ ట్రైన్ వస్తోందని చంద్రబాబుకు సంబంధించిన అనుకూల పత్రికలు, చానెళ్లు ఊదరగొడతాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే, బడ్జెట్ సమావేశాలప్పుడు చంద్రబాబు దుబాయ్‌కి వెళ్లడం మరో ఎత్తు. కేంద్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ముఖ్యమంత్రి ఇక్కడే ఉండి.. మనకు అన్యాయం జరిగిందని ఒక్క మాట కూడా మాట్లాడలేక పోయారు. పైగా ఆయన దుబాయ్‌కి పోగానే అక్కడి నుంచి ఎమిరేట్స్ మన రాష్ట్రానికి వచ్చేస్తోందంటూ అనుకూల పత్రికలన్నీ రాసేస్తాయి.


మనుబోలుపాడులో జగన్‌ను దీవిస్తున్న అవ్వలు


బోడగుడిపాడులో జై జగన్ అంటూ జననేతతోపాటు నడుస్తున్న అక్కచెల్లెమ్మలు

నాలుగేళ్లుగా చేసినవన్నీ మోసాలే

రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై చంద్రబాబు నాలుగేళ్లుగా అబద్ధాలు చెబుతూ మోసం చేస్తూ వచ్చారు. విశాఖపట్టణంలో రెండేళ్లు నిర్వహించిన భాగస్వామ్య సదస్సుల్లో ఒక ఏడాది రూ. 5 లక్షల కోట్లు, మరో ఏడాది రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చినట్లుగా చంద్రబాబు ప్రకటించారు. కానీ కేంద్ర పరిశ్రమల శాఖ లెక్కల ప్రకారం చూస్తే ఒక ఏడాది రూ.10 వేల కోట్లు, మరో ఏడాది రూ.4,300 కోట్లు మాత్రమేనని వెల్లడైంది. వాస్తవాలు ఇలా ఉంటే రాష్ట్రంలో ఉద్యోగాలు పుష్కలంగా లభించి, మన పిల్లలంతా కేరింతలు కొడుతున్నారని చంద్రబాబు చెబుతున్నారు.

రైతుల పరిస్థితి దారుణం

ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధరలు లేని పరిస్థితుల్లో రైతన్నలు వ్యవసాయం చేస్తున్నారు. రుణ మాఫీ పేరుతో చంద్రబాబు రైతులను దారుణంగా మోసం చేశారు. రుణమాఫీ సొమ్ము వడ్డీలకు కూడా సరిపోని పరిస్థితి ఉంది. రుణ మాఫీ చేస్తానని చెప్పి చేయకుండా చంద్రబాబు ఇవాళ రాష్ట్రంలో ఉండే ప్రతి అక్కా, చెల్లెమ్మ కళ్ల నీళ్లు పెట్టుకునేలా చేశారు. మహిళలు కన్నీళ్లు పెడితే అరిష్టం అంటారు. కానీ వారిని కూడా ముఖ్యమంత్రి వదలకుండా మోసం చేశారు. బాబు వస్తే జాబు వస్తుందని ప్రచారం చేసుకున్నారు. జాబు ఇవ్వలేక పోతే ప్రతి నెలా రూ.2 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. ఇప్పటికి చంద్రబాబు అధికారంలోకి వచ్చి 45 నెలలు దాటినా ఆ ఊసే లేదు. ఈ లెక్కన ప్రతి ఇంటికీ రూ.90 వేలు ఎగ్గొట్టారు కదా? మన రాష్ట్రంలో పిల్లలకు కాస్తో, కూస్తో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండేది ప్రత్యేక హోదా వల్లనే. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే ఇక్కడ పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు ఆదాయపు పన్ను, జీఎస్టీ కట్టాల్సిన పని లేదు. ఎప్పుడైతే ఈ రాయితీలు ఉంటాయో అపుడే పారిశ్రామికవేత్తలు వచ్చి ఫ్యాక్టరీలు, హోటళ్లు, ఆసుపత్రులు కడతారు. అప్పుడే మన నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు వస్తాయి. అలాంటి ప్రత్యేక హోదాను చంద్రబాబు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఢిల్లీ పెద్దలకు అమ్మేసి రాష్ట్ర ప్రజలను అన్ని రకాలుగా మోసం, అన్యాయం చేశారు.

చివరకు హీరోదే పైచేయి అవుతుంది..

పధ్నాలుగు రీళ్ల సినిమా ఏది చూసినా ఆది నుంచీ 13వ రీలు వరకు విలన్‌దే పైచేయిగా ఉంటుంది. ముగింపునకు వచ్చేటప్పటికి 14వ రీల్‌లో హీరో అంతిమంగా విలన్‌ను చావబాదుతాడు. మనకు సాధారణంగా మంచి పనులు చేసే హీరోనే నచ్చుతాడు. అందుకే సినిమా అంతా అతను ఎదురు దెబ్బలు తింటూ ఉన్నా మన మద్దతు హీరోకే ఉంటుంది. చివరకు హీరోదే పైచేయి అవుతుంది. ఇప్పటి రాజకీయ వ్యవస్థలో నిజాయితీ, విశ్వసనీయత లేదు. రాష్ట్రం విడిపోయేటప్పుడు 1.42 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉంటే.. ఈ నాలుగేళ్లలో ఒక్క ఖాళీని కూడా భర్తీ చేయలేదు. రేపు దేవుని ఆశీస్సులు, మీ అందరి చల్లని దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఏటా ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించి ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అంతే కాదు.. గ్రామ స్థాయికే ఉద్యోగాలు తెస్తాను. ఇవాళ ఏ సంక్షేమ పథకం లబ్ధిదారునికి ఇవ్వాలన్నా.. జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వాల్సి వస్తోంది. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలను నెలకొల్పుతాం. ఆ గ్రామంలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన పది మందికి అందులో ఉద్యోగాలిస్తాం. ప్రజలు దరఖాస్తు చేసిన 72 గంటల్లో సంక్షేమ పథకాలు మంజూరు చేస్తాం. ఈ విషయంలో మతం, కులం, పార్టీలను చూడం. ఏ పథకం కోసం ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం మన రాష్ట్రంలో పెట్టే పరిశ్రమల్లో స్థానికులకు సెక్యూరిటీ గార్డు వంటి ఉద్యోగాలు మినహా ఇతర ఉద్యోగాలు ఇవ్వడం లేదు. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెట్టబోయే పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ఆ నిబంధనను పారిశ్రామికవేత్తలు కచ్చితంగా పాటించేలా చూస్తాం. ప్రత్యేక హోదాను ఎప్పటికీ వదలం.. ఊపిరున్నంత వరకూ పోరాడుతూనే ఉంటాం. ఇవాళ కాక పోయినా రేపైనా దానిని సాధిస్తాం. తెలంగాణ కోసం ఎన్ని ఏళ్లు పోరాడారో మీ అందరికీ తెలుసు. మనకు సంజీవని అయిన హోదా కోసం పోరు కొనసాగిస్తాం'' అని వైఎస్ జగన్ అన్నారు.

ఏం సాధించావయ్యా బాబూ..

కేంద్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో ఐదారు రోజులుగా చంద్రబాబు కార్చిన మొసలి కన్నీరు మీ అందరికీ కనిపించే ఉంటుంది. టీడీపీ మంత్రులు భాగస్వాములుగా ఉన్న కేంద్ర మంత్రివర్గం ఆమోదంతోనే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశ పెడతారు. వాళ్ల మంత్రులే ఆమోదించిన బడ్జెట్ గురించి చంద్రబాబుకు నిజంగా తెలియదా? అన్నీ తెలిసి ఇవాళ అన్యాయం జరుగుతోందని మొసలి కన్నీరు కారుస్తారా? ఇదేమీ తొలి బడ్జెట్ కాదు.. ఎన్డీయే పాలనలో ఇది ఆఖరు బడ్జెట్. ఇప్పటికి ఐదుసార్లు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. గత నాలుగేళ్ల బడ్జెట్‌లలో ఏమీ సాధించలేకపోగా.. ఆయన చేసిన మోసాలు, అన్యాయాల గురించి రాష్ట్ర ప్రజలందరూ తిడుతున్నారన్న సంగతి తెలుసుకుని ఆ నెపాన్ని ఇపుడు కేంద్రంపై నెట్టేస్తున్నారు. కొంత కాలం క్రితం చంద్రబాబు.. కేంద్రం రాష్ట్రానికి ఎంతో చేసిందని చెప్పిన పత్రికా ప్రకటనలను మీ దృష్టికి తెస్తున్నా. ఆయనకు అనుకూలమైన ఈనాడు, ఇతర ఎల్లో మీడియాలో వచ్చిన వార్తలనే ఇక్కడ చూపిస్తాను. (పత్రిక చూపుతూ) గత ఏడాది జనవరి 26 నాటి పత్రికలో.. 'మనమే ఎక్కువ సాధించాం.. ఏ రాష్ట్రానికైనా ఇంతకంటే ఎక్కువ వచ్చాయా?' అని చంద్రబాబు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంతో గొప్పగా చేసిందని ఇందులో చెప్పారు. పైగా 'ఆధారాలుంటే రండి, చెప్పండి' అంటూ ప్రతిపక్షానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సవాల్ అని పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సినవన్నీ వచ్చేశాయని గత ఏడాది బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు చంద్రబాబు ఈ విధంగా చెప్పారు. సాక్షిలో వచ్చిన వార్తలను నేను చూపించడం లేదు. ఇవన్నీ కూడా వారి అనుకూల పత్రికల్లో వచ్చినవే చూపుతున్నాను. 'ప్రత్యేక హోదా అంటున్నారు.. అదనంగా వచ్చేది ఏంటో.. ప్యాకేజీ కంటే ప్రత్యేక హోదా వల్ల వచ్చే మేలేంటో..' అని చంద్రబాబు మనల్నే అప్పట్లో ఎదురు ప్రశ్నించారు. ప్రత్యేక హోదా సంజీవని లాంటిది కనుక, పదేళ్లు కాదు.. పదిహేనేళ్లు తెస్తానని ఎన్నికలప్పుడు చంద్రబాబే చెప్పారు కదా! పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలంటేనే మూడేళ్లు పడుతుందని కూడా ఆయనే చెప్పారు. హోదాయే సంజీవని అన్న పెద్దమనిషి ప్యాకేజీ కన్నా హోదా వల్ల సాధించేదేమిటి.. అని ప్రశ్నిస్తారా? గత ఏడాది జూన్ 6 ఈ మాటలు అన్నారు. 'హోదా తెస్తామన్న వాళ్లే చెప్పాలి.. ప్యాకేజీకన్నా హోదా వల్ల జరిగే మేలేమిటో' అని కూడా చంద్రబాబు అన్నారు. పైగా 'దేశంలోకెల్లా నేనే సీనియర్' అని కూడా ఆరోజున చెప్పుకున్నారు.


మనమే ఎక్కువ సాధించామని చంద్రబాబు చేసిన ప్రకటనను బోడగుడిపాడు బహిరంగసభలో చూపుతున్న జగన్

ఎన్నికలు వస్తున్నాయని ప్లేటు ఫిరాయింపు

'ప్రత్యేక హోదా వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ' (ఈనాడు) అని కేంద్ర మంత్రి సుజనా చౌదరి 2016 సెప్టెంబర్ 12న ప్రకటన చేశారు. 'మీ స్వార్థ ప్రయోజనాల కోసం, మీ అవినీతిని కేంద్రం ప్రశ్నించకుండా ఉండటం కోసం, మీపై దర్యాప్తులు జరక్కుండా తప్పించుకునేందుకు కేంద్రం ముందు సాగిలపడిపోయి ఇలా రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం ధర్మమేనా?' అని మేము చంద్రబాబును నిలదీసినపుడు 'మూర్ఖంగా వెళితే నష్టపోతాం..' అని 2016 సెప్టెంబర్ 11న ఆయన సమాధానం ఇచ్చారు. 'ఉద్యోగాలు రాని పిల్లలకు అన్యాయం చేస్తున్నావు కదయ్యా? వారెక్కడికి పోవాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారు.. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి పోరాడాల్సిన వ్యక్తివి నువ్వే కదయ్యా? పోరాడవయ్యా..' అని ప్రశ్నిస్తూ.. కేంద్రంలో ఉన్న టీడీపీ మంత్రులకు బుద్ధి రావాలని చెప్పి మేం బంద్‌లు, ధర్నాలు, యువభేరి కార్యక్రమాలు చేస్తూ ఉంటే.. 'దెబ్బలు తగిలిన చోట కారం చల్లుతారా! రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంటే మీరు బంద్‌కు పిలుపు నిస్తారా?' అని చంద్రబాబు అన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రానికి ఏ మేలూ జరక్కపోయినా చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదాను అమ్మేయడం, అమ్మేసిన తర్వాత ప్రత్యేక ప్యాకేజీ ఏదీ ఇవ్వక పోయినా కూడా.. ప్యాకేజీ ఏదో వచ్చిందన్నట్లుగా భ్రమలు (కలర్ ఇచ్చారు) కల్పించారు. నాలుగేళ్లుగా చంద్రబాబు చేసిందేమిటంటే రానిది చూపించడం, ప్రత్యేక హోదాను అమ్మేయడం మాత్రమే. ఇపుడు మరో ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయనేటప్పటికి ప్లేటు మారుస్తున్నారు. ఇదంతా చూస్తుంటే.. ఎందుకింత దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని నాకనిపిస్తోంది. ఇలాంటి దిక్కుమాలిన రాజకీయాలు చేయడం కన్నా ఆ పదవికి రాజీనామా చేసి ఇంటికి పోయి ఆనందంగా కూర్చోవడం మంచిది కాదా? చంద్రబాబు నోరు తెరిస్తే చాలు అబద్ధాలు చెబుతూ మోసాలు చేస్తారు. ఈ నాలుగేళ్ల పాలనలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉన్నారా? (లేరు.. లేరు.. అంటూ జనం చేతులూపారు)


మనుబోలుపాడు శివారులో జననేత పాదయాత్రలో వైఎస్ ప్రతిమలతో ముందు నడుస్తున్న అభిమానులు..

పాదయాత్రలో జగన్‌తో కలసి నడుస్తున్న ముస్లింలు

ఐతంపాడు క్రాస్ వద్ద ఓ అవ్వకు ధైర్యం చెబుతూ..

దుండిగంలో ఓ అవ్వ సమస్యను ఓపికగా వింటూ..

ప్రజాసంకల్ప యాత్ర 83వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం

1,125.2 కి.మీ

83వ రోజు నడిచిన దూరం

15.5 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు దగదర్తి మండలం దుండిగం క్రాస్‌రోడ్డు

ముగింపు: సా. 6 గంటలకు బోడగుడిపాడు శివారు

ముఖ్యాంశాలు

- దుండిగం క్రాస్, దుండిగం, ఐతంపాడు క్రాస్, లింగాలపాడు క్రాస్‌లో ప్రజలతో మమేకం
- మనుబోలుపాడు, బోడగుడిపాడుల్లో వైఎస్ఆర్ విగ్రహావిష్కరణలు, పార్టీ పతాకావిష్కరణలు
- బోడగుడిపాడులో బహిరంగ సభ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు బోడగుడిపాడు శివారు

ముఖ్యాంశాలు

- జక్కేపల్లి గూడూరు క్రాస్‌రోడ్డు, ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం కొత్తపాలెం, కలిగిరి మండలం తూర్పుగుడ్లదోన క్రాస్, పడమట గుడ్లదోన, అనంతపురం గ్రామాల్లో ప్రజలతో మమేకం


మనుబోలుపాడు వద్ద జగన్ చూసేందుకు చెట్టు ఎక్కిన అభిమానులు

83వ రోజు

10-02-2018, శనివారం
బోడగుడిపాడు,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా



అదే స్ఫూర్తి నాలోనూ ఉంది

ఈ రోజు ఉదయం దుండిగం గ్రామంలో పాడి రైతులు కలిశారు. నన్ను కలిశామన్న ఆనందం వాళ్ల కళ్లలో కనిపించినా.. గుండెల్లోంచి బాధ ఎగదన్నుకొచ్చింది. పైసా పైసా అప్పుచేసి పాడి గేదెలను సాకుతున్నారా రైతన్నలు. కరువు కాలంలోనైనా వేడినీళ్లకు చన్నీళ్లలా పాడి తోడుంటుందని భావించారు. కానీ, నీళ్లకున్న రేటు కూడా పాలకు ఇవ్వడం లేదయ్యా.. అంటూ బాధపడ్డారు. మూగ జీవాలకు మేతే కష్టమవుతోందట. గడ్డి రేట్లు మిద్దెక్కాయన్నారు. గొడ్డు చాకిరీ తప్పడం లేదన్నారు. ఇంత చేసినా ఆ పాలమ్మితే కన్నీళ్లే మిగులుతున్నాయని బావురుమన్నారు. ఆ రైతన్నల ఆవేదన నా గుండెను పిండేసింది. ఆరుగాలం కష్టపడే రైతన్న ఎందుకు నష్టపోతున్నాడు? అదే రైతన్న దగ్గర పాలు తీసుకుని ప్రయివేటు వ్యక్తులు కోట్లాది రూపాయలెలా కూడబెడుతున్నారు? సహకార పాల సంఘాలను బలోపేతం చేస్తే.. పాడి రైతు ఇంత దారుణంగా మోసపోడు కదా? మన ప్రభుత్వం వచ్చాక పాడి రైతులకు లీటర్‌కు నాలుగు రూపాయల ప్రోత్సాహకం ఇస్తామని చెప్పగానే.. సంబరపడ్డారు. ఆ మంచి రోజులు త్వరగా రావాలని ఆకాంక్షించారు.

నాన్నగారి హయాంలో రైతన్నల ఇంట ఎంత ఆనందం ఉండేదో ఏ ఒక్కరూ ఇంకా మర్చిపోలేదు. పాదయాత్ర దుండిగం దాటాక.. పద్మజ అనే ఓ అమ్మ ఇదే విషయాన్ని మరోసారి గుర్తుచేసింది. నాన్నగారి పాలన రైతన్నలకు ఓ స్వర్ణయుగం అని చెప్పింది. వరుణుడు కరుణించడమే కాదు.. పంటకు గిట్టుబాటు ధర ఉండేదని తెలిపింది. బోనస్ ఇవ్వడం ఆయనకే చెల్లిందని చెప్పింది. చంద్రబాబు తొమ్మిదేళ్ల పాలనలో వరికి మద్దతు ధర 13 శాతమే పెరిగితే.. నాన్నగారి కాలంలో 82 శాతం పెరగడం చరిత్రలోనే గొప్ప విషయమంది. ఈ నాలుగేళ్లలో మద్దతు ధర 17శాతం మించలేదని అంకెలతో సహా వివరించింది. నాన్నగారిది రైతు రాజ్యమైతే.. చంద్రబాబుది రైతు వ్యతిరేక రాజ్యమంది. అందుకే నాన్నగారు అంతగా రైతన్నకు దగ్గరయ్యారేమో. అదే స్ఫూర్తి నాలోనూ ఉంది.

ఐతంపాడు వద్ద రేషన్ డీలర్లు కలిశారు. నాలుగేళ్లుగా కష్టాల్లోనే కాలం గడుపుతున్నామన్నారు. ప్రతి కేజీకీ ప్రభుత్వం 70 పైసలు కమీషన్ ఇస్తోందట. షాపు నిర్వహణకు కూడా అది చాలడం లేదట. వారికొస్తున్న సరుకును కాటా వేస్తే తేడా ఉంటోందట. పైవాళ్లకు చెప్పినా పట్టించుకునే నాథుడే లేడట. అధికార పార్టీ వాళ్లదే రాజ్యమట. ఏం పాపం చేశామని ఇలా వేధిస్తున్నారంటూ వాపోయారు. వ్యూహాత్మకంగా వెంటాడుతున్నారనేది వారి అనుమానం. నిజమే కావొచ్చు. తాజా పరిణామాలు చూస్తుంటే.. వాళ్ల ఆందోళనకు అర్థముంది. ఈ మధ్య చంద్రన్న మాల్స్ వెలుస్తున్నాయి. పేదల పొట్టగొట్టి, బడాబాబుల జేబులు నింపే కార్యక్రమానికి చంద్రబాబే శ్రీకారం చుట్టారు. రిలయన్స్, హెరిటేజ్‌లకు వాటా ఉన్న ఫ్యూచర్ గ్రూపునకు నామినేషన్ పద్ధతిలో వాటిని కట్టబెడుతున్నారు. ఇంతకన్నా దారుణం ఉంటుందా?

ఈ రోజు యాత్ర మొత్తం తాగునీటికి కటకటలాడుతున్న గ్రామాల నుంచి సాగింది. జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తిచేసి, శాశ్వత కరువు నివారణకు చర్యలు తీసుకోకుండా.. కేవలం ప్రజలను మభ్యపెట్టి, మోసపుచ్చి ఓట్లు దండుకోవాలనుకునే నీతి లేని నేతలు పదవుల్లో ఉన్నంతకాలం ప్రజలకు ఈ ఇక్కట్లు తప్పవేమో!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మీ గత తొమ్మిదేళ్ల హయాంలోగానీ, నేటి పాలనలో గానీ.. పంటలకు గిట్టుబాటు ధర గురించి ఏనాడైనా ఆలోచించారా? కేంద్రాన్ని ఒక్కసారైనా అభ్యర్థించారా? ఈ నాలుగేళ్లలో మద్దతు ధర పెంచాలని కనీసం ఒక్క లేఖ కూడా రాయకపోవడం సిగ్గుగా అనిపించలేదా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం, 11-2-2018





నేను నా గళమెత్తుతాను.
అరవగలనని చెప్పడానికి కాదు.
గొంతులేని వారి తరపున
వినిపించడం కోసం.

- మలాలా యుసాఫ్జాయ్,
నోబెల్ శాంతి బహుమతి గ్రహీత

శక్తి!

ఏ ఇంట్లో కనపడుతుంది?
ఏ వీధిలో నడుస్తుంది?
ఏ ఆఫీసును నడిపిస్తుంది?
ఏ వ్యవహారాలు చక్కబెట్టగలుగుతుంది?
ఏ కొరివికుండ మోస్తుంది?
ఏ ఆస్తి కాగితం మీద సంతకం పెడుతుంది?
ఎప్పుడు మంచంలో వద్దనగలుగుతుంది?
ఎక్కడ తన కంచంలో ఓ ముద్ద
వేసుకోగలుగుతుంది?
అబ్బ... అంతెందుకు?
అసలు ఎన్ని పిండాలలో ఊపిరిపోసుకుంటుంది?
సంప్రదాయపు కట్టుబాట్లలో ఇంకెన్నాళ్లు
కట్టుబడి ఉంటుంది?
దేవత అనీ, పూజనీయురాలనీ, త్యాగమూర్తనీ...
ఇంకెన్నాళ్లు మనిషిగా జీవించే అవకాశాన్ని
పోగొట్టుకుంటుంది?
ఇంట్లో కొరికినా, వీధిలో కాటేసినా
ఇంకెన్నాళ్లు మూగబోయిన విగ్రహంలా
ఉండిపోతుంది?

భూమి అంత చైతన్యం రావాలి.
ఆకాశమంత అవగాహన కావాలి.
నీకు జన్మనిచ్చినదానిని... నువ్వు నాకేమిస్తావు?
ఆకాశంలో సగమిస్తావా?
భూమ్మీద పూర్తిగా దగా చేస్తావా?
వద్దు... నువ్వు నాకు ఇవ్వద్దు.
శక్తి ఒకరు ఇస్తే రాదనీ... ఒకరు దోచుకుంటే
పోదనీ... వెక్కిరిస్తే దాక్కోదనీ...
శక్తి నేనని... తెలుసుకుంటా. తెలియజేస్తా.
నేను శక్తి
అందమైన రేపటికి నేను శక్తి...
దానికి మీరే సాక్షి.

• గెస్ట్ ఎడిటర్

మగాళ్లు మారాలి

ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం ''స్త్రీలు ప్రపంచ పనిగంటల్లో 60 శాతం పనిచేస్తారు. ప్రపంచ ఆదాయంలో పదిశాతం మాత్రమే పొందుతారు. ప్రపంచ సంపదలోనైతే ఒకేఒక శాతం మీద మాత్రమే స్త్రీలకు యాజమాన్యం ఉంటుంది.'' ఇది 1980, 90 దశాబ్దాల లెక్కల ప్రకారం. ఇప్పుడు పరిస్థితి మరింత క్షీణించింది. స్త్రీలు ఎంతో శ్రమ చేసి, తక్కువ పొందటం ఒకరకమైన వివక్ష అయితే, స్త్రీలు చేసే పనులు విలువలేనివిగా, దాని వల్ల స్త్రీలు విలువలేనివారుగా పరిగణించడం మరొకరకం వివక్ష. వివక్ష వేరు వేరు కాలాలలో, వేరువేరు ప్రాంతాల్లో వేరుగా ఉంటుంది. కానీ సారాంశంలో మాత్రం స్త్రీలు తక్కువ స్థాయి వారు, వారు పురుషుల కంట్రోలులో ఉండాలి అనే ప్రాథమిక సూత్రంపై వివక్ష ఆధారపడి ఉంటుంది. మన అమ్మమ్మల కాలంలో పద్ధతులిప్పుడు లేవు. అలాగే దళిత స్త్రీలపై, గిరిజన స్త్రీలపై ఉండే వివక్షకూ అగ్రవర్ణ స్త్రీలపై అమలయ్యే వివక్షకూ ఎంతో తేడా ఉంటుంది. ఈ వివక్షలో అతి ప్రధానమైన, ప్రాథమికమైన నియంత్రణలు లైంగికత్వం మీద, సంతానోత్పత్తి మీద, శ్రమ మీదా అమలు జరుగుతాయి. ఈ నియంత్రణలను కచ్చితంగా అమలు చేయాలంటే స్త్రీల కదలికలను నియంత్రించాలి. ఒకప్పుడు స్త్రీలను ఇల్లు దాటి బైటికి రానివ్వకపోతే, ఇప్పుడు రాత్రి పొద్దుపోయాక రావొద్దంటున్నారు. కొన్ని ప్రాంతాల్లోనే సంచరించాలనే ఆంక్షలు పెడుతున్నారు.



ఓల్గా, రచయిత్రి

ఈ వివక్షను కొనసాగించడానికి అన్ని కాలాల్లో అన్ని దేశాల్లో ఉపయోగించే సాధనం హింస. లైంగిక అత్యాచారం, లైంగిక అవమానాలు, గృహహింస, పని చేసే చోట లైంగిక వేధింపులు– వీటన్నింటితో స్త్రీలలో భయాన్నీ, అభద్రతా భావాన్నీ కల్పించి వివక్ష విశ్వరూపంతో వర్ధిల్లుతోంది.

ఈ వివక్షలన్నింటినీ స్త్రీలు సవాలు చేస్తున్నారు. చట్టాలలో మార్పులకోసం కృషి చేస్తున్నారు. స్త్రీలలో ఇలా చైతన్యం పెరగటం అనేది కచ్చితంగా మార్పే. కానీ ఇప్పుడు చైతన్యం పెరగవలసింది పురుషులలో. స్త్రీలు అన్ని రంగాలలోకీ వస్తున్నారు. కానీ పురుషులు ఇంటి పనులకు ఇంకా దూరంగానే ఉంటున్నారు. ఇంటి పనికి సమాజం విలువ కట్టడం లేదు. శ్రమగా గుర్తించటం లేదు. పిల్లల పెంపకంలోకి పురుషులు రావటం లేదు.

సమానత్వం లేనిదే తమ కుటుంబ సభ్యులైన స్త్రీల ప్రేమను వారెన్నటికీ పొందలేరనే ఎరుక వారికి కలగటం లేదు. స్త్రీలను సమానులుగా భావించటం వల్ల తామేదో కోల్పోతామనే తెలివితక్కువ ఆలోచన నుండి బయటపడి, తాము ఎంతో పొందుతామనీ, సమాజం అభివృద్ధి చెందుతుందనీ పురుషులు గ్రహించేలా స్త్రీలు తమ పోరాటాలను నడిపి, వివక్షను నిర్మూలించాలి.



ఆమెకెందుకు సార్!
ఈ డిపార్ట్‌మెంట్‌ల పనెక్కువుంటది.
అయ్యో ఆమెకు పనిరాదు!
ఆమెకిద్దరు చిన్న పిల్లలు జల్దిసర్దుకుంటది బ్యాగు!
ఆమె చాన దూరం నుంచొస్తది బస్సుపోద్దని టెన్ టు ఫైవే ఆమె టైమ్!
ఆమె సీట్లనే ఉండది సార్!
ఆమెకు ఫ్రెండ్సెక్కువ!
చాయ్‌కంటది, ఫ్రెండ్సుంటది, చీరలంటది!

లోదుస్తుల రంగు అడిగారు!



ముఖ్యమైన డిపార్ట్‌మెంట్లు, కీర్తి తెచ్చిపెట్టే సెక్షన్స్, పెద్దపెద్దోళ్లతోని డీల్ చేసే డిపార్ట్‌మెంట్స్ ఆడవాళ్లకివ్వకుండా ఉండేందుకు మగాళ్లు చెప్పే సూక్తులివేనంటారు అణచివేతల దారుల గుండా ఎదిగివచ్చిన జూపాక సుభద్ర. సెక్రటేరియట్‌లో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీగా ఉన్నత స్థానంలో ఉన్న జూపాక సుభద్ర తెలంగాణ పోరుగడ్డపై బలమైన దళిత గొంతుక. ఆమె కథలూ, కవితలూ సమాజంపై విసిరిన సరికొత్త సవాళ్లు. వరంగల్ జిల్లాలో దళితవాడలో పుట్టి, అణచివేతనూ, వివక్షనూ ఎదిరించే చైతన్యాన్ని విద్యార్థిదశనుంచే అందిపుచ్చుకుని అదే స్ఫూర్తిని తన రచనల్లోనూ, కథలూ, కవితలూ, వ్యాసాల్లోనూ బలంగా వినిపిస్తూ సామాజిక అసమానతలపై కత్తులు ఝుళిపిస్తోన్న జూపాక సుభద్రని స్త్రీపురుష అసమానతలపై 'సాక్షి' తలపెట్టిన అక్షర యుద్ధం పై మాట్లాడమని కదిలించాము. అంతే ఒళ్లు గగుర్పొడిచే లైంగిక వేధింపులను భరిస్తూ, మండే గుండెలను చిక్కబట్టుకొని ఎప్పుడేం జరుగుతుందో తెలియక నిత్యం అవమానాలనూ, అవహేళనలనూ ఎదుర్కొంటూ అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతోన్న స్త్రీల గుండెచప్పుడును వినిపించారు. స్త్రీ అన్నదే వాస్తవం తప్ప ఆమె ఉన్నతోద్యోగంలో ఉందా, లేక ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీనా అనే తారతమ్యం ఎక్కడా లేదనడానికి తన జీవితమే ఉదాహరణ అంటోన్న జూపాక సుభద్రతో సాక్షి జరిపిన సంభాషణలోని ముఖ్యాంశాలివి.

> **"నువ్వే కలర్ అండర్‌వేర్ వేసుకుంటావ్", "వాడితో క్లోజ్‌గా ఉంటావెందుకు? వాడికి ఎయిడ్స్ ఉంది. నాతో ఉండు"**
>
> ఈ తరహా వేధింపులు ఎక్కడో మారుమూల పల్లెటూళ్లలోనో, ఏ కుగ్రామంలోనో మహిళా ఉద్యోగినికి ఎదురైనవి అనుకుంటే పొరబడ్డట్టే. అక్షరాలా హైదరాబాద్ నడిబొడ్డున రాష్ట్ర పరిపాలనా వ్యవహారాలన్నీ చక్కబెట్టే చోట పోలీసుల నిత్య పర్యవేక్షణలో ఉండే రాష్ట్ర సచివాలయంలోనే.

ఎన్నాళ్లు "కొత్త....గా" ఉంటావన్నాడు!

నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో మా ఆఫీసరు ఐదింటి తరువాత నన్ను పిలిచి ఎదురుగా కూర్చోబెట్టుకున్నాడు. నా కొలీగ్స్‌కి చెపితే వాళ్లెళ్లి ఆమె కొత్తగా చేరింది సార్ అని చెపితే ఎన్నాళ్లు ''కొత్త...గా'' ఉంటుందని ఒత్తిపలుకుతూ అదోరకంగా ద్వంద్వార్థంతో మాట్లాడాడు. ఏడేడు తరాల్లో ఏకైక దాన్ని గ్రూప్‌టూ రాసి కొత్తగా ఉద్యోగంలో చేరాను. ఆఫీసరు మాటలకు బెదిరిపోయి మూడు రోజులు సెలవుపెట్టి ఇంట్లోనే ఉన్నాను. అప్పటినుంచి ఎన్నో వేధింపులు, ఎన్నో ఎన్నో జుగుప్సాకరమైన పురుషుల చేతుల పూతలు, బూతులు, గుండెలపైనే గుచ్చే చూపులు, ఏదీ కుదరకపోతే మాపైనే తిరుగుబోతులనే కారెక్టర్ అసాసినేషన్స్.

కనీసం చెప్పుకునే దిక్కులేదు

నేను చేరేటప్పటికి ఈ సెక్రటేరియట్‌లో ఆడాళ్లకి ప్రత్యేకించి టాయ్‌లెట్స్ లేవు. లంచ్‌రూం లేదు. ఎంతో గొడవ చేస్తే ఈ టాయ్‌లెట్స్ వచ్చాయి. కానీ వాటి నిండా బూతుబొమ్మలు, ఆడాళ్లపైన చెత్తరాతలు, లేకపోతే అక్కడే టాయ్‌లెట్ క్లీన్ చేసే అమ్మాయిల పైన అఘాయిత్యాలు కూడా జరిగాయి. ఓ కాంట్రాక్ట్ ఎంప్లాయీ. బాత్‌రూం క్లీన్ చేయడానికెళ్లింది. తాగి ఉద్యోగంలో ఉన్న సెక్రటేరియట్ ఎంప్లాయీ ఆమె వెంటే వచ్చి తలుపు మూసేశాడు. ఆమె బయటకు పరిగెత్తుకొచ్చి లబోదిబోమంది. మేమంతా వెళ్లి అతనిపై కంప్లైంట్ ఇస్తే, ఏం జరిగింది? ఎక్కడ పట్టుకున్నాడు? ఆమె అక్కడేం చేస్తోంది?

> **అవసరం లేకున్నా ఐదింటి వరకు ఆఫీసరు మహిళా ఉద్యోగిని తన ముందు కూర్చోబెట్టుకోవడం ఏమిటి?**
>
> **ఐదింటి తరువాతే మా ఆఫీసరుకి మా పని గురించి ఆలోచించే తీరిక చిక్కడం ఏమిటి?**

ఇంత పొద్దున్నే ఏం పని? ఇలా ప్రశ్నలు! అఘాయిత్యం చేసినోడిని కాదు, అందుకు బలైన అమ్మాయిని! ఆమె పేరు బయటపడితే కాంట్రాక్టరు ఉద్యోగంలోంచి తీసేస్తాడని భయంతో ఆమె పేరు చెప్పనివ్వలేదు.

ఆకాశరామన్న ఉత్తరం ఒక ఉదాహరణ

ఆర్కైవ్స్‌లో పనిచేసే ఒకామెపై చీకట్లో జరిగిన అఘాయిత్యాన్ని ఇన్‌లాండ్ లెటర్‌లో రాసి పేరు రాయకుండా పోస్ట్ చేస్తే ఒకరి ద్వారా మరొకరికి మొత్తం సెక్రటేరియట్ అంతా తిరిగింది. ఆ ఆకాశరామన్న ఉత్తరంలో తనను ''ఆగం జేసారని రాస్తదామె''. నా ఫ్రెండే కొన్నేళ్ల క్రితం ఒకామె ఇక్కడ వేధింపులు తట్టుకోలేక, ఇంట్లో భర్త పెట్టే వేధింపులు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకిద్దరు చిన్నపిల్లలు. ఇక ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ మీద జరిగేవేవీ భయంతో బయటకు చెప్పుకోరు. చెపితే ఉద్యోగం పోద్ది, లేదంటే భర్తే మానిపిస్తాడు. అందుకే బయటికి చెప్పరు.

మేం సంఘటితం కాకూడదు!

మేం ఐక్యంగా ఉండొద్దు. మాకు యూనియన్ ఉండొద్దు. ఇదే ఇక్కడి పురుషులందరి అభిప్రాయం. అందుకే మామీద ఏం జరిగినా కంప్లయింట్ చేయడానికి ఒక కంప్లయింట్ బాక్స్ ఉండదు. కనీసం ఎన్నికల్లో ఆడవాళ్ల పోటీయే లేదు. తొలిసారిగా సెక్రటేరియట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌బేరర్‌గా గెలిచాను. నేనొక్కదాన్నే అలా ఓటింగ్ ద్వారా గెలిచిన తొలి మహిళని. తెలంగాణ వచ్చాక మేం ఉమెన్స్ అసోసియేషన్ పెడితే మా కరపత్రాలూ, పోస్టర్లూ చింపేశారు మగ లీడర్లు.

మహిళా ఉద్యోగినులకు ఏదైనా జరిగితే అప్పుడు మాదగ్గరికి ఉరికురికి వచ్చి చెప్పేటోళ్ళు. కానీ ఇప్పుడు ఎవరికి చెప్పుకోవాలో తెల్వదు. ఏం జేయాలో కూడా తెల్వదు.

> **మహిళా ఉద్యోగులపై మగ ఉద్యోగుల కామెంట్!**
>
> **'సింప్లీ సిట్టింగ్... మంత్లీ గెట్టింగ్'**

మహిళా ఎంప్లాయీస్ ఎంతో అభద్రత మధ్య, రక్షణ లేని పరిస్థితుల్లో, గోడలపై లేకి రాతల పనిప్రదేశాల్లో పనిచేస్తున్నారు. సెక్రటేరియట్‌లోనే ఇలా ఉంటే మిగిలిన చోట్ల ఆడవాళ్ల పరిస్థితులు మనం అర్థం చేసుకోవచ్చు.

మా పై ఆఫీసర్‌కి చెపితే ఇవి గూడా చెప్పాల్నామ్మా గోడలకు రంగులేస్తే పోతైగద అంటడు. నిజానికి గోడలకైతే రంగులు పూసి మరకలు లేకుండా చేయొచ్చు కానీ మెదడుకేం రంగులు పూయాలే?

ఇంటర్వ్యూ : అత్తలూరి అరుణ

స్త్రీ పురుషుల శారీరక, భౌతిక ప్రత్యేకతల రీత్యా స్త్రీలు ఇంటిపనికీ, పురుషులు బయటిపనికీ పరిమితమయ్యారు. కాలక్రమేణా స్త్రీలు చేసే ఇంటి శ్రమకు గుర్తింపే లేని పరిస్థితి ఏర్పడింది. శ్రమ విభజన.. పనిలో సైతం స్త్రీ పురుష అంతరాలు కొనసాగిస్తోంది. దీంతో గృహసంబంధిత పనులు స్త్రీలే చేయాలనే భావం, ఉద్యోగం పురుష లక్షణంగా పాతుకుపోయింది. పురుషులు బయటకెళ్లి సంపాదించేవారు కనుక వారికి సమాజం అధిక ప్రాధాన్యమిస్తోంది. స్త్రీలు పిల్లల పెంపకం, వంట, ఇంటిపనులకే పరిమితం. ఆమె చేస్తున్నది అనుత్పాదక పని కనుక ఆమెను ద్వితీయ శ్రేణి పౌరురాలిగా సమాజం నెట్టివేసింది. ఉత్పాదక రంగంలో ఉన్న పురుషుల శ్రమని లెక్కించొచ్చు. కానీ స్త్రీలు చేసే పనికి కొలమానం లేకుండా నిర్లక్ష్యానికి గురయ్యింది. ఈ ఆర్థికపరమైన విభజన భావనే స్త్రీ పురుష అసమానతలకు పునాది అని సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం.


పెట్టుబడిదారీ సమాజం రెండు రకాలైన శ్రామికులను తయారు చేసింది. తక్కువ వేతనంతో ఎక్కువగా (పనిగంటలు) శ్రమించే వారు ఒకరకం అయితే అందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితిలో ఉండి ఎక్కువ వేతనాలు పొందుతూ తక్కువ పనిగంటలు శ్రమించేవారు రెండవ రకం. (ఉదాహరణకు కన్‌స్ట్రక్షన్ పనిలో ఉండేవారు) మొదటి రకం శ్రామికులు స్త్రీలైతే, రెండవ రకం వారు పురుషులు. ఈ విభజన పనిలో లింగ వివక్షకు ప్రత్యక్ష ఉదాహరణ. స్త్రీలపై సమాజంలో కొనసాగుతోన్న వివక్షలన్నిటికీ ఇదే మూలం.

• గర్భంలో వివక్ష

ఆరోగ్యం, ఆహారం విషయంలో, స్త్రీల పట్ల శ్రద్ధ వహించకపోవడం వల్ల అనారోగ్యం కారణంగా ఎందరో స్త్రీలు (మిస్సింగ్ వుమన్) కనపడకుండా పోతున్నారు. ఉండాల్సిన సెక్స్ నిష్పత్తికీ, మనుగడలో ఉన్న సెక్స్ నిష్పత్తికీ మధ్యనున్న తేడానే మిస్సింగ్ వుమన్‌గానూ, స్త్రీలపట్ల కొనసాగుతున్న వివక్షకి కొలమానంగానూ భావిస్తున్నారు.

2001
3.91 కోట్లు
భారత దేశంలో మిస్సింగ్ వుమన్ సంఖ్య

భారతదేశంలో బాలబాలికల శాతం (0-6 యేళ్లు) ప్రతి 1000 మంది బాలురకి



7000 మంది
మన దేశంలో పుట్టకముందే ప్రతి రోజూ చనిపోతున్న ఆడపిల్లలు

* యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్(యూనిసెఫ్) రిపోర్టు ప్రకారం

వికక్ష

మహిళపై మగాడి కక్షే... వికక్ష

• ఆహారంలో వివక్ష

అభివృద్ధి చెందుతోన్న దేశాల్లో స్త్రీల ఆహారం విషయంలోనూ, ఆరోగ్యం విషయంలోనూ వివక్ష కొనసాగుతోంది. అంతేకాకుండా ఈ దేశాల్లో 'సన్ ప్రిఫరెన్స్' అత్యధికంగా ఉంది. పురుషులకు ఈ రెండు విషయాల్లోనూ ప్రథమ ప్రాధాన్యతనిస్తున్న పరిస్థితి ఉంది. పురుషులకన్నా స్త్రీలు తక్కువ క్యాలరీలు తీసుకుంటున్నట్టు అనేక పరిశోధనలు తేల్చి చెప్పాయి. పురుషులకన్నా స్త్రీలు 29 శాతం తక్కువ క్యాలరీలు తీసుకుంటున్నారు. సాధారణంగా మన భారతీయ మహిళలు తీసుకుంటున్న ఆహారం 1,400 కిలో క్యాలరీలు మాత్రమే. నిజానికి ప్రతిరోజూ ఒక స్త్రీకి తక్కువలో తక్కువ అవసరమైనది 1,600 కిలో క్యాలరీలు. కానీ ప్రతి స్త్రీ అవసరమైన దానికన్నా 200 కిలో క్యాలరీలు తక్కువగా తీసుకుంటోంది.



నిజానికి ప్రతిరోజూ ఒక స్త్రీ కి తక్కువలో తక్కువ అవసరమైన కిలో క్యాలరీలు.

మన భారతీయ మహిళలు తీసుకుంటున్న ఆహారం కిలో క్యాలరీలు



• శ్రమలో వివక్ష

ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 70 శాతం ఆహార ఉత్పత్తిని స్త్రీలే సృష్టిస్తున్నారు. భారతీయ స్త్రీ సగటున ప్రతిరోజూ నాలుగు గంటలపాటు లేదా తన జీవితకాలంలో 16 శాతం వంటింటిలోనే గడుపుతోంది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం శ్రామికుల్లో 40 శాతం మంది స్త్రీలే. ప్రత్యేకించి వ్యవసాయరంగంలో పనిచేస్తోన్న శ్రామికుల్లో 43 శాతం మంది మహిళలే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉపాధి రంగంలో స్త్రీల సంఖ్య పెరగడానికి ఫెర్టిలిటీ శాతం తగ్గడం ఒక ప్రధాన కారణంగా భావిస్తున్నారు.



1980–2008

1980–2008 సంవత్సరాల మధ్య ఉత్పాదక శ్రమ భాగస్వామ్యంలో స్త్రీ పురుష వివక్ష 32 శాతం నుంచి 26 శాతానికి తగ్గినట్టు వరల్డ్ డెవలప్‌మెంట్ 2012 రిపోర్టు తేల్చి చెప్పింది.

వివక్షల్లో మిగిలినవి... లోపలి పేజీలో



ఫొటో: శివ మల్లాల
జయప్రద

'నేను శక్తి' క్యాంపెయిన్ గురించి జయప్రద మాట్లాడుతూ... "'సాక్షి' చేస్తున్న ఈ కార్యక్రమం చాలా గొప్పది. ఈ ప్రయత్నం తప్పకుండా జయప్రదం కావాలి. ఎంతోమందిలో ఇది చైతన్యం తేవాలి" అన్నారు.

చివరికి కంచంలోనూ...

కొన్ని ఇళ్లల్లో మగవాళ్లకు ముందు అన్నం పెట్టి, ఆ తర్వాత ఆడవాళ్లు తినడం జరుగుతుంది. ఆకలికి కూడా 'జెండరా?' ఇదెక్కడి న్యాయం?

ఆడ కడుపు, మగ కడుపు అని ఉండదు కదా. ఆకలి ఒకటే. మగవాళ్లు తినేంతవరకూ ఆకలి భరించాలా? వాళ్లు తిన్న తర్వాత మిగిలితే తినాలా? సగం ఆకలే తీర్చుకోవాలా? కడుపు నిండా తినే అర్హత కూడా ఆడపిల్లకు లేదా? ఆకలిలోనూ వివక్షా? ఇదెంత దుర్మార్గం. కొన్ని ఇళ్లల్లో మగపిల్లలకు పౌష్టికాహారం పెట్టి, ఆడపిల్లకు తక్కువ పెడతారు. మగపిల్లలకు గ్లాసుడు పాలు ఇస్తారు. అమ్మాయికి కొన్ని చుక్కలు ఇస్తారు. మగాడి జన్మకు కారణం అవుతున్న ఆడపిల్లకు తక్కువ తిండా? ఆడపిల్ల చదువుకోకూడదా? ఎనిమిదో తరగతి వరకూ చదివిస్తే చాలని ఇప్పటికీ కొన్ని ఇళ్లల్లో అనుకుంటున్నారు. ఆడపిల్ల ఎడ్యుకేట్ అవ్వకూడదా? ఏం... ప్రశ్నిస్తుందని భయమా?

■ **ఆడ, మగ... రెండూ రక్తమాంసాలున్న శరీరాలే. ఆడ తక్కువ.. మగ ఎక్కువ ఎందుకు?**

కరెక్టే. దెబ్బ తగిలితే నొప్పి ఎవరికైనా ఒకటే. మగాళ్లకు తక్కువగా ఉంటుందా? లేదు కదా. మరి ఆడవాళ్లు ఎందుకు తక్కువ? మగవాళ్లు ఎందుకు ఎక్కువ? ఇది ఎవరికివాళ్లు వేసుకోవాల్సిన ప్రశ్న. ముఖ్యంగా ఆడవాళ్లు తక్కువ అని అనుకునేవాళ్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

■ **కడుపులో పడ్డ బిడ్డ 'ఫీమేల్' అనగానే నిర్దాక్షిణ్యంగా ఊపిరి ఆపేస్తున్నారు. చివరికి 'బేటీ బచావో.. బేటీ పడావో' అని అభ్యర్థించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది..**

'ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే' సెలబ్రేషన్స్‌ను ప్రతి ఏడాదీ ఘనంగా జరుపుకుంటున్నాం. ఆ వేడుకలు ఎందుకు? ఎవరి కోసం? సమాజంలో ఉన్న ఆడవాళ్లందరి పరిస్థితీ బాగుందనా? ఇప్పుడు ఆడపిల్లల సంఖ్య తగ్గిపోయింది. వెయ్యి మంది మగపిల్లలుంటే ఆరేడు వందల మంది మాత్రమే ఆడపిల్లలు ఉంటున్నారు. ఆడపిల్లను కడుపులోనే చంపేస్తున్నారు. చూస్తూ ఉండండి... ఇప్పుడు కట్నం తీసుకుంటున్న అబ్బాయిలు భవిష్యత్తులో ఆడపిల్లల కొరత కారణంగా ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకోవాల్సి వస్తుంది. మీరు హర్యానా, రాజస్తాన్‌లను తీసుకుంటే అక్కడ భ్రూణ హత్యలు ఎక్కువ. ఆడపిల్ల ఏం పాపం చేసిందని భూమ్మీదకు రానివ్వకుండా చేస్తున్నారో? మగపిల్లాడైతే కట్నం తెస్తాడనా? కొన్ని సందర్భాల్లో ఆడవాళ్లే ఆడవాళ్లకు శత్రువులవుతున్నారు. కోడలి కడుపులో పడ్డది ఆడబిడ్డ అంటే అత్త కూడా వ్యతిరేకిస్తుంది. అందుకే ఆడవాళ్లలోనూ మార్పు రావాలి. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థలకు ఓ విన్నపం. లింగ నిర్ధారణ కూడదని ప్రభుత్వం ఓ నిబంధన పెట్టినప్పటికీ, కొన్ని చోట్ల దాన్ని ఉల్లంఘిస్తున్నారు. దయచేసి దాని మీద పోరాడండి.

భాష కూడా మారిపోతుంది

నా విషయంలో అజమ్ ఖాన్ చేసింది ఏంటి? నీచమైన ప్రచారానికి ఒడిగట్టాడు. క్యారెక్టర్ అసాసినేషన్ చేశాడు. స్త్రీ అంటే ఎవరైనా అడ్వాంటేజ్ తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఒక బొమ్మలా భావిస్తారు. ఈ గడ్డ మీద ప్రతి స్త్రీకి ప్రతి నిమిషం అగ్ని పరీక్షే. ఆమె గురించి మాట్లాడేటప్పుడు కొందరి భాష కూడా మారిపోతుంది. వాడే పదాలు ఘోరంగా ఉంటాయి. ఆ విధంగా సంతృప్తి పొందుతారు.

■ **ఆడవాళ్లు గొప్ప పదవుల్లో ఉంటే.. ఆమెను వీలైనంతగా హింసించాలని చాలామంది ప్రయత్నిస్తారు. రాజకీయ నాయకురాలిగా మీరలాంటివి ఫేస్ చేశారు కదా?**

యస్.. మనం పెద్ద పదవుల్లో ఉంటే భరించలేరు. రామ్‌పూర్‌లో నేను పొలిటీషియన్‌గా అడుగుపెట్టినప్పుడు ఆడవాళ్లను లీడర్‌గా అంగీకరించే పరిస్థితులు లేవు. కానీ ప్రజల ప్రేమతో గెలిచాను. ప్రత్యర్థి పార్టీల సంగతి వదిలేయండి.. నా పార్టీలో ఉన్నవాళ్లే నన్ను సూటిపోటి మాటలనేవాళ్లు. యాసిడ్ ఎటాక్ చేస్తారని, చంపేస్తారని భయపడేదాన్ని. అలాంటి ప్రయత్నాలు కూడా జరిగాయి. మనసులో భయం ఉన్నా ధైర్యంగా ముందుకెళ్లా. మేల్ డామినేషన్ ఉన్న ఈ సొసైటీలో ఆడవాళ్లు రాజకీయాల్లోకి రావాలి. ఇందిరా గాంధీ, జయలలితగార్లను జనాలు ఎప్పటికీ మరచిపోలేరు. ప్రజల ప్రేమ ఒక్కటి చాలు. ఎవరేం చేయాలనుకున్నా చేయలేరు.

■ **ఆడవాళ్ల ప్రతిష్టను మంటగలపాలంటే వాళ్ల క్యారెక్టర్‌ను తక్కువ చేసి మాట్లాడే ప్రబుద్ధులు చాలామంది ఉంటారు. అలాంటివారి గురించి ఏమంటారు?**

వాళ్లకు 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్' ఎక్కువ. అందుకే క్యారెక్టర్‌ని తక్కువ చేసి మాట్లాడతారు. నిండు సభలో జయలలితగారిని అలానే కదా చేయబోయారు. అయినా ఆమె వెనక్కి తగ్గలేదు. పట్టుదలతో అనుకున్నది సాధించారు. క్యారెక్టర్ తక్కువ చేసి మాట్లాడటం మొదలుపెడితే ఏ ఆడపిల్లకైనా బాధ ఉంటుంది. ఆ బాధలోంచి అభద్రతాభావం వస్తుంది. మానసికంగా కుంగిపోతుంది. అప్పుడు అనుకున్నది సాధించలేదు. అప్పుడు ఇన్‌ఫీరియార్టీ కాంప్లెక్స్‌తో బాధపడే మగవాడు తాను గెలిచినట్లుగా ఫీలవుతాడు. ఆ మగవాడి బుద్ధి అంత నీచమైనది. నా గురించి కూడా అవాకులు చెవాకులు పేలారు. పట్టించుకోలేదు. ఎందుకంటే పట్టించుకుని నేను వెనక్కి తగ్గితే, ఇంకొకరి గెలుపుకి కారణం అవుతాను.

■ **అలాగే మగవాళ్ల సక్సెస్‌ని వాళ్ల ప్రతిభతో, ఆడవాళ్ల సక్సెస్‌ని వాళ్ల అందానికి ఎక్కువగా ఆపాదించి, టాలెంట్‌కి తక్కువ స్పేస్ ఇస్తారు కొంతమంది...**

ఖిల్జీకి దక్కకూడదనే పద్మావతి అలా చేసింది

ఆడవాళ్లకు ఆత్మాభిమానం ఎక్కువ. రాణీ పద్మావతి అందుకు ఓ ఉదాహరణ. ఖిల్జీ నీడ కూడా తనను తాకకూడదని ఆత్మాహుతికి పాల్పడింది. పిరికితనంతో కాదు.. తెగువతో. తనంతట తాను ఇష్టపడి తీసుకున్న నిర్ణయం అది. ఖిల్జీకి దక్కి తాను ఓడిపోకూడదని, తనువు చాలించి, గెలిచింది. మన గడ్డ మీద ఉన్న స్త్రీ అంత పవిత్రమైనది.

ఇది దౌర్భాగ్య పరిస్థితి. ఆడవాళ్ల ప్రతిభను అంగీకరించలేని కుంచిత మనస్తత్వాలు ఉంటాయి. ఆ మనుషులను ఏమీ చేయలేం. అయితే బయటకు ఎంత మాట్లాడినా మనసుకి తెలుస్తుంది కదా.. తాము మాట్లాడేది కరెక్ట్ కాదని. అది ఫిల్మ్ ఇండస్ట్రీ అయినా, పాలిటిక్స్ అయినా.. ఏ ఫీల్డ్ అయినా ఆడవాళ్ల టాలెంట్‌ను అభినందించే వాళ్లు తక్కువ ఉంటారు. వాళ్ల సక్సెస్‌ని ప్రతిభకు తక్కువ, అందంతో ఎక్కువ ముడి పెట్టేస్తారు. అందుకే అంటున్నా... 'అందంగా ఉండటం కూడా ఆడదానికి శాపమే'. అసలు ఆడవాళ్లంటేనే అందమైనవాళ్లు. అందుకే ప్రతి స్త్రీకి పోరాటం తప్పడంలేదు. నాలుగేళ్ల పాపలో ఏం అందం చూసి, రేప్ చేస్తున్నారు. ఎంత రాక్షసత్వం ఉండి ఉంటుంది. ఆ మనిషి ఎంత కఠినాత్ముడు అయ్యుంటాడు? వాళ్లను క్షమించ వచ్చా? 'నిర్భయ' యాక్ట్ అంటున్నారు. కానీ నిర్భయంగానే ఇలాంటి పనులు చేస్తున్నారు. వాళ్లను ఎంత కఠినంగా శిక్షించాలంటే తప్పు చేయాలనుకున్నవాళ్ల వెన్నులో వణుకు పుట్టాలి.

■ **అవునూ... ఆడవాళ్లు ఎందుకు కట్నం ఇవ్వాలి?**

ఈ ప్రశ్న చాలాసార్లు వేసుకున్నాను. ఇలాంటి ఓ నియమం ఉంది కాబట్టే ఆడపిల్లను తల్లిదండ్రులు భారంగా అనుకుంటున్నారు. ఎక్కువ చదువులు చదివిస్తే ఆ చదువుకి తగ్గ వరుడ్ని తీసుకురావాల్సి వస్తుందని భయపడుతున్నారు. అంతేకానీ అమ్మాయి తన కాళ్లపై తను నిలబడుతుందని ఆలోచించడంలేదు. 'డౌరీ యాక్ట్' రావడంతో చాలామంది బతికిపోయాం. లేకపోతే ఆడవాళ్లను గుండెల మీద కుంపటిలా చూసేవాళ్లు. అయినా ఇప్పటికీ కట్నం వ్యవహారం సాగుతుందనుకోండి. ఒక పెళ్లి కుదరాలంటే కట్నం 'డిసైడింగ్ ఫ్యాక్టర్' అవుతోంది. పెళ్లనేది రెండు మనసులతో, 'మాంగల్యం'తో ముడిపడుతుంది కానీ డబ్బుతోనే ఎక్కువ ముడిపడింది. బాధపడాల్సిన విషయం ఏంటంటే.. పుట్టింటి నుంచి మెట్టినింటికి కోడలిగా వచ్చే అమ్మాయి.. అత్త అయ్యే సమయానికి కట్నం ఆశిస్తోంది. కొందరు ఆడవాళ్లు ఇందుకు మినహాయింపు. ఏది ఏమైనా నిన్నటి కంటే ఇవాళ మార్పు వచ్చింది. కట్నం విషయంలో రేపు మరింత మంచి మార్పు వస్తుందనే నమ్మకం ఉంది.

■ **కొందరు మగవాళ్లు తమ ఇంటి ఆడవాళ్లను పరాయి మగాడు కన్నెత్తి చూడకూడదనుకుంటారు. వాళ్లు మాత్రం పరాయి ఆడవాళ్ల మీద కన్నేస్తారు...**

రావణాసురుడు ఏమయ్యాడు? సీతను అపహరించి మరీ తీసుకెళ్లాడు. అతనికి అవసాన దశ వచ్చింది కాబట్టే అలాంటి దుర్బుద్ధి పుట్టింది. పరాయి స్త్రీని ఆశించే ఏ మగాడి పరిస్థితి అయినా చివరికి అదే అవుతుంది.

■ **మీరు గమనించారో లేదో కానీ అనాథాశ్రమాల్లో దత్తత తీసుకునేటప్పుడు కూడా ఎక్కువమంది తల్లిదండ్రులు మగపిల్లలనే దత్తత తీసుకుంటుంటారు?**

'మాతృదేవోభవ' సినిమా గుర్తొస్తోంది. ఆ సినిమాలో ముందు మగపిల్లలను దత్తత తీసుకుంటారు. బిడ్డలు లేని వాళ్లకు ఏ బిడ్డ అయినా ఒకటే. అయినా దత్తత తీసుకునేటప్పుడు మగబిడ్డను కోరుకుంటారు. మగబిడ్డ లేకపోతే అప్పుడు ఆడపిల్ల గురించి ఆలోచిస్తారు. నేను స్వయంగా ఇలాంటి సంఘటనలు చూశా. కొంతమందికి హితబోధ చేశాను కూడా. మగపిల్లాడైతే ఆదుకుంటాడనా? ఏం మగపిల్లలు తల్లిదండ్రులను నిర్దయగా వదిలేయడం మనం చూడటంలేదా? అయినా ఇంకా మారకపోతే ఎలా? దేశం కోసం పోరాడిన వీర నారీమణులు ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయ్, రాణీ రుద్రమదేవి, పద్మావతి వంటి వాళ్లు తిరగాడిన ఈ గడ్డ మీద వివక్షా? అప్పుడు వాళ్లు కత్తి పట్టి దేశాన్ని రక్షించాలనుకున్నారు. ఆడవాళ్లు దేశాలనే పాలించగల సమర్థత ఉన్నవాళ్లు. వాళ్లను అణగదొక్కడమా? ఇదెక్కడి న్యాయం?

■ **హీరోలతో సమానంగా హీరోయిన్లకు పారితోషికం ఎందుకు ఇవ్వరు?**

ఈ ఒక్క విషయంలో కొంచెం న్యాయం మాట్లాడాలి. ఫెయిల్యూర్ ఎఫెక్ట్ ఎక్కువగా హీరోల మీదే పడుతుంది. అందుకని మనం ఈ పరిస్థితిని అంగీకరించాలి. అదే విధంగా హీరోయిన్ల కష్టం తక్కువ కాదని కూడా గ్రహించాలి. మేల్ డామినేటెడ్ ఇండస్ట్రీలో సాగడం అంటే అంత సులువు కాదు. అయినా మాకంటూ ఓ ప్రత్యేకత క్రియేట్ చేసుకోవాలి. ఆ ప్రత్యేకత కొన్ని తరాల పాటు గుర్తుండిపోయేలా ఉండాలి. అది సాధించగలిగితే మేం సక్సెస్ అయినట్లే.

■ **ప్రపంచం ప్రగతిపథంలో వెళుతున్న ఈ సమయంలో 'సమానత్వం' ఇంకా ప్రశ్నార్థకంగానే ఉండటం గురించి?**

పురాణాలకు వెళితే స్త్రీ–పురుషులు సమానమే అనేది గుర్తొస్తుంది. సీతారాములు, రాధాకృష్ణులు, పార్వతీపరమేశ్వరులు అన్నారు. పురాణాల్లో స్త్రీకి అంత విలువ ఉంది. మనం చాలా విషయాల్లో పురాణాలను ఆచరిస్తాం. కానీ స్త్రీ–పురుష సమానత్వం వచ్చేసరికి కొందరు పురాణాలను మరచిపోతారు. స్త్రీని దేవతలా భావించాల్సిన సంస్కృతి మనది. దేవతలా భావించడం పక్కన పెట్టండి.. కనీసం తమతో సమానంగా చూడ్డానికి కూడా ఇష్టపడటంలేదు. మారాలి.. మనిషి ఆలోచనా విధానం మారాలి. స్త్రీని చూసే విధానంలో మార్పు రావాలి. స్త్రీని సమానంగా చూసే ప్రపంచం రావాలి.

- డి.జి. భవాని

అతిథి దేవోభవ


అదంతా ఇక్కడితో సరి...



పరాశర భట్టరు దత్తకోశం చేస్తూ ఓ శ్లోకమిచ్చారు మనకు. అదేమంటుందంటే... చతుర్ముఖ బ్రహ్మగారు జీవుడిని సృజించే ముందు పుర్రె చేత్తో పట్టుకుని రాయడం మొదలుపెడతాడట. వీడికి చదువెంత ఉండాలి.. రాస్తాడు. వీడికి ఆయుర్దాయం ఎంత... రాస్తాడు. బలం... రాస్తాడు. ఐశ్వర్యం ఎంతుండాలి...ఇది రాసేముందు తల్లి లక్ష్మీదేవి వంక చూస్తాడట. ''గత జన్మలో ఈ పుర్రెపేరేమిటి? ఈ జీవుడు ఏ పేరుతో బతికాడు ?'' అని అడుగుతుందట అమ్మవారు. ఫలానా వాడమ్మా... అని చెబుతాడు.. ఆవిడ ఏమీ అనక పోతే...'సామాన్యం' అని రాస్తాడు. ఆవిడ విని 'వీడా, ఒకరికి పెట్టినవాడు కాదు' అని తల దించుకుంటే... 'దరిద్రుడు' అని రాస్తాడు. పేరు వినగానే 'ఆ! వాడా.. అని ఆవిడ కనుబొమ్మ పైకెత్తితే....'మహదైశ్వర్యవంతుడు' అని రాస్తాడట. కలిసొచ్చింది, కలిసొచ్చింది... అంటారే, ఎక్కడినుంచి వచ్చింది? అదంతా గత జన్మలతాలూకు పుణ్యం. దాన్ని ఆధారం చేసుకుని ఇక్కడ దాని ఫలితాన్ని అనుభవిస్తున్నావు. అదంతా ఇక్కడిదానికి సరిపోయింది. ఆ ఐశ్వర్యాన్ని, ఆ బలాన్ని, ఆ తెలివితేటలను ఉపయోగించి ఈ జన్మలో నీవు కూడబెట్టిందేమిటి? దాన్ని పుణ్యంకింద మార్చుకోవాలిగా...!!! ఎలా..!!!

నేనిక్కడినుంచి అమెరికా వెళ్ళాలి. ఇక్కడి రూపాయలు ఎన్ని పట్టుకెళ్ళినా అక్కడ ఓ కప్పు కాఫీకూడా దొరకదు. ఇక్కడి ధనం అక్కడ పనికిరాదు. అందుకని బయల్దేరేముందే దాన్ని అక్కడి ధనం ... డాలర్లకింద మార్చుకోవాలి. అప్పుడు అది పెట్టి కాఫీ కానీ మరేదయినా కానీ తీసుకోవచ్చు. కానీ రూపాయలు అక్కడ చెల్లవు. అలాగే, ఇక్కడ సంపాదించిన ధనం, బలం, తేజస్సు, తెలివితేటలు... అన్నీ ఇక్కడితో సరి. అవి ఉత్తర జన్మలకిక పనికి రావు. మరి ఉత్తరజన్మలకూ కూడా పనికివచ్చేటట్లు మార్చుకునే ప్రక్రియ ఒకటుంది. రూపాయలు అమెరికా డాలర్లుగా మారినట్లు, దానితో ఇక్కడి బలం, ధనం... పుణ్యధనంగా మారుతుంది. ఎలా ?

నీకు ఒంట్లో బలముంది. మనగుడి కార్యక్రమానికి వెళ్ళి ఓ దేవాలయాన్ని తుడిచావు. కొంతమంది ఏ క్షేత్రానికి వెళ్ళినా కొంతసేపు అక్కడ శ్రమించి స్వచ్ఛందంగా గుడికి, భక్తులకు సేవ చేస్తుంటారు. 63 మంది నాయనార్లలో ఒకడైన అప్పర్ నాయనార్ ఇలా చేస్తుండేవారు. ఇక్కడ బలం ఉంది. పల్లకి మోసావు. పూజా సామాగ్రిని శుభ్రపరిచావు. నీకు పాండిత్యం ఉంది.. పరుల హితం కోసం ఉపయోగించావు. శాస్త్రాన్ని శాస్త్రంగా ప్రబోధం చేసావు. ఇలా నీవు ఇక్కడ ఉపయోగించినదంతా పుణ్యధనంగా మారుతుంది. ఎవరు మారుస్తారు అలా... చిత్రంగా ఇక్కడ కూర్చుని గుప్తంగా రాసుకునే వాడొకడున్నాడు. వాడే చిత్రగుప్తుడు. వాడెవరో కాదు, ఈశ్వరుడే. నీకిచ్చిన బలాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు రాసుకుంటాడు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఇక్కడ ఏ విభూతిని ఈశ్వరుడిచ్చాడో దానిని పుణ్యధనంగా మార్చుకోవడానికి ఏర్పడిన కేంద్రం– ఇంటిలో అయితే పూజగది, సమాజంలో అయితే దేవాలయం. ప్రతివాడికి ఏదో ఒక విభూతిపెట్టాడు, దానిని పరుల హితంకోరి, ఈశ్వరపరంచేయడమే పుణ్యధనంగా మార్చుకోవడం. అటువంటి విభూతులలో ఒకటి–అతిథి. ఇంటికి వచ్చిన అతిథి సామాన్యుడిగా కనిపించినా, సామాన్యుడు మాత్రంకాడు. నీ గతజన్మ తాలూకు పాపాలను త్వరగా నశింపచేయడానికి పరమేశ్వరుడు ఏరికోరి మహాత్ములను అతిథులుగా పంపుతాడు. కనుక ఇంటికి వచ్చిన అతిథిని పూజించి, ఆదరించి, తృప్తిగా అన్నంపెట్టి సత్కరించడం వల్ల నీ పాపాలన్నీ నశించి, ఉత్తర జన్మలకోసం కావలసినంత పుణ్యధనాన్ని మూటగట్టుకోవచ్చని శాస్త్రం చెబుతున్నది.

ఆరాధనలో జాగ్రత్తం కావాలి



13న
మహా
శివరాత్రి

శివ అంటే మంగళమని అర్థం. ఆ పరమ శివుని అనుగ్రహం పొందటానికి మనం జరుపుకునే ముఖ్యమైన పండుగ మహాశివరాత్రి.

పురాణాలలో చెప్పినటువంటి ఈ మహాశివరాత్రిని ప్రతి సంవత్సరం మాఘమాసం కృష్ణపక్షంలో చతుర్దశినాడు జరుపుకుంటాం.

రూపరహితుడైన శివుడు, జ్యోతిరూపంలో, లింగాకారంగా అవిర్భవించిన సమయం కనుక శివరాత్రిని లింగోద్భవకాలం అంటారు. పరమేశ్వరుడి 64 స్వరూపాలలో లింగోద్భవమూర్తి ముఖ్యమైనది.

శివరాత్రికి ఏం చేయాలి? ఎలా జరుపుకోవాలి

శివరాత్రి పూట ఉదయాన నిద్రలేవగానే శివుడి మీదనే మనస్సును లగ్నం చేయాలి. స్నానం చేశాక శివాలయానికి వెళ్ళి శివపూజను చేసి సంకల్పం చెప్పుకొని పూజాద్రవ్యాలను సమకూర్చుకోవాలి. ఆ రాత్రికి ప్రసిద్ధమైన శివాలయానికి వెళ్ళి సమకూర్చుకొన్న పూజాద్రవ్యాలను అక్కడ ఉంచాలి. తర్వాత మళ్ళీ స్నానం, లోపల, బయట అంతా పరిశుభ్ర వస్త్రధారణలతో శివపూజకు ఉపక్రమించాలి. దీనికోసం ఉత్తముడైన ఆచార్యుడిని ఎంచుకోవాలి. ఏ మంత్రానికి ఏ పూజాద్రవ్యాన్ని వాడాలో ఆ క్రమంలో మాత్రమే పూజ చేయాలి. ఏమీ తెలియకపోతే ఓం నమశ్శివాయ అని జపిస్తూ ఉండాలి.

భక్తి భావంతో గీత, వాద్య, నృత్యాలతో ఇలా ఆ రాత్రి తొలి యామం (జాము) పూజను పూర్తిచేయాలి. శివమంత్రానుష్ఠానం ఉన్నవారు పార్థివ లింగాన్ని పూజించాలి. ఆ తర్వాత వ్రతమాహాత్మ్య కథను వినాలి. ఈ పూజ నాలుగు జాములలోనూ ఆ రాత్రి అంతా చెయ్యాల్సి ఉంటుంది. వ్రతానంతరం యధాశక్తి పండితులకు, శివభక్తులకు విశేషించి సన్యాసులకు భోజనాన్ని పెట్టి సత్కరించాలి.

ఉపవాసం: శివరాత్రికి అందరూ ఉపవాసం చేయాలంది శాస్త్రం. పిల్లలకు, వృద్ధులకు, రోగులకు, గర్భిణులకు, ఔషధసేవనం చేయాల్సిన వాళ్ళకు మినహాయింపు ఇచ్చింది శాస్త్రం.

సూర్యోదయానికి ముందే నిద్రలేచి, తల స్నానం చేసి, ఈ రోజు నేను శివునకు ప్రీతికరంగా శివరాత్రి ఉపవాసం చేస్తున్నాను అని సంకల్పం చెప్పుకోవాలి. ఉపవాసం అనే పదానికి అర్థం భగవంతునికి దగ్గరగా ఉండడం అని. భగవంతునికి మనసును, ఇంద్రియాలను దగ్గరగా జరపడమే ఉపవాసం. ఆరోగ్యపరంగా చూసినప్పుడు ఉపవాసం శరీరంలో ఉన్న విషపదార్థాలను తొలగించడంతో పాటు ప్రాణశక్తిని, ఇంద్రియ నిగ్రహాన్ని పెంచుతుంది. మరీ నీళ్ళు కూడా తాగకుండా ఉపవసించకూడదు. ఎందుకంటే శరీరాన్ని కష్టపెడుతూ, భగవంతుని వైపు మనసును మళ్లించం కష్టం.

జీవారాధన: మీరు ఉపవాసం ఉన్నప్పుడు ఎంత బియ్యం, ఇతర ఆహార పదార్థాలు మిగులుతాయో, వాటిని ఆకలితో ఉన్న పేదలకు పంచాలి. అష్టమూర్తి తత్వంలో శివుడు లోకంలో జీవుల రూపంలో సంచరిస్తూ ఉంటాడు. అన్నార్తుల ఆకలిని తీర్చడం కూడా ఈశ్వరసేవయే. ఉపవాస నియమాలు కూడా అవే చెప్తాయి.

పంచాక్షరాలు... పంచోపచారాలు

మొదటిది విభూతి ధారణ. విభూతి ధారణ ఐశ్వర్యకరమని అంటారు. రెండవది రుద్రాక్ష. రుద్రాక్ష అంటే శివుని మూడవ కన్ను. మూడవది పంచాక్షరి జపం. పంచాక్షరీ మంత్రోపదేశం లేనివారు శివనామాం జపిస్తే చాలు. నాలుగవది మారేడు దళాలతో శివుని పూజించడం. అయిదవది అంతరంగంలో శివ స్వరూపాన్ని ఎల్లవేళలా స్మరిస్తూ ఉండాలి.

శివరాత్రి రోజు ప్రకృతిలో ఉన్న శివశక్తిని శరీరం గ్రహించాలంటే, వెన్నును నిటారుగా పెట్టి కూర్చోవాలి. అంటే కూర్చునే సమయంలో ముందుకు వంగి కూర్చోకుండా, మీ వెన్నుపూస నిటారుగా ఉండేలా కూర్చోవాలి, నిలబడాలి.

మౌనవ్రతం: శివరాత్రి రోజు చేసే మౌనవ్రతం చాలా అద్భుత ఫలితాలను ఇస్తుంది. మానసికప్రశాంతతను చేకూరుస్తుంది. మౌనం అనగానే నోరు మూసుకుని కూర్చోవడం కాదు. వ్రతంలో మనోవాక్కాయాలు ఏకం కావాలి. అందువల్ల అనవసరమైన ఆలోచనలను, వాదనలను కట్టిపెట్టి, మనసును శివునిపై కేంద్రీకరించాలి. అవసరమైతే శివాలయానికి వెళ్ళండి, అభిషేకం చేయించుకోకపోయిన ఫర్వాలేదు, ప్రశాంతంగా కళ్ళు మూసుకుని కూర్చుని, పండితులు చదువుతున్న రుద్ర – నమకచమకాలను వినండి.

ఉద్యోగస్తులు, ముఖ్యంగా ప్రైవేటు రంగంలో పని చేస్తున్నవారికి ఆ రోజు సెలవు ఉండకపోవచ్చు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు అదే పరిస్థితి ఎదురుకావచ్చు. మరి అలాంటప్పుడు ఏం చేయాలి? అవసరమైంతవరకే మాట్లాడండి, అనవసరమైన మాటలు కట్టిపెట్టండి. ఎవరితోను గొడవ పడకండి, సాధ్యమైనంత తక్కువ మాట్లాడండి. ఇంటికి వచ్చాక, కాళ్లూ చేతులూ ముఖం శుభ్రపరుచుకుని, శివుడి ముందో, ఆలయంలోనో కాసేపు కన్నులు మూసుకుని మౌనంగా కూర్చోండి.

అభిషేకం: శివుడు అభిషేక ప్రియుడు. శిరస్సుపై కాసిని నీరు పోసినా, సంతోషంతో పొంగిపోతాడు. శివరాత్రి నాడు శివుడిని అర్చించడం వలన, అభిషేకించడం వలన సదాశివుని అనుగ్రహంతో జీవితానికి పట్టిన పీడ తొలగిపోతుంది.

జాగరణ: శివరాత్రి జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. తమస్సును తొలగిస్తుంది.

మంత్ర జపం: శివరాత్రి మొత్తం ఓం నమః శివాయ అనే పంచాక్షరీ మంత్ర జపం/స్మరణతో మీలో నిక్షిప్తమై ఉన్న అనంతమైన శక్తిని జాగృతం చేస్తుంది. శివరాత్రి మరునాడు శివాలయాన్ని సందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి.

సాక్షి ఫ్యామిలీ
నేను శక్తి సాక్షి
విజయవాడ
ఆదివారం, 11-2-2018

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 01



ఒకటిని దిద్దండి



● కొండేపూడి నిర్మల

పక్కింటావిడ దొంగలాగా వచ్చి తొంగి చూస్తుంది.
'అన్నయ్యగారు ఊర్నుంచి రాలేదా వొదినా' అంటుంది.
తల అడ్డంగా ఊపాల్సి వస్తుంది.
ఎదురింటావిడ పోలీసులాగా జబర్దస్తీగా దూరుతుంది.
'అయితే మా తమ్ముడు ఫలానా ఊర్లో బ్యాంక్ ఉద్యోగం చేస్తున్నాడంటావ్' అని గోడ మీద ఫొటో ఏమైనా దొరుకుతుందేమో అన్నట్టు మెడ అటూ ఇటూ తిప్పుతుంది.
హౌస్ ఓనర్ భార్య 'అమ్మాయ్... ఈసారి కూడా నువ్వే వెళతావా... మీ ఆయన రాడా?' అని ఆదరంగా కూపీ లాగుతుంది.
హౌస్ ఓనర్‌కు ఈ ములాజా కూడా లేదు.
'ఫలానా తేదీ లోపల మీ ఆయన్ను ప్రవేశ పెట్టకపోతే ఇంటి నుంచి వెళ్లగొడతా' అని అల్టిమేటమ్ జారీ చేస్తాడు.
అందరికీ సున్నా కావాలి.
ఒకటి పక్కన సున్నా.
తను పుట్టింది. మనిషి. చదువుకుంది. మనిషి. ఉద్యోగం చేయగలదు. మనిషి. జీవితాన్ని తన పద్ధతిలో తాను ఎదుర్కోగలదు. మనిషి. తనకో విలువుంది. మనిషి.
ఆమెకై ఆమె ఒకటి. కాని ఎప్పుడైతే పెళ్లి చేసుకుందో అప్పటి నుంచి ఆమె సున్నా అయిపోయింది. ఆ సున్నా పక్కన మొగుడు అనే ఒకటి ఉంటేనే దానికి విలువ. మొగుడు నిలబడితేనే ఆమె పది. లేకపోతే సున్నా.
కాని వాడో సన్నాసి వెధవ. నాలుగేళ్లు రాచి రంపాన పెట్టాడు. పేరుకు సంసారం. ఇంట్లో ఉంటేగా. పేరుకు కాపురం. బాధ్యత తీసుకుంటేగా. వాడున్నప్పుడు కూడా తను ఒకటిలానే ఉంది. తనే గుట్టుగా సంసారాన్ని ఈదుకుంటూ వచ్చింది. డెలివరీ బిల్లుకు డబ్బు తెస్తానని పత్తా లేకుండా పోతే ఉన్న ఒక గాజును అమ్మి బయటపడింది. వాడొక సున్నా.
వాడేనా?
లోకంలో ఎన్ని సున్నాలు.
అనుమానించే సున్నాలు. పో... మీ పుట్టింటికి పోయి డబ్బు పట్రా అనే సున్నాలు. తాగొచ్చి పడిపోయే సున్నాలు. తందనాలాడే సున్నాలు. జీవితంలో ఒక్కసారి కూడా భోజనం చేశావా అని అడగని ఏబ్రాసి సున్నాలు. అలాంటి సున్నాలతో గుణకారం జరిగితే తన జీవితం నిండు సున్నా అని కనిపెట్టింది.
వదిలేసి వచ్చేసింది.
ఆరేళ్ల కొడుకు అప్పుడప్పుడు అడుగుతాడు–
'నాన్న ఏడమ్మా?'
'నాన్న రాడమ్మా. నాన్నకూ మనకూ కటీఫ్'.
'నాన్న ఎలా ఉంటాడమ్మా?'
'నువ్వు పెద్దయ్యాక చూద్దువులే నాన్నా'.
నాన్నొక వెధవ అని తెలియడం కన్నా నాన్న ఎలా ఉంటాడో తెలియకపోవడం మేలు కదా అనుకుంది.
కాని లోకం ఊరుకుంటుందా?
ఒంటరి ఆడది జీవిస్తుందంటే అదీ మొగుడి ప్రమేయం లేకుండా జీవిస్తుంది అంటే దానికి సయించదు. అలా ఒంటరిగా జీవించేవాళ్లు సంసారులు కారు. ఎందుకు కారో. సింగిల్ ఉమన్ అంటే కచ్చితంగా బహిష్కృతురాలే. ఈ బహిష్కారం ఎవరు విధించారో?
ఓయ్... ఇది నేను. ఈ జీవితమే సత్యం. ఇలా సత్యంగా బతకడమే నా జీవితపు సత్యం అంటే వినరు.
అబద్ధం చెప్పాలి.
మా ఆయన లండన్‌లో ఉన్నాడు. అబద్ధం చెప్పాలి. మా ఆయన దుబాయ్‌లో ఉన్నాడు. అబద్ధం చెప్పాలి. మా ఆయనకు సెలవు దొరకదు. అబద్ధం చెప్పాలి. మా ఆయన దగ్గరకు నేనే వెళ్లి రావాలి. అబద్ధం చెప్పాలి.
స్త్రీని అబద్ధంగా మార్చే ఈ సంఘనీతి మారదా?
ఈ అబద్ధాన్ని చెప్పి చెప్పి, చెప్పలేక వాళ్లెలా కోత అనుభవిస్తారో లోకం చూడదా?
సున్నాలను వెతికే పెద్దలారా ఒకటిని ఒకటిగా ఉండనివ్వండి.
కథ ముగిసింది.
కొండేపూడి నిర్మల రాసిన 'అబద్ధం' కథ ఇది.
వివక్ష అంటే పుట్టుకలోనూ పెంపకంలోనూ పెరుగుదలలోనూ సకల అవకాశాలలోనూ ప్రదర్శించేది మాత్రమే కాదు. జీవన సందర్భాలలోనూ ప్రదర్శించి హింసించేది వివక్ష. టూలెట్ బోర్డులు మనం ఎన్ని చూస్తుంటాం. 'ఫ్యామిలీకి మాత్రమే' అని ఉంటుంది. 'సింగిల్ ఉమన్‌కు మాత్రమే' అని ఎప్పుడైనా చూడగలమా? పిల్లాడి స్కూల్ అడ్మిషన్‌లో తండ్రి పేరు రాయకపోతే అడ్మిషన్ దొరికే రోజులు చూస్తున్నామా? మెట్టెలు మంగళసూత్రాలు లేకపోతే చాలు అర్ధరాత్రి మిస్డ్ కాల్ ఇవ్వొచ్చు అని మగాళ్లు స్వీయ అనుమతి తీసుకోని రోజులు చూస్తున్నామా?
ఆమెకో ఇల్లుంటే ఏమిటి నష్టం?
ఆమెకో జీవితం ఉంటే ఏమిటి నష్టం?
ఇంకోణ్ణి చేసుకుంటే వాడు మొదటివాడులా ఉండడని గ్యారంటీ ఏమిటనే భయంతో ఆమె అలాగే ఉండిపోతే ఏమిటి నష్టం.
సున్నాలు చుట్టడం మానండి. ఒకటిని దిద్దండి.

పునః కథనం: ఖదీర్

వివక్ష

● ప్రతిఫలంలో వివక్ష

బయటకెళ్ళి పనిచేసేవారిలో స్త్రీలకంటే పురుషులే అధికం. అయితే ప్రధానంగా పేద కుటుంబాల్లో స్త్రీలు ఉత్పాదక శ్రమలోనూ, ఇటు గృహ సంబంధమైన అనుత్పాదక శ్రమలోనూ భాగం అవుతారు. ఇలాంటి శ్రామిక కుటుంబాల్లో గృహశ్రమభారం స్త్రీలపై అదనంగా ఉంటుంది. పురుషులు ఎక్కడా ఈ శ్రమలో భాగం కారు. దీనివల్ల పురుషులకంటే స్త్రీలు అధిక గంటలు శ్రమిస్తారు. ఇటువంటి అసమాన శ్రమవిభజన ద్వారా స్త్రీలపై పడే అదనపు శ్రమ భారాన్ని 'అక్యుములేషన్ ఆఫ్ లేబర్' అని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, అంతర్జాతీయ మానవహక్కుల నాయకులు అమర్త్య సేన్ అభిప్రాయపడ్డారు.

దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్త్రీ పురుషుల భాగస్వామ్యం

రంగం	మహిళలు	పురుషులు
కమ్యూనికేషన్ సర్వీసెస్	31	16
హోటల్స్ అండ్ రెస్టారెంట్స్	21	17
తయారీ రంగంలో (మ్యానుఫ్యాక్చరింగ్)	13	12
ఫైనాన్స్ అండ్ బిజినెస్	4	5
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, స్టీమ్, వాటర్	0.5	1
మైనింగ్ (ఖనిజోత్పత్తి)	0.5	2
ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్స్	2	7
వ్యవసాయం ఆధారిత రంగాలు	27	29
కన్‌స్ట్రక్షన్ రంగం	1	11

భాగస్వామ్యం ఇంతగా ఉన్నా ప్రతిఫలంలో మాత్రం వివక్షే

● ఆదాయంలో వివక్ష



కేవలం అసంఘటిత రంగంలోనే కాకుండా సంఘటిత రంగంలో సైతం వేతనాల్లో స్త్రీలు వివక్షకు గురవుతున్నారు. అది అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో కింది విధంగా ఉంది.

స్త్రీపురుషుల సంపాదనలో వ్యత్యాసం

	మహిళలు	పురుషులు
అభివృద్ధి చెందిన 19 దేశాల్లో	0.77%	0.23%
అభివృద్ధిచెందుతోన్న 42 దేశాల్లో	0. 73%	0.27%

స్త్రీపురుష వేతన వ్యత్యాసం అభివృద్ధి చెందిన దేశాల్లో 23 శాతం, అభివృద్ధి చెందుతోన్న దేశాల్లో 27 శాతంగా ఉన్న విషయాన్ని పై గ్రాఫ్ తెలియజేస్తోంది.

● అక్షరాస్యతలో వివక్ష



భారత దేశంలో బాలబాలికల అక్షరాస్యతా శాతం 2001లో 75.26, 53.67 శాతం నుంచి 2011కి వచ్చేసరికి 82.14, 65.46కి పెరిగింది. అయితే మహిళల అక్షరాస్యతాశాతం దాదాపు 54 శాతంగా ఉంది. దీన్ని బట్టి కేవలం జనాభాలో సగం మంది మహిళలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్నారు. విద్యకి తక్కువ ప్రాధాన్యతనిస్తున్న కారణంగా హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో భారత దేశం 126 వ స్థానం నుంచి దిగజారి 134 స్థానానికి చేరింది.
ప్రాథమిక స్థాయిలో 2009లో బాలబాలికల ఎన్‌రోల్‌మెంట్ రేటు బాలురలో 115 గానూ, బాలికల్లో 111 గానూ ఉంది. ఇదే చైనాలో అయితే బాలురలో 111 గానూ, బాలికల్లో 115 గానూ ఉంది. చైనా తరువాత బాలికల్లో డ్రాపౌట్ రేట్ భారతదేశంలోనే అధికంగా ఉంది. డ్రాపౌట్ రేటు అధికంగా ఉండడానికి అనేక కారణాలున్నా ప్రధానమైనది తల్లిదండ్రుల నిరక్షరాస్యతే.

● వివాహాల్లో వివక్ష



భారతదేశ సగటు వివాహ వయస్సు 13 నుంచి 14 మాత్రమే. చట్టప్రకారం ఇది 18 ఏళ్ళైనా, దేశంలోని ప్రతి నలుగురిలో ఒకరిది బాల్య వివాహమే. నేపాల్‌లో ప్రతి ఐదుగురిలో ఒకరిది బాల్య వివాహమే.మనకన్నా నేపాల్ కొంత మెరుగు. అక్కడ కనీస వివాహ వయస్సు 15 ఏళ్ళు. బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో యాభై శాతం మంది పదహారేళ్ళలోపే బాల్యవివాహాల బారిన పడుతున్నారు.
● బాల్య వివాహాలు ఆడుకునే వయస్సులోనే తల్లిగా మారుస్తున్న పరిస్థితి ఎదురవుతోంది. బాల్య వివాహాల్లో అధికమంది బాలికలు 15 ఏళ్ళలోపే బిడ్డకి తల్లులవుతున్నారు.
● పుట్టిన పిల్లల సంరక్షణ బాధ్యత కూడా అమ్మాయిలపై పడుతోంది. అది వారి ఆరోగ్యంపైన ప్రభావం చూపుతోంది.
● ఈ బాల్య వివాహాలే మాతా శిశు మరణాలకు కూడా కారణం అవుతున్నాయి.

వివక్షే స్త్రీలపై హింసకు కారణం

స్త్రీల పట్ల వివక్ష అంతిమంగా స్త్రీలపై హింసకు దారితీస్తుంది. ఈ హింస ఆడపిల్ల పుట్టుకతోనే ఆరంభం అవుతుంది. ఇదే హింస స్త్రీల జీవితమంతా వెంటాడుతుంది. సంపాదనలోనూ, ఆస్తిలోనూ, కుటుంబంలో ఆహారం, ఆరోగ్యం విషయంలోనూ తారతమ్యాలకు ఇదే వివక్ష కారణమౌతుంది. అది అంతిమంగా హింసకు దారితీస్తుంది. ఇలాంటి అన్ని రకాలైన వివక్షకు పేద, ధనిక దేశాల్లో తేడా ఏంలేదు. దేశాల, సమాజాల, వ్యక్తుల ఆర్థిక స్థితిపై ఈ వివక్ష ఆధారపడి లేదు. అలాగే వరకట్నం హింసకు ఒక పనిముట్టుగా తయారయ్యింది. గృహహింసలో వరకట్న మరణాలు చాలా తీవ్రంగా పరిణమిస్తున్నాయి. లైంగిక హింస తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలి. అమ్మాయిల అక్రమ రవాణాకూ, స్త్రీలైంగిక దోపిడీకి పేదరికం ఒక కారణంగా మారుతోంది.
● స్త్రీలపై హింసకు అంతర్జాతీయంగా అనేక కారణాలున్నప్పటికీ ప్రధానంగా పురుషాధిపత్య భావజాలం, పురుష స్వామ్యం, అసమాన ఆధిపత్యం దీనికి కారణంగా భావించాలి. అయితే స్త్రీల అవిద్య, అరకొరా చదువులు దీనికి మరి కొంత కారణం అవుతున్నాయి.



● ఆర్థిక స్వాతంత్య్రం, కుటుంబేతర ఆర్జిత ఉపాధి అవకాశాలూ, ఆర్థిక అసమానతలూ, ఆస్తిహక్కు, విద్యావకాశాలూ స్త్రీలు స్వతంత్రతకు ఒక మార్గం వేస్తాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతలో ఈ అంశాలన్నింటినీ పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ స్త్రీల సాధికారతను సుసాధ్యం చేస్తాయి. పురుషస్వామ్యాన్నీ, పురుషాధిపత్యాన్నీ, స్త్రీలపై హింసనీ దూరంచేయడంలో ఇవే కీలక భూమిక పోషిస్తాయి. ●

సనాతనం

వేదం శ్లాఘించిన స్త్రీ

వేదాలు స్త్రీల గురించి ఏమన్నాయో కొన్ని విషయాలు చూద్దాం...

● **స్త్రీలు ధైర్యవంతులుగా ఉండాలి** – యజుర్వేదం 10.03
● **స్త్రీలు మంచి కీర్తి గడించాలి** – అధర్వణవేదం 14.1.20
● **స్త్రీలు పండితులవ్వాలి** – అధర్వణవేదం 11.5.18
● **స్త్రీ అందరిని జ్ఞానవంతుల్ని చేయాలి** – అధర్వణవేదం 14.2.74
● **స్త్రీ ఎప్పుడూ సంపదలతో సుఖంగా ఉండాలి** – అధర్వణవేదం 7.47.2
● **స్త్రీలు ఎప్పుడూ జ్ఞానవంతులై, తెలివిగలవారై ఉండాలి** – అధర్వణవేదం 7.47.1

పరిపాలన విషయంలో స్త్రీలు
● పరిపాలనకు సంబంధించిన సభలు, సమావేశాల్లో స్త్రీలు కూడా పాల్గొనాలి – అధర్వణవేదం 7.38.4
● దేశపరిపాలన, సామాజిక సంస్కరణలు, ప్రభుత్వ కార్యకలాపాలను స్త్రీలు ముందుండి నడిపించాలి – ఋగ్వేదం 10.85.46

ఆస్తిహక్కు
● పిత్రార్జితం (తండ్రి కూడబెట్టిన ఆస్తి) లో కుమారుడితో బాటు కుమార్తెకు కూడా సమాన హక్కు ఉంది – ఋగ్వేదం 3.31.1

కుటుంబం
● సమాజానికి, కుటుంబానికి స్త్రీ రక్షకురాలిగా వ్యవహరించాలి – అధర్వణవేదం 14.1.20
● స్త్రీ సంపదను, ఆహారాన్ని అందించాలి. శ్రేయస్సును కలిగించేదై ఉండాలి – అధర్వణవేదం 11.1.17
(స్త్రీకి సంపాదన ఉన్నప్పుడే ఆమె కుటుంబానికి సంపదను చేకూర్చగలుగుతుంది)
● ఉద్యోగాల్లో స్త్రీలు కూడా రథాలను నడపాలి – అధర్వణవేదం 9.9.2
● స్త్రీలు యుద్ధంలో పాల్గొనాలి – యజుర్వేదం 16.44

(ఈ విషయంలో దుర్గాదేవియే స్త్రీలకు ఆదర్శం). సత్యభామ శ్రీకృష్ణునితోపాటు కదనరంగానికి వెళ్లి, నరకాసురునితో యుద్ధం చేసి, ఆ దుష్టరాక్షసుని నిలువరించడమే ఇందుకు ఉదాహరణ.
దళపతి తరహాలో స్త్రీ సభలను ఉద్దేశించి ప్రసంగించాలి*– *ఋగ్వేదం 10.85.26

విద్య
పురుషులతో సమానంగా మీకు ఈ మంత్రాలను ఇవ్వడమేగాక, వీటిని అర్థం చేసుకునే శక్తిని మీకు ప్రసాదిస్తున్నాను. – ఋగ్వేదం 10–191–3



వేదాల్లోనే మైత్రేయి, గార్గి, లోపాముద్ర వంటి దాదాపు 30 పైగా మంత్రద్రష్టలైన స్త్రీ ఋషుల గురించి చెప్పబడింది.

వివాహం - విద్యాభ్యాసం
ఓ వధువా! (వధువు అంటే పెళ్ళికూతురు) వైదికజ్ఞానం నీకు అన్ని దిశల నుండి కలగాలి. వేదాల్లో ఉన్న జ్ఞానం పొందిన తరువాతనే నీవు జీవితానికి సంబంధించిన విషయాల మీద నిర్ణయం తీసుకో. నీవు మంచి కీర్తి గడించి, భర్తకు శుభాలను కలుగ చేసేదానివిగా ఉండు. నీ అత్తవారింట్లో గౌరవప్రదమైన జీవితం గడుపు, నీ జ్ఞానంతో వారి ఇంటిని వృద్ధిపరుచు – అధర్వణవేదం 14–1–64
(ముందు విద్యను పొందండి, ఆ తర్వాతే వివాహం చేసుకోండని స్త్రీలకు ఈ మంత్రంలో భగవంతుడు నిర్దేశించాడు).

ఇస్లాం వెలుగు

స్త్రీ ధనం స్త్రీ గౌరవం



అన్నిటికన్నా ముందు, ఇస్లాం ధర్మం 'స్త్రీ' ఉనికిని, వ్యక్తిత్వాన్ని గుర్తిస్తుంది, అంగీకరిస్తుంది. పురుషుని వ్యక్తిత్వంతో స్త్రీని ముడిపెట్టదు. పురుషుని ఉనికిలో స్త్రీని నొప్పించి ఆమె ఉనికిని నిరాధారం చేయడాన్ని ఇస్లాం ఎంతమాత్రం సమ్మతించదు. పవిత్ర ఖురాన్‌లో ఇలా ఉంది.

సమానత్వం
'స్త్రీ అయినా, పురుషుడైనా – సత్కార్యం చేసే వారైతే, మేము వారికి పరిశుద్ధ జీవితం గడిపేలా చేస్తాం, ఇంకా పరలోకంలో వారికి వారి సదాచరణలకు అనుగుణంగా ప్రతిఫలం ప్రసాదిస్తాము. (పవిత్ర ఖురాన్. 16–97)
స్త్రీ తన ముక్తి మోక్షాలకు పురుషుడిపై ఆధారపడవలసిన అవసరం లేదు. మగవారికి మహిళలపై ఎలాంటి హక్కులు ఉన్నాయో, అలాంటి హక్కులే, ధర్మం ప్రకారం మహిళలకూ మగవారిపై ఉన్నాయి. (ఖురాన్. 2–228)

వరుణ్ని ఎంచుకునే విషయంలో స్వేచ్ఛ
వివాహ సమయంలో, వరుణ్ని ఎంపిక చేసుకొనే విషయంలో స్త్రీలకి సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్య్రాలు ఉన్నాయి. స్త్రీ ఇష్టపడడం అన్నది ఇస్లాం ధర్మంలో నికాహ్ జరగడానికి తప్పనిసరి నియమం.
'వివాహం విషయంలో, చేసుకునే యువతి అనుమతి, అభీష్టం తప్పనిసరి' (సహీహ్ ముస్లిం)

వారసత్వపు హక్కు
'తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు వదిలి వెళ్లిన ఆస్తిలో పురుషులకు భాగం ఉన్నట్లుగానే, స్త్రీలకూ భాగం ఉంది. అది కొద్దిగా ఉన్నా, ఎక్కువగా ఉన్నా, ఈ భాగం దైవం తరపున నిర్ణయించబడింది' (పవిత్ర ఖురాన్)

మహర్ హక్కు
'మహర్' ధనానికి హక్కుదారు స్త్రీ. మహర్ ధనంపై ఆమెకు తప్ప మరెవరికీ అధికారం లేదు. దాన్ని ఆమె తన ఇష్టానుసారం ఖర్చు పెట్టుకునే అధికారం కలిగి ఉంటుంది.
(హిదాయతుల్ ముజ్తహిద్ రెండవ భాగం 16వ పేజి.)

స్త్రీ గౌరవానికి రక్షణ
గౌరవ మర్యాదలన్నది మానవుల అమూల్యనిధులు. అందుకని ఈ విషయంలోనూ ఇస్లాం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. స్త్రీలను అగౌరవపరచడం, వారి సౌశీల్యంపై అనుమానాలు రేకెత్తించడం లాంటి దుర్మార్గాన్ని తీవ్రంగా పరిగణించి, దానికి తగిన శిక్షను నిర్ణయించింది.

విడాకుల స్వేచ్ఛ
అన్ని ప్రయత్నాలూ విఫలమై, దాంపత్య బంధం ఇకముందుకు సాగే పరిస్థితి లేనపుడు పురుషులకు విడాకులిచ్చే అధికారం ఎలా ఉంటుందో, అలాగే మహిళలకూ 'ఖులా' ద్వారా భర్త నుంచి విడాకులు పొందే హక్కు ఉంటుంది. అవసరమైతే ఇస్లామీయ న్యాయ స్థానం ద్వారా విడాకులు పొందే హక్కు, అధికారాలు మహిళలకు ప్రసాదించబడ్డాయి.

విద్యాహక్కు
ఇస్లాం ధర్మం స్త్రీ పురుషులిద్దరినీ విద్యను అర్జించమని ఆదేశించింది. కొన్ని సందర్భాల్లో స్త్రీ విద్య అత్యవసరమని నొక్కి చెప్పింది. ఇస్లాం ప్రసాదించిన విద్యా హక్కు కారణంగా ఎంతో మంది ముస్లిం మహిళలు గొప్ప గొప్ప పండితులుగా ప్రసిద్ధిగాంచారు. హజ్రత్ ఆయిషా సిద్ధిఖీ (ర.అన్హా) దీనికి నిదర్శనం.
ముఖ్యంగా చూస్తే అదీ ఇదీ అని కాకుండా ఇస్లాం స్త్రీ జాతికి అన్ని రంగాల్లో సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్య్రాలు ప్రసాదించింది. 'అమ్మ'గా ఆమె స్థానాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చింది. చెల్లిగా, ఇల్లాలిగా, అత్తగా, కోడలిగా, కూతురిగా వివిధ రంగాల్లో ఆమెకు గౌరవాన్ని, ఆ రంగాల్లో వారిపట్ల ప్రేమను ప్రసాదించింది. తల్లి పాదాల చెంత స్వర్గమున్నదని ప్రకటించి స్త్రీ జాతి ఔన్నత్యాన్ని పతాక స్థాయికి చేర్చిన ఘనత ఇస్లాం ధర్మానికి దక్కుతుందనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు.

– ఎండీ ఉస్మాన్‌ఖాన్

సువార్త

సౌవార్తిక ఉద్యమంలో బలమైన పాత్ర ఆమెదే!

సమాజం అనుసరించే ద్వంద్వ ప్రమాణాలకు బలై స్త్రీ ద్వితీయశ్రేణికి చెందిన జీవిగా, కేవలం వినోద సాధనంగా, పిల్లల్ని పుట్టించే యంత్రంగా పరిగణింపబడుతున్న సమాజంలోకి యేసు అరుదెంచి స్త్రీలను గౌరవించే విషయంలో ఒక విప్లవాన్నే తెచ్చాడు. నాటి స్త్రీలు బయటి ఆవరణాన్ని దాటి ఆలయం లోపలికి ప్రవేశించకూడదు. సమాజ మందిరంలో పురుషులతో సమానంగా కూర్చోకూడదు. పవిత్ర గ్రంథమైన 'తోరా'ను స్త్రీలు తాకకూడదు. పురుషుడు భార్యతోనైనా బహిరంగ ప్రదేశాల్లో మాట్లాడకూడదు. స్త్రీని ఇన్ని కట్టుబాట్లకు బానిసగా మార్చిన నాటి సమాజంలో యేసుక్రీస్తు వారికి అత్యంత గౌరవప్రదమైన స్థానాన్నిచ్చాడు. దేవుడు మనిషిని తన స్వరూపంలో, తన వ్యక్తిత్వాన్నిచ్చి సృష్టించాలనుకున్నప్పుడు అతన్ని పురుషునిగా, స్త్రీగా చేశాడు. అంటే తనను రెండుగా విభజించి ఆ రెండు భాగాలుగా స్త్రీ పురుషులను దేవుడు సృష్టించాడు. కాని కాలక్రమంలో సమాజం దైవాభీష్టానికి వ్యతిరేకంగా పురుషాధిక్య సమాజంగా మారిందని యేసు తన బోధలు, కార్యాల ద్వారా హెచ్చరించాడు. అధమజాతికి చెందిన ఒక సమరయ స్త్రీకి యాకోబు బావి వద్ద యేసు అనేక గంటల పాటు ప్రవచనం చెప్పి ఆధ్యాత్మిక లోతులు వివరించాడు (యోహాను 4:7–26). పాపం చేస్తూ, దొరికిన స్త్రీని 'అమ్మా' అని అనునయంగా సంబోధించి మరణ శిక్ష నుండి తప్పించి క్షమించాడు. (యోహాను 8:10–11). రక్తస్రావమనే ఎంతో ఇబ్బందికరమైన వ్యాధితో బాధపడుతున్న స్త్రీని బాగు చేసి ఆమెకు శాంతిని ప్రసాదించాడు. పద్దెనిమిదేళ్లపాటు నడుము వంగిపోయి వ్యధననుభవిస్తున్న స్త్రీని బాగు చేసిన ఆమెను 'అబ్రాహాము కుమార్తె'గా ప్రకటించాడు (లూకా 18:16). తనను అత్తరుతో అభిషేకించిన ఒక పాపాత్మురాలైన స్త్రీని అంతా ఈసడించుకుంటే ఆయన మాత్రం ఆమెను పొగిడాడు. మరియ ఆయన పాదాల దగ్గరే కూర్చొని రోజంతా ఆయన మాటలు వింటూంటే ఆమె ఎన్నుకున్నది అత్యుత్తమమైన మార్గమన్నాడు. సిలువను మోస్తూ కూడా యెరూషలేము కుమార్తెలను ఓదార్చాడు. సిలువలో వేలాడుతూ తన తల్లి బాధ్యతల్ని శిష్యునికప్పగించాడు. తాను పునరుత్థానుడియ్యానని అందరికీ చెప్పమంటూ మగ్దలేనె మరియను ఆదేశించి ఆమెను తొలి సువార్తికురాలిని చేశాడు.



విశ్వంలో, ఆకాశంలో స్త్రీది సమాన భాగమని, ఆమెది సగభాగమని ఆచరణలో ప్రకటించిన మహావిప్లవకారుడు యేసుక్రీస్తు. స్త్రీని గౌరవించి ప్రోత్సహించడమే సమాజ పురోగతికి గీటురాయి అని ఆయన బోధలు చెబుతాయి. ఆదిమకాలం నుండి ఇప్పటిదాకా సౌవార్తిక ఉద్యమంలో, చర్చి చరిత్రలో స్త్రీది చాలా ప్రధానమైన పాత్ర. ఒక బలమైన సమాజానికి పునాది బలమైన కుటుంబమైతే, బలమైన కుటుంబ నిర్మాణంలో ముఖ్యపాత్ర తల్లిగా, భార్యగా స్త్రీదే!! స్త్రీకి సమాన హోదానిచ్చి గౌరవించనివాడు అనాగరికుడు, క్రైస్తవ స్ఫూర్తికి విరుద్ధమైన వాడు.

- రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్



● విజయ్‌కుమార్, పరుచూరి వెంకటేశ్వరరావు, టి. సుబ్బరామిరెడ్డి, పద్మిని కొల్హాపురి, మురళీమోహన్, కైకాల సత్యనారాయణ, అట్లూరి సుబ్బారావు

ఆయనే నిజమైన కళాకారుడు

\- కైకాల సత్యనారాయణ

''ఆ ఈశ్వరుడికి, కళకు సంబంధం ఉంది. కళలో ఈశ్వర శక్తి ఉంది. అందుకే కళలను ప్రేమిస్తాను. ఆరాధిస్తాను. కళాకారులపై అభిమానంతో, వారిని అభినందించి సత్కరిస్తాను. దీనికి రాజకీయంతో సంబంధం లేదు. కళలను ఆరాధిస్తూ అందర్నీ ప్రేమిస్తూ, అజాత శత్రువుగా ఉండాలన్నదే జీవితంలో నా కోరిక అన్నారు'' కళాబంధు టి. సుబ్బరామిరెడ్డి. మహా శివరాత్రి సందర్భంగా విశాఖ సముద్ర తీరాన టీయస్సార్ ఆధ్వర్యంలో కోటి శివలింగాల ప్రతిష్ట, మహా కుంభాభిషేకం కార్యక్రమం ఈ నెల 13న జరగనుంది. ఈ సందర్భంగా సీనియర్ నటులు కైకాల సత్యనారాయణకు 'విశ్వనట సమ్రాట్ బిరుదు' ప్రదానం చేయనున్నారు. అలాగే యశ్ చోప్రా స్మారక జాతీయ అవార్డును ప్రముఖ గాయని ఆశా భోంస్లేకు ప్రదానం చేయనున్నారు. ఈ వేడుకల వివరాలను హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో టి. సుబ్బరామిరెడ్డి వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ – ''కోటి లింగాల ప్రతిష్ట, మహా కుంభాభిషేకం కార్యక్రమం ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయింది. ఫిబ్రవరి 13న సిల్వర్ జూబ్లీ చేయనున్నాం. ఆ రోజు 7 గంటలకు ప్రారంభమయ్యే అభిషేకం మధ్యాహ్నం మూడు గంటల వరకు సాగుతుంది. అలాగే సాయంత్రం 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు శివజాగారం కొరకు భక్తి రస కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. దాదాపు వెయ్యి చిత్రాల్లో కైకాల సత్యనారాయణ నటించారు. ఎన్టీఆర్ వంటి గ్రేట్ ఆర్టిస్ట్‌తో వర్క్ చేశారు. ఆయనకు 'విశ్వనట సమ్రాట్' బిరుదును ప్రదానం చేయనున్నాం. స్వర్ణకంకణ ఘనసన్మానం కూడా జరుగుతుంది. యశ్ చోప్రాగారు దేశం గర్వించదగ్గ ఫిల్మ్‌మేకర్. ఆయనతో కలిసి 'చాందినీ, లమ్హే' లాంటి చిత్రాల నిర్మాణంలో పాలు పంచుకున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన జ్ఞాపకార్థం 2014లో ప్రారంభించిన యశ్ చోప్రా స్మారక జాతీయ పురస్కారాన్ని ఈ ఏడాది గాయని ఆశా భోంస్లేకు అందజేయాలని జ్యూరీ కమిటీ నిర్ణయించింది. త్వరలో మహబూబ్‌నగర్‌లో కాకతీయ కళా వైభోత్సవాన్ని నిర్వహించాలనుకుంటున్నాం'' అన్నారు. ''మహాశివరాత్రి రోజున ప్రజల సమక్షంలో విశ్వనట సమ్రాట్ బిరుదుతో నన్ను సత్కరించనుండటం ఆనందంగా ఉంది. కళాకారులు గౌరవాన్ని కోరుకుంటారు. ఏమీ ఆశించకుండా డబ్బును కళాసేవకు వినియోగిస్తున్నారు టి.సుబ్బరామిరెడ్డిగారు. ఆయనే నిజమైన కళాకారుడు. కళామతల్లి ముద్దుబిడ్డ అన్నది నా ఉద్దేశం. ఇలాంటి కార్యక్రమాలు ఆయన ఎన్నో చేయాలి. నాకు పద్మశ్రీ, పద్మ విభూషణ్ కంటే ఈ అవార్డు గొప్పదని నేను భావిస్తున్నాను'' అన్నారు కైకాల సత్యనారాయణ. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, పరుచూరి వెంకటేశ్వరరావు, పద్మినీ కొల్హాపురి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొగసరి అత్త.. గడసరి అల్లుడు

అత్తారింటికెళ్లాడు అల్లుడు. ఆతిథ్యంలో తేడా వస్తే అమ్మాయిపై ఉన్న ప్రేమతోనో, అత్తింటిపై ఉన్న గౌరవంతోనో.. సర్లే అని సర్దుకుంటాడు. కానీ అత్త తనపై పెత్తనం చేయాలంటే ఊరుకుంటాడా? అబ్బే... అస్సలు కాంప్రమైజ్ అవ్వడు. సొగసరి అత్తకి ఘాటైన రిప్లై ఇచ్చాడు గడసరి అల్లుడు. ఎలా అంటే.. స్క్రీన్‌పై చూడాల్సిందే. నాగచైతన్య హీరోగా మారుతి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'శైలజారెడ్డిగారి అల్లుడు' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారని టాక్. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. రమ్యకృష్ణ అత్త క్యారెక్టర్ చేస్తున్నారని టాక్. రీసెంట్‌గా హైదరాబాద్‌లో జరిగిన ఫస్ట్ షెడ్యూల్‌లో కథానాయిక ఇంట్లోని సీన్స్‌ను తెరకెక్కించారు. సినిమా స్టార్టింగ్‌లో హీరో, హీరోయిన్లపై కాలేజీ అండ్ పార్క్ సీన్స్‌ను చిత్రీకరించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ ఈ నెల 19న స్టార్ట్ కానుందని సమాచారం.



● నాగ చైతన్య

డాన్ ఆఫ్ ది డాన్స్!



● రజనీకాంత్

డాన్స్ చాలామంది ఉండొచ్చు. కానీ డాన్స్‌నే డామినేట్ చేసే డాన్ 'కాలా'. రజనీకాంత్ హీరోగా 'కబాలి' ఫేమ్ రంజిత్. పా దర్శకత్వంలో వండర్‌బార్ పతాకంపై దర్శక–నిర్మాత–నటుడు ధనుష్ నిర్మించిన చిత్రం 'కాలా'. ఇందులో హ్యూమా ఖురేషి, అంజలి పాటిల్, సముద్రఖని, నానా పటేకర్ కీలక పాత్రలు చేశారు. ఈ సినిమాను ఏప్రిల్ 27న రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా చిత్రబృందం ఎనౌన్స్ చేసింది. 'బాషా', 'కబాలి' సినిమాల్లో డాన్ రోల్ చేసిన రజనీ 'కాలా' చిత్రంలోనూ డాన్ పాత్ర చేయడంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. పైగా లుక్ ఇప్పటికే బాగా ఆకట్టుకుంది. 'కాలా' రిలీజ్ డేట్ ప్రకటించారు కాబట్టి రజనీ '2.0' ఈ సమ్మర్‌లో రిలీజ్ అవ్వడం లేదన్నది ఫిక్స్ అన్నమాట. ఈ '2.0' చిత్రాన్ని ఆగస్ట్ 15న విడుదల చేయాలనుకున్నారు. ఈ వార్త వచ్చి రెండు రోజులైందో లేదో ఇప్పుడు వేరే డేట్ వినిపిస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారట.


ఫస్ట్ హీరోతో 34 ఏళ్ల తర్వాత!

ఒకటి కాదు... రెండు కాదు.. 34 ఏళ్లు పట్టింది మోహన్‌లాల్, నదియా మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోవడానికి. మోహన్‌లాల్ హీరోగా ఆల్మోస్ట్ 34 ఏళ్ల క్రితం 'నోక్కెద దూరత్తు కన్నుమ్ నాట్టు' సినిమాతోనే మాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు నదియా. ఆ తర్వాత తన తొలి హీరో మోహన్‌లాల్ సరసన ఆమె నటించలేదు. నిజానికి మాతృభాష మలయాళంలోకన్నా తమిళంలోనే నదియా ఎక్కువ సినిమాలు చేశారు. తమిళ చిత్రం 'ఎం కుమరన్ సన్నాఫ్ మహాలక్ష్మి'తో క్యారెక్టర్‌గా ఆర్టిస్ట్‌గా మారి, వరుసగా సినిమాలు చేస్తూ వస్తున్న నదియా 'మిర్చి'తో తెలుగులో మోస్ట్ వాంటెడ్ వదిన, అమ్మ అయ్యారు. ఆ సంగతలా ఉంచితే ఇప్పుడు తన తొలి హీరో మోహన్‌లాల్‌తో ఆమె 'నీరలి' అనే సినిమా చేయనున్నారు. అయితే జంటగా కాదని సమాచారం. ఓ కీలక పాత్రకు నదియాను తీసుకున్నారట. ఈ చిత్రంలో పార్వతీ నాయర్ కథానాయికగా నటిస్తున్నారు. అజయ్ వర్మ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం కోసం మోహన్‌లాల్ స్లిమ్ లుక్‌లోకి ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు.



● నదియా

ప్రపంచాన్ని చుట్టేసే ఫకీర్



● ధనుష్

ఎలాంటి పాత్రనైనా అవలీలగా పోషించగల నటుడు ధనుష్. సౌత్‌లోనే కాకుండా నార్త్‌లో కూడా మంచి ఫాలోయింగ్ ఉన్న ధనుష్ ఇప్పుడు హాలీవుడ్ సినిమాలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రెడీ అయ్యారు. 'వై దిస్ కొలవెరి డీ' అంటూ ఇంతకు ముందు వరల్డ్ వైడ్ సెన్సేషన్ క్రియేట్ చేసినా ఫుల్ టైమ్ యాక్టర్‌గా ఒక ఫ్రెంచ్ సినిమా ద్వారా డెబ్యూ చేయనున్నారు. 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్' అనే ఓ ఫ్రెంచి కామెడీ అడ్వెంచర్ సినిమాలో హీరోగా నటిస్తున్నారు ధనుష్. ఈ సినిమాలో ధనుష్ క్యారెక్టర్ టీజర్‌ను ఇటీవల రిలీజ్ చేశారు. 'ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్ హూ గాట్ ట్రాప్డ్ ఇన్ యాన్ అకియా వార్డ్‌రోబ్' అనే నవల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాకు కెన్ స్కాట్ దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్, బెరెనిస్ బెజో, బార్ఖద్ అబ్ది ముఖ్య తారలుగా నటించిన ఈ సినిమాను లుక్ బోసీ, ఆదితీ ఆనంద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు స్కాట్ మాట్లాడుతూ – ''ముంబైలో పుట్టి తన పరిసర ప్రాంతాలు తప్ప మరో ప్రపంచం తెలియని ఓ కుర్రాడు ప్రపంచాన్ని ఎలా చుట్టాడు? అనేది కథాంశం. వివిధ ప్రాంతాల యాక్టర్స్‌తో పని చేయటం, వాళ్ల కల్చరల్ బ్యాగ్రౌండ్ గురించి తెలుసుకోవటం చాలా ఇన్స్‌పిరేషనల్‌గా ఉంది. ధనుష్ అజాతశత్రూ లవాశ్ పటేల్ అనే ముంబై యువకుడి పాత్ర పోషిస్తున్నారు. ఇండియా, ఇటలీ, ఫ్రాన్స్, లిబియా వంటి దేశాల్లో ఈ సినిమాను షూట్ చేశాం. ఫకీర్ ఫన్నీగా ఉంటూనే అడ్వెంచర్స్ చేస్తుంటాడు'' అని అన్నారు.

అత్తారింట్లో సరదాగా...



● రష్మికా మండన్నా

రష్మికా మండన్నా.. లేటెస్ట్ తెలుగు సినిమా సెన్సేషన్. 'ఛలో' సినిమా సూపర్ హిట్ అయిన తర్వాత తెలుగు యూత్ అందరి నెక్స్ట్ ఫేవరెట్ హీరోయిన్ అయిపోయారామె. కానీ ఆవిడ సింగిల్ కాదండోయ్. కన్నడంలో 'కిరిక్ పార్టీ' సినిమా సూపర్ హిట్ అవ్వగానే అందులో హీరో రక్షిత్ శెట్టితో ఎంగేజ్‌మెంట్ చేసేసుకున్నారీ కన్నడ బ్యూటీ. ఎంగేజ్ అయిన తర్వాత ఎవరి కెరీర్‌లో వాళ్లు బిజీ అయిపోయారు. వీలున్నప్పుడల్లా రష్మికా, రక్షిత్ శెట్టి కలిసి టైమ్ స్పెండ్ చేస్తున్నారట. ఈ మధ్యన రక్షిత్ శెట్టి వాళ్ల ఫ్యామిలీ ట్రెడిషన్ అయిన 'భూత కోల' అనే ఆటను రష్మికా చూశారట. భూత కోల కూడా మన జాతరలలో అమ్మవారి ముందు చేసే నృత్యం లాంటిదే. తులు మాట్లాడే కన్నడ వాళ్ల సాంప్రదాయం ఈ 'భూత కోల'. కన్నడంలో 'భూత' అంటే 'స్పిరిట్' అని 'కోల' అంటే ఆట అని అర్థం. ఈ ట్రిప్ గురించి మాట్లాడుతూ – ''ఇది నా ఫస్ట్ 'భూత కోల' ఎక్స్‌పీరియన్స్. చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఇంతకు ముందు రక్షిత్ ద్వారా దీని గురించి విన్నాను. ఈ ఆచారాలను ఇంకా ఎంతోమంది ఫాలో అవుతున్నారంటే ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఆ తర్వాత కూడా 'భూత కోల' లాంటి మరో సంప్రదాయ నృత్యాన్ని చూశాం. ఈ ట్రిప్ నాకు మంచి అనుభూతిని మిగిల్చింది. వెంటనే మా పనుల మీద బెంగళూర్ వెళ్లిపోవాల్సి ఉంది. ఉన్న ఆ కొద్ది టైమ్‌లో రక్షిత్ శెట్టి వాళ్ల ఇంట్లో కొద్దిసేపు గడిపాము. వాళ్ల ఫ్యామిలీ, కిడ్స్ అందరితో క్వాలిటీ టైమ్ స్పెండ్ చేశాను. నా ఫేవరెట్ ఫిష్ ఫ్రై కుడా సెర్వ్ చేశారు'' అని కాబోయే అత్తారింటి విశేషాలను పేర్కొన్నారు రష్మికా.

సీక్వెల్ మీద సీక్వెల్



● గౌతమ్ మీనన్

డీసీపీ రామ్‌చందర్ మళ్లీ వస్తే? రాఘవన్ మళ్లీ కనిపిస్తే? సత్యదేవ్ మళ్లీ సందడి చేస్తే ఎంత బాగుండు అని ఆ క్యారెక్టర్స్‌ని ఇష్టపడినవాళ్లు అనుకోవడం సహజం. 'ఘర్షణ'లో వెంకటేశ్ చేసిన స్టైలిస్ పోలీస్ క్యారెక్టర్ పేరు రామ్‌చందర్ అనీ, 'రాఘవన్'లో కమల్‌హాసన్ పాత్ర పేరు రాఘవన్ అనీ, 'ఎంతవాడు గానీ'లో అజిత్ పేరు సత్యదేవ్ అనీ గుర్తుండే ఉంటుంది. మంచి హిట్ సాధించిన ఈ చిత్రాలు, ఆ పాత్రలనూ మరచిపోలేం. అందుకే గౌతమ్ మీనన్ మళ్లీ ఈ క్యారెక్టర్స్‌ని కొనసాగించాలనుకుని ఉంటారు. ఈ మూడు చిత్రాలకూ సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారు. 'ఘర్షణ' తమిళ 'కాక్క కాక్క'కు రీమేక్. అందులో సూర్య హీరో. అలాగే కమల్ 'వేట్టైయాడు విలైయాడు' తెలుగులో 'రాఘవన్'గా, అజిత్ 'ఎన్నై అరిందాల్' తెలుగులో 'ఎంతవాడు గానీ' పేరుతో అనువాదమయ్యాయి. తమిళంలో ఈ మూడు చిత్రాలకు సీక్వెల్స్ ప్లాన్ చేస్తున్నారు గౌతమ్. ఇవి డబ్బింగ్ రూపంలోనో లేక తమిళ్‌తో పాటు తెలుగులో కూడా నిర్మిస్తే టాలీవుడ్ ప్రేక్షకులూ చూడొచ్చనుకోండి. ''ముందు 'ఎన్నై అరిందాల్' సీక్వెల్ స్క్రిప్ట్ తయారు చేసి, అజిత్‌ను అప్రోచ్ అవుతాను'' అన్నారు గౌతమ్. యాక్చువల్లీ ఈ మూడు హై వోల్టేజ్ పోలీస్ స్టోరీలు ఒక పోలీసాఫీసర్ లైఫ్‌లో వివిధ దశల్లో జరిగే కథలని, ఈ మూడు సినిమాలు ఒక ట్రయాలజీ అని, ఎన్నై అరిందాల్‌తో ఈ ట్రయాలజీ ముగుస్తుందని ఓ సందర్భంలో పేర్కొన్నారు గౌతమ్. మరి.. వీటి సీక్వెల్స్ ఎలా ప్లాన్ చేశారు? అన్నది తెలియాల్సి ఉంది.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 11-2-2018

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



పద్మశాలి/28/5'9"/B.Tech / MBA / SWE/ Well Settled Family కలిగిన వరునికి అందమైన వధువు కావలెను. Ph: 7702274416 / 9951022798 [H-704213]

రెడ్డి/29/5'10"/B.Tech/ IIT/SWE/ విప్రో/ Hyd / నెలకు 1 లక్ష జీతం గల మంచి ఆస్తి వున్న ఏకైక వరుడుకు తగిన వధువు కావలెను. (అర్జెంట్) 9059098156 [HA-52444]

రాజులు/క్షత్రియులు/29/5'10"/B.Tech/ SWE/ అమెజాన్/Hyd / నెలకు 1 లక్ష జీతం గల ఏకైక వరుడుకు తగిన వధువు కావలెను. (అర్జెంట్) 9912298156 [HA-52444]

కాపు/29/5'10"/B.Tech/ IIT/SWE/ విప్రో/ Hyd / నెలకు 1 లక్ష జీతం గల వరుడుకు సాంప్రదాయమైన వధువు కావలెను. (అర్జెంట్) 8978799956 [HA-52444]

కాపు/రెండో పెళ్ళి/45y/5'5"/1 బాబు/Pvt. Job / రూ. 16,000/- PM/ ఆస్తులు ఏమీ లేవు/ కుల ప్రసక్తిలేని వధువు కావలెను. డైరెక్ట్ నెం. 8639204397/9052956438 [H-0606782]

వైశ్య/కట్న ప్రసక్తిలేదు/ 5'10"/ 30 సం॥ / B.Com / MBA/ సొంత బిజినెస్/80K PM / వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. 8555849510, 8885066616 [HA- 704165]

క్రిస్టియన్ మాదిగ/B.Tech / MBA/ Govt. Asst. మేనేజర్ (ఆంధ్రా బ్యాంక్) 45000/- PM / 5'8" ఎత్తు / 29 సం॥ల వరునికి వధువు కావలెను. 9703978131 [HA- 8580]

కాపు/37 Age / CNB/ డైవర్స్/2 Cr ప్రాపర్టీ/4 Lakhs PM / గల వరునికి 1వ/ డైవర్స్/ విడో/లేట్ మ్యారేజ్ 25 నుంచి 35 సం॥ల వయస్సు గల BC/OC అమ్మాయి కావలెను. డైరెక్ట్. 8885674325/7416076668 [HA- 8580]

SC మాల హిందు, 32Y., 5'9"H, Fair, Q/F: BE (Mech), ONGC Mumbai, C.Govt., 1.5L/month Preferred : Govt/bank Jobs. Direct Parties only (No Brokers) Contact : 83286 71123 [R-0980768]

★★

క్రిస్టియన్ మాల/C.Govt. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇన్సూరెన్స్) / 75000/- PM / 5'8" ఎత్తు / 28 సం॥ల అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. సంప్ర: 9642728299 [HA-52444]

రెడ్డి/30y/177/ Handsome / BE/ M.TECH (IIT) / SWE/ Texas / Rs. 1,85,000/-PM / Bengaluru / Seeks Suitable Bride / Contact: 9341222222 [HA-332]

కాపు/65 సం॥/ విడో / ప్రైవేట్ జాబ్ / ఒంటరి వరునికి ఏ బాదరబందీలేని / డైవర్సీ/ విడో/ అనాథ వధువు కావలెను. సంప్ర॥ 8297211014 [H-684548]

బ్రాహ్మిన్/29/ ఆరువేల N/BE/ SW/70 వేలు / ఆర్థికంగా OK గల వరుడికి వధువు కావలెను.& ST /నాయక్/Govt/ 40 వేలు / Govt ఉద్యోగి వధువు కావలెను. 9490570029/9154969331 [H-684844]

PG ఆదర్శ భావాలు కల వరునికి కుల మత వయస్సు ప్రసక్తిలేని వధువు కావలెను. డైరెక్ట్. సంప్రదించండి. 9515425059 [HA- 52444]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015 Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ (Christian) / B.Tech /MS / Now Business (Builder) / Hyd / 27/5'10"/ 12 Cr (Prop) / 2 L/M Rents * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ (Business) / V. Smart / 200 Cr (Prop) / Hyd/ MBA / Very Smart Boy. * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ MBBS / MD (Gen Med) / 27/5'7 1/2" / 5 Cr * MS (Opth) / 31/5'10"/10 Cr * DM / 29/ 5'11"/ 80 Cr *MD (Paed) / 28/5'9"/25 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech / MBA/ Business / V. Smart / 27/6'/100 Cr * 31/5'9"/200 Cr * 33/6'/400 Cr * 29/5'8"/225 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ V. Big Business / 31/5'10"/150 Cr (Prop) / B.Tech/ MBA * B.Tech (Civil) Builder / 29/5'10"/ 40 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ USA (Green Card) / 28 /5'8"/100K / 40 Cr (Prop) * Cont: K.C. Reddy Mar Bur, B. Hills, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ (Divercee) B.Tech/ 38/5'9"/ 60 Cr / Hyd / Big - Contractor / Big House in Banjarahills * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech / MBA/ USA/26/ 5'9"/75 Cr * BS/USA/25/6'/150 Cr* MS/ 24/6'/40 Cr * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech (IIT) / M.Tech (IIT) / PhD/ USA/300k/ 32/6'/ 10 Cr * VIT/ GMAT/ MBA (USA) (KELLY) 30/5'11"/180K * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ B.Tech /MS/H1/USA*28/6'/200 Cr * 28/5'11"/60 Cr * 34/5'10"/ 70 Cr * 30/5'7"/150K / 70 Cr*28/5'8"/100K / 30 Cr* Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015.

[D-056]

వరుడు కావలెను

Reddy/ B.Com / MBA (USA) Now India / 25 / 5'7 1/2" / 10 Cr (Prop) / Needs India or USA Boys * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ B.Tech / SWE/ Hyd / 10 L / Yr / 26 / 5'4"/ 5 Cr (Prop) * Cont: K.C. Reddy Mar Bur, Banjara Hills, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech /MS/26/5'3"/150 Cr * 26/5'3 1/2" / 40 Cr * 28/5'5"/40 Cr * 26/5'7"/30 Cr * 28/5'4"/ 30 Cr * 27/5'6"/100 Cr * Cont: K.C. Reddy , Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech (IIT)/MS/USA * 30/5'5"/ 200K/ 15 Cr * 29/5'4"/180K * 27/5'4" * 26/5'7"/30 Cr * 27/5'2"/5 Cr * 27/5'5" * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/MBBS / Res-Doc-USA*26/5'7"/ 50 Cr * 26/5'4"/120 Cr * 27/5'7"/10 Cr * 29/5'3" * 29/5'5"/10 Cr * 30/5'4" * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech / MS/ Most Beautiful / 26/ 5'3"/50 Cr (Prop) * Cont: K.C. Reddy Marriage Bureau, Road No.3, B. Hills, Hyd. Ph: 9347807015

Reddy/MBBS /PG * 28/5'3" (Sur) / 27/5'6"/GM/ 29/5'3"/ (RAD) * 30/5'6"/ (DER) * 28/5'8"/GM * 29/5'4"/GM * 28/5'4"/ENT * 26/5'5" (Path)* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ Rich /B.Tech / 27/5'6"/100Cr * 30/5'2 1/2" / 100 Cr * 28/5'7"/50 Cr * 28/5'3"/20 Cr * 28/5'5"/40 Cr* 29/5'3"/30 Cr * Cont: K.C.Reddy, Hyd. Ph: 9347807015

Reddy/ (Rich) / B.Tech/ 26/5'5"/10 Cr * 27/ 5'5"/25 Cr * 27/5'2"/20 Cr * 27/5'5"/ 20 Cr * 28/5'3"/20 Cr * 26/5'6"/30 Cr * 20/5'8"/30 Cr * Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ (Divercee) / Most Beautiful / 26/5'3"/BBA/. 10 Cr *32/5'6"/M.Tech/ 20 Cr * 28/5'6"/25 Cr * B.Tech / 31/5'2 1/2"/ 10 Cr* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

కాపు: డైరెక్ట్ BA, 2nd, 43Yrs, 5'6", Govt Job, Sal: 35K వరునకు వధువు కావలెను. విజయవాడ. సంప్ర॥ ✆ 73829 00793, 79898 14041. [B-0886782]


కాపు: డైవర్సీ, 46/5'.5"/ఇంటర్/ 8,000/ వరునుకి వధువు కావలెను. ఇల్లరికమైనా OK; కృష్ణాజిల్లా జగ్గయ్యపేట. డైరెక్ట్ ✆ 91546 98959 [B-0926797]

బ్రాహ్మణ/37 సం॥లు/ఎత్తు5.7/50లక్ష లు ఆస్తి నెలకు 30వేలు ఆదాయం గల వరునికి అందమైన వధువు కావలెను. సంప్రదించండి. 9676823115 [G-617409]

కమ్మ,30,5.5, ఫెయిర్, (ITI) ప్రైవేట్ జాబ్, 1ఎకరం పొలం, ఇల్లు ఉన్న వరునికి వధు వు కావలెను. కట్నప్రసక్తి లేదు. చంద్ర మ్యా రేజ్ బ్యూరో,గుంటూరు. 8019803894 [G-702071]

SC హిందూమాల (కట్న ప్రసక్తి లేదు) 27/ 5'10", B.Tech S/W/E, TCS, 80,000/- P.M. అందమైన వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. Ph : 80080 55675. [V- 617988]

వరుడు కావలెను



కమ్మ/24/5'5"/B.Tech/SWE / Well Settled Family కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8790246602/9951049449 [H-704213]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి 50 Crores, 27, 6', BE, MBA, Business, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, MBA, 27, 5' 10", 30 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 30, 5'5", Doctor, Handsome,, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS, 26, 6', 150 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, 29, 6', 100 K, SWE, 10 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, USA, 29, 5' 9", 140 K, H1, 7 Crores Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5' 8", Business, 14 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Canada, 33, 5'7", PR, MS, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS,MS, 25 Crores, 24, 5'5" , Doctor, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 27, 5' 4", BE, MBA, 80 Crores, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE, MS, 25, 5'4", 10 Crores, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి B.Arch, 25, 5'6", 10 Crores, Hyderabad, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, 25, 5'4", BE, SWE, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5'6", Rich Family, Fair Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి H1, BE, MS, 26, 5'4", H1, 8 Crores, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5'1", Software, 55,000 P/M, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కాపు/24/5'4"/B.Tech/SWE / Well Settled Family కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7673939882 / 9705345003 [H-704213]

కాపు/డైవర్సీ/31/5'4"/MBA / Manager / Well Settled Family కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. కుల పట్టింపులేదు. Ph: 9705345003/7673939882 [H-704213]

పద్మశాలి/24/5'4"/B.Tech / SWE/Well Settled Family కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7702274416 / 9951022798 [H-704213]

SC/24/5'4"/B.Tech / SWE/Well Settled Family కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9676968974/9951049449 [H-704213]

KAAKATEEYA.COM (మ్యారేజెస్)

గత 36 సంవత్సరాలుగా 5 రాష్ట్రాలలో 25 బ్రాంచీలతో అన్ని కులాల వారికి వేలాది సంబంధాలు కుదిర్చిన అగ్రగామి సంస్థ కాకతీయ.కామ్ H.O.: 101,102 విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ -73. మరియు కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం, ఒంగోలు, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, పాండిచ్చేరి www.kaakateeya.com / 9390999 999

వధువు కావలెను

Reddy /27/5.10/BE/MS/SWE/Blue Cross Blue Shield/$100K * 27/6/BE/MS/ SWE/ Hunlocks Technology/&100K * 29/5.10/ BE/MS/ SWE/MNC/&100K Ph: 9848944222

REDDY INDIA/ 27/5.9/BE/CIVIL ENGINEER/ 12 LAKHS P.A/30 CR* 27/5.8/BE/ ME/ SWE/ MNC/ 12 LAKHS P.A*29/5.8/ MCA/ SWE/ TECH/ MAHINDRA/8 LAKHS P.APh: 9848031931

REDDY DOCTORS/ 28/6/MBBS/ MS (Orthopedics) /50 CR* 28/5.8/ MBBS/ MS(Opthamology)* 28/5.8/ BDS/ MDS/ 9 LAKHS P.A Ph: 9392292939

KAPU DOCTORS/ 28/6/MBBS/MS (General Surgoen) * 28/5.10/MBBS/ MD (GENERAL MEDICINE) * 27/BDS/ MDS/DOCTOR Ph: 9618658877

KAPU INDIA 29/5.10/BE/ME/BE/ME/ SWE/30 LAKHS P.A * 29/5.9/BE/ME/SWE/ ROBERT BOSCH/11LAKHS P.A * 28/ E/ME/5.11/ SWE/ ACCENTURE/9 LAKHS P.A Ph: 9848535379

KAPU USA /29/BE/DOUBLE MS/SWE/ MNC/&120K * 28/6/BE/MS/SWE/Cloud -wick Technologies/&110K* 28/5.11/ BE/ MS/ SWE/ MNC &100K Ph: 7674868080

INTERCASTE USA 29/6/BE/MS/SWE /&130K * 28/5.11/BE/MS/ Software Developer/ MNC/&110K *29/6/BE/ MS/ MBA/ SWE/&100K Ph: 9966636222

INTERCASTE INDIA/ 29/5.11/BE/ ME (IIT)/ SWE/12LAKHS P.A* 28/5.9/ MCA/ MBA/SWE/8LAKHSP.A*29/ 5.8/ BE/MS/ SWE/7LAKHS P.A Ph: 9848031931

INTERCASTE DOCTORS 27/5.11/ MBBS/ MD (Pediatrics)/DM (Pediatric Critical Care)/ 100 CR *25/MBBS/MS (Orthopedics)* 28/5.8/ BDS/MDS/ 10LAKHSP.A Ph: 7675818080

REDDY DIVORCEE/ 29/6/BE/MS/ SWE /& 90K * 31/6/BE/MS/ SWE/&85K * 31/BE/MS/SWE/ 6LKHSP.A Ph: 7093200777

వరుడు కావలెను

REDDY INDIA/ 26/5.2/BE/MBA/SWE/ DELO- ITTE/12 LAK-PA * 27/5.5/BE/ME /(BITS) /ENGINEER/15LAK-PA*28/5.4/BE/MBA (IIM)/ SW/ HINDUSTAN /15LAK-PA Ph: 7680839333

REDDY USA /25/5.6/BE/MS/SWE/CTS/ $85 K-PA * 24/5.5/BE/MS /SWE/ MNC/ $90 K-PA * 26/5.4/BE/ SWE /MICRO-SOFT/ $ 80K-PA Ph: 9848535378

REDDY DOCTOR 26/5.5/MBBS/MD (General Medicine) * 26/5.4/ MBBS/ MD (Pediatrics) * 27/5.2/MBBS/ MS (General Surgoen) Ph: 9848535373

KAPU INDIA / 26/5.6/BE/MBA/SWE/ MNC/20 LAK-PA * 25/5.4/BE/ME(IIT)/ SWE/ MNC/15 LAK-PA * 27/5.7 /BE /SWE/CTS/6 LAK-PA Ph: 7702545670

KAPU USA / 26/5.3/BE/MS/SWE/ BANK OF AMERICA/$110 K-PA * 27/ 5.03/ BE/ MS/SWE/IBM/ $100K-PA * 27/5.4/BE /MS/ SWE/AT&T/ $75 K-PA Ph: 9177897788

KAPU DOCTOR/ 26/5.4/MBBS/MS (Gynaecology) * 27/5.2/MBBS/MS (ENT) * 26/5.6/MBBS/MS (General Surgoen) Ph: 7337320066

CASTE NO BAR INDIA / 25/5.7/BE/MBA (IIT)/SWE/TCS/12 LAK-PA * 25/5.4/BE/ SWE/ AMAZON/6 LAK-PA * 28/5.4/ BE/ SWE /POLARIES/9LAK-PA Ph:9848337378

REDDY DIVORCEE 32/5.7/MCA/SWE/ MNC/20 LAK-PA * 34/5.5/BE/ME/ SCIENTIST /I S R O/ 10 LAK-PA * 36/5.4/ MBA/HR/PWC/ 9LA-PA Ph: 9848123222

CASTE NO BAR USA/ 25/5.6/BE/MS/ Scientist/ $100K-PA * 28/5.4/BS/MS/ SEW/MNC/ $80K-PA * 28/5.4/BE/MS /SWE/ HPE/ $70K-PA Ph: 9848297222

CASTE NO BAR DOCTOR / 25/5.5/ MBBS/ MD (General Medicine) * 27/ 5.5/ MBBS/MS (ENT)* 27/5.4/ MBBS/ MS (Gynaecology) Ph: 9502888000

Letter

నాయుడు/డైవర్సీ/ 29y / 5'4"/ గ్రానైట్ బిజినెస్ / 13 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 9515060514 [HA- 704165]

ముదిరాజ్/1st మ్యారేజ్/27y / 5'4"/ ఇండియన్ ఆయిల్ సబ్ డీలర్/ 7 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 7287896285 [HA- 704165]

రెడ్డి/లేట్ మ్యారేజ్/29y / 5'5"/ ఆటో ఫైనాన్స్ బిజినెస్/ 15 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 8790788977 [HA- 704165]

VRS ఎంప్లాయి(2వ పెళ్ళి) /56/ 5'3"/ 25000/- పెన్షన్/ ఆంధ్రాలో వరిపంటలు, 2 కోట్ల ప్రాపర్టీగల వధువుకు మధ్య తరగతి వరుడు కావలెను. 9948576536 [HA- 704165]

రెడ్డి/కన్వెర్టడ్/24/5'6"/ B.Tech / SWE / 4 L PA గల అందమైన వధువుకు Software Job వరుడు కావలెను. (నో మీడియేటర్స్) 7077077441 [H-704022]

కమ్మ/విడో/కుల పట్టింపులేదు/29/ 5'2"/ B.Tech / 8 కోట్ల ఆస్తి/ అందమైన వధువుకు తగిన ఇల్లరికపు వరుడు కావలెను. 7731936806 [HA- 704022]

SC మాల హిందు/B.Tech / 25 Yrs / 5'4"/ Height / SWE / Hyd/ "COGNIGENT" కంపెనీ / 40,000/- PM/ చక్కని అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 9705960270 [HA- 704022]

చౌదరి/విడో/29/ 5'2"/ MBBS / Govt. డాక్టర్/ 75,000/- PM / 7 Cr ప్రాపర్టీ / ఈ మధ్యనే భర్తను కోల్పోయిన వధువుకు కుల /ఆస్తి ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను. 7801086663 [HA- 704022]

రెడ్డి/విడో/45/ 5'4"/BSc-BEd / Govt. టీచర్/38,000/- PM /ఒక పాప వున్న సాంప్రదాయక వధువుకు కుల /ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (ఇల్లరికం Ok)7095922464 [HA- 704022]

గౌడ/B.Tech / C. Govt. Asst. ఇంజినీర్ (BHEL) / 35000/- PM/ 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు డాక్టర్/ Any ఎంప్లాయి వరుడు కావలెను. 9885299854 [HA- 8580]

బ్రాహ్మణ/23/5'3"/5th * 21/5'4"/7th * 23/5'4"/10th వధువులకు వరులు కావలెను. పూజారి అయినా Ok. 7674078296 / 8106446865 [HA- 8580]

రెడ్డి/డైవర్సీ/కుల ధన ప్రసక్తిలేదు / 14 కోట్ల ఆస్తి/ వయస్సు 33y/5'6" ఎత్తు/ Qly : PG వెరీ ఫెయిర్ / నెలకు 7 లక్షల సంపాదన గల అందమైన వధువుకు వరుడు కావలెను. 9515528286 [HA- 8580]

మాల(SC)23,వెరీఫెయిర్,B.Sc, గవర్నమెంట్ జాబ్, 42,000pm, వెల్‌సెటిల్ ఫ్యామిలీ, 18crఆస్తి ఉన్న వధువుకి వరుడు కావలెను. మనీ సపోర్టు ఇస్తాం. 8341721377 [G-702070]

★★

రెడ్డి 24Y/162/ Beautiful / B.Tech / M.Tech / Hardware / Profession / CISCO/ Rs. 1,20,000/- PM/ Bengaluru / Seeks suitable groom Contact: 9342939344 [HA-332]

వేదికలు



అన్ని కుల కులాంతర దేశ, విదేశ 1వ, 2వ, లేట్ ఉన్నత మధ్య తరగతి కుటుంబ సంబంధాలకై సంప్రదించండి. హేమ 7032252439 [HA-704707]

కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్/ అన్ని కులముల వారికి డైవర్సీస్/ విడోస్/ విడోవర్స్, పెన్షనర్స్‌కు సంబంధములు త్వరగా కుదర్చబడును. (స్త్రీలకు ఫ్రీ రిజి॥) ఫోన్: 7286931144 [H-704201]

మనిషి జీవితం తెల్లకాగితం లాంటిది. దానికి అక్షరం లాంటి అర్థాంగి తోడైతే ఆ జీవితానికి అర్థం ఉంటుంది. జీవిత భాగస్వామి కోసం సంప్ర॥ కుల పట్టింపులేని 1వ, 2వ, లేట్ /పెన్షనర్స్ వ॥ 25-60 సం॥ 8096731243 [HA- 704165]

వెంటనే కుదర్చబడును. అన్ని కులముల మొదటి, 2వ, లేట్ సంబంధాలు, Dr's, SWE, Govt. Pvt., USA, UK, మంచి వధూవరుల సంబంధాలకై Ph: 8328398670 [HA- 704022]

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, BDS, MDS & డాక్టర్స్‌కి మాత్రమే. 1వ, 2వ, లేటు, దేశ విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదర్చబడును. 9963632698 [HA- 8580]

గంగపుత్రుల పెళ్ళి సంబంధాలకై శ్రీ గంగ భావాని గంగపుత్రుల వివాహ పరిచయాలు (అగ్ని కుల, క్షత్రియ, బెస్త, గూండ్ల, జాలరి, వాడ బలిజ & ఇతరత్రా) అంబర్‌పేట్. Hyd. 9000541008 [H- 684872]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS/IPS/ MBBS/MD/MCA/Abroad & Govt Job Holders సంప్ర॥ శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182. [H-684483]

15రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com, ✆ 9849058673, 94418 29644, 94920 33897, 94407 85888 [B-1073]

JIO వివాహ వేదిక 30 వేలు ప్రొఫైల్స్‌తో 100 మంది Assioats తో అన్ని కులాలు వారికి www.jiomatrimony.in. 8885410555, 8555800692. event@jiomatrimony.in [R-857984]

★★

మాల, క్రైస్తవ, హిందూ, MS/ M.Tech / M.Sc/ MA/ CA/MBA/ MBBS చదువులతో దేశ, విదేశాలలో ఉద్యోగములు చేయుచున్న వధూవరుల కొరకు సుమమాల. kalyanamala.org ✆ 94405 45049. [B-0866770]

విశ్వబ్రాహ్మణ పెళ్ళి సంబంధాల ప్రత్యేక సంస్థ, బ్రహ్మముడి, గుంటూరు. కమీషన్ డిమాండ్ లేదు. 0863-2261898, 94911 25725 [G-700124]

క్రిస్టియన్ వివాహ పరిచయ వేదిక. ప్రతి-శని, ఆదివారం మీ అమ్మాయికి/అబ్బాయికి సంబంధం కావాలా? డాక్టర్స్, ఇంజనీర్స్, పీజీ, డిగ్రీ సంబంధాలు చాలా కలవు. www.sweethomemarriage.com. ఫోన్: 0891-2739003, 98490 72372. [V- 617989]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1430/- for 4 Lines, 385/- Extra Line
Andhra Pradesh : 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line
Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line
* Color 25% Extra

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.

3+3 3 ప్రకటనలకు చెల్లించండి 3 ప్రకటనలు ఉచితంగా పొందండి

నిజామాబాద్	: 99122 20764	తిరుపతి	: 99122 20584	తాడేపల్లి గూడెం	: 99122 20558
కరీంనగర్	: 9705933396	కడప	: 99516 02932	రాజమండ్రి	: 99122 20358
వరంగల్	: 99516 02868	అనంతపూర్	: 99122 20718	విజయవాడ	: 9912225442
నల్గొండ	: 95055 08382	కర్నూల్	: 99122 20575	గుంటూరు	: 99122 20349
మహబూబ్‌నగర్	: 99128 22811	శ్రీకాకుళం	: 99122 20343	ఒంగోలు	: 99122 25431
ఖమ్మం	: 99122 20596	విశాఖపట్నం	: 99122 20550	నెల్లూరు	: 99122 20736

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912225456.

బ్రహ్మాండం బద్దలు కాలేదేం!

సీఎం చంద్రబాబుపై సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ధ్వజం

- బీజేపీతో కలిసి రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు
- ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామన్నారు.. మొదటికే మోసం చేశారు
- హోదాను అటకెక్కించడం పాలక వర్గాల ద్రోహానికి నిదర్శనం
- విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తే భావిపౌరులే నవ భారతం నిర్మిస్తారు
- హోదా విషయంలో బీజేపీ, టీడీపీ తొలి మోసం చేశాయి: రాఘవులు
- ప్యాకేజీకి జైకొట్టిన చంద్రబాబు రెండో మోసానికి పాల్పడ్డారు
- ఇప్పటికే ఉన్న జేఏసీలు చాలు.. కొత్తది ఎందుకు?
- పవన్ కల్యాణ్ మరో రాజకీయ నాటకం ఆడొద్దు
- చంద్రబాబు, వెంకయ్య, జైట్లీ నాటకాలు ఆడడంలో ఆరితేరారు
- భీమవరంలో ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలు

భీమవరం నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి:

''రాష్ట్రాన్ని విభజిస్తే తలెత్తే సమస్యలను ముందుగానే పసిగట్టాం. అందుకే సమైక్య రాష్ట్రానికి మద్దతుగా నిలిచాం. నాలుగేళ్లక్రితం చంద్రబాబును అడిగా.. పదేళ్లు బీజేపీతో సావాసం చేశావు కదా, గుణపాఠం నేర్చుకోలేదా? మళ్లీ వాళ్లతోనే ఎందుకు వెళ్తున్నావు అని ప్రశ్నించా. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంది, రాబోయే రోజుల్లో మేమిద్దరం కలిసి రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం, బ్రహ్మాండం బద్దలు కొడతాం, చూస్తూ ఉండండి అన్నాడు. చివరకు ఏమైంది? ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు, పదేళ్లు ఇస్తామని మొదటికే మోసం చేశారు. హోదా బదులు ప్యాకేజీ అన్నారు, చివరకు దాన్నీ లేకుండా చేశారు. ఇప్పుడేమో టీడీపీ వాళ్లు వచ్చి సీపీఎం సహకారం కావాలని అడుగుతున్నారు. మేము మద్దతిచ్చేది ప్రజలకోసమే తప్ప పార్టీలకోసం కాదు'' అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తేల్చిచెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శనివారం సీపీఎం రాష్ట్ర 25వ మహాసభలు ప్రారంభమయ్యాయి. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి పి.మధు, తెలంగాణ రాష్ట్ర శాఖ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, హైమావతి తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సభలో, అనంతరం బహిరంగసభలో ఏచూరి ప్రసంగించారు.



సీపీఎం రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మధు

ఎర్రజెండాను దించే సత్తా ఎవరికీ లేదు

''ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఎప్పటికప్పుడు రేపటిలోగా ప్రకటిస్తామనే సమాధానమే వస్తోంది తప్ప హోదా మాత్రం రావట్లేదు. ప్రత్యేక హోదాను అటకెక్కించడం పాలకవర్గాల ద్రోహానికి నిదర్శనం. ప్రజా ఉద్యమాలతో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ శ్రేణులు నడుం బిగించాలి. ఏపీలో సీపీఎంకు పూర్వవైభవం వస్తుంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో పేద వర్గాలపై మరింత భారం మోపారు. 2017లో సృష్టించిన సంపదలో 73శాతం సంపద జనాభాలో ఒక శాతమే ఉన్న ధనికుల చేతుల్లోకి వెళ్లింది. సామాన్య ప్రజలకు అప్పులు, ఆకలిచావులు మిగిలితే పారిశ్రామికవేత్తలకు రూ.లక్షల కోట్లు మిగిలాయి. విద్య, వైద్యానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తే భావిపౌరులే నవ భారతాన్ని నిర్మిస్తారు. ఎర్రజెండాను రూపుమాపాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఎర్రజెండాను దించే సత్తా ఎవరికీ లేదు. బీజేపీని ఓడించేందుకు ప్రత్యామ్నాయ విధానాలతో కూడిన ప్రజా ఉద్యమాలు అవసరం'' అని ఏచూరి స్పష్టంచేశారు.

నవరత్నాల్లో భూసమస్యను చేర్చాలి

వైఎస్సార్‌సీపీ ప్రకటించిన నవరత్నాలు మంచి సంక్షేమ కార్యక్రమాలే అయినా భూమి సమస్యనూ వాటిలో చేర్చాలని బీవీ రాఘవులు సూచించారు. గిరిజనులు, దళితులు, నిర్వాసితుల సమస్యలను, భూ పంపిణీ, పర్యావరణ సమస్యలనూ చేర్చాలని చెప్పారు. ప్రభుత్వం దళితులు, గిరిజనుల జోలికొస్తే సహించేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. ఈ నెల 13, 14 తేదీల్లో వామపక్షాలు సమావేశమై, ప్రజాసమస్యలపై భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని ప్రకటిస్తాయన్నారు. సౌహార్ద్ర ప్రతినిధిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా సాధనకు ఢిల్లీలోనూ సమరానికి సిద్ధం కావాలని కోరారు. ఆర్‌ఎస్‌పీ, ఫార్వర్డ్‌బ్లాక్, సీపీఐ ఎంఎల్ నాయకులు జానకీరామ్, సుందరరామరాజు, బంగార్రాజు తదితరులు సందేశాలిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. బహిరంగసభ అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సమావేశంలో పి.మధు కార్యదర్శి నివేదికను చర్చకు ప్రవేశపెట్టారు. ఆది, సోమవారాల్లో దీనిపై చర్చ జరుగుతుంది.

వారికి నంది అవార్డులిచ్చినా సరిపోదు

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని ఎంపీలు ఆందోళన చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమని బీవీ రాఘవులు మండిపడ్డారు. ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ, టీడీపీలు కలిసే తొలి మోసం చేశాయని ధ్వజమెత్తారు. ''ప్రత్యేక హోదాయే ముద్దన్న చంద్రబాబు తర్వాత ప్రత్యేక ప్యాకేజీ గొప్పదని చెప్పాడు. పోలవరం ప్రాజెక్టు మొదలు కాకినాడ రిఫైనరీ వరకు రాష్ట్రానికి ఎన్నో రావాల్సి ఉన్నా, వాటి గురించి అడగకపోగా ప్యాకేజీకి జైకొట్టి చంద్రబాబు రెండో మోసానికి పాల్పడ్డాడు. చంద్రబాబు, వెంకయ్యనాయుడు, అరుణ్ జైట్లీ నాటకాలు ఆడడంలో ఆరితేరిపోయారు. వారికి నంది అవార్డులిచ్చినా సరిపోదు. వాళ్లు చేసింది రాజకీయ మోసపూరిత నాటకం. వారికి తగిన బుద్ధి చెప్పాలి. జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ ఈ నాటకంలో టీడీపీ పేరు చెప్పకుండా బీజేపీనే తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ తోడుదొంగల గురించి చిత్తశుద్ధి ఉన్న ప్రతి ఒక్క నాయకుడూ మాట్లాడాలి. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కేంద్రాన్ని నిలదీసేందుకు ఇప్పటికే చాలా జేఏసీలున్నాయి. నాలుగేళ్లుగా ఇవి పనిచేస్తున్నాయి. పవన్‌కల్యాణ్ కొత్తగా జేఏసీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు. ఆయన మరో రాజకీయ నాటకం ఆడొద్దు. చట్టాల్లో ఉన్నవి అమలు చేయమని కోరితే చాలు. టీడీపీ, బీజేపీలు ఎవరి మేలుకోసం పని చేస్తున్నాయో ప్రజలు గమనించాలి'' అని రాఘవులు విజ్ఞప్తి చేశారు.

మల్లన్నకు పట్టువస్త్రాలు



రాష్ట్ర ప్రభుత్వం తరపున మల్లన్నకు పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి మాణిక్యాలరావు

శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13న జరిగే శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి మాణిక్యాలరావు శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. వీటిని ప్రధాన ఆలయ గోపురం ముందు ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తుల ఎదుట ఉంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సతీసమేతంగా పట్టువస్త్రాలు తీసుకుని ఈవో భరత్‌గుప్త తదితరులతో కలిసి ఆలయ ప్రవేశం చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి శనివారం రావణవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గంగాధర మండపం వద్ద నుంచి వీరభద్ర ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు.

ఫీచర్ ఫోన్‌లో ఉచిత వాయిస్ కాల్స్

జియో సరికొత్త ఆఫర్

సాక్షి, అమరావతి: రిలయన్స్ జియో స్మార్ట్ ఫీచర్ ఫోన్లపై ఉచిత కాల్స్ ఆఫర్‌ను ప్రకటించింది. రూ.1,500 డిపాజిట్ చేసి జియో ఫోను తీసుకుంటే మూడేళ్ల తర్వాత ఈ డిపాజిట్ సొమ్మును తిరిగి ఇచ్చేస్తుంది. కానీ ప్రతీ నెలా రూ.49 చెల్లిస్తే నెల రోజుల పాటు ఉచితంగా నిరంతరాయంగా మాట్లాడుకునే వెసులుబాటును కల్పిస్తోంది. గతంలో కేవలం వాయిస్ కాల్స్‌కు మాత్రమే ఉపయోగించే ఈ ఫీచర్ ఫోన్ ద్వారా యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ క్రోమ్‌లతో పాటు జియో టీవీ ద్వారా 450 ఛానళ్లను, జియో మ్యూజిక్ ద్వారా అనేక పాటలను వినవచ్చు. జియో ఎల్‌టీఈ టారిఫ్ ప్లాన్ ద్వారా వీడియోకాల్స్ చేసుకోవచ్చని రిలయన్స్ జియో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. 4 జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో లభించే ఈఫోన్‌లో మెమొరీని 128 జీబీ వరకు పెంచుకోవచ్చు.

మానవుడి శరీరంలోనే మూత్రపిండాల కణజాలాన్ని అభివృద్ధి చేయగల నూతన పద్ధతిని శాస్త్రవేత్తలు విజయవంతంగా కనుగొన్నారు. అలాగే ఈ కణజాలానికి మూత్రాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యం కూడా ఉందని పేర్కొన్నారు.



జమ్మూలో సైనిక శిబిరంపై ఉగ్రదాడి

- ఇద్దరు ఆర్మీ సిబ్బంది మృతి, 9 మందికి గాయాలు
- ఎదురుకాల్పుల్లో ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం
- అర్ధరాత్రి దాటాక కొనసాగిన ఆర్మీ ఆపరేషన్

సంజువాన్: జమ్మూ కశ్మీర్‌లో జైషే మహమ్మద్ ఉగ్రవాదులు రెచ్చిపోయారు. జమ్మూ నగరం శివారు ప్రాంతం సంజువాన్‌లో ఉన్న ఆర్మీ శిబిరంపై శనివారం తెల్లవారుజామున దాడికి తెగబడడంతో ఇద్దరు ఆర్మీ సిబ్బంది మరణించగా.. 9 మంది గాయపడ్డారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు గ్రనేడ్లు విసరడంతో పాటు విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూ ఆర్మీ కుటుంబాలు నివసిస్తున్న వసతి గృహ సముదాయంపై దాడికి యత్నించారు. వెంటనే తేరుకున్న ఆర్మీ సిబ్బంది ఉగ్రదాడిని దీటుగా తిప్పికొట్టారు. ఉగ్రవాదుల్ని ఎటూ కదలకుండా నిరోధించిన భద్రతా బలగాలు.. శిబిరం నుంచి అందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించిన అనంతరం సాయంత్రం సమయంలో ముగ్గురు ఉగ్రవాదుల్ని హతమార్చాయి. ఆర్మీ ఆపరేషన్ అర్ధరాత్రి దాటాక కూడా కొనసాగడంతో దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులంతా హతమయ్యారా? లేదా? అన్న విషయం తెలియాల్సి ఉంది. ఉగ్రదాడిలో జమ్మూ కశ్మీర్‌కు చెందిన సుబేదార్ మదన్‌లాల్ చౌదరి, హవిల్దార్ హబీముల్లా ఖురేషీ ప్రాణాలు కోల్పోయారని ఆర్మీ అధికారి వెల్లడించారు. ఐదుగురు మహిళలు, చిన్నారులు సహా తొమ్మిది మంది గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంద న్నారు. గాయపడ్డవారిలో హవిల్దార్ అబ్దుల్ హమీద్, లాన్స్ నాయక్ బహదూర్ సింగ్‌తో పాటు స్కూలు సెలవుల్లో తండ్రిని చూసేందుకు వచ్చిన సుబేదార్ మదన్‌లాల్ కుమార్తె కూడా ఉన్నారు. జమ్మూకు చెందిన ఆర్మీ పీఆర్వో లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ దాడి వివరాల్ని వెల్లడిస్తూ 'శనివారం తెల్లవారుజామున శిబిరానికి వెనుకవైపు కాపలాగా ఉన్న సెంట్రీ బంకర్‌పై కాల్పులు జరిపిన ఉగ్రవాదులు.. అనంతరం ఆర్మీ కుటుంబాలు నివసిస్తున్న వసతి గృహ సముదాయంలోకి చొరబడ్డారు. ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదుల్ని ఆర్మీ హతమార్చింది. ఉగ్రవాదుల వద్ద దొరికిన వస్తువుల మేరకు వారిని జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థకు చెందిన వారుగా గుర్తించాం' అని తెలిపారు. ఉగ్రదాడి జరిగిన వెంటనే మెరుపు బృందాలు రంగ ప్రవేశం చేసి ఇళ్లలో దాక్కున్న ఉగ్రవాదుల్ని ఎటూ కదలకుండా నిరోధించాయని, సైనిక కుటుంబాల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే క్రమంలో ఇద్దరు ఆర్మీ సిబ్బంది మృతి చెందారని ఆయన వెల్లడించారు. గతంలో 2016 నవంబర్‌లో నగ్రోటాలోని ఆర్మీ శిబిరంపై ఆత్మాహుతి బృందం దాడి చేయడంతో ఏడుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.


ఖురేషీ (ఫైల్)


మదన్‌లాల్ (ఫైల్)



దాడి జరిగిన సంజువాన్ సైనిక శిబిరం వద్ద అప్రమత్తమైన జవాన్లు

ఆచితూచి ఆపరేషన్

గృహ సముదాయంలో మహిళలు, చిన్నారులు ఉండడంతో ఉగ్రవాదుల్ని మట్టుబెట్టే ఆపరేషన్‌ను ఆర్మీ జాగ్రత్తగా కొనసాగించింది. ఉగ్రవాదులు ఎక్కడ నక్కారో తెలుసుకునేందుకు ఆర్మీ హెలికాప్టర్లు, డ్రోన్‌లను వాడింది. బుల్లెట్ ప్రూఫ్ వెహికల్స్‌లో ప్రత్యేక బలగాలు వెనుకవైపు నుంచి శిబిరంలోకి చేరుకుని ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. శిబిరం సరిహద్దు గోడ వెలుపల సీఆర్‌పీఎఫ్, పోలీసుల్ని మోహరించారు. అలాగే ఐదు కిలోమీటర్ల పరిధిలోని స్కూళ్లను అధికారులు మూసివేశారు. జమ్మూలో హై అలర్ట్ ప్రకటించడంతో పాటు భద్రతను కట్టుదిట్టం చేశారు. జమ్మూ ఐజీ ఎస్‌డీ సింగ్ ఉగ్రదాడిపై మాట్లాడుతూ.. 'దాడి గురించి తెలియగానే ఆర్మీ ప్రత్యేక బలగాలు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్(ఎస్‌ఓజీ) సిబ్బంది చేరుకుని.. శిబిరాన్ని చుట్టుముట్టాయి' అని తెలిపారు. ఉగ్రదాడిలో తీవ్రంగా గాయపడ్డ మేజర్‌ను హెలికాప్టర్‌లో ఉధమ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

విద్యాసాయంపై పరిమితి వద్దు

ఆర్థిక శాఖకు రక్షణ మంత్రి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: విధుల్లో వైకల్యం పొందిన, అమరులైన జవాన్ల పిల్లలకు ప్రతినెలా రూ.10,000 చొప్పున అందిస్తున్న విద్యాసాయంపై గరిష్ట పరిమితిని ఎత్తివేయాలని రక్షణ శాఖ ఆర్థికశాఖకు విజ్ఞప్తి చేసింది. ఈ జవాన్ల పిల్లలకు అందిస్తున్న విద్యా సాయం రూ.10 వేలు దాటరాదని గతేడాది జూలై 1న కేంద్రం ఉత్తర్వులిచ్చింది. 'జవాన్ల పిల్లలకు అందిస్తున్న విద్యాసాయంపై గరిష్ట పరిమితిని ఎత్తివేయాలని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక మంత్రిత్వశాఖకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నాం' అని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. విద్యాసాయంపై కేంద్రం గరిష్ట పరిమితిని విధించడంపై త్రివిధ దళాల్లో పెద్దఎత్తున అప్పట్లో అసంతృప్తి వ్యక్తమైంది. దీంతో ఆర్మీ, నేవీ, వాయుసేనకు చెందిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ(సీవోఎస్‌ఈ) ఈ పరిమితిని ఎత్తివేయాలని రక్షణశాఖకు లేఖ రాసింది. 1972లో తీసుకొచ్చిన పథకం కింద ప్రస్తుతం స్కూళ్లు, కళాశాలలు, ఇతర వృత్తివిద్యా సంస్థల్లో చదువుకునే జవాన్ల పిల్లలకు విద్యను పూర్తి ఉచితంగా అందిస్తున్నారు.

ఇది పురుషుల అసెంబ్లీ!

నాగాలాండ్‌లో ఇప్పటి దాకా ఎమ్మెల్యేగా ఎన్నికవని మహిళ

కోహిమా: దేశవ్యాప్తంగా చట్టసభల్లో మహిళా శక్తి వెల్లి విరుస్తుంటే, నాగాలాండ్ అసెంబ్లీ మాత్రం అందుకు విరుద్ధమైన రికార్డు సొంతం చేసుకుంది. ఇప్పటివరకు ఆ రాష్ట్ర శాసనసభలో మహిళా సభ్యురాలే అడుగుపెట్టకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. జాతీయ అక్షరాస్యత (65 శాతం) కంటే నాగాలాండ్‌లో స్త్రీల అక్షరాస్యత (76 శాతం) ఎక్కువ. 2016 గణాంకాల ప్రకారం... ప్రభుత్వ ఉద్యోగాల్లో 23.5 శాతం, ప్రైవేట్‌రంగంలో 49 శాతం మహిళలు పనిచేస్తున్నారు. 1963లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం 30 మంది మహిళలే పోటీ చేసినా అందులో ఒక్కరూ గెలుపొందలేదు. అయితే 1977 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం రానో ఎం షాజియా అనే మహిళ గెలుపొంది రాష్ట్రం నుంచి పార్లమెంట్‌కు వెళ్లిన ఏకైక మహిళగా నిలిచారు.

ఈసారి బరిలో అయిదుగురే...

ఈ నెల 27న నాగాలాండ్‌లో 60 శాసనసభా స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 227 మంది బరిలో నిలవగా వారిలో కేవలం అయిదుగురే మహిళా అభ్యర్థులున్నారు. బీజేపీ, ఆ పార్టీ మిత్రపక్షం నేషనల్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)ల నుంచి చెరో మహిళా అభ్యర్థిని పోటీ చేస్తున్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ఇద్దరిని బరిలో నిలపగా, స్వతంత్ర అభ్యర్థిగా మరొకరు పోటీచేస్తున్నారు. 2013 ఎన్నికల్లో ఇద్దరే మహిళలు పోటీ చేశారు. నాగాలాండ్‌లో గ్రామాభివృద్ధి బోర్డుల్లో మహిళలకు 25 శాతం రిజర్వేషన్లు ఉన్నా ముఖ్యమైన అంశాలపై వారు కీలకంగా వ్యవహరించ లేకపోతున్నారు. వారికి వారసత్వంగా ఆస్తులను పొందే హక్కు కూడా లేదు. రాష్ట్రంలో మహిళా రిజర్వేషన్ల సాధనకు 'నాగా మదర్స్ అసోసియేషన్' (ఎన్‌ఎంఏ) అనే మహిళా సంస్థ న్యాయపోరాటం చేస్తోంది. 2016లో ఈ సంస్థ పిటిషన్ పైనే స్పందించిన సుప్రీంకోర్టు 33 శాతం మహిళా రిజర్వేషన్లతో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పురుషుల ఆధిపత్యంలోని గిరిజన మండళ్ల వ్యతిరేకించడంతో పాటు ఆందోళనలు చెలరేగడంతో అది కార్యరూపం దాల్చలేదు. 'ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మేము ఆశించిన మార్పు వస్తుందని నమ్ముతున్నాం. కొందరే పోటీ చేస్తున్నా వారిలో కనీసం ఒకరు గెలుపొంది కొత్త మార్పునకు నాంది పలుకుతారని ఆశిస్తున్నాం' అని ఎన్‌ఎంఏ అధ్యక్షురాలు అబేయు మేరు చెప్పారు.




అమెరికాలో మిచిగాన్ రాష్ట్రంలోని గాలెస్‌బర్గ్ సమీపంలో శుక్రవారం పూర్తిగా మంచు కప్పేసిన రహదారిపై ఒకదానితో మరొకటి ఢీకొని ప్రమాదానికి గురైన వాహనాలు.

'రాఫెల్' అవినీతిపై మోదీ బదులేది?

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

సాక్షి, బళ్లారి: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ప్రధాని మోదీపై ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ విమర్శలను తీవ్రం చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద అవినీతి కుంభకోణమనీ, ఎంతో అనుభవమున్న ప్రభుత్వ రంగ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)ను రాఫెల్ కాంట్రాక్టు నుంచి తప్పించి తన సన్నిహితుడికి ఎందుకు అప్పగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలోని బళ్లారి జిల్లా హొసపేటలో జరిగిన ఎన్నికల 'జనాశీర్వాద్ యాత్ర'లో రాహుల్ మాట్లాడారు. 'రాఫెల్' వ్యవహారంపై తాను సంధించిన 3 ప్రశ్నలకు మోదీ జవాబివ్వలేకపోయారన్నారు. వెనుక నుంచి వచ్చే వాహనాలను అద్దంలో గమనిస్తూ నడిపే వాహనదారు మాదిరిగా.. ప్రధాని మోదీ గత కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలను విమర్శిస్తూ నోట్ల రద్దు, జీఎస్టీ వంటి తప్పిదాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వెనుక వాటిని చూస్తూ వాహనాన్ని ముందుకు నడిపితే ప్రమాదాలు తప్పవని వ్యాఖ్యానించారు. ముందు చూపుతో ప్రభుత్వాన్ని నడుపుతున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్యను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. మోదీ ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలతో నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. కాగా, బళ్లారి, కొప్పాల్, రాయిచూర్, కలబురిగి, బీదర్ జిల్లాల్లో నాలుగు రోజుల ఎన్నికల ప్రచారంలో రాహుల్ బస్సులో ప్రయాణిస్తూ సభలు, ర్యాలీల ద్వారా ప్రజలను కలుసుకుంటున్నారు. కాగా, యూపీఏ హయాంలో 126 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందమే కుదరలేదని రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు చెప్పాయి.


హొసపేటలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న రాహుల్

కృష్ణుడిగా రాహుల్.. ద్రౌపదిగా రేణుక

లక్నో: కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరిని మహాభారతంలోని ద్రౌపదిగా, రాహుల్ గాంధీని కృష్ణుడిగా, ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, హోం శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజులను కౌరవులుగా చూపుతూ...ద్రౌపది వస్త్రాపహరణం ఘట్టానికి సంబంధించిన పోస్టర్లు ఉత్తరప్రదేశ్‌లో వెలిశాయి. రాజ్యసభలో బుధవారం మోదీ మాట్లాడుతుండగా రేణుకా చౌదరి గట్టిగా నవ్వడంతో ఆమెను రామాయణంలోని ఓ పాత్రతో మోదీ పోల్చడం తెలిసిందే. అందుకు దీటుగానే తాజాగా అలహాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు హసీబ్ అహ్మద్ ఈ పోస్టర్‌ను తయారుచేయించారు. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీని ఈ పోస్టర్‌లో కౌరవ రాజైన కళ్లు లేని ధృతరాష్ట్రునిగా చూపారు. ఈ పోస్టర్‌పై 'ఓ స్త్రీ నవ్వు దుర్యోధనుడి అహాన్ని దెబ్బతీసింది. వంద మంది కౌరవుల చావుకు కారణమైంది' అని రాశారు. ఓ వైపు భేటీ బచావో భేటీ పఢావో అంటున్న మోదీ మరోవైపు మహిళా ఎంపీ నవ్వును రామాయణ పాత్రతో పోల్చి అవమానించారనీ, అందుకు ఆయన క్షమాపణ చెప్పాలని అహ్మద్ డిమాండ్ చేశారు.


ఉత్తరప్రదేశ్‌లో వెలిసిన పోస్టర్

మా దేశానికి రండి.. మూన్‌కు కిమ్ ఆహ్వానం

గ్యాంగ్నెయుంగ్: దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌ను తమ దేశంలో పర్యటించాల్సిందిగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఆహ్వానించారు. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో జరగబోయే సదస్సుకు హాజరు కావాలని మూన్‌ను కోరారు. ఉత్తర కొరియా విదేశాంగ మంత్రితో కలసి కిమ్ సోదరి యో జోంగ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా కిమ్ పంపిన ఆహ్వాన లేఖను మూన్‌కు అందించారు. సదస్సుకు వెళ్తారా లేదా అనే దానిపై మూన్ స్పందించలేదు. అయితే గతేడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్, కిమ్‌లు వ్యక్తిగత దూషణలకు సైతం దిగడం తెల్సిందే. ఈ నేపథ్యంలో అమెరికాకు మిత్రదేశమైన దక్షిణ కొరియా అధ్యక్షుడు ఉ.కొరియాకు వెళ్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ వెళితే మూన్ ట్రంప్ ఆగ్రహానికి గురికావాల్సి రావొచ్చని పలువురు విశ్లేషిస్తున్నారు.

రూ.10 కోసం కొట్టి చంపాడు..!

ముంబై: కేవలం రూ.10 అడిగినందుకు ఓ వ్యక్తిని స్నేహితుడే కొట్టిచంపిన ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. పోవైలోని సాయి బన్‌గుర్దా గ్రామానికి చెందిన స్నేహితులు జీవన్ మోరే(35), దినేశ్ లక్ష్మణ్ బుధవారం ఓ షాపులో మద్యం సేవించారు. అనంతరం లక్ష్మణ్ ఓ హోటల్ నుంచి ఇద్దరికీ ఆహార పదార్థాలను తీసుకొచ్చాడు. ఆహారం ఖర్చులో కొంత భరించాలనీ, రూ.10 చెల్లించాలని లక్ష్మణ్ మోరేను కోరాడు. ఇద్దరిమధ్య మాటామాటా పెరగటంతో ఆగ్రహానికి లోనైన మోరే..ఓ కర్రతో లక్ష్మణ్‌పై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మణ్‌ను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఐపీసీ సెక్షన్ 302(హత్య) కింద నిందితుడిపై కేసు నమోదుచేసిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

'ఆధార్' లేదని సేవలు నిరాకరించొద్దు

న్యూఢిల్లీ: ఆధార్ లేదనే సాకుతో పౌరులకు అత్యవసర సేవలు నిరాకరించవద్దని భారతీయ విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ప్రభుత్వాలను కోరింది. ఈ మేరకు వివిధ ప్రభుత్వ, పరిపాలనా విభాగాలకు లేఖలు రాసింది. అత్యవసర వైద్యం, పాఠశాలల్లో ప్రవేశం, నిరుపేదలకు రేషన్ సరుకుల పంపిణీ వంటి వాటిని తిరస్కరించవద్దని అధికారులకు సూచించింది. ఆధార్ లేని కారణంగా ప్రభుత్వ పరంగా అందించే ఎటువంటి లబ్ధినైనా నిరాకరించటానికి వీల్లేదంది. వైద్య సాయం, చికిత్స వంటి అత్యవసర సందర్భాల్లో కూడా ఆధార్ లేదని సేవలు నిరాకరిస్తున్నారంటూ వార్తలు రావటంపై తీవ్రంగా స్పందించింది. ఇవే నిజమైతే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామంది. అన్ని సేవలను పొందే హక్కు పౌరులకుందనీ, ఎవరైనా నిరాకరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కోరింది.


యూఏఈలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు గౌరవ సూచకంగా దుబాయ్‌లోని ప్రతిష్టాత్మక బుర్జ్ ఖలీఫా భవంతి ఇలా త్రివర్ణ శోభితమైంది. శనివారం రాత్రి 7.15 నుంచి 11.15 వరకు ప్రతి గంటకోసారి ఈ భవనం మువ్వన్నెల వెలుగుల్లో కనబడినట్లు ఖలీజ్ టైమ్స్ పేర్కొంది.

రైల్వే ఉద్యోగులకు ప్రోత్సాహకాలు



న్యూఢిల్లీ: ఉద్యోగుల్లో మనోధైర్యం, ఉత్సాహం పెంచడానికి ప్రత్యేక రివార్డులు, ప్రోత్సాహకాలు, బోనస్‌లు ఇవ్వాలని రైల్వే శాఖ యోచిస్తోంది. ఉత్తమ పనితీరు కనబరిచే వారికి మెరుగైన రివార్డులు ఇచ్చేలా పదోన్నతుల ప్రాతిపదికల్లో మార్పులు చేయాలని భావిస్తోంది. నిపుణుల కమిటీ పలు సిఫార్సులతో సమర్పించిన నివేదిక రైల్వే బోర్డుకు చేరింది. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు వార్షిక పనితీరు మదింపు నివేదికలకు బదులు చివరి ఏడేళ్లలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఐదేళ్లను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. సిబ్బంది తల్లిదండ్రులకూ వైద్య, ఉచిత ప్రయాణ సదుపాయాలు కల్పించాలంది. ఉన్నత విద్య కొనసాగించే ఉద్యోగులకు ఆర్థిక సాయం, దిగువ స్థాయి సిబ్బందికే కాకుండా ఏ, బీ గ్రేడ్ ఉద్యోగులకు బోనస్‌లు ఇవ్వాలని పేర్కొంది. కాగా, రైల్వేల్లో నిర్వహణ సమయంలో పాటిస్తున్న ప్రమాదకరమైన పద్ధతుల గురించి తెలియజేయాలని ఉద్యోగులందరికీ రైల్వే బోర్డు చైర్మన్ లేఖ రాశారు.

ఆధ్యాత్మికతకు భారత్ రాజధాని

మైసూరు (శ్రావణ బెళగొళ): ప్రాచీన సంప్రదాయాలతో భారతదేశం విరాజిల్లుతోందనీ, ప్రపంచంలో ఆధ్యాత్మికతకు భారత్ రాజధాని అని ఉపరాష్ట్రపతి వెంకయ్య వ్యాఖ్యానించారు. శ్రావణ బెళగొళలో గోమతేశ్వరుని మహామస్తకాభిషేకాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. చావుండరాయ వేదికపై కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికంగా, ధార్మికంగా ఘనచరిత్ర కలిగిన కర్ణాటకలో జరుగుతున్న బాహుబలి మహామస్తకాభిషేకాల్లో పాల్గొనడం తనకు జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమన్నారు. మన ఆచార, వ్యవహారాలను చూసి ఎవ్వరూ సిగ్గుపడనక్కర లేదన్నారు. మన పూర్వీకులు, గురువుల నుంచి నేర్చుకున్న సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందజేయాలన్నారు.


మహామస్తకాభిషేకంలో పాల్గొన్న వెంకయ్య

ఆర్మీ స్థావరాలకు 1,487 కోట్లు

న్యూఢిల్లీ: కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలతో పాటు దేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న ఆర్మీ స్థావరాల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేసేందుకు రక్షణశాఖ రూ.1,487 కోట్లను మంజూరుచేసింది. ఈ ప్రాజెక్టును 10 నెలల్లోగా పూర్తిచేయాలని రక్షణ మంత్రి సీతారామన్ ఆదేశించినట్లు అధికారిక వర్గాలు చెప్పాయి. కశ్మీర్‌లో నియంత్రణ రేఖ, కొన్ని చోట్ల ఆర్మీ స్థావరాలపై ఉగ్రదాడులు పెరిగిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత భద్రతను కట్టుదిట్టం చేయడానికి లెఫ్టినెంట్ జనరల్ ఫిలిప్ కాంపోస్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఆడిట్ కమిటీ పలు సిఫార్సులు చేసింది. వీటి ఆధారంగా భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేసేందుకు వీలుగా ప్రామాణిక నిర్వహణ విధానాలను(ఎస్‌వోపీ) త్రివిధ దళాలకు అందజేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించి భద్రతను కట్టుదిట్టం చేయాల్సిన 600 అత్యంత సున్నితమైన, 3 వేల సున్నితమైన స్థావరాలను గుర్తించినట్లు వెల్లడించాయి.

అంతా భారత్ చేతుల్లోనే!

- ఇజ్రాయెల్‌తో శాంతిప్రక్రియపై పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్
- పాలస్తీనా అభివృద్ధికి మేం తోడుంటాం: ప్రధాని మోదీ

రమల్లా: ఇజ్రాయెల్‌తో శాంతి ప్రక్రియలో భారత్ కీలక భూమిక వహించాలని పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్.. భారత ప్రధాని మోదీని కోరారు. శాంతి నెలకొల్పే అంశంలో వివిధ దేశాలతో చర్చించి ఒప్పించాల్సిన బాధ్యతను మోదీ భుజస్కంధాలపై పెట్టారు. అంతకుముందు, మోదీకి (పాలస్తీనా అధికార పర్యటనకు వచ్చిన తొలి భారత ప్రధాని) రమల్లాలో ఘన స్వాగతం లభించింది. అనంతరం ఇరుదేశాధినేతలు ద్వైపాక్షిక అంశాలు, పాలస్తీనా–ఇజ్రాయెల్ శాంతి ఒప్పందాలపై చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం దిశగా ఆరు ఒప్పందాలపై ఇరుదేశాల అధికారులు సంతకాలు చేశారు. పాలస్తీనా సామర్థ్య నిర్మాణం కోసం భారత్ దాదాపు 50 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.321 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు మోదీ తెలిపారు. తర్వాత ఇద్దరు నేతలు సంయుక్త మీడియా ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత్ ప్రభావం కారణంగానే ఈ శాంతిప్రక్రియలో కీలకంగా వ్యవహరించాలని కోరామని అబ్బాస్ వెల్లడించారు.


పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో మోదీ కరచాలనం

పాలస్తీనాకు అండగా ఉంటాం

పాలస్తీనా ప్రభుత్వం, ప్రజల ప్రయోజనాలను కాపాడే విషయంలో భారత్ చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని మోదీ అన్నారు. 'భారత్, పాలస్తీనాల మధ్య స్నేహం పురాతనమైనది. పాలస్తీనా అభివృద్ధి ప్రయాణంలో భారత్ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుంది. చర్చల ప్రక్రియ ద్వారా పాలస్తీనా త్వరలోనే స్వతంత్ర, సార్వభౌమ దేశంగా నిలవనుంది' అని మోదీ అన్నారు. పాలస్తీనాలో శాంతి, స్థిరత్వం నెలకొల్పే ప్రక్రియలో భారత్ మద్దతుంటుందని.. అయితే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చర్చల ద్వారానే సాధ్యమని మోదీ తెలిపారు. దౌత్యం, దూరదృష్టి మాత్రమే హింసకు అడ్డుకట్ట వేయగలవన్నారు. 'ఇదేమీ అంత సులభమైన విషయం కాదు. కానీ మేం ఈ దిశగా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తాం' అని ప్రధాని పేర్కొన్నారు.

యూఏఈతో ఐదు ఒప్పందాలు

పాలస్తీనాలో శాంతి నెలకొల్పేందుకు భారత నాయకత్వం మొదట్నుంచీ అండగా నిలుస్తోందని అబ్బాస్ పేర్కొన్నారు. ప్రధాని మోదీతో నిర్మాణాత్మక, ఫలప్రదమైన చర్చలు జరిగాయని ఆయన తెలిపారు. పాలస్తీనాతోపాటు పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొంటున్న పరిస్థితులను మోదీకి వివరించామన్నారు. అయితే.. తూర్పు జెరూసలేంను పాలస్తీనా రాజధానిగా అంగీకరించాల్సిందేనని అబ్బాస్ పేర్కొన్నారు. జోర్డాన్ నుంచి యూఏఈ చేరుకున్న ప్రధాని మోదీకి అబుధాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ ఘనస్వాగతం పలికారు. అనంతరం వీరిద్దరూ సమావేశమై.. విస్తృతాంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య ఐదు కీలక ఒప్పందాలు జరిగాయి. ఇందులో భారత ఆయిల్ కంపెనీల కన్సార్షియానికి 10% రాయితీ కల్పించే చారిత్రక ఒప్పందం కూడా ఉంది. ఇది 2018 నుంచి 2057వరకు 40 ఏళ్లపాటు అమల్లో ఉంటుంది. ఈ ఒప్పందంతో గల్ఫ్ దేశాల్లోని భారత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

మోదీకి అరుదైన గౌరవం




పాలస్తీనా పర్యటన సందర్భంగా మోదీకి ఆ దేశం అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. పాలస్తీనా విదేశీ అతిథులకు ఇచ్చే అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా'తో సత్కరించింది. అంతకుముందు జోర్డాన్ రాజధాని అమ్మన్ నుంచి రమల్లా వరకు మోదీ హెలికాప్టర్‌కు ఇజ్రాయెల్ హెలికాప్టర్లు రక్షణగా వచ్చాయి. హెలికాప్టర్ దిగగానే.. పాలస్తీనా ప్రధాని హమ్‌దల్లా స్వాగతం పలికారు. అనంతరం అధ్యక్ష భవనం (మఖాటా)లో ఏర్పాటుచేసిన స్వాగత కార్యక్రమానికి అబ్బాస్ ఆలింగనంతో ఆహ్వానించారు. రమల్లాలోని యాసర్ అరాఫత్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు.

సాక్షి రౌండప్

విజయవాడ

ఆదివారం । ఫిబ్రవరి । 11 । 2018

www.sakshi.com



బామ్మే.. అమ్మే..



చైనాకు చెందిన 76 ఏళ్ల షి యుయింగ్ తన మనవడ్ని చదివించడం కోసం పడరాని పాట్లు పడుతోంది. అంగవైకల్యం గల 9 ఏళ్ల తన మనవడు జియంగ్ హోవెన్ చదువు కోసం ప్రతి రోజు 24 కిలోమీటర్లు నడుస్తూ.. అందులో సగం దూరం జియంగ్‌ని వీల్‌చైర్‌పై తోసుకుంటూ గ్వాంగ్సి ప్రోవిన్స్‌లోని స్కూల్‌కు తీసుకెళ్తోంది. నాలుగేళ్లుగా స్కూల్‌కి తీసుకెళ్లటం.. ఇంటికి తీసుకురావడం చేస్తోంది. జియంగ్ పుట్టిన రెండేళ్లకే మెదడులో ఏర్పడిన సమస్యతో అతడి కాళ్లు చచ్చుబడి పోయాయి. ఇది జరిగిన కొన్నాళ్లకే జియంగ్ తల్లి.. భర్తకు విడాకులిచ్చింది. ఆ తర్వాతైనా తన కొడుకుని చూసుకునే ప్రయత్నం చేయకపోగా ఒకటికి రెండు పెళ్లిళ్లు చేసుకొని తన దారి తాను చూసుకుంది. జియంగ్ తండ్రి కుటుంబ పోషణ కోసం వేరే దేశానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో జియంగ్ బాధ్యత బామ్మ యుయింగ్‌పై పడింది. తన కొడుకు పంపే డబ్బులతో జియంగ్ బాగోగులు చూసుకుంటూ కాలం వెళ్లదీస్తోంది. జియంగ్ బాధ్యతను భారంగా ఫీలవుతున్నారా అని యుయింగ్‌ను ప్రశ్నించగా.. తన ఒంట్లో సత్తువ ఉన్నంత వరకూ మనవడిని కాపాడుకుంటానంటూ నవ్వుతూ బదులిస్తోంది. ఎంతైనా బామ్మ కూడా ఓ అమ్మేగా..

అంతరిక్షంలోకి కారును పంపిన స్పేస్ ఎక్స్ (స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ టెక్నాలజీస్) సంస్థను టెస్లా ఇన్ కార్పొరేషన్ సీఈవో ఎలాన్ మస్క్ 2002లో స్థాపించాడు.



మామిడి పూయదేమి?



ఫిబ్రవరి వచ్చినా తోటల్లో కనిపించని మామిడి పూత

- ఉష్ణోగ్రతల్లో మార్పులతో ఆలస్యం
- కాయ సైజు, దిగుబడి తగ్గే ప్రమాదం
- గడువు మించిపోతోందని రైతుల ఆందోళన
- ఈ ఏడాది తీవ్రంగా నష్టపోతామని ఆవేదన
- ఆందోళన అక్కర్లేదంటున్న అధికారులు
- ఉద్యాన శాఖ సలహాలు పాటించాలని సూచన

సాక్షి, అమరావతి: శివరాత్రికి శివలింగాలంత మామిడి పిందెలుంటాయన్నది నానుడి. మరికొద్ది రోజుల్లో శివరాత్రి వస్తున్నా ఇంతవరకు మామిడి తోటల్లో పూతే కనిపించడం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వేలకు వేలు ఖర్చు పెట్టి తోటల్ని సిద్ధం చేస్తే ఇంతవరకు పూత రాలేదని, మరో వారంలోగా పూత రాకుంటే తమ పరిస్థితి అధ్వానంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. దేశం మొత్తం మీద మామిడిని అత్యధికంగా పండించే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రెండోది. రాష్ట్రంలో ప్రస్తుతం 3,36,956 హెక్టార్లలో సాగవుతోంది. ఈ ఏడాది 40,43,472 మెట్రిక్ టన్నుల దిగబడి ఉంటుందన్నది అంచనా. దేశంలోని మామిడి ఉత్పత్తిలో దాదాపు 24 శాతం ఒక్క ఏపీ నుంచే వస్తోంది. బంగినపల్లి, రసాలు, నీలాలు వంటి వాటితో సహా దాదాపు 20 రకాలకు పైగా మామిడి పండ్లను రాష్ట్రంలో సాగు చేస్తున్నారు. మామిడి పంటకు ఉష్ణమండల వాతావరణం అనువైనది. మామిడి పూత వచ్చే కాలంలో వర్షాలు, ఎక్కువ తేమ, మబ్బులు పట్టే వాతావరణం ఉండకూడదు. అలా ఉంటే ఫలదీకరణ సరిగ్గా జరగక దిగుబడి ఉండదు.

తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు

మామిడి పూత సాధారణంగా జనవరిలో వస్తుంది. కానీ ఫిబ్రవరి రెండో వారం వస్తున్నా పూత కానరావడంలేదు. ప్రస్తుతం రాత్రి ఉష్ణోగ్రతలు 13, 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మామిడి పూత బాగా రావాలంటే 17, 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండాలి. చిత్తూరు, వై?ఎస్సార్ జిల్లాల్లో ఇప్పుడిప్పుడే పూత మొదలైందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఆలస్యంగా పూతవస్తే కాయ దిగుబడి, సైజు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో పూత వచ్చినా పెద్దగా ఉపయోగం ఉండదని, మార్చి నెలలో చెట్లకు కొత్త చిగురులు వస్తాయని, అవి వస్తే దిగుబడి ఉండదని వివరించారు. తోట వేసిన తర్వాత ప్రతి ఏటా ఎకరానికి రూ. 55 నుంచి రూ. 60 వేల వరకు రైతు ఖర్చు చేస్తామని, మంచి కాపు వస్తే పది టన్నుల వరకు దిగుబడి ఉంటుందన్నారు.

పూత రావడానికి ఇలా చేయవచ్చు..

పూత రావడానికి సల్ఫర్‌ను పిచికారీ చేయాలని, అయినా రాకుంటే చెట్లపై పల్చటి తడి (నీరు) ఇవ్వడం మంచిదని ఉద్యాన శాఖాధికారులు తెలిపారు. ఆ తర్వాత మల్టీకె 6,7 గ్రాములను ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేస్తే పూల గుత్తులు విచ్చుకుంటాయని చెప్పారు. వచ్చిన పూతను కాపాడుకోవడానికి, మంచుతేనే వంటి తెగుళ్ల నివారణకు శాస్త్రవేత్తలు సూచించినట్టు మూడుసార్లు క్రిమిసంహారక మందుల్ని పిచికారీ చేయాలన్నారు.

కష్టాలు తప్పేలా లేవు- నాగరాజు కూకట్ల, తురిమెళ్ల, నెల్లూరు జిల్లా

ఈ ఏడాది 12 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. ఇంతవరకు పూత రాలేదు. ఇప్పటికే ఒకసారి సల్ఫర్ కొట్టా. అయినా ఫలితం కనిపించలేదు. శివరాత్రి తర్వాత పూత వచ్చినా ఉపయోగం ఉండదు. ఇప్పటికే ఎకరానికి రూ. 35 వేలు ఖర్చు పెట్టాను. పూత రాకపోతే కనీస పెట్టుబడులు రావు. ప్రస్తుత పరిస్థితి చూస్తా ఉంటే మాకు ఈ ఏడాది కష్టాలు తప్పేలా లేవు

ఆందోళన వద్దు- పావులూరి హనుమంతరావు, ఉద్యాన శాఖ (పండ్లు) డిప్యూటీ డైరెక్టర్

వాతావరణ పరిస్థితుల్లో మార్పు వల్ల మామిడి పూత ఆలస్యమైంది. కొన్ని జిల్లాల్లో పూత వస్తున్నట్టు సమాచారం ఉంది. ఉద్యాన శాఖ సూచించినట్టుగా మందుల్ని పిచికారి చేయాలి. ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తున్నాయి. పూత వస్తుందన్న భరోసా ఉంది. రైతులు ఆందోళన పడాల్సిన పని లేదు. రైతులు సలహాల కోసం సమీపంలోని ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించవచ్చు.

ఉద్యాన శాఖ లెక్కల ప్రకారం వివిధ జిల్లాలలో మామిడి సాగు వివరాలు

జిల్లా	హెక్టార్లు
శ్రీకాకుళం	10,215
విజయనగరం	43,467
విశాఖపట్నం	16,790
తూర్పు గోదావరి	15,864
పశ్చిమ గోదావరి	6,499
కృష్ణ	60,580
గుంటూరు	984
ప్రకాశం	8,458
నెల్లూరు	10,520
చిత్తూరు	77,637
వైఎస్సార్	27,500
అనంతపురం	49,430
కర్నూలు	9,012
మొత్తం	3,36,956

జాతీయస్థాయి నాస్తిక మేళా ప్రారంభం

నిడమర్రు (మంగళగిరి టౌన్): మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో 26వ జాతీయ నాస్తిక మేళా శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ మేళాను సీపీఐ సీనియర్ నాయకుడు ఈడ్పుగంటి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత దేశ చరిత్ర.. భిన్న వర్గాలు, జాతులు, సంస్కృతుల సమ్మేళనమని, అందుకు భిన్నంగా అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్, మనువాద శక్తులు చరిత్రను వక్రీకరిస్తున్నాయన్నారు. ఈ నాస్తిక మేళాకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 600 మంది నాస్తికులు, హేతువాదులు హాజరయ్యారు. సదస్సులో వివిధ అంశాలపై ప్రముఖులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాస్తిక సమాజ అధ్యక్షుడు కె.అయ్యన్న, కార్యదర్శి బి. సుధాకర్, మోతుకూరి అరుణకుమార్, ఎస్కే జిలానీబేగం, కె.సత్యనారాయణ, జీడీ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టును సందర్శించిన నేపాల్ బృందం

విశాఖలో నేపాల్ కార్యనిర్వహక కార్యాలయం ఏర్పాటుపై చర్చ



నేపాల్ అధికార ప్రతినిధులతో సమావేశమైన పోర్టు చైర్మన్ ఎం.టి.కృష్ణబాబు

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ): నేపాల్ అధికారిక బృందం శనివారం విశాఖ పోర్టును సందర్శించింది. ఈ బృందంలో ఆ దేశ వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి చంద్రకుమార్ గిమైర్, సంయుక్త కార్యదర్శి రబిశంకర్ సంజు, కస్టమ్స్ డైరెక్టర్ జనరల్ జగదీష్ రెగ్మి, నేపాల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజేష్‌కజి శ్రేష్ట ఉన్నారు. వీరికి పోర్టు చైర్మన్ ఎం.టి.కృష్ణబాబు స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ సమావేశ మందిరంలో విశాఖ పోర్టులో ఉన్న మౌలిక సదుపాయాలతో పాటు కంటెయినర్ల ద్వారా చేస్తున్న ఎగుమతి, దిగుమతులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పీఓఎస్ అండ్ పీసీఎస్ ఈ ఆఫీస్ విధానంతో కంటెనర్ల ద్వారా నేపాల్‌తో ఎగుమతి, దిగుమతులకు విశాఖ పోర్టు అన్నివిధాలా అనుకూలమని వివరించారు. సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించారు.ఈ సందర్భంగా నేపాల్ వాణిజ్య శాఖ కార్యదర్శి చంద్రకుమార్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సహకారం ఉన్నపుడు వర్తక, వాణిజ్యాలు చురుగ్గా జరుగుతాయన్నారు.

ప్రైవేటు హాస్టల్లో భారీ అగ్ని ప్రమాదం

- సకాలంలో మేల్కోవడంతో సురక్షితంగా బయటపడ్డ యువతులు
- ప్రమాదంతో రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం
- విశాఖలో ఘటన



హాస్టల్‌లో కాలిబూడిదైన సామగ్రి

విశాఖ క్రైం: విశాఖలోని ఓ ప్రైవేట్ లేడీస్ హాస్టల్‌లో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. అయితే సకాలంలో నిద్ర మేల్కోవడంతో యువతులు సురక్షితంగా బయటపడ్డారు. ఆశీలమెట్ట వద్ద ఉన్న 'సేఫ్ హ్యాండ్స్' ప్రైవేట్ లేడీస్ హాస్టల్‌లో 37 మంది యువతులు ఉంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ షర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన యువతులు వెంటనే గదులు నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించక పోవడంతో గదుల్లో ఉన్న ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్లు, డబ్బులు, దుస్తులు అన్నీ కాలి బూడిదయ్యాయని విద్యార్థినులు వాపోయారు. హాస్టల్‌లో సరైన సౌకర్యాలు లేవని, హాస్టర్ నిర్వాహకురాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమ భవిష్యత్తుకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, డబ్బులు కాలిపోయాయని కన్నీటి పర్యంతమయ్యారు. హాస్టల్‌లో ఎలాంటి అగ్నిప్రమాద నిరోధకాలు లేవని చెప్పారు. కాగా, అగ్నిప్రమాదం వల్ల సుమారు రూ.20 లక్షలు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

ఒకరి మృతి.. గుంటూరు జిల్లాలో ఘటన



క్రోసూరు (పెదకూరపాడు): గుంటూరు జిల్లా క్రోసూరుకి చెందిన వృద్ధ దంపతులు శనివారం తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇరువురినీ గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. మృతుడి సోదరుడు క్రోసూరు వెంకటేశ్వర్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రోసూరు రత్తయ్య (95), అతని భార్య నరసమ్మల దత్త కుమారుడు శివ చాలా కాలం క్రితం చనిపోయాడు. దీంతో వృద్ధాప్యంలో బాగోగులు చూసుకునేవారులేక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించారు. వీరిలో రత్తయ్య మృతి చెందగా, నరసమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

వికటించిన డీపీటీ టీకా.. ఇద్దరు శిశువుల మృతి

మరో ఏడుగురికి తీవ్ర అస్వస్థత



మండ్య (కర్ణాటక): చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రంలో వేసిన డీపీటీ టీకా వికటించి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కర్ణాటక రాష్ట్రం మండ్య తాలూకాలోని చిన్నగిరిదొడ్డి అనే గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరగగా శనివారం వెలుగులోకి వచ్చింది. హోళలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు శుక్రవారం గ్రామానికి వచ్చి శిశువులకు టీకాలు వేశారు. అయితే కొద్దిసేపటికే తొమ్మిది మంది శిశువులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే వారిని మిమ్స్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ హేమావతి, రవి దంపతుల కుమారుడు భువన్ (రెండున్నర నెలలు), ప్రియా, రవి దంపతుల కుమారుడు ప్రీతమ్ (2 నెలలు) మృతిచెందారు. ఆస్పత్రి సిబ్బంది వారి మృతదేహాలను పోస్ట్‌మార్టంకు తీసుకొని వెళుతుండగా చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు అడ్డుకుని తమకు న్యాయం చేయాలని ధర్నాకు దిగారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐరాస యూత్ అసెంబ్లీకి ఇద్దరు రాష్ట్ర విద్యార్థులు

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్యసమితి ఈనెల 14 నుంచి 16 వరకు అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నిర్వహించే యూత్ అసెంబ్లీ–2018కి రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలోని మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సుకు చెందిన విద్యార్థులు చరణ్‌సాయి పాలా, అనిత నార్ణవరంలు ఈ ఐరాస యూత్ అసెంబ్లీకి హాజరుకానున్నారు. ఇన్నోవేషన్ అండ్ కొలాబరేషన్ ఫర్ సస్టయినబుల్ వరల్డ్ అనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన విద్య, ఇతర సాంకేతిక అంశాలలో వినూత్న ఆవిష్కరణల ద్వారా భావితరాలకు ఉపయోగపడే అంశాలపై ఈ అసెంబ్లీలో చర్చించనున్నారు. ప్రభుత్వ రంగం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పౌరసమాజ సంస్థలు, ఇలా దాదాపు 100కు పైగా సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారని ఆ కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేయి మంది యువతీ యువకులు ఈ అసెంబ్లీకి హాజరుకానున్నారు.

మార్చి 8న పార్లమెంటు ముట్టడి

రఘువీరారెడ్డి

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ మార్చి 8న పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు సమావేశాలు ముగిసే లోపు కేంద్రంపై ఒత్తిడి పెంచితే రాష్ట్రానికి న్యాయం జరిగే అవకాశం ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనలో భాగంగా ఈ నెల 15 వరకు మండల కేంద్రాల్లో ఆందోళనలు, 20 నుంచి 28 వరకు ఆంధ్రుల ఆత్మగౌరవం పేరుతో రెవెన్యూ డివిజినల్ కార్యాలయాల ఎదుట దీక్షలు, మార్చి 2న జాతీయ రహదారులను స్తంభించజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకుంటేనే ఆర్టీసీ మనుగడ

- ఏఎస్ఆర్టీయూ స్పష్టీకరణ
- ఆస్ట్రేలియాలో పర్యటించిన ఆర్టీసీ అధికారులు.. యాజమాన్యానికి నివేదిక



సాక్షి, అమరావతి: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ఆర్టీసీ) పరిస్థితి అప్పులు, నష్టాలతో నానాటికీ దిగజారుతోంది. ప్రస్తుతం సంస్థ రూ.4 వేల కోట్లకు పైగా నష్టాల్లో కొనసాగుతోంది. ప్రభుత్వం తక్షణమే ఆదుకోకపోతే సంస్థ మనుగడ సాధించడం కష్టమేనని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రజా రవాణా వ్యవస్థకు అక్కడి ప్రభుత్వాలు ఊతమిస్తున్నాయి. మోటార్ వాహన చట్టం పన్నుతోపాటు ఇంధనంపై వ్యాట్‌ను కూడా భరిస్తున్నాయి. నష్టాలు వస్తే బడ్జెట్‌లో కేటాయింపులు చేసి ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. కానీ, ఏపీలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఏపీఎస్ఆర్టీసీ మనుగడ ఇక రాష్ట్ర సర్కారు చేతుల్లోనే ఉందని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) తాజాగా తేల్చిచెప్పింది. ఏఎస్ఆర్టీయూ ఇటీవలే స్టడీ టూర్‌కు ఏపీఎస్ఆర్టీసీ అధికారులను ఎంపిక చేసింది. సంస్థ నుంచి ముగ్గురు సీనియర్ అధికారుల బృందం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లింది. అక్కడ ఐదు రోజులపాటు పర్యటించి రవాణా అంశాలపై అధ్యయనం చేసింది. ఆస్ట్రేలియాలో బ్రిస్బేన్, ఈగల్ ఫామ్ బస్ డిపో, న్యూ సౌత్ వేల్‌లోని బస్ డిపోలను సందర్శించింది.

అక్కడంతా ప్రభుత్వం చేతుల్లోనే...

ప్రజా రవాణా వ్యవస్థకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ఏకంగా 80 శాతం నిధులను రాయితీ రూపంలో అందిస్తోంది. అక్కడ ప్రజా రవాణా వ్యవస్థ మొత్తం ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది. బస్ డిపోల పర్యవేక్షణ, టికెట్ టెక్నాలజీ, ట్రాన్స్‌లింక్ మాత్రం డిపోల అధికారులు నిర్వహిస్తారు. లాభనష్టాలతో బస్ డిపోల అధికారులకు సంబంధం ఉండదు. ఆర్టీసీ అధికారులు ఆస్ట్రేలియాలో తమ అధ్యయనంలో వెల్లడైన అంశాలను నివేదిక రూపంలో యాజమాన్యానికి అందించారు.

ఏపీఎస్ఆర్టీసీపై చిన్నచూపు

ఏపీఎస్ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగానే నిధులు కేటాయిస్తోంది. రూ.1,000 కోట్లు ఇవ్వాలని కోరితే గత బడ్జెట్‌లో రూ.239 కోట్లే కేటాయించి చేతులు దులుపుకుంది. మోటార్ వాహన చట్టం పన్ను, డీజిల్‌పై వ్యాట్ శాతం తగ్గించాలని వినతులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్ని అధ్యయనలు చేసి నివేదికలిచ్చినా.. వాటిని బుట్టదాఖలు చేయడం తప్ప ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.

ఆధార్‌లో

అక్రమాలకు కళ్లెం..!

- కార్డుల జారీ, నమోదులో ప్రైవేటు పెత్తనానికి అడ్డుకట్ట
- సీఎస్‌సీ సేవలకు మంగళం పాడిన కేంద్ర ప్రభుత్వం
- అగ్రిమెంట్ పునరుద్ధరణకు నిరాకరణ
- ఆధార్ నమోదు, కార్డుల జారీలో అక్రమాల నేపథ్యంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఆధార్.. దేశంలోని ప్రతి పౌరునికీ భారత ప్రభుత్వం ఇస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్య. ఆధార్ కార్డుల జారీ ప్రక్రియలో ఇప్పటివరకూ కీలకంగా వ్యవహరిస్తున్న సీఎస్‌సీ–ఈ గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ సేవలకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. క్షేత్రస్థాయిలో పౌరుల నుంచి ఆధార్ నమోదు, వివరాల్లో మార్పుచేర్పులు తదితర బాధ్యతల్ని సీఎస్‌సీ నిర్వహిస్తూ వచ్చింది. అయితే వివరాల నమోదు, మార్పుచేర్పులు చేసే క్రమంలో సీఎస్‌సీ నిర్వాహకులు భారీగా అక్రమాలకు పాల్పడుతుండటం, ఆధార్ నిబంధనలకు విరుద్ధంగా వివరాల నమోదు ప్రక్రియను చేపడుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మూడు రోజుల క్రితం కమ్యునికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

కొన్ని కేంద్రాల్లో అక్రమాలు..

ఆధార్ కార్డుల జారీ ప్రక్రియలో వివరాల నమోదే కీలకం. ఈ బాధ్యతలు అక్కడక్కడా ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నప్పటికీ సరిపడా మానవ వనరులు లేక ప్రైవేటు సంస్థను కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. ఈ క్రమంలో సీఎస్‌సీ–ఈగవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో సదరు సంస్థ మండల కేంద్రాలు, టౌన్‌లు, మేజర్ గ్రామ పంచాయతీల పరిధిలో సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్స్) పేరిట కేంద్రాలను తెరిచింది. కొన్నిచోట్ల మీసేవా నిర్వాహకులకే ఈ బాధ్యతల్ని అప్పగించింది. అంతేకాకుండా ఆధార్ కిట్లు సైతం పంపిణీ చేయడంతో పౌరులకు కార్డుల జారీ సులభతరమైంది. ఈ నేపథ్యంలో కొన్ని కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు తెరలేపారు. వివరాల నమోదుకు భారీ మొత్తాన్ని వసూలు చేయడంతో పాటు సవరణల కోసం వచ్చే వారి నుంచి సైతం అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడ్డారు. మరికొన్ని చోట్ల ఏకంగా తప్పుడు వివరాలను సమర్పించి యంత్రాంగాన్నే తప్పుదోవ పట్టించారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

యథేచ్ఛగా వసూళ్ల దందా..

కొన్ని కేంద్రాల నిర్వాహకులు ఒక్కో వ్యక్తి నుంచి ఆధార్ నమోదుకు గరిష్టంగా రూ.2 వేల వరకు వసూలు చేశారు. వివరాల మార్పునకు రూ.వెయ్యి చొప్పున డిమాండ్ చేశారు. మొత్తంగా ఈ వ్యవహారాన్ని వసూళ్ల దందాగా మార్చేశారు. ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు చేపట్టిన అధికారులు పరిస్థితిని గమనించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ క్రమంలో ప్రైవేటు వ్యక్తుల ఆగడాలను కట్టడి చేయాలని భావించిన ప్రభుత్వం సీఎస్‌సీ సేవలకు మంగళం పాడింది. ఆగమేఘాల మీద తీసుకున్న ఈ నిర్ణయంతో అక్రమాలకు అడ్డుకట్ట పడినప్పటికీ పౌరులకు వెతలు మొదలవుతున్నాయి. నిన్నమొన్నటి వరకు ఆధార్ కేంద్రాలుగా ఉండటంతో అక్కడికి వెళ్లిన పౌరులకు చుక్కెదురవుతోంది. కొత్త కేంద్రాల చిరునామా కోసం సామాన్యులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.



'మీసేవ'లు ఉన్నప్పటికీ..

ఆధార్ కార్డుకు సంబంధించి వివరాల నమోదు, మార్పుచేర్పుల కోసం సమాచార సాంకేతిక శాఖ మండల స్థాయిలో కేంద్రాలకు అనుమతిచ్చింది. ఎంపిక చేసిన మీసేవ కేంద్రాల్లో ఈ సౌకర్యం ఉంది. కానీ ఆయా కేంద్రాల్లో ఉన్న సాంకేతిక పరికరాలు పాతవి కావడంతో.. చాలాచోట్ల నమోదు ప్రక్రియ నెమ్మదించింది. సీఎస్‌సీ కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు పరికరాల పంపిణీ, హార్డ్‌వేర్ వసతులు మెరుగ్గా ఉండటంతో అక్కడ నమోదు అధికంగా ఉండేది. సీఎస్‌సీ కేంద్రాల్లో నమోదు నిలిచిపోవడంతో తిరిగి మీసేవ కేంద్రాల్లో సంప్రదించాల్సి వస్తోంది. కొత్తగా ఆధార్ కార్డులు పొందే వారితో పాటు ఇప్పటికే కార్డులున్న పౌరులు ప్రతి ఐదేళ్లకోసారి వారి వేలిముద్రలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆధార్ నమోదు, మార్పుచేర్పులనేది నిరంతర ప్రక్రియ. ఆధార్ కేంద్రాలకు జనాల తాకిడి ఎప్పుడూ ఉండేదే. కానీ ఒక్కసారిగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆధార్ సౌకర్యం ఉన్న మీసేవ కేంద్రాలకు తాకిడి పెరుగుతోంది. అయితే అక్కడ వసతులు లేకపోవడంతో పౌరులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్కంఠగా సీఎస్ఐ బిషప్ ఎన్నికలు

- నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ ఎన్నికలు
- మొదటి స్థానంలో రెవరెండ్ జార్జి కొర్నేలియస్
- నాలుగో స్థానం కోసం రెండోసారి పోలింగ్



రెవరెండ్ జార్జి కొర్నేలియస్



రెవరెండ్ చిన్నం జాస్పర్



రెవరెండ్ డాక్టర్ ఆనందరావు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్‌ను నియమించేందుకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. విజయవాడ సూర్యారావుపేటలోని బసిలిక చర్చిలో జరిగిన ఈ ఎన్నికల్లో కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన పాస్టర్లు, చర్చి పాలక సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆరుగురు పోటీ చేయగా, వారిలో అత్యధికంగా ఓట్లు వచ్చిన నలుగురిని ఎంపికచేసి, చెన్నైలోని సీఎస్ఐ, సినాడ్ కార్యాలయానికి పంపుతారు. అక్కడ వీరిని ఇంటర్వ్యూ చేసి బిషప్‌ను ఎంపిక చేస్తారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఈ ఎన్నికలు జరిగాయి. మూడు జిల్లాల నుంచి మొత్తం 472 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 465 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలకు చైర్‌పర్సన్‌గా విశాఖపట్నానికి చెందిన విజయ్‌ప్రదాన్ వ్యవహరించగా, సినాడ్ ఎన్నికల పరిశీలకులుగా కేరళ నుంచి జార్జి జాకబ్ ఫిలిప్ హాజరయ్యారు.

మొదటి స్థానంలో కొర్నేలియస్

కాగా, తొలిరౌండ్ కౌంటింగ్‌లో వన్‌టౌన్‌లోని సెంటినరీ చర్చి గురువుగా ఉన్న రెవరెండ్ జార్జి కొర్నేలియస్ 355 ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. మచిలీపట్నంలోని సెయింట్ ఆండ్రూస్ కథెడ్రల్ చర్చి గురువుగా ఉన్న రెవరెండ్ జాస్పర్ 322 ఓట్లుతో రెండో స్థానంలో ఉండగా, బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణంలోని ఆల్ సెయింట్ చర్చి గురువుగా ఉన్న రెవరెండ్ డాక్టర్ ఆనందరావు 316 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. మరో ముగురు పోటీలో ఉన్నప్పటికీ వారికి అర్హత ఓట్లుగా నిర్ణయించిన 250 రాకపోవడంతో వారికి మరోసారి ఎన్నిక నిర్వహిస్తున్నారు. వీరిలో అత్యధిక ఓట్లు వచ్చిన వారు నాలుగో స్థానంలో నిలుస్తారు.

ఆస్తుల పరిరక్షణకు ఎన్నో కేసులు ఎదుర్కొన్నా

కొత్త బిషప్‌ను ఎన్నుకునే సమయంలో ప్రస్తుత బిషప్ గోవాడ దైవాశీర్వాదం ప్రసంగించారు. ఆస్తుల పరిరక్షించేందుకు తాను ఎంతో కృషిచేశానని, ఆ తరుణంలో ఎన్నో కేసులను ఎదర్కోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. సీఎస్ఐను మరింత అభివృద్ధి చేసేందుకు రానున్న వారు కృషిచేయాలని కోరారు.

సాక్షి రౌండప్

విజయవాడ

ఆదివారం । ఫిబ్రవరి । 11 । 2018

www.sakshi.com

అంతరిక్ష నౌకను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపిన తొలి ప్రైవేట్ సంస్థ కూడా స్పేస్ ఎక్స్. 2012లో ఈ ప్రయోగం విజయవంతమైంది.



స్టాంపులను సగం చించి వాడేద్దామా!

ఓ పోస్టు పంపాలి.. రూ.15 స్టాంపులు కావాలి. కానీ మీ దగ్గర రూ.10 స్టాంపులు రెండు ఉన్నాయి. ఓ రూ.10 స్టాంపును సరిగ్గా సగానికి కత్తిరించి వాడుకోవడం కుదురుతుందా.. ఇక్కడ మాత్రం కుదిరింది. స్టాంపులు మొదలైన తొలి రోజుల్లో వాటి ముద్రణ, వితరణ ఊపందుకోని సమయంలో అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోపియన్, ఆసియా దేశాల్లో దీన్ని అనుమతించారు. సరిగ్గా కర్ణం (డయాగోనల్)లా కత్తిరించిన స్టాంపులు వాటి ముఖ విలువలో సగంగా పరిగణించేవారు. కొన్ని కొన్ని సార్లు మరింత ముందుకెళ్లి మూడు వంతులు, నాలుగు వంతులుగా కూడా కత్తిరించి వాడేవారు. మెక్సికోలో అయితే మూడు, నాలుగు, ఎనిమిది వంతులుగా కత్తిరించి ఉపయోగించేవారు. స్టాంపుల కొరత ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని అమలు చేశారు. పక్కనున్న ఫొటోలోని పోస్టల్ స్టాంపును చూశారుగా.. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో గురెన్సీ ద్వీపంలో సగానికి కత్తిరించి అతికించి పోస్టు చేశారు..!



కొరియర్‌లో పులి పిల్ల!



సాధారణంగా కొరియర్‌లో మనం ఏమేం పంపిస్తుంటాం.. పుస్తకాలో, ఫోన్లో, ఇతరత్రా వస్తువులో.. కానీ మెక్సికోలో మాత్రం స్మగ్లర్లు పులిపిల్లను కొరియర్ చేశారు. దానికి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు కూడా తీసుకున్నారు. పులి పిల్లను పంపిన ప్లాస్టిక్ డబ్బాలో మెత్తదనం కోసం పేపర్లు నింపి ఊపిరాడేందుకు డబ్బాకు రంధ్రాలు పెట్టారు. మెక్సికో పశ్చిమ రాష్ట్రం జాలిస్కో నుంచి మధ్య రాష్ట్రం క్వెరెటారోకు ఈ కొరియర్‌ను ఆర్డర్ చేశారు. ఇంత జాగ్రత్త పడినా దొరికిపోయారు. ఎలాగంటారా.. జాలిస్కోలోని ట్లాక్వెపాగ్యు నగరలో బస్ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నపుడు ఓ ప్లాస్టిక్ కంటెయినర్‌లో శబ్దం, కదలికలు, వాసనను గుర్తించాయి పోలీసు జాగిలాలు. అందులో ఏముందో అని తనిఖీ చేసిన అధికారులకు రెండు నెలల బెంగాల్ టైగర్ కనిపించింది. డీహైడ్రేషన్‌తో బాధపడుతున్న పులి పిల్లను చూసిన అధికారులు తొలుత కంగారుపడినా.. వెంటనే తేరుకొని జంతుసంరక్షణ అధికారులకు అప్పగించారు. దీన్ని బట్టి కొరియర్‌కు కాదేదీ అనర్హం అనాలేమో..

కోర్టు ధిక్కార కేసులో విశాఖ జేసీకి జరిమానా

విధించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కార కేసులో స్పందించని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ సృజనకు హైకోర్టు రూ.రెండు వేలు జరిమానా విధించింది. అదే జిల్లాలోని అనకాపల్లి షుగర్ ఫ్యాక్టరీ రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వుల్ని అమలు చేయకపోడంతో జాయింట్ కలెక్టర్ ఈ నెల 2న స్వయంగా హైకోర్టు విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. మహిళా పారిశ్రామికవేత్తలతో ఒక ప్రైవేటు కార్యక్రమం ఉన్నందున 2న హాజరుకాలేకపోతున్నట్లు జాయింట్ కలెక్టర్ అఫిడవిట్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన న్యాయమూర్తి.. కోర్టు ఉత్తర్వులంటే అధికారులకే లెక్కలేకుండా ఉంటే కింది స్థాయి ఉద్యోగులు ఇంకెలా ఉంటారో అని, వారి నిర్లక్ష్య వైఖరికి ఇది తాత్కారణమని వ్యాఖ్యానించారు.

ఆగమ సంప్రదాయాలపై అర్చకులకు శిక్షణ

రాష్ట్ర అర్చక అకాడమి డైరెక్టర్ రాజగోపాల చక్రవర్తి



అర్చకులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న ట్రెనింగ్ అకాడమీ డైరెక్టర్ రాజగోపాల చక్రవర్తి

తాడేపల్లి రూరల్ (మంగళగిరి): హిందూధర్మం, ఆగమ సంప్రదాయాలు, ఇతిహాసాలు వంటి అంశాలపై చాత్తాద శ్రీవైష్ణవ అర్చకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రాష్ట్ర అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి తెలిపారు. తాడేపల్లి పరిధిలోని సీతానగరం రాష్ట్ర దేవాలయ పరిపాలన సంస్థ(సీత) కార్యాలయంలో 10 రోజులుగా జరుగుతున్న అర్చక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సనాతన ధర్మం, హైందవ సంస్కృతి సంప్రదాయాలు వంటి వాటిపై సంపూర్ణ అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దేవాదాయ శాఖ కమిషనర్ మార్గదర్శకాలతో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన 60 మంది అర్చకులకు ఈ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి ధృవీకరణ పత్రాలతో పాటు పూజా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ళూరి మఠం పొడుగు వెంకటసత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు, సుదర్శనం శ్రీనివాసనూరి, శిక్షణావేత్త వీఎం. చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మనోవ్యథతో అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి



సత్యనారాయణ (ఫైల్)

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ): మానసిక వ్యథతో మరో అగ్రిగోల్డ్ బాధితుడు మరణించాడు. విశాఖ పోర్టు పూల్‌లో కొంతకాలం వరకు పనిచేసిన నట్ల సత్యనారాయణ (40) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పాతనగరం 23వ వార్డు రంగిరీజులో నివాసం ఉంటున్నాడు. ఉద్యోగం చేస్తూనే అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా చేరి బంధువులు, స్నేహితులతో ఖాతాలు తెరిపించాడు. పిల్లల చదువులకు, వివాహానికి ఉపయోగపడుతుందని దాచుకున్న సొమ్ము రూ.20 లక్షల వరకు అగ్రిగోల్డ్‌లో పెట్టుబడిగా పెట్టాడు. సంస్థపై వివాదం చెలరేగిన సమయంలో తాను కట్టించిన ఖాతాదారులు ఇంటిమీద పడి గొడవ చేయడంతో చాలా వరకు అప్పులు చేసి చెల్లించాడు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ శనివారం మధ్యాహ్నం మరణించాడు. మృతదేహం వద్ద భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించడం అందరినీ కలిచివేసింది.


లోక్ అదాలత్‌లో 28 వేల కేసుల పరిష్కారం

రూ.58 కోట్ల పరిహారం చెల్లింపునకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఉభయ రాష్ట్రాల్లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో దాదాపు 28 వేల కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కేసుల్లో రూ.58 కోట్ల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశాలు వచ్చాయి. ఏపీలో 18 వేల కేసులు పరిష్కారమైనట్లు ఆ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. పరిహారం కింద రూ.32.4 కోట్లు చెల్లించామన్నారు. తెలంగాణలో 10 వేలు పరిష్కారం కాగా, దాదాపు రూ.26 కోట్ల మేర పరిహారం చెల్లించామని ఆ రాష్ట్ర న్యాయవాసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బి.ఆర్.మధుసూధన్‌రావు తెలిపారు. ఇదిలా ఉంటే, ఈసారి హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ నిర్వహించిన లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కృతమయ్యాయి. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్ నేతృత్వంలో శనివారం హైకోర్టులో లోక్ అదాలత్ జరిగింది. జస్టిస్ సంజయ్‌కుమార్‌తో పాటు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్, జస్టిస్ షమీమ్ అక్తర్, జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ గంగారావుతో పాటు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జి.వి.సీతాపతి లోక్ అదాలత్‌లో కేసులను విచారించారు. 119 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల్లో దాదాపు 500 మందికి రూ.6.5 కోట్ల మేర పరిహారం చెల్లింపునకు న్యాయమూర్తులు ఆదేశాలు జారీ చేసినట్లు లీగల్ సర్వీసెస్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

కీలుకీలుకో బాధ

- రాష్ట్రంలో 35 లక్షల మంది వరకూ బాధితులు
- 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల వారే
- తాగునీటిలో ఫ్లోరిన్ అధికంగా ఉండటమే ప్రధాన కారణం
- ఆరోగ్యశ్రీలో చేరుస్తామని చెప్పి అమలు చేయని సర్కార్
- దీంతో ట్యాబ్లెట్‌లకే పరిమితమవుతున్న బాధితులు



సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ప్రజలను కీళ్ల జబ్బులు కుదిపేస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా కీళ్ల జబ్బులతో బాధితులు పెరుగుతున్నారు. ప్రభుత్వం కీళ్ల నొప్పులను ఆరోగ్య శ్రీలో చేరుస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా ఇంతవరకు చేర్చలేదు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేక అల్లాడుతున్నారు. ప్రతి పది మంది ఎముకల జబ్బుల బాధితుల్లో ముగ్గురు మోకాలి చిప్పల అరుగుదలతో బాధపడుతున్నవారేనని వైద్యులు చెబుతున్నారు. వీరు రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల మంది వరకూ ఉండొచ్చని అంచనా. వీరిలో ముప్పై శాతం మందికి మోకాలి చిప్పలు మార్చాల్సిన అవసరం ఉంది. బాధితుల్లో 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాలవారే. వీరిలో ఎక్కువ మంది మహిళలే కావడం గమనార్హం.

నలభై ఐదేళ్లకే అరుగుదల

ఒక్కో మోకాలికి చిప్ప మార్పిడి చేయాలంటే రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు ఖర్చవుతోంది. ఇంత భారీ మొత్తం వెచ్చించే స్థితిలో గ్రామీణులు లేరు. గతంలో అరవై ఏళ్లు దాటితేనే మోకాలి చిప్పల కీళ్లు అరిగేవి. ఇప్పుడా సమస్య నలభై ఐదేళ్లు దాటిన వారిలోనూ కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బాధితుల సంఖ్య తీవ్రంగా ఉంది. తాగునీటిలో ఫ్లోరిన్ ఎక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణం. దీంతోపాటు కీళ్ల అరుగుదలకు కారణమయ్యే పలు కారకాలు నీటిలో ఉండటం వల్ల కీళ్ల వ్యాధులు వస్తున్నాయని వైద్యులు అంటున్నారు.

ఆరోగ్యశ్రీలో చేర్చని ప్రభుత్వం

మోకాలి చిప్పల శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీలో చేరుస్తామని రెండేళ్ల క్రితమే మంత్రి కామినేని శ్రీనివాస్ ప్రకటించారు. కానీ ఇంతవరకు చేర్చలేదు. స్టేట్ ఇల్‌నెస్ ఫండ్ కింద ఒక్కో ఆస్పత్రికి రూ.65 లక్షల చొప్పున కర్నూలు, విశాఖపట్నం, గుంటూరు ఆస్పత్రులకు కేటాయించారు. ఇందులో భాగంగా రెండేళ్లలో గుంటూరు జిల్లాలో 55 చికిత్సలు మాత్రమే చేశారు. ప్రస్తుతం గుంటూరు ఆస్పత్రిలో రోగుల నమోదు ఆపేశారు. ఇచ్చిన నిధులు సరిపోకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆపేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్టు వైద్యులు చెప్పారు. కర్నూలు, విశాఖపట్నంలో ఇప్పటివరకూ మొదలే కాలేదు. దీంతో బాధితులు శస్త్రచికిత్సలకు దూరమై నొప్పి నివారిణి మందులు వాడుతున్నారు. వీటిని దీర్ఘకాలం వాడటం వల్ల కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు.

మో'కీలు' అరుగుదలకు ప్రధాన కారణాలివే..

- తాగే నీటిలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉండటం
- వయసుకు మించి, శక్తికి మించి ఎక్కువగా శ్రమపడటం
- ఊబకాయం, మధుమేహంతోపాటు శారీరక వ్యాయామం తక్కువ కావడం
- పోషకాహారం తీసుకోకపోవడం
- తగినంత మంది ఎముకల వైద్య నిపుణులు, ఫిజియోథెరపిస్ట్‌లు లేకపోవడం

వైద్యుల సలహాలు..

- చిన్నతనం నుంచే సురక్షిత మంచినీరు తాగాలి
- కీళ్ల అరుగుదలకు కారణమయ్యే శ్రమను తగ్గించుకోవాలి
- కీళ్ల అరుగుదలను ప్రాథమిక దశలోనే గుర్తించి, పోషకాహారం తీసుకోవాలి
- ఊబకాయం, మధుమేహ బాధితులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- కీళ్ల బాధితులు నేలపై కూర్చోకూడదు. బల్లపై, కుర్చీలో కూర్చుని కాళ్లు జారవిడుచుకునేటట్టుండాలి
- పెయిన్ కిల్లర్స్ వాడకూడదు. ఫిజియోథెరపీ చేయించుకోవడం మంచిది

వివిధ ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులు, వైద్య నిపుణుల అంచనా మేరకు బాధితుల వివరాలు..

మోకాలి బాధితుల సంఖ్య	35 లక్షల వరకూ
తాగునీటిలో ఫ్లోరిన్ కారణంగా బాధితులు	20 లక్షలు
యాభై ఏళ్ల వయసు దాటిన బాధితులు	12 లక్షలు
అరవై ఏళ్ల వయసు దాటిన బాధితులు	20 లక్షలు
నలభై ఐదేళ్ల వయసు దాటిన బాధితులు	3 లక్షల వరకూ
బాధితుల్లో మహిళలు	18 లక్షల వరకూ
బాధితుల్లో పురుషులు	17 లక్షల వరకు

మూడేళ్లుగా వేచిచూస్తున్న బాధితులు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో బర్డ్ ఆస్పత్రి నడుస్తోంది. మోకాలిచిప్పల మార్పిడిలో ఈ ఆస్పత్రికి మంచి పేరుంది. పేద ప్రజలకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్న ఆస్పత్రి ఇది. కానీ ఇక్కడకు వస్తున్న బాధితులు ఎక్కువయ్యారు. ఇక్కడ మోకాలి శస్త్రచికిత్స చేయించుకోవాలంటే మూడేళ్ల పడుతుందంటే ఎంత రద్దీ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు దరఖాస్తు చేసుకున్న ఆరు మాసాల నుంచి ఏడాదిలోపు ఆపరేషన్ జరిగేది.

గ్రామీణుల్లోనే అధికంగా ఉన్నారు

కీళ్ల అరుగుదలపై అవగాహన లేకపోవడం, ముందస్తు జాగ్రత్తలు పాటించకపోవడం ప్రధాన సమస్య. వెస్ట్రన్ బాత్రూమ్స్ వాడకపోవటం, కాల్షియం, పోషకాహార లోపం, ఎముకల్లో బలం తగ్గిపోవడం కూడా కారణాలే. పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదిస్తున్నారు. డాక్టర్లు, ఫిజియోథెరపిస్టులు అందుబాటులో లేకపోవడం గ్రామీణులకు ఇబ్బందిగా ఉంది.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం జోజిబాబు



రాజకీయ భేరిలో పాల్గొన్న దివ్యాంగులు

మంగళగిరి రూరల్: రాష్ట్ర జనాభాలో 20 లక్షలకు పైగా ఉన్న దివ్యాంగులకు దామాషా ప్రకారం స్థానిక సంస్థలు, చట్టసభల్లో నాలుగుశాతం రిజర్వేషన్లు కల్పించేలా బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ తీర్మానం చేయాలని ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం జోజిబాబు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శనివారం దివ్యాంగుల రాజకీయ భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా జోజిబాబు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ దివ్యాంగులకు 7 అసెంబ్లీ, 1 పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో నాలుగుశాతం రిజర్వేషన్లు కల్పిస్తే 6,348 మంది ప్రజా ప్రతినిధులుగా అవకాశం పొందుతారని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు, విద్యా సంస్థలకు, ఆధ్యాత్మిక సంస్థలకు వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను ఉచితంగా కేటాయిస్తున్న ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ రూ.1500కు పెంచకుండా కుంటిసాకులు చెప్పడం బాధాకరమన్నారు. మార్చి బడ్జెట్‌లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేయకుంటే.. ఏప్రిల్ నెలలో చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు దివ్యాంగుల రాజకీయ చైతన్య యాత్ర చేపట్టి ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

దీర్ఘకాలిక వ్యాధుల వైద్యంలో మొక్కలు కీలకం

జపాన్ శాస్త్రవేత్త మియామోటో



ప్రసంగిస్తున్న జపాన్ శాస్త్రవేత్త మియామోటో

ఏఎన్‌యూ (పొన్నూరు): దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య చికిత్సలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని జపాన్ శాస్త్రవేత్త మియామోటో తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ విభాగం ఆధ్వర్యంలో శనివారం జరిగిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సులో పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడారు. మియామోటో మాట్లాడుతూ అనిమోరినే రైజోమా అనే మొక్క నుంచి క్యాన్సర్ వైద్యానికి అవసరమైన మిథోక్సిన్యాసోల్స్‌ను తీయవచ్చని చెప్పారు. వాటిని వేరు చేసే విధానాన్ని వివరించారు. డెన్మార్క్‌కు చెందిన హెన్రీ లూట్‌కెన్ మాట్లాడుతూ ఆగ్రో బ్యాక్టీరియంలో జీవాధారిత, యూవీబీ ద్వారా ఫ్లేవర్‌ల అభివృద్ధిని వివరించారు. జపాన్‌కు చెందిన హిరోయుకితనాఖ మాట్లాడుతూ చిన్న చిన్న మొక్కల్లో రసాయనాలు, ఇమ్మినో కెమికల్స్ ఉంటాయని, అవి పనిచేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఇంకా బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్త శుభశ్రీ , కాకతీయ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ వీఎస్. రాజు, అస్సాంకు చెందిన డాక్టర్ రామారావు, ఔరంగబాద్‌కు చెందిన రాజారామ్ తదితరులు మాట్లాడారు. సదస్సు సెక్రటరీ డాక్టర్ జి.రోశయ్య, కన్వీనర్ డాక్టర్ ఖాశీం, బోటనీ విభాగ అధ్యాపకులు ప్రొఫెసర్ ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మళ్లీ నగదు కష్టాలు

- ఏటీఎంలలో డబ్బులు లేక జనం తిప్పలు
- వరుస సెలవులతో నగదు కోసం పెరిగిన డిమాండ్

సాక్షి, అమరావతి: వరుస సెలవులు, నగదు కోసం డిమాండ్ పెరగటంతో పలుచోట్ల ఏటీఎంలలో డబ్బులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శనివారం మధ్యాహ్నానికే చాలా ఏటీఎంలలో నగదు నిల్వలు నిండుకున్నాయి. రెండో శనివారం, ఆదివారం, మంగళవారం శివరాత్రి ఇలా వరుస సెలవులు కలిసి రావడంతో చాలా మంది దూరప్రయాణాలకు సిద్ధమయ్యారు.

రేపు బ్యాంకులు తెరుచుకున్నాకే...

విజయవాడలో పనిచేసే విద్యాధరరావు హైదరాబాద్ వెళ్లడం కోసం నగరంలోని 20 ఏటీఎంలు చుట్టూ తిరిగినా ఎక్కడా డబ్బులు దొరకలేదు. రాష్ట్రమంతా ఇలాంటి పరిస్థితే ఉంది. నగదు సరఫరా తగ్గిపోవడంతో బ్యాంకుల్లో విత్‌డ్రాయల్స్‌పై కూడా ఆంక్షలు విధిస్తున్న సంగతి తెలిసిందే. చాలా చోట్ల బ్యాంకుల పనివేళల్లో ఏటీఎంలో నగదు నింపడం లేదు. రాత్రి పూట, సెలవు సమయాల్లో మాత్రమే ఏటీఎంల్లో నగదు అమరుస్తున్నట్లు బ్యాంకు అధికారులు చెపుతున్నారు. సోమవారం బ్యాంకులు తెరుచుకుంటే కానీ నగదు లభించే అవకాశాలు లేవు.

ప్రజల్లో ఆగ్రహం

గత రెండు నెలల నుంచి నగదు కొరత వేధిస్తున్నా సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులకు వెళితే డబ్బులు ఇవ్వడం లేదని, ఏటీఎంలలో నగదు ఉండటం లేదని వాపోతున్నారు. కనీసం పాలు, కూరగాయలు కొనుక్కోవడానికి కూడా డబ్బులు ఉండటం లేదని, ఇలా అయితే ఎలా గడపాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నగదు సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.



● తెలంగాణ

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఉద్రిక్తత

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై మందుబాబుల దాడి



కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న వాహనదారుడు

హైదరాబాద్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పీకల దాకా మద్యం సేవించిన ఓ యువకుడు శ్వాస పరీక్షలకు నిరాకరించడమే కాకుండా కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ రోడ్ నం.1లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ముందు శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఏపీ 10పీ5004 నంబర్ గల కారును ఆపి వెంకటేశ్వర్లు అనే కానిస్టేబుల్ శ్వాస పరీక్ష నిర్వహిస్తుండగా డ్రైవర్ సీటులో కూర్చున్న వ్యక్తి సహకరించలేదు. అదే సమయంలో వెనుక కూర్చున్న సర్దార్ అంకిత్‌సింగ్ కారు దిగి తాగిన మైకంలో అసభ్యపదజాలంతో పోలీసులను దూషించాడు. అంతటితో ఆగకుండా వెంకటేశ్వర్లుపై చేయి చేసుకున్నాడు. అడ్డువచ్చిన జితేంద్ర అనే కానిస్టేబుల్‌ని కూడా కొట్టి.. కారులో పరారయ్యాడు. జితేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విధులకు ఆటంకం కలిగించి, పోలీసులను అసభ్యకరంగా తిట్టిన అంకిత్‌సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

తెలంగాణ ప్రాజెక్టులు భేష్!

- తెలంగాణ సాగు, తాగునీటి పథకాలు దేశానికే ఆదర్శం
- కేంద్ర ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా

చిన్నకోడూరు (సిద్దిపేట)/గజ్వేల్/కాళేశ్వరం (మంథని): తెలంగాణలో సాగు, తాగునీటి కోసం చేపట్టిన ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక సంఘం అరవింద్ మెహతా ప్రశంసించారు. దేశాభివృద్ధికి వ్యవసాయం కీలకమని, దీనికి ప్రాజెక్టులే మూలమని.. అందుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులు నిర్మిస్తోందని కితాబిచ్చారు. ఇంటింటికీ సురక్షిత మంచినీరు అందించాలన్న సంకల్పంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం దేశమంతటికీ ఆదర్శనీయమని శ్లాఘించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల పనులను ఆయన శనివారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, రాష్ట్ర ఆర్థిక సంఘం ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తదితరులతో కలసి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి ప్రాజెక్టుల వద్దకు చేరుకున్నారు. గజ్వేల్‌లోని కోమటిబండ గుట్టపై ఉన్న 'మిషన్ భగీరథ' హెడ్ రెగ్యులరేటరీని, సిద్దిపేట జిల్లా చంద్లాపూర్ శివారులో నిర్మిస్తున్న రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బ్యారేజీని పరిశీలించారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో జరుగుతున్న పనుల వివరాలన్నింటినీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టుల వద్దే విలేకరులతో మాట్లాడారు.

దేశానికే ఆదర్శం..

సాగు, తాగునీటి కోసం తెలంగాణ ప్రభుత్వం శ్రద్ధ అభినందనీయమని, ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని అరవింద్ మెహతా ప్రశంసించారు. రాష్ట్రంలో సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రాధాన్యతను ఇతర రాష్ట్రాలు గుర్తించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మంచి పథకాలను ప్రోత్సహించాలని ఆర్థిక సంఘం నిర్ణయిస్తే.. ఆ ప్రోత్సాహకాలన్నీ తెలంగాణకే దక్కుతాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న నిధులను తెలంగాణ ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇలాంటి మంచి పనులకు 15వ ఆర్థిక సంఘం సహకారం ఉంటుందని.. మరిన్ని నిధులు కావాలంటే ప్రభుత్వం తరఫున మెమోరాండం అందించాలని సూచించారు.

సీట్లు ఖాళీగా ఉంటే సర్కారుకెందుకు బాధ?

- ఫార్మా–డీ కోర్సుపై హైకోర్టు
- ఎన్‌ఓసీ ఇవ్వాలని జేఎన్‌టీయూ–హెచ్‌కు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విధాన నిర్ణయం పేరుతో సాంకేతిక విద్యాసంస్థల్లో కొత్త కోర్సులకు నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వకపోవడం సబబు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో లక్ష్మీబాయి విద్యాపీఠం నిర్వహిస్తున్న బొజ్జల నర్సింహులు మహిళా ఫార్మసీ కాలేజీలో 2018–19 విద్యాసంవత్సరంలో ఫార్మాడీ కోర్సును ప్రారంభించేందుకు వీలుగా ఎన్‌ఓసీ మంజూరు చేయాలని జేఎన్‌టీయూ–హెచ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు చెప్పింది. ఫార్మా–డీ విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న అంశాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. సీట్లు భర్తీ కాకపోతే సంబంధిత కాలేజీ బాధపడాలే గానీ ఆ బాధను ప్రభుత్వమే తనపై వేసుకుని ఎన్‌ఓసీ ఇవ్వకపోవడం సబబు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇంజనీరింగ్ విద్యలో ఉన్న పరిస్థితులను ఫార్మా–డీ కోర్సుకు వర్తింపజేయడం సముచితంగా లేదని పేర్కొంది. ఏఐసీటీఈ, పీసీఐ అనుమతి ఇచ్చినా తమ కాలేజీలో ఫార్మా–డీ కోర్సు ప్రారంభానికి అనుబంధ గుర్తింపు ఇవ్వడం లేదని ఆ కాలేజీ హైకోర్టును ఆశ్రయించింది. ఫార్మా–డీ సీట్లు భర్తీ కావడం లేదని, 2014–15 నుంచి 2017–18 విద్యా సంవత్సరం వరకు వరుసగా 237, 103, 125, 173 చొప్పున ఏటా సీటు ఖాళీలు ఉన్నాయంటూ తెలంగాణ సర్కార్ తోపాటు జేఎన్‌టీయూ–హెచ్ చేసిన వాదనల్ని ధర్మాసనం తిరస్కరించింది.

ఈ కొలువులు..

అధిక వేతనాలకు కేరాఫ్!



అమెరికాలో ఉద్యోగం.. పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో లక్షల్లో జీతమొచ్చే ఐటీ జాబ్! ఇలాంటి మాటలు మనం తరచూ వింటుంటాం. అంటే.. అమెరికాలో జాబ్, లేదంటే సాఫ్ట్‌వేర్ కొలువు అయితేనే రూ.లక్షల్లో వేతనాలు చేతికందుతాయనే అభిప్రాయం సర్వసాధారణంగా మారింది. కానీ, సరైన నైపుణ్యాలు, కష్టపడి పనిచేసే తత్వం ఉంటే ఇక్కడే, వివిధ రంగాల్లో భారీ వేతనాలు వచ్చే ఉద్యోగాలున్నాయంటున్నారు నిపుణులు. అందుకునే సామర్థ్యం ఉండాలేగానీ అవకాశాలు అపారమంటూ భరోసా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సరైన విద్యార్హతలు, విషయ పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు ఉంటే.. అత్యధిక వేతనాలు లభించే అవకాశమున్న ఉద్యోగాలేవో చూద్దాం..!

జాబ్ ట్రెండ్స్

మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్



సంస్థ అభివృద్ధి విషయంలో మేనేజర్ స్థాయి వ్యక్తులు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. టాప్ మేనేజ్‌మెంట్ విధానాలను అమలు చేస్తారు. వృత్తి పరంగా ప్రారంభ దశలో కష్టపడితే చాలు.. కొంత అనుభవం గడించాక వెనక్కి తిరిగి చూసుకోవల్సిన అవసరం ఉండదు. స్థాయికి తగ్గట్లు అధిక వేతనాలూ అందుకోవచ్చు. మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్ కెరీర్ పరంగా ఐఐఎంలు వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఎంబీఏ పూర్తిచేసిన వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లోనే కార్పొరేట్ కంపెనీలు లక్షల్లో వేతనం ఆఫర్ చేస్తున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికైన మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్ ప్రారంభ వార్షిక వేతనం సగటున రూ.10 లక్షల వరకు ఉంటుంది.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్



సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టడంలో.. ఆర్థికపరమైన సలహాలు అందించడంలో.. మూలధన పెట్టుబడుల సేకరణలోనూ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లదే కీలకపాత్ర. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్ ప్రారంభిస్తే... అనలిస్ట్, అసోసియేట్, వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్.. ఇలా అంచెలంచెలుగా ఎదిగే వీలుంది. వేతనాల విషయానికొస్తే అనలిస్టులకు సగటున రూ.8 లక్షలు, అసోసియేట్లకు రూ. 13 లక్షలు, వైస్ ప్రెసిడెంట్లకు రూ.30 లక్షల మధ్య వేతనం లభిస్తుంది. ప్రతిష్టాత్మక సంస్థలైన గోల్డ్‌మ్యాన్ శ్యాచ్స్, జేపీ మోర్గాన్ చేస్, డచ్ బ్యాంక్, హెచ్‌ఎస్‌బీసీ, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, సిటీ గ్రూప్ తదితరాలు ఉద్యోగ కల్పనలో ముందుంటున్నాయి.

చార్టర్డ్ అకౌంటెంట్

మనదేశంలో చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తికి అమితమైన గౌరవం ఉంది. ఇంజనీరింగ్, మెడిసిన్ తర్వాత అత్యధిక మందికి క్రేజీ కెరీర్ ఇది. సీఏ కోర్సు పూర్తిచేసి.. వ్యాపార దక్షత, ఆర్థిక అంశాల్లో పట్టున్న వారు చార్టర్డ్ అకౌంటెంట్లుగా స్థిరపడొచ్చు. సీఏ పూర్తిచేసిన వారికి ఫైనాన్షియల్ అకౌంటింగ్, ట్యాక్స్ మేనేజ్‌మెంట్, ఆడిటింగ్, కాస్ట్ అకౌంటింగ్, బ్యాంకింగ్, కన్సల్టెన్సీ తదితర అంశాలపై మంచి అవగాహన కలిగి ఉంటే.. డెలాయిట్, ప్రైస్ వాటర్ కూపర్స్, కేపీఎంజీ, ఐసీఐసీఐ బ్యాంక్ తదితర సంస్థలు అధిక వేతనాలతో ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. వీరి ప్రారంభ వార్షిక వేతనాలు సగటున రూ.5–8 లక్షలు, అనుభవం వచ్చాక రూ.18–25 లక్షల మధ్య ఉంటున్నాయి.

జియాలజిస్టులు, మెరైన్ ఇంజనీర్లు



మనదేశంలో చమురు, సహజవాయు రంగాలకున్న డిమాండ్ గురించి తెలిసిందే. ముడి చమురు.. పెట్రోల్, డీజిల్‌గా మారాలంటే.. ఎన్నో ప్రక్రియలను దాటాలి. అందుకే ఈ రంగంలో పనిచేసే జియాలజిస్టులు, మెరైన్ ఇంజనీర్లు అధిక పరిజ్ఞానవంతులై ఉండాలి. సంబంధిత విద్యార్హతలు సొంతం చేసుకున్న విద్యార్థులు.. ఓఎన్‌జీసీ, ఐఓసీఎల్, భారత్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు బ్రిటిష్ గ్యాస్, రిలయన్స్ ఎనర్జీ, షెల్ వంటి ప్రైవేటు సంస్థల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందొచ్చు. ఈ రంగంలో ప్రారంభ వార్షిక వేతనాలు సగటున రూ.5–8 లక్షలు ఉంటాయి. ఐదారేళ్ల అనుభవం గడించాక రూ.15–20 లక్షల వార్షిక వేతనం పొందవచ్చు.

ఏవియేషన్ ప్రొఫెషనల్స్



ప్రైవేటు ఎయిర్‌లైన్స్ రాకతో గతకొన్నేళ్లుగా ఏవియేషన్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అధిక సంఖ్యలో ఉద్యోగాలను సైతం కల్పిస్తోంది. జంబో పైలట్లు, రెగ్యులర్ పైలట్లు రూ.7–10 లక్షల వార్షిక వేతనం అందుకుంటున్నారు. ఎయిర్‌లైన్ స్టీవార్డ్స్, ఎయిర్ హోస్టెస్, గ్రౌండ్ స్టాఫ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ (ఏటీసీ) వంటి వాళ్లకు సగటున రూ.5–6 లక్షల మధ్య వార్షిక వేతనం లభిస్తోంది.

బిజినెస్ అనలిస్ట్



మనదేశంలో వ్యాపార సంస్థల మధ్య పోటీ నానాటికీ పెరిగిపోతోంది. మార్కెట్ పరిస్థితులను ప్రతిరోజూ విశ్లేషించుకోవడం సంస్థలకు ప్రధానం. అందుకోసం పెద్ద కంపెనీలు బిజినెస్ అనలిస్ట్‌లను నియమించుకోవడం పరిపాటి. సంస్థ అవసరాలను అర్థం చేసుకుని, పోటీ సంస్థల పనితీరును అధ్యయనం (మార్కెట్ విశ్లేషణ) చేసి.. కంపెనీ ప్రగతికి నివేదికలు (డాక్యుమెంటేషన్) తయారు చేయడం బిజినెస్ అనలిస్టుల బాధ్యత. అనలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన వారు కన్సల్టెంట్, సీనియర్ కన్సల్టెంట్, మేనేజర్, ప్రాజెక్ట్ లీడ్, ప్రెసిడెంట్, డైరెక్టర్ స్థాయికి చేరుకోవచ్చు. బిజినెస్ అనలిస్ట్‌గా రాణించాలంటే.. లాజికల్ థింకింగ్, మ్యాథ్స్ కాన్సెప్ట్స్‌పై పట్టు, కొత్త టెక్నాలజీలపై అవగాహన, కొత్త అంశాలపై ఆసక్తి ఉండాలి. మెకన్సీ, యాక్సెంచర్, బీసీజీ, కేపీఎంజీ వంటి పేరొందిన అనేక సంస్థలు అధిక వేతనాలతో బిజినెస్ అనలిస్ట్‌లను నియమించుకుంటున్నాయి. వీరి ప్రారంభ వార్షిక వేతనం సగటున రూ.8–15 లక్షల వరకు ఉంటుంది. వీటితోపాటు జీవిత బీమా, పెయిడ్ సిక్ లీవ్స్, రీలొకేషన్ ఖర్చులు, పెయిడ్ ట్రిప్‌లు, ఫ్రీ హెల్త్ క్లబ్ మెంబర్‌షిప్ వంటి అదనపు సౌకర్యాలను సైతం కల్పిస్తున్నాయి.

'నేటి పోటీ ప్రపంచంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. ఇలా రాణించగల శక్తి ఉందనే విషయాన్ని విద్యార్థినులు గుర్తించి ముందడుగు వేయాలి. అంతేకాని అనవసరపు అపోహలతో ఆగిపోకూడదు' అని సూచిస్తున్నారు.. ప్రముఖ వైద్య శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్. హరిత విప్లవ పితామహుడిగా పేరుగడించిన ఎం.ఎస్.స్వామినాథన్ కుమార్తె అయిన సౌమ్య స్వామినాథన్ నాలుగు దశాబ్దాల తన మెడికల్ కెరీర్‌లో ఎన్నో కీలక పదవులు చేపట్టారు. ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థలో (డబ్ల్యూహెచ్‌వో) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రోగ్రామ్స్‌గా నియమితులైన ఆమెతో గెస్ట్‌కాలం..



గెస్ట్‌కాలం

పరిశోధనల్లో అపార అవకాశాలు..

- అమ్మాయిలు అందిపుచ్చుకోవాలి
- ప్రముఖ వైద్య శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్

విద్యార్థినులు చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గుర్తించాలి. అయితే, నేటికీ మనదేశంలో ఉన్నతవిద్య, ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ పరంగా విద్యార్థినులు ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపడంలేదు. దీనికి సామాజిక పరిస్థితులతోపాటు, కుటుంబ వాతావరణం కూడా కారణమవుతోంది. ఇప్పటికీ ఆడపిల్లలకు పెద్ద చదువులు ఎందుకనే భావన కొందరు తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. అమ్మాయిల చదువు విషయంలో తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు రావాలి. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిననే చెప్పాలి. మా అమ్మానాన్న ఇద్దరూ విద్యావంతులు కావడంతో నచ్చిన చదువులు అభ్యసించేలా ప్రోత్సహించారు.

సైన్స్‌లో అవకాశాలు

విద్యార్థినులకు సైన్స్ రంగంలో ఇప్పుడు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అమ్మాయిలు పరిశోధనల్లో చేరి, రాణించేలా పలు ప్రోత్సాహకాలు అమలవుతున్నాయి. వాటిని అందిపుచ్చుకునేందుకు ప్రయత్నించాలి. అంతేగానీ రీసెర్చ్‌లో రాణించగలమా? ఏళ్ల తరబడి సమయం వెచ్చించాల్సి ఉంటుందా? తదితర సందేహాలతో ఆగిపోకూడదు. ఉన్నత విద్య పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ ఇలాంటి సందేహాలతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్న విద్యార్థినులను ఎందరినో చూశాను.

సాంకేతిక రంగాల్లోనూ రాణించేలా..

విద్యార్థినులు సాంకేతిక రంగాల్లోనూ రాణించేందుకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వం సాంకేతిక విద్యవైపు విద్యార్థినులను ప్రోత్సహించేలా స్కాలర్‌షిప్స్, ఇతర సదుపాయాలు ఉన్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఇంజనీరింగ్ వైపు మహిళలు దృష్టిపెడుతున్న మాట నిజమే. కానీ, ఎక్కువ మంది క్షేత్రస్థాయి కార్యకలాపాలకు ప్రాధాన్యం లేని బ్రాంచ్‌లను ఎంపిక చేసుకుంటున్నారు.

వైద్య విద్యకు ప్రాధాన్యం

ప్రస్తుతం మనదేశంలోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. వైద్య విద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. తాజాగా ప్రతిపాదించిన కొత్త మెడికల్ కళాశాలల ద్వారా సమీప భవిష్యత్తులో మరింత మంది వైద్యులు అందుబాటులోకి వస్తారు. అదే విధంగా జిల్లా ఆస్పత్రులను టీచింగ్ హాస్పిటల్స్‌గా మార్చాలనే ఆలోచన కూడా ఈ రంగంలో వైద్యుల కొరతను తీర్చేందుకు మార్గంగా చెప్పొచ్చు.

సేవా దృక్పథం

మెడికల్ ఎడ్యుకేషన్ ఔత్సాహిక విద్యార్థులు.. సామాజిక సేవా దృక్పథంతోనే ఈ దిశగా అడుగులు వేయాలి. వైద్య వృత్తిని మార్కెట్ వస్తువుగా భావించకూడదు. ఎంబీబీఎస్, ఎండీ కోర్సులు పూర్తిచేసేందుకు తాము ఖర్చు చేసిన మొత్తాన్ని భవిష్యత్తులో సంపాదించుకోవాలనే విధంగా ఆలోచిస్తే.. సామాన్య ప్రజలకు ఎప్పటికీ సరైన వైద్య సేవలు అందుబాటులోకి రావు.

మెడికల్ పరిశోధనలపై దృష్టి

ప్రస్తుతం మెడికల్ కెరీర్ పరంగా కేవలం వైద్య వృత్తి అనే కాకుండా.. రీసెర్చ్ పరంగానూ విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా కేన్సర్ రీసెర్చ్, హెచ్ఐవీ నివారణకు సంబంధించిన రీసెర్చ్ కార్యకలాపాలు విస్తృతంగా సాగుతున్నాయి. ఈ దిశగాను మెడికల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు దృష్టిసారించాలి.

ప్రోత్సహించాలి

విద్యార్థినులు ఉన్నత విద్య వైపు అడుగులు వేసేలా తల్లిదండ్రులు, సమాజంతోపాటు విద్యా సంస్థలు కూడా ప్రోత్సహించాలి. ఉన్నతవిద్యకు సంబంధించి అందుబాటులో ఉన్న అవకాశాలు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ఫలితంగా మహిళలు అన్ని రంగాల్లోనూ అడుగు పెట్టి విజయం సాధించేందుకు అవకాశం ఉంటుంది.

బులెటిన్ బోర్డ్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్‌లో 20 'ఫెలోషిప్' ఖాళీలు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసీహెచ్‌ఆర్).. 2018–19కి గాను 20 'ఫెలోషిప్' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు–ఖాళీలు:** సీనియర్ అకడమిక్ ఫెలోషిప్ (ఎస్ఏఎఫ్)–10; పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్–10.
- **ఫెలోషిప్:** ఎస్ఏఎఫ్‌కు రూ.44,000+ఏడాది కంటింజెన్సీ గ్రాంట్ రూ.44,000; పీడీఎఫ్‌కు రూ.30800+ఏడాది కంటింజెన్సీ గ్రాంట్ రూ.22,000.
- **అర్హతలు:** పీడీఎఫ్‌కు.. చరిత్ర సంబంధ అంశాల్లో పీహెచ్‌డీ పూర్తిచేసి ఉండాలి; ఎస్ఏఎఫ్‌కు.. చరిత్ర సంబంధ విభాగాల్లో పరిశోధనలు చేసిన సీనియర్ స్కాలర్స్ అర్హులు. అలాగే వివిధ జర్నల్స్‌లో రచనలు ప్రచురితమై ఉండాలి.
- **ఎంపిక:** ప్రెజెంటేషన్ కమ్ ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** పీడీఎఫ్‌కు రూ.300. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్/ఈ మెయిల్.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** ఫిబ్రవరి 13, 2018. ❖ **వెబ్‌సైట్:** www.ichr.ac.in

చిత్తరంజన్ నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 22 ఖాళీలు

కోల్‌కతాలోని చిత్తరంజన్ నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ (సీఎన్‌సీఐ).. 22 ఖాళీలు భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు–ఖాళీలు:** సీనియర్ రెసిడెంట్–6 (సర్జరీ–2+గైనకాలజీ–1+ రేడియోథెరపీ–1+ఈఎన్‌టీ–1+మెడికల్ ఆంకాలజీ–1); జూనియర్ రెసిడెంట్–16 (సర్జరీ–5+మెడికల్ ఆంకాలజీ–4+ అనాస్–ఐటీయూ–2+ రిజర్వ్–2+ ఈఎన్‌టీ–1+ రేడియోథెరపీ–1+గైనకాలజీ–1).
- **అర్హతలు:** ఎంబీబీఎస్‌తోపా సంబంధిత విభాగాల్లో పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా. అలాగే జాయినింగ్‌లోపు ఎంసీఐ సర్టిఫికెట్ సమర్పించాలి. ❖ **వయసు:** సీనియర్ రెసిడెంట్‌కు 33 ఏళ్లు; జూనియర్ రెసిడెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ–రూ.200 ; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళలు–రూ.50.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28, 2018. ❖ **వెబ్‌సైట్:** www.cnci.org.in

ఆగ్నేయాసియా, భారత్ మైత్రి

జనరల్ ఎస్సే సివిల్స్, గ్రూప్స్ ప్రత్యేకం

భారత్ తొలినుంచి ప్రపంచ శాంతి కాంక్షిస్తున్న దేశం. సూపర్ పవర్‌గా ఎదుగుతున్నా.. ఎప్పుడూ ఇతర దేశాలపై పెత్తనం చేయాలని చూడలేదు. ఈ వైఖరే ప్రపంచ దేశాల మన్ననలు పొందేలా చేసింది. తాజాగా భారత్ 'తూర్పు దిశగా కార్యాచరణ'లో భాగంగా గణతంత్ర దినోత్సవానికి ఆగ్నేయాసియా దేశాధినేతలకు ఆతిథ్యమిచ్చి.. ఆ దేశాలతో మైత్రీ బంధాన్ని నూతన స్థాయికి తీసుకెళ్లింది. ఇదే సమయంలో చైనా దురాక్రమణ విధానాలతో విసిగిపోయిన ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. దీంతో భవిష్యత్తులో ఆగ్నేయాసియాలో భారత్ కీలక పాత్ర పోషించడం ఖాయంగా కనిపిస్తోంది.



- ఆగ్నేయాసియాలోని చాలా దేశాలు రెండో ప్రపంచయుద్ధానంతరం స్వాతంత్ర్యం పొందాయి. ఆ తర్వాత కొద్ది కాలానికే ఆయా దేశాల మధ్య సరిహద్దు తగాదాలు మొదలయ్యాయి. ఈ వివాదాలను పరిష్కరించే నెపంతో పాశ్చాత్య దేశాలు తిరిగి ఆగ్నేయాసియాలో జోక్యం చేసుకున్నాయి. దీన్ని గుర్తించి సుహార్తో, మహతిర్ మహ్మద్, లీ కెన్ యూ తదితర నాయకులు పరస్పర చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి నడుంబిగించారు. ఇందులో భాగంగా సింగపూర్‌లో 1967, ఆగస్టు 8న ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్‌లు కలిసి కూటమి (ఆసియాన్)గా ఏర్పడుతూ సంబంధిత ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇది బ్యాంకాక్ తీర్మానంగా ప్రసిద్ధి చెందింది. అనంతరం 1984లో బ్రూనై; 1995లో వియత్నాం; 1997లో లావోస్, మయన్మార్; 1999లో కంబోడియాలు ఆసియాన్‌లో చేరాయి. దీంతో ఈ కూటమిలోని దేశాల సంఖ్య పదికి చేరింది. ఆసియాన్ దేశాలు ప్రపంచ భూభాగంలో 3 శాతం; జనాభాలో 9 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఆసియాన్ దేశాలను ఒక ఆర్థిక వ్యవస్థగా పరిగణిస్తే ఆసియాలో మూడవ; ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుంది. ఈ కూటమి వాణిజ్యం, రక్షణ తదితర రంగాల్లో సహకారం కోసం భారత్, జపాన్, చైనా, దక్షిణ కొరియాలను భాగస్వాములుగా చేసుకొని ముందుకు సాగుతోంది. ఆసియాన్ 2017లో 50 ఏళ్లు పూర్తి చేసుకుంది.

ఆసియాన్-భారత్

ఆంగ్లేయులు రాకముందు ఆసియాన్ దేశాలతో భారత్‌కు బలమైన వాణిజ్య సంబంధాలు ఉండేవి. వలసపాలనలో ఇవి పూర్తిగా దెబ్బతిన్నాయి. స్వాతంత్ర్యానంతరం భారత్ 1980, 90 దశకాల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంది. ఆ సమయంలో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలతోపాటు 'తూర్పు వైపు చూపు' అనే విధానాన్ని ప్రారంభించారు. భారత్–ఆసియాన్‌ల మధ్య 1992లో అంశాల వారీగా చర్చలు ప్రారంభం కాగా, 1996 నుంచి పూర్తిస్థాయి చర్చలు జరుగుతున్నాయి. తొలి ఆసియాన్–భారత్ సదస్సు కంబోడియా రాజధాని నాంఫెన్‌లో జరిగింది. 2002 నుంచి ఏటా ఆసియాన్ దేశాల శిఖరాగ్ర సదస్సు అనంతరం ఆసియాన్–భారత్ సదస్సు జరుగుతుంది. 2012 నుంచి ఆసియాన్‌తో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది. 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో 'తూర్పు దిశగా కార్యాచరణ' ప్రారంభమైంది. భారత్–ఆసియాన్ చర్చల భాగస్వామ్యానికి ఇటీవల 25 ఏళ్లు పూర్తయ్యాయి. ఆసియాన్ కూటమిలోని చాలా దేశాలు అలీనోద్యమం (నామ్), బిమ్స్‌టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోపరేటివ్)లో సభ్యులుగా ఉన్నాయి. ఈ దేశాలన్నీ అంతర్జాతీయ వేదికలపై భారత్‌తో కలిసి పనిచేస్తున్నాయి.

చైనా ప్రభావం

ఇటీవల ప్రపంచంపై అమెరికా పట్టు క్రమంగా సడలుతోంది. దీంతో ప్రపంచానికి నాయకత్వం వహించాలని చైనా ఉవ్విళ్లూరుతోంది. ముఖ్యంగా ఆసియా మార్కెట్లను గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు దక్షిణ చైనా సముద్రంపై ఆధిపత్యం చలాయిస్తూ చుట్టుపక్కల దేశాలపై పెత్తనం చేస్తోంది. ఈ చర్యలను ఫిలిప్పీన్స్, బ్రూనై, మలేషియా, వియత్నాం తీవ్రంగా వ్యతిరేకించాయి. చైనాకు వ్యతిరేకంగా ఫిలిప్పీన్స్ అంతర్జాతీయ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. దీనిపై స్పందించిన ట్రిబ్యునల్ ఆ ప్రాంతంలోని అన్ని దేశాలకు దక్షిణ చైనా సముద్రంపై హక్కులు ఉన్నాయని తేల్చిచెప్పింది. కానీ, చైనా మాత్రం ఆ ఆదేశాలను లెక్కచేయడం లేదు. దీంతోపాటు చైనా చేపట్టిన 'వన్ బెల్ట్ వన్ రోడ్' ప్రాజెక్టు కూడా ఆగ్నేయాసియా దేశాలను కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో చైనాను దీటుగా ఎదుర్కొనేందుకు భారత్ తోడ్పడగలదని ఆసియాన్ దేశాలు భావిస్తున్నాయి.

ఆర్థిక సంబంధాలు

ప్రపంచీకరణ ఫలితంగా అంతర్జాతీయ సంబంధాల్లో ఆర్థిక, వాణిజ్య పరమైన అంశాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. కాబట్టి ఆసియాన్ దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉంది. వస్తు సరఫరాకు సంబంధించి ఆసియాన్‌తో 2009లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరగా, 2014లో సేవల ఒప్పందం కుదిరింది. భారత్ ఎగుమతుల్లో ఆసియాన్ వాటా 8.1 శాతంగా ఉంది. 2016–17లో భారత్.. ఆసియాన్‌కు చేసిన మొత్తం ఎగుమతుల విలువ 3,107 కోట్ల డాలర్లు కాగా, దిగుమతులు 4,063 కోట్ల డాలర్లు. వాణిజ్య లోటు 956 కోట్ల డాలర్లుగా ఉంది. ఆసియాన్–భారత్ మధ్య వాణిజ్యాన్ని 2022 నాటికి 200 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

- ఆసియాన్ దేశాల్లో మయన్మార్‌తో మాత్రమే భారత్‌కు భూమార్గ అనుసంధానం ఉంది. ఇది అంత అనుకూలంగా లేకపోవడంతో జలమార్గాలను అభివృద్ధి చేస్తున్నారు. కాలడాన్ మల్టీ–మోడల్ ట్రాన్సిస్ట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టులో భాగంగా కోల్‌కతా రేవుతో మయన్మార్‌లోని సిట్వేని అనుసంధానిస్తున్నారు.
- భారత్–మయన్మార్–థాయిలాండ్ మధ్య 1700 కిలోమీటర్ల పొడవైన హైవే నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మార్గంలో భారత్ 69 వంతెనలు నిర్మిస్తోంది. భవిష్యత్తులో ఈ మార్గాన్ని కాంబోడియా, లావోస్, వియత్నాం వరకు విస్తరించే అవకాశం ఉంది. ఆసియాన్‌తో అనుసంధానానికి భారత్ 'మాస్టర్ ప్లాన్ ఆఫ్ ఆసియాన్ కనెక్టివిటీ' పేరుతో ప్రణాళిక రూపొందించింది. ఇందులో నిర్దేశించుకున్న లక్ష్యాలను 2025లోగా చేరుకోవాలని నిర్ణయించింది.
- ఆసియాన్‌తో వాణిజ్యంలో చైనాతో పోల్చితే భారత్ బాగా వెనకబడి ఉంది. 2014–15లో ఆసియాన్–భారత్ వాణిజ్యం 76.53 బిలియన్ డాలర్లు కాగా, ఆసియాన్–చైనా వాణిజ్యం 452.2 డాలర్లు (6 రెట్లు అధికం)గా ఉంది. 2015–16లో ఆసియాన్ దేశాల్లో భారత్ పెట్టుబడులు 224 మిలియన్ డాలర్లు కాగా, చైనా పెట్టుబడి 3 బిలియన్ డాలర్లుగా ఉంది.
- ఆసియాన్ దేశాలు సముద్రమార్గం ద్వారా భారత్‌తో వాణిజ్యం సాగిస్తున్నాయి. ఈ మార్గాల్లో అక్రమ రవాణా, సముద్ర దొంగల తాకిడి ఎక్కువగా ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సముద్ర భద్రతను పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.

సంపూర్ణ సహకారం

- వస్తు, సేవలకు పరిమితం కాకుండా విద్య, వైద్యం, శాస్త్ర, సాంకేతికత, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారం దిశగా ఆసియాన్–భారత్ బంధం కొనసాగుతోంది.
- 2016లో ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఆసియాన్–భారత్ సదస్సుకు హాజరైన ప్రధాని నరేంద్రమోదీ.. భౌగోళిక, డిజిటల్ అనుసంధానానికి రూ.100 కోట్ల రుణం ప్రకటించారు.
- ఆసియాన్–భారత్ శాస్త్ర సాంకేతిక అభివృద్ధి నిధిని 10 లక్షల డాలర్ల నుంచి 50 లక్షల డాలర్లకు పెంచాలని నిర్ణయించారు.
- వియత్నాం కేంద్రంగా త్వరలో అంతరిక్ష రంగంలో ఆసియాన్–భారత్ సహకార ప్రాజెక్టు ప్రారంభం కానుంది.
- వియత్నాం రక్షణను బలోపేతం చేసేందుకు క్షిపణుల ఎగుమతి, ఆ దేశ వాయుసేన పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది.
- భారత్.. ఆసియాన్ దేశాలతో కలిసి సంయుక్త సైనిక విన్యాసాలు చేపడుతోంది. గతేడాది సింగపూర్ నావికాదళంతో కలిసి సింబెక్స్–17 పేరుతో దక్షిణ చైనా సముద్రంలో వారం రోజులపాటు విన్యాసాలు నిర్వహించింది.
- మలేషియా, వియత్నాం, మయన్మార్ తదితర దేశాలు భవిష్యత్‌లో భారత్ ఇంధన అవసరాలను తీర్చడంలో కీలకపాత్ర పోషించనున్నాయి.

ఢిల్లీ డిక్లరేషన్

ఆసియాన్–భారత్ సంబంధాలకు 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారత్ ఆహ్వానం మేరకు ఆగ్నేయాసియా దేశాధినేతలు జనవరి 25న ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'విలువల భాగస్వామ్యం, ఉమ్మడి లక్ష్యం' ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సు 36 అంశాలతో కూడిన తీర్మాన పత్రాన్ని విడుదల చేసింది. ఇందులో సముద్ర జలాలపై హక్కులకు సంబంధించి దేశాలన్నీ ఐక్యరాజ్యసమితి తీర్మానం (1982), అంతర్జాతీయ నిబంధలకు లోబడి నడుచుకోవాలని పిలుపునిచ్చాయి.

సాంస్కృతిక బంధం

ఆసియాన్ దేశాలతో భారత్‌కు బలమైన సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి. హిందూ, బౌద్ధ సంప్రదాయాలు ఈ బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి. మయన్మార్‌లోని బౌద్ధ పగోడాల రక్షణలో భారత్ పాలుపంచుకుంటోంది. అలాగే మన దేశంలోని నలంద విశ్వవిద్యాలయం పునరుద్ధరణలో భాగమయ్యేందుకు ఆసియాన్ దేశాలు సిద్ధంగా ఉన్నాయి. ఆసియాన్‌లోని చాలా దేశాల్లో రామాయణ గాథలు వివిధ రూపాల్లో ప్రాచుర్యంలో ఉన్నాయి. భారతీయ చిత్రాలకు సింగపూర్, మలేషియాల్లో పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. సింగపూర్‌లో ఒక ప్రాంతాన్ని లిటిల్ ఇండియాగా పిలుస్తారు. దీన్నిబట్టి ఆయా దేశాలతో భారత్‌కు ఉన్న అనుబంధం అర్థమవుతుంది.



బాలలత మల్లవరపు

సివిల్స్ ఫ్యాకల్టీ, హైదరాబాద్.

మంచి మనసుతో జీవించడమే బౌద్ధ ధర్మం

రాష్ట్ర స్థాయి బౌద్ధ సమ్మేళనంలో వక్తలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మంచి మనసు, మంచి ఆలోచనతో ఆదర్శవంతంగా జీవించడమే బుద్ధుడు ప్రవచించిన ధర్మసూత్రాల సారాంశమని రాష్ట్రస్థాయి బౌద్ధ సమ్మేళనంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం ఉదయం తిరుపతి రామానాయుడు కల్యాణ మండపంలో 8వ రాష్ట్రస్థాయి బౌద్ధ సమ్మేళనం జరిగింది.

నీటి నిల్వకు చోటేది?

- రాష్ట్రంలో గ్రామీణ ప్రజలకు కావాల్సింది 1357 టీఎంసీలు
- నిల్వ సామర్థ్యం 230 టీఎంసీలు మాత్రమే
- 337 గ్రామాల్లోనే అవసరానికి సరిపడా నిల్వ సామర్థ్యం
- గ్రామ పంచాయతీల వారీగా వాటర్ బడ్జెట్ రూపకల్పన



సాక్షి, అమరావతి: ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జనాభా ఎంత? ఆ జనాభా మొత్తానికి రోజువారీ అవసరాలకు ఎంత నీరు అవసరం? ఆ గ్రామంలోని పశువులకు ఎంత నీరు కావాలి? గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లో పంటలు పండించడానికి ఎంత పరిమాణంలో నీరు అవసరం? గ్రామ పంచాయతీకి అన్ని అవసరాలకు అవసమైన నీరెంత? వంటి అంశాలపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధ్యయనం చేసింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు వాటర్ బడ్జెట్ రూపకల్పనను ప్రారంభించింది. సాధారణ వర్షపాతం నమోదైనప్పుడు గ్రామంలో ఎంత పరిమాణంలో వర్షం కురిసే అవకాశం ఉంటుందన్న అంచనాలు సిద్ధం చేశారు. వర్షపు నీటి నిల్వకు అక్కడ ఎలాంటి వనరులు ఉన్నాయన్న వివరాలు సేకరించారు. గ్రామంలో పూర్వకాలం నుంచి ఉన్న చిన్న తరహా సాగునీటి చెరువులు, మంచినీటి చెరువులు, కుంటల్లో ఎంత పరిమాణంలో నీరు నిల్వ చేసుకోవచ్చన్న గణాంకాలను రూపొందించారు.

కేవలం 337 పంచాయతీల్లోనే...

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రజల అవసరాలకు 1,357 టీఎంసీల నీరు అవసరమని అంచనా వేయగా.. గ్రామాల్లో కేవలం 230 టీఎంసీలను మాత్రమే నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీలకు గాను 12,815 గ్రామ పంచాయతీల వాటర్ బడ్జెట్‌ను రూపొందించారు. వాటిలో కేవలం 337 పంచాయతీల్లో అక్కడి అవసరానికి సరిపడా వర్షపు నీటి నిల్వకు వనరులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడైంది.

నిల్వ సామర్థ్యం తక్కువే

కర్నూలు, గుంటూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు తేలింది. గుంటూరు జిల్లాలో ఏడాదిపాటు 112 టీఎంసీల పరిమాణంలో వర్షం కురుస్తుందని అంచనా వేయగా, జిల్లాలోని 1,011 గ్రామ పంచాయతీల్లో కేవలం 4 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే చెరువులున్నాయని బహిర్గతమైంది. కర్నూలు జిల్లాలో 889 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు 100 టీఎంసీల నీరు అవసరమని అంచనా వేయగా, జిల్లాలోని అన్ని గ్రామాల్లో కేవలం 2 టీఎంసీల నిల్వకు చెరువులు ఉన్నాయని గుర్తించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా విశాఖ జిల్లాలో 30 టీఎంసీలను నిల్వ చేసుకునేందుకు చెరువులు ఉన్నాయి. జిల్లాలోని 925 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు 136 టీఎంసీలు అవసరమని తేల్చారు.

'ఉపాధి' ఉపయోగించుకోండి

వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి చెరువుల విస్తీర్ణం తక్కువగా ఉన్న గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, వాటర్ షెడ్ పథకం నిధులను ఉపయోగించుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రానికి సూచించింది. ఈ నిధులతో కొత్త నీటి వనరులను సృష్టించుకోవాలని పేర్కొంది. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలిపింది. గ్రామాల్లో భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నీరాంచల్ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో పైలెట్ ప్రాజెక్టుగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసింది.

సీఎం ఇంటి దగ్గర రాయలసీమ న్యాయవాదుల నిరసన

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్

తాడేపల్లి రూరల్ (మంగళగిరి): రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయనందుకు నిరసనగా రాయలసీమ న్యాయవాదులు ఉండవల్లిలోని సీఎం ఇంటి వద్ద శనివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఉండవల్లి కొండవీటి వాగు వద్ద నుంచి సీఎం ఇంటి వద్ద వరకు ప్లకార్డులతో ప్రదర్శనగా వచ్చిన న్యాయవాదులను భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. సీఎంను కలవడానికి అనుమతించకపోవడంతో పోలీసులకు, న్యాయవాదులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాజధాని అమరావతినే పట్టించుకుంటున్నారని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల గురించి ఆలోచించడం లేదని మండిపడ్డారు.

శ్రీకాళహస్తిలో వేడుకగా భూతరాత్రి ఉత్సవాలు

శ్రీకాళహస్తి: చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో మూడో రోజైన శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఉదయం సూర్యప్రభ–చప్పరంపై, రాత్రి భూత–శుక వాహనాలపై ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని హరిజన సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవస్థానంకు చెందిన ధూర్జటి కళా ప్రాంగణంలో వేడుకగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వ్యభిచారం చేయకపోతే చంపేస్తానంటున్నాడు

- మాట వినకపోతే పిల్లల్ని వ్యభిచార గృహానికి అమ్మేస్తాడట..
- 15 ఏళ్లుగా నరకం అనుభవిస్తున్నానంటూ ఓ మహిళ ఆవేదన
- పెద్దమనుషులవద్దే పరిష్కరించుకోమని పోలీసుల సలహా
- ఆశ్రయం కల్పించిన స్ఫూర్తి మహిళామండలి



ఇద్దరు పిల్లలతో కలసి కష్టాన్ని వివరిస్తున్న బాధిత మహిళ, పక్కన స్ఫూర్తి మహిళా మండలి అధ్యక్షురాలు రాధ


సాలూరు: 'అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్తే నా పాలిట శాపమయ్యాడు. అతని జల్సాల కోసం నన్ను వ్యభిచారం చేయమంటున్నాడు. కాదంటే కొడుతున్నాడు. చంపేందుకు కూడా ప్రయత్నించాడు. ఇద్దరు ఆడపిల్లలతో వేరుగా వుంటున్నా..., తాగివస్తూ వేధిస్తున్నాడు. అతని వల్ల నాకు.. నా బిడ్డలకు ప్రాణహాని వుంది. న్యాయం చేయండి' అని పట్టణంలోని నాయుడువీధికి చెందిన మహిళ శనివారం పట్టణ పోలీసులకు పిర్యాదు చేసింది. అనంతరం ఆమె విలేకరుల వద్ద తన వేదన వివరించింది. విశాఖపట్నానికి చెందిన తనకు 17ఏళ్ల క్రితం సాలూరుకు చెందిన లారీడ్రైవర్ మేకల రమణబాబు(లక్ష్మణ)తో వివాహమైందని, రెండేళ్ల వరకు బాగానే కాపురం చేసినా, ఆ తర్వాత నుంచి వేధింపులు మొదలయ్యాయని తెలిపింది. పనికి వెళ్లడం మాని, తాగుతూ జల్సాలు చేసేవాడని, కుటుంబం సుఖంగా వుండాలంటే లారీ యజమానితో వివాహేతర సంబంధం కొనసాగించాలని ఒత్తిడి చేశాడన్నారు. గత్యంతరంలేక ఆ పనికి ఒప్పుకున్నానని, దాన్ని సాకుగా చూపుతూ ఏకంగా వ్యభిచారమే చేయమంటున్నాడని వాపోయింది. పలుమార్లు హత్యాయత్నం కూడా చేశాడని, ఆ బాధలు తట్టుకోలేక రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడ్డానని తెలిపింది. రెండేళ్ల క్రితం తన బిడ్డలతో కలసి ఇల్లు వదిలి బయటకు వచ్చేసానని, అయినా వేధింపులు కొనసాగాయని చెప్పింది. శుక్రవారం అర్ధరాత్రి ఇంటికివచ్చి, పెద్దగొడవ చేసాడని, తనను చంపేస్తానని, పిల్లలను వ్యభిచార గృహానికి అమ్మేస్తానని బెదించాడని వాపోయింది.

ఆదుకున్న స్ఫూర్తి మహిళా మండలి

తన కష్టాలను రెండురోజుల క్రితం స్థానిక స్ఫూర్తి మహిళా మండలి దృష్టికి తీసుకువెళ్లానని, ఆ విషయం తెలియడంతో వేధింపులు ఎక్కువయ్యాయని బాధితురాలు వాపోయింది. శుక్రవారం అర్ధరాత్రి గొడవ అనంతరం మహిళా మండలి అధ్యక్షురాలు బి.రాధ తనతో పాటు పిల్లలకు తన ఇంట్లో ఆశ్రయం కల్పించినట్టు తెలిపింది. పలుమార్లు పట్టణ పోలీసులకు తన కష్టాన్ని వివరించానని, పెద్దల వద్ద పరిష్కరించుకోవాలని చెప్పి పంపించేశారని బాధితురాలు తెలిపింది. సమస్య పరిష్కారానికి వచ్చిన పెద్దలు తమ పక్కలోకొస్తేనే న్యాయం జరిగేలా చూస్తామంటున్నారని కన్నీరుమున్నీరైంది. చివరి ప్రయత్నంగా స్ఫూర్తి మహిళా మండలిని ఆశ్రయించానని, న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయింది.

జర్నలిస్టులకు ఇళ్లపై త్వరలో విధాన నిర్ణయం

మంత్రి కాల్వ శ్రీనివాసులు



ఆర్యాపురం(రాజమహేంద్రవరం): రాష్ట్రంలో అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల నిర్మాణంపై త్వరలో విధాన ప్రకటన చేస్తామని మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. దీనిపై మంత్రి పి.నారాయణతో సమాలోచనలు జరుపుతున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే స్థలాలు ఇచ్చిన వారికి బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. అక్రిడిటేషన్ దుర్వినియోగం జరుగుతోందని, అర్హత ఉన్న వారికి ఏప్రిల్ లోపు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ ఉన్నవారికి ఇళ్ల కేటాయించేందుకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని చెప్పారు. సమాచార శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

రెండో రోజు ఉత్సాహంగా రెవెన్యూ క్రీడలు

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు రెండో రోజైన శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 1400 మందికి పైగా ఉద్యోగులు ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, స్విమ్మింగ్ తదితర పోటీలు నిర్వహించారు. 40 ఏళ్లలోపు విభాగంలో జరిగిన టేబుల్ టెన్నిస్ డబుల్స్ పోటీల్లో అనంతపురం జిల్లాపై తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా టీమ్ విజయం సాధించింది. ఈ పోటీలు ఆదివారం ముగియనున్నాయి. ముగింపు వేడుకలకు ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తదితరులు హాజరుకానున్నారు.

మరో వివాదంలో నెల్లూరు మేయర్

నెల్లూరు సిటీ: నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌కు చెందిన స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మరో వివాదంలో చిక్కుకుంది. చెన్నైకి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో బ్యాంక్ చెన్నైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. దీంతో కంపెనీ తీసుకున్న రుణాలు, ఆస్తులను గుర్తించాలని రిసీవర్‌ను నియమిస్తూ ట్రిబ్యునల్ జనవరి 4న ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు.. తమ కంపెనీని స్టార్ ఆగ్రో మోసం చేసిందని ఆ సంస్థతో వ్యాపార లావాదేవీలు కలిగిన జంపెక్స్ కంపెనీ నెలరోజుల కిందట చెన్నైలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ట్రిబ్యునల్ జారీచేసిన ఉత్తర్వులు బట్టి 2016 ఏప్రిల్ 16న స్టార్ ఆగ్రో కంపెనీ, చెన్నైకి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రుణం తీసుకుంది. 2017 సెప్టెంబర్ 24 నాటికి అది వడ్డీతో కలిపి మొత్తం రూ.174.26కోట్లు బకాయి పడింది. బకాయిలు చెల్లించాలని బ్యాంకు పలుమార్లు కంపెనీకి తాఖీదులు పంపింది. దీనిపై స్టార్ ఆగ్రో యాజమాన్యం స్పందించిన తీరుతో సంతృప్తి చెందని బ్యాంకు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ట్రిబ్యునల్ రిసీవర్‌ను నియమించింది. స్టార్ ఆగ్రో రుణాలు, దానికి సంబంధించిన ఆస్తులు వివరాలు సేకరించాల్సిందిగా రిసీవర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

తపాలా ఉద్యోగులకు కేడర్'

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో పనిచేసే పోస్టల్ ఉద్యోగుల్లో కేడర్ పునర్నిర్మాణ భయం నెలకొంది. శాఖాపరంగా పొందుపర్చిన కొన్ని నిబంధనలు ఉద్యోగులను కొంత మేర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా 30 ఏళ్లకు పైగా సీనియారిటీ ఉన్న ఉద్యోగులందరూ కేడర్ పునర్నిర్మాణం వల్ల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. అంతేకాకుండా సర్కిల్ స్థాయిలో తయారయ్యే సీనియారిటీ జాబితా కావడంతో పోస్టింగ్‌లు కూడా ఏపీ జిల్లాల్లో ఉంటాయో తెలియడం కష్టం. నాలుగైదేళ్లలో రిటైరయ్యే సీనియర్ ఉద్యోగులకు కచ్చితంగా స్థాన చలనం ఉంటుంది. కేడర్ వల్ల కలిగే ప్రయోజనం కంటే బదిలీ జరిగితే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడమే కష్టమన్న భావన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. దీనికితోడు నగర ప్రాంతాల్లో ఉద్యోగులకు లభించే 16 శాతం హెచ్ఆర్ఏ గ్రామీణ ప్రాంతాలకు వెళితే అందదు. దీంతో ఉద్యోగులు వెనుకంజ వేసే వీలుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌లో క్లరికల్ కేడర్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరిగింది. 35 ఏళ్లుగా పనిచేస్తున్నా మూడు వేల మందికి పైగా పదోన్నతులు లేకపోవడం కుంగదీసింది. దీంతో ఉద్యోగ సంఘ నాయకులు కేడర్ రీస్ట్రక్చర్ కోసం డిమాండ్ చేశారు. దీనికి పోస్టల్ డైరెక్టరేట్ నుంచి ఆమోదం లభించింది. 2016లో తపాలా శాఖ ఈ మేరకు కేడర్ రీస్ట్రక్చర్‌కు మార్గదర్శకాలు విడుదల చేసింది. 1977 నుంచి ఇరవయ్యేళ్ల సీనియారిటీ ఉన్న పోస్టల్ అసిస్టెంట్లకు లోయర్ సెలక్షన్ గ్రేడ్(ఎల్ఎస్‌జీ) కల్పిస్తూ ఉత్తర్వులిచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఏర్పాటైన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) ఈ మధ్యనే సమావేశమై కేడర్ పునర్నిర్మాణంపై సమీక్షించింది. ఇందుకోసం పోస్ట్‌మాస్టర్ల పోస్టులను అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన ఆఫీస్‌లను గుర్తించింది.



కోహ్లితో స్నేహానికి రాజకీయ పరిమితుల్లేవు: ఆఫ్రిది

పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షాహిద్ ఆఫ్రిది తన స్నేహ స్వభావాన్ని చాటుకున్నాడు. భారత కెప్టెన్ విరాట్ కోహ్లితో తన స్నేహాన్ని రాజకీయ పరిస్థితులు నిర్వచించలేవని అన్నాడు. వ్యక్తులు, దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడానికి క్రికెటర్లుగా ఆదర్శంగా ఉండాలనేదే తన సిద్ధాంతమని ఆఫ్రిది చెప్పాడు. 'విరాట్ ఒక అద్భుత వ్యక్తి. ప్రస్తుతం భారత క్రికెట్‌కు అతనే అంబాసిడర్. కోహ్లితో మాట్లాడిన ప్రతీసారి ఆత్మీయ అనుభూతి పొందుతా. అతడికి వివాహ అభినందనలు కూడా తెలిపా. నా స్వచ్ఛంద సంస్థకు సంతకం చేసిన తన జెర్సీని పంపించాడు' అని ఆఫ్రిది గుర్తుచేసుకున్నాడు.

గులాబీ ముల్లు గుచ్చేసింది

- నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా విజయం
- గెలిపించిన క్లాసెన్, మిల్లర్
- వర్షంతో లక్ష్యం కుదింపు
- ధావన్ శతకం వృథా

'పింక్' పోరులో భారత జోరు తేలిపోయింది. గులాబీ ముల్లు గుచ్చేసింది. దక్షిణాఫ్రికా తనదైన శైలిలో గెలిచింది. నాలుగో వన్డేలో ధావన్ సెంచరీ చేసినా... కోహ్లి కసిదీరా ఆడినా... గులాబీ జెర్సీలో మమ్మల్ని ఓడించలేరని సఫారీ తేలిగ్గా తేల్చేసింది. మొత్తానికి భారత జైత్రయాత్రను వాండరర్స్‌లో మొదట వర్షం అడ్డుకుంటే... తర్వాత ప్రత్యర్థి జట్టు ఓడించేదాకా ఆడుకుంది.



జొహన్నెస్‌బర్గ్: భారత్ భారీ స్కోరు నిలవలేదు. పేస్ పదును సరిపోలేదు. స్పిన్ పాచిక పారలేదు. కొత్త చరిత్ర సృష్టించేందుకు వాన, వాండరర్స్ మైదానం రెండూ సహకరించలేదు. నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా 'పింక్'స్థైర్యమే గెలిచింది. టీమిండియా 'హ్యాట్రిక్' విజయాలకు బ్రేకులేసింది. శనివారం ఆగి... ఆగి... సాగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. శిఖర్ ధావన్ (105 బంతుల్లో 109; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీ సాధించగా, కోహ్లి (83 బంతుల్లో 75; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. రబడ, ఇన్‌గిడి చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత వర్షం కారణంగా దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 28 ఓవర్లలో 202 పరుగులుగా నిర్ణయించగా... ఆ జట్టు 25.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసి గెలిచింది. చాహల్ బౌలింగ్‌లో లైఫ్‌లు పొందిన మిల్లర్ (28 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) సఫారీకి గెలుపు బాట వేశాడు. క్లాసెన్ (27 బంతుల్లో 43 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) కడదాకా నిలిచి జట్టును గెలిపించాడు. ఫెలుక్‌వాయో (5 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. భారత ఫీల్డింగ్ వైఫల్యాలు, కీలకమైన క్యాచ్‌ల నేలపాలు సఫారీకి కలిసొచ్చాయి. సిరీస్‌లో ఐదో వన్డే మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగుతుంది. ఆరు వన్డేల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 3–1తో ఆధిక్యంలో ఉంది.

ధాటిగా ఆడిన ధావన్, కోహ్లి

గాయపడిన కేదార్ జాదవ్ స్థానంలో భారత్ తుది జట్టులో శ్రేయస్ అయ్యర్‌ను తీసుకోగా... డివిలియర్స్, మోర్నీ మోర్కెల్‌లు సఫారీ తుది జట్టులోకి వచ్చారు. టాస్ నెగ్గిన భారత్ ముందుగా బ్యాటింగ్‌కు దిగగా... రోహిత్ శర్మ (5) మరోసారి విఫలమయ్యాడు. రబడ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. దీంతో భారత్ 20 పరుగులకే మొదటి వికెట్‌ను కోల్పోయింది. ఇక మరో వికెట్ కోసం దక్షిణాఫ్రికా చెమటోడ్చింది. క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ కోహ్లి, ధావన్‌తో కలిసి స్కోరు బోర్డును ధాటిగా పరిగెత్తించాడు. దీంతో జట్టు స్కోరు 19వ ఓవర్లో వంద పరుగులు చేరింది. తర్వాత కూడా ఓవర్‌కు సగటున 6 రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. ఈ జోడీని విడగొట్టేందుకు సఫారీ బౌలర్ల ప్రయత్నాలేవీ ఫలించలేదు. మొదట ధావన్ ఆ తర్వాత కోహ్లి (56 బంతుల్లో; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. భారత్ స్కోరు 25 ఓవర్లలో 150కి చేరింది. ఎట్టకేలకు జట్టు స్కోరు 178 పరుగుల వద్ద మోరిస్ బౌలింగ్‌లో మిల్లర్‌కు క్యాచ్ ఇచ్చి కోహ్లి నిష్క్రమించడంతో 158 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

ఏమైంది ఈ జోరుకు...

కోహ్లి ఔటయ్యే సమయానికి స్కోరు 31.1 ఓవర్లలో 178/2. చేతిలో మరో 8 వికెట్లుండటంతో 340 పరుగుల భారీ స్కోరు ఖాయమనుకుంటే కనీసం మూడొందలైనా చేయలేకపోయింది. రహానే, శ్రేయస్ అయ్యర్, పాండ్యా అంతా మూకుమ్మడిగా విఫలమయ్యారు. వరుస ఓవర్లలో ధావన్, రహానే (8) నిష్క్రమించడం భారత్‌ను దెబ్బ తీసింది. దీంతో శ్రేయస్ (18), ధోని (42 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) ఆచితూచి ఆడటంతో స్కోరు వేగం పూర్తిగా మందగించింది. చివర్లో భారీషాట్ల కోసం ప్రయత్నించినప్పటికీ దక్షిణాఫ్రికా బౌలర్ల చేతికి చిక్కారు. పాండ్యా (9) కొట్టిన షాట్‌ను మార్క్‌రమ్ లిప్తపాటు కాలంలోనే గాల్లో అందుకున్న తీరు అద్భుతం.


ఫెలుక్‌వాయో

ధావన్ ఆటకు 'వంద'నం...

ఈ మ్యాచ్‌లో ధావన్ ఆటే హైలైట్. వన్డే కెరీర్‌లో 100వ మ్యాచ్ ఆడుతున్న శిఖర్ సెంచరీ బాదాడు. ఈ శతక సాధనలో ఎక్కడా సహనం కోల్పోలేదు. ఏ బౌలర్‌కూ తలొగ్గలేదు. రోహిత్‌తో శుభారంభం లభించకపోయినా... సారథి కోహ్లితో చక్కని సమన్వయానికి ఒక్కో పరుగు పేర్చాడు. ఇన్నింగ్స్ ఆసాంతం నిలకడగా ఆడాడు. మొదట 53 బంతుల్లో అర్ధసెంచరీ (5 ఫోర్లు)ని పూర్తి చేసుకున్న ఈ లెఫ్ట్ హ్యాండర్ సెంచరీ మార్క్‌లో రెండు భారీ సిక్సర్లు బాదాడు. 99 బంతుల్లో (10 ఫోర్లు, 2 సిక్స్‌లు) 13వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. తద్వారా వందో మ్యాచ్‌లో వంద పరుగులు చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా రికార్డులకెక్కాడు. గతంలో వందో మ్యాచ్‌లో గంగూలీ చేసిన 97 పరుగులే (1999 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై) భారత్ తరఫున మెరుగైన స్కోరు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి అండ్ బి) రబడ 5; ధావన్ (సి) డివిలియర్స్ (బి) మోర్కెల్ 109; కోహ్లి (సి) మిల్లర్ (బి) మోరిస్ 75; రహానే (సి) రబడ (బి) ఇన్‌గిడి 8; అయ్యర్ (సి) మోరిస్ (బి) ఇన్‌గిడి 18; ధోని నాటౌట్ 42; పాండ్యా (సి) మార్క్‌రమ్ (బి) రబడ 9; భువనేశ్వర్ రనౌట్ 5; కుల్దీప్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 289.**

వికెట్ల పతనం: 1–20, 2–178, 3–206, 4–210, 5–247, 6–262, 7–282. **బౌలింగ్:** మోర్కెల్ 10–0–55–1, రబడ 10–0–58–2, ఇన్‌గిడి 10–0–52–2, మోరిస్ 10–0–60–1, ఫెలుక్‌వాయో 6–0–38–0, డుమిని 4–0–20–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 22; ఆమ్లా (సి) భువనేశ్వర్ (బి) కుల్దీప్ 33; డుమిని (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 10; డివిలియర్స్ (సి) రోహిత్ శర్మ (బి) పాండ్యా 26; మిల్లర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 39; క్లాసెన్ నాటౌట్ 43; ఫెలుక్‌వాయో నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (25.3 ఓవర్లలో ఐదు వికెట్లకు) 207.**

వికెట్ల పతనం: 1–43, 2–67, 3–77, 4–102, 5–174.

బౌలింగ్: భువనేశ్వర్ 4–0–27–0, బుమ్రా 5–0–21–1, కుల్దీప్ 6–0–51–2, పాండ్యా 5–0–37–1, చహల్ 5.3–0–68–1.

1 అరంగేట్రం వన్డేలో డకౌట్ అయి, 100వ మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఏకైక క్రికెటర్ శిఖర్ ధావన్.

1 భారత్ తరఫున రెండో వికెట్‌కు అత్యధికంగా తొమ్మిదిసార్లు శతక భాగస్వామ్యాల్లో పాలుపంచుకొని గంగూలీ- ద్రవిడ్ పేరిట ఉన్న రికార్డును కోహ్లి-ధావన్ సమం చేశారు.

1 తాను ఆడిన 100వ వన్డేలో సెంచరీ చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్ శిఖర్ ధావన్. ఓవరాల్‌గా తొమ్మిదో క్రికెటర్. గతంలో గార్డన్ గ్రీనిడ్జ్ (వెస్టిండీస్), క్రిస్ కెయిన్స్ (న్యూజిలాండ్), మొహమ్మద్ యూసుఫ్ (పాకిస్తాన్), కుమార సంగక్కర (శ్రీలంక), క్రిస్ గేల్ (వెస్టిండీస్), ట్రెస్కోథిక్ (ఇంగ్లండ్), రామ్‌నరేశ్ శర్వాణ్ (వెస్టిండీస్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా) ఈ ఘనత సాధించారు.

1 దక్షిణాఫ్రికా గడ్డపై ద్వైపాక్షిక సిరీస్‌లలో (టెస్టు, వన్డే, టి20 ఫార్మాట్) అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్‌గా కోహ్లి (679 పరుగులు) రికార్డు సృష్టించాడు. ఇప్పటిదాకా ఈ రికార్డు బ్రియాన్ లారా (వెస్టిండీస్: 627; 2003-2004 సిరీస్) పేరిట ఉండేది.

34 భారత్ తరఫున 100 వన్డేలు ఆడిన 34వ క్రికెటర్ శిఖర్ ధావన్.

'పింక్' వాండరర్స్



రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో పింక్ జెర్సీలతో మైదానంలోకి దిగారు. దీనికి మద్దతుగా ప్రేక్షకులు సైతం గులాబీ రంగు టీషర్టులు, టోపీలు, కళ్ల జోడులతో స్టేడియాన్ని పింక్ మయం చేశారు. ఆశ్చర్యకరంగా స్టేడియంలోని ప్రకటనలు కూడా గులాబీ వర్ణంలోనే దర్శనమిచ్చాయి.

ఆట ఆగింది!

ధావన్ సెంచరీ పూర్తయిన కాసేపటికి జట్టు స్కోరు 200 పరుగులకు చేరింది. ఈ దశలో మేఘాలను చీల్చే ఉరుములు, మెరుపులతో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. అంపైర్లు మ్యాచ్‌ను కాసేపు నిలిపివేశారు.



క్లీన్‌స్వీప్ చేజారింది

మూడోవన్డేలో భారత్ ఓటమి


దీప్తి శర్మ

పోచెఫ్‌స్ట్రూమ్: ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన మూడో వన్డేలో భారత్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావించిన మిథాలీ సేనకు నిరాశ ఎదురైంది. చివరిదైన మూడో వన్డేలో సఫారీలు ఏడు వికెట్లతో భారత్‌ను ఓడించారు. మొదట భారత్ 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ కాగా... దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన మిథాలీ సేనకు ఇన్నింగ్స్ ప్రారంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత రెండు మ్యాచ్‌ల్లో విజృంభించిన స్మృతి మంధాన... ఈసారి దక్షిణాఫ్రికా పేసర్ షబ్నమ్ ఇస్మాయిల్ (4/30) వేసిన తొలి బంతికే వెనుదిరిగింది. ఆ తర్వాత మరో ఓపెనర్ దీప్తి శర్మ (112 బంతుల్లో 79; 8 ఫోర్లు), వేద కృష్ణమూర్తి (64 బంతుల్లో 56; 8 ఫోర్లు) రాణించడంతో జట్టు ఓ మోస్తరు స్కోరు చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 25; 4 ఫోర్లు), శిఖా పాండే (16 బంతుల్లో 31 నాటౌట్; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ మిథాలీరాజ్ (4) విఫలమైంది. అనంతరం దక్షిణాఫ్రికా డు ప్రీజ్ (111 బంతుల్లో 90 నాటౌట్; 7 ఫోర్లు), లారా వోల్వార్ట్ (88 బంతుల్లో 59; 4 ఫోర్లు), కెప్టెన్ నికెర్క్ (30 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు) రాణించడంతో నాలుగు బంతులు మిగిలుండగానే 241 పరుగులు చేసి గెలిచింది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్ జులన్ గోస్వామి బరిలోకి దిగలేదు. తొలి రెండు వన్డేలు గెలిచిన భారత్ 2–1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టి20 సిరీస్ ఈ నెల 13 నుంచి ప్రారంభం కానుంది.

తొలి స్వర్ణం స్వీడన్ ఖాతాలో

వింటర్ ఒలింపిక్స్


చార్లోటి కల్లా

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): వింటర్ ఒలింపిక్స్‌లో తొలి పసిడి పతకం స్వీడన్ ఖాతాలోకి వెళ్లింది. పోటీల తొలి రోజు శనివారం మహిళల స్కీయాథ్లాన్ క్రాస్ కంట్రీ ఈవెంట్‌లో స్వీడన్‌కు చెందిన చార్లోటి కల్లా విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మారిట్ జోయెర్న్ (నార్వే) రజతం... క్రిస్టా పర్మాకోస్కి (ఫిన్‌లాండ్) కాంస్యం సాధించారు. ఆతిథ్య దక్షిణ కొరియా జట్టు తొలి రోజే పసిడి బోణీ చేసింది. పురుషుల 1500 మీటర్ల షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్‌లో లిమ్ హయోజున్ కొరియాకు బంగారు పతకాన్ని అందించాడు.

మరోవైపు మహిళల ఐస్ హాకీ మ్యాచ్‌లో దక్షిణ కొరియా–ఉత్తర కొరియా క్రీడాకారిణులతో కూడిన ఉమ్మడి కొరియా జట్టుకు ఓటమి ఎదురైంది. స్విట్జర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉమ్మడి కొరియా 0–8తో పరాజయం పాలైంది.

34వ స్థానంలో శివ కేశవన్



వరుసగా ఆరో వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత స్టార్ శివ కేశవన్‌కు తొలి రోజు నిరాశే ఎదురైంది. ల్యూజ్ క్రీడాంశం సింగిల్స్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన శివ కేశవన్ తొలి రోజు రెండు రేసులు ముగిశాక 1ని:39.288 సెకన్లతో 34వ స్థానంలో ఉన్నాడు. 1,365 మీటర్లతో కూడిన ట్రాక్‌పై అతను తొలి రేసును 50.578 సెకన్లలో... రెండో రేసును 48.710 సెకన్లలో ముగించాడు. 40 మంది పాల్గొంటున్న ఈ రేసులో ఆదివారం మరో రెండు రేసులు జరుగుతాయి. నిర్ణీత నాలుగు రేసులు ముగిశాక అత్యుత్తమ సమయం నమోదు చేసిన తొలి ముగ్గురికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందజేస్తారు.

సిరీస్ శ్రీలంకదే

రెండో టెస్టులో 215 పరుగులతో బంగ్లాదేశ్‌పై విజయం


ధనంజయకు చండిమాల్ అభినందన

ఢాకా: స్పిన్నర్లు అకిల ధనంజయ (5/24), రంగన హెరాత్ (4/49) మాయాజాలంతో... బంగ్లాదేశ్‌తో జరిగిన చివరిదైన రెండో టెస్టులో శ్రీలంక 215 పరుగులతో ఘనవిజయం సాధించింది. ఇరు జట్ల మధ్య తొలి టెస్టు 'డ్రా'గా ముగియడంతో... ఈ గెలుపుతో లంక 1–0తో సిరీస్ సొంతం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 200/8తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 226 పరుగులకు ఆలౌటైంది. 339 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ పూర్తిగా విఫలమవడంతో 123 పరుగులకే కుప్పకూలింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాలు చేసిన రోషన్ సిల్వాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఈ మ్యాచ్‌లో తైజుల్ ఇస్లామ్ వికెట్ తీయడం ద్వారా సీనియర్ స్పిన్నర్ రంగన హెరాత్ అత్యధిక వికెట్లు (415) పడగొట్టిన లెఫ్టార్మ్ బౌలర్‌గా ఘనత సాధించాడు. గతంలో పాక్ బౌలింగ్ దిగ్గజం వసీమ్ అక్రమ్ (414) పేరిట ఈ రికార్డు ఉంది. ఇరు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్ ఈనెల 15న మొదలవుతుంది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 222; బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 110; శ్రీలంక రెండో ఇన్నింగ్స్: 226 ఆలౌట్; బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: 123 ఆలౌట్ (మోమినుల్ హక్ 33; ధనంజయ 5/24, హెరాత్ 4/49).


ఫించ్ షార్ట్

ఫైనల్లో ఆస్ట్రేలియా

ముక్కోణపు టి20 టోర్నీ

మెల్‌బోర్న్: సమష్టి ఆటతీరు కనబరుస్తున్న ఆస్ట్రేలియా ముక్కోణపు టి20 టోర్నీలో తమ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించి... మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఫైనల్‌కు చేరింది. శనివారం ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టి20లో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. రిచర్డ్‌సన్ (3/33), స్టాన్‌లేక్ (2/28) ధాటికి నిలవలేక తక్కువ స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ జోస్ బట్లర్ (49 బంతుల్లో 46; 3 ఫోర్లు) బిల్లింగ్స్ (23 బంతుల్లో 29; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం బరిలోకి దిగిన ఆసీస్ మ్యాక్స్‌వెల్ (26 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షార్ట్ (36 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), క్రిస్ లిన్ (19 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫించ్ (5 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తలో చేయి వేయడంతో 14.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసింది. ముక్కోణపు టోర్నీలో భాగంగా తొలి మూడు మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలో జరగ్గా... మిగతా మూడు మ్యాచ్‌లతో పాటు ఫైనల్‌కు న్యూజిలాండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. మంగళవారం వెల్లింగ్టన్‌లో జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో న్యూజిలాండ్ ఆడుతుంది.

గ్రూప్-1లోనే భారత్

చైనీస్ తైపీపై 2-0తో విజయం


అంకిత కర్మన్‌కౌర్

న్యూఢిల్లీ: ఫెడ్ కప్ ఆసియా ఓసియానియా టెన్నిస్ టోర్నమెంట్ గ్రూప్–1లో ఉండాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ సత్తా చాటింది. ఇప్పటికే వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన భారత్ శనివారం చైనీస్ తైపీతో జరిగిన మ్యాచ్‌లో 2–0తో గెలుపొందింది. తొలి సింగిల్స్‌లో కర్మన్‌కౌర్ థండి గెలుపొందడం... రెండో మ్యాచ్‌లో అంకిత జోరు కొనసాగించడంతో భారత్ విజయంతో టోర్నీని ముగించింది. తొలి మ్యాచ్‌లో కర్మన్‌కౌర్ 7–6 (7/4), 6–3తో లీ పై చీపై విజయం సాధించడం ద్వారా 1–0 ఆధిక్యం అందించింది. ఆ తర్వాత సుదీర్ఘంగా సాగిన రెండో మ్యాచ్‌లో అంకిత 6–4, 5–7, 6–1తో ప్రపంచ 377వ ర్యాంకర్ చియెయూ సూపై గెలుపొందింది. 2 గంటల 54 నిమిషాల పాటు సాగిన ఈ మారథాన్ మ్యాచ్‌లో అంకిత అద్భుత ప్రదర్శన కనబర్చింది. టోర్నీలో అంకిత నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందడం విశేషం.

సాక్షి
రౌండప్
విజయవాడ
ఆదివారం | ఫిబ్రవరి | 11 | 2018
www.sakshi.com

100.17 కోట్లు
గతేడాది
ప్రపంచవ్యాప్తంగా
అమ్ముడైన 4జీ స్మార్ట్‌ఫోన్లు



అమ్మ భాషను ఆదరిద్దాం

- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ
- ఇతర భాషలు జీవనోపాధి కోసం నేర్చుకోవాలి
- శ్రీకృష్ణదేవరాయ మహోత్సవం, తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సాక్షి, విజయవాడ: శాస్త్ర సాంకేతిక అంశాలను సరళమైన తెలుగులో తెచ్చేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ కోరారు. శనివారం కృష్ణా జిల్లా శ్రీకాకుళంలోని ఆంధ్ర మహావిష్ణు దేవాలయంలో శ్రీకృష్ణదేవరాయ మహోత్సవం–2018, తెలుగు భాషా బ్రహ్మోత్సవాలను ఆయన ప్రారంభించారు. తెలుగువారు తెలుగులోనే మాట్లాడుకోవాలని కోరారు. పిల్లలకు తెలుగును ప్రథమ భాషగా బోధించాలని, ఆటపాటలు అమ్మ భాషలోనే సాగాలన్నారు. తెలుగులో ఉత్తరాలు రాసుకోవాలని, పెద్దబాల శిక్ష ప్రతి ఇంటా ఉండేలా చూడాలని సూచించారు.

మాతృభాషపై మార్కెట్ శక్తుల ప్రభావం

సెల్‌ఫోన్లు, కంప్యూటర్లలో తెలుగు వినియోగించుకునే అవకాశం ఉన్నా సాంకేతిక సౌలభ్యం లేక ఇంగ్లిషు భాషపై ఆధారపడాల్సి వస్తోందని జస్టిస్ ఎన్.వి.రమణ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన జపాన్, దక్షిణ కొరియాలో విద్యావేత్తలు, న్యాయమూర్తులు, పారిశ్రామికవేత్తలు మాతృ భాషల్లోనే మాట్లాడటం చూశానని తెలిపారు. వారు మాట్లాడే భాషను ట్రాన్స్‌లేటర్లు ఇంగ్లిషులో తర్జుమా చేస్తున్నారని వివరించారు. మాతృభాషను మార్కెట్ శక్తులను ప్రభావితం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఉద్యోగ అవకాశాల కోసం ఆంగ్ల భాష అవసరమే అయినా మాతృభాషను వదిలి వేయాల్సిన అవసరం లేదన్నారు.

తెలుగు భాషపై రాసిన వ్యాసంతో గుర్తింపు


తాను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు జడ్జిగా పలు తీర్పులు ఇచ్చినా రాని గుర్తింపు తెలుగు భాష గురించి ఓ వ్యాసం రాయడం ద్వారా తెలుగు భాషా సమావేశాల్లో పాల్గొనే అవకాశం వచ్చిందని జస్టిస్ రమణ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రజలంతా విభజన తరువాత ఏర్పడిన సమస్యలు గురించి ఆలోచిస్తున్నందున ఈ సమావేశాల్లో కవులు వాటి గురించి కూడా చర్చించాలన్నారు. భారతీయతను కాపాడటం, పెంపొందించటంలో తెలుగు భాష కీలకపాత్ర పోషిస్తోందని సమావేశంలో పాల్గొన్న సినీ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు ఆముక్త మాల్యదను రచించిన శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణువు సన్నిధిలో తెలుగు బ్రహోత్సవాలు జరగడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా 'దేశ భాషలందు తెలుగు లెస్స' 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం' 'ద్రావిడ మంగోలు భాషల జన్య సంబంధాలు' తదితర ఏడు గ్రంథాలను ఆవిష్కరించారు.



శ్రీకృష్ణదేవరాయ ఉత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ దంపతులు

టీడీపీ ఇప్పుడు ఎందుకు స్వరం మార్చింది?

ట్విటర్లో పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఇంతకుముందు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినప్పుడు స్వాగతించిన తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు హఠాత్తుగా అది అమల్లోకి రాలేదంటూ ఎందుకు అంటోందో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ శనివారం ట్వీట్ చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు హక్కుగా రావాల్సిన నిధులను ప్యాకేజీలో పేర్కొన్నారే తప్ప ఈ ప్యాకేజీలో ఎటువంటి ప్రత్యేకతలు లేవన్న విషయాన్ని జనసేన పార్టీతో పాటు ఇతరులు కూడా విమర్శించిన సంగతిని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రం ఇస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనలపై విచారించి వాస్తవాలను బహిర్గతం చేయడానికి తక్షణం సంయుక్త నిజనిర్ధారణ కమిటీని(జేఎఫ్‌సీ) ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వ మాజీ అధికారులు, విద్యావేత్తలతో పాటు సామాజికవేత్తలు, రాజకీయ నాయకులతో జేఎఫ్‌సీని ఏర్పాటుచేయాలంటూ ట్వీట్ చేశారు. ఈ నివేదిక ఆధారంగా రాజకీయ ఐక్య కార్యచరణ కమిటీ తదుపరి కార్యచరణను నిర్ణయించాలని అభిప్రాయపడ్డారు. కాగా, టీఆర్ఎస్ ఎంపీ కవితకు పవన్ కళ్యాణ్ తన ట్వీట్‌లో కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలుచేయాలంటూ పార్లమెంటులో మద్దతుగా నిలిచినందుకు చెల్లెలు కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలంటూ పవన్ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించే హక్కు గీతకు లేదు

టీడీపీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి

మెంటాడ(సాలూరు): కొత్తపల్లి గీత ఎంపీ కావడం వైఎస్సార్‌సీపీ పుణ్యమేననీ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెను కష్టపడి గెలిపించారని పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశం కల్పించిన పార్టీని విమర్శించే అర్హత ఆమెకు లేదని టీడీపీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. ఆమెకు రాజకీయ భిక్షపెట్టిన వైఎస్సార్‌సీపీ, అనంతరం ఆమె చేరిన తెలుగుదేశం పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయంటూ శుక్రవారం ఆమె పార్లమెంట్‌లో వ్యాఖ్యానించడం సిగ్గుచేటని మండిపడ్డారు. విజయనగరం జిల్లా మెంటాడలో ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాష్ట్రంలో జరిగిన నిరసన సమైక్యాంధ్ర ఉద్యమపోరాటాన్ని గుర్తుకు తెచ్చిందన్నారు. కొన్ని రాష్ట్రాలకు ఎక్కువ నిధులిస్తున్న కేంద్రం, మన రాష్ట్రాన్ని చిన్నచూపు చూస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

కర్నూలులో ఉన్నతాధికారి బ్యాంక్ అకౌంట్ హ్యాక్

రూ.6 లక్షల మేర డ్రా చేసిన హ్యాకర్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: కర్నూలు జిల్లాలో ఏకంగా ఒక ముఖ్య ఉన్నతాధికారి బ్యాంకు అకౌంట్ హ్యాక్ అయ్యింది. దాని నుంచి రూ.6 లక్షల మేర హ్యాకర్ డ్రా చేసుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన సదరు ఉన్నతాధికారి పోలీసుల సహాయంతో హ్యాకర్‌ను పట్టుకున్నట్టు సమాచారం. అయితే, సదరు హ్యాకర్ నుంచి ఇంకా డబ్బు వసూలు కాలేదని తెలిసింది. మొత్తం వ్యవహారం ఎక్కడా లీకు కాకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. ఏ విధంగా హ్యాక్ చేశారనే కోణంలో విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరి ఒక్కరి అకౌంట్ మాత్రమే హ్యాక్ అయ్యిందా? లేక ఇంకా బాధితులు ఉన్నారా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారాన్ని ఎందుకు రహస్యంగా ఉంచుతున్నారనే అంశం కూడా అంతుబట్టడం లేదు. హ్యాకర్ నుంచి రూ.6 లక్షలు వసూలు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇప్పటివరకు రికవరీ కాలేదని తెలిసింది.

ఆరోపణలను ఖండించిన సతీష్ చంద్ర

సాక్షి, అమరావతి: అధికార టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి తనను ఉద్దేశించి చేసిన ఆరోపణలను సీఎం కార్యాలయం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర ఖండించారు. 'రాజ్యసభ ఎన్నికలపై ఈసీ నిఘా!' శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తలో తనపై చేసిన ఆరోపణలు బాధించాయన్నారు. రాజకీయ వ్యవహారాలకు తాను దూరంగా ఉంటానని, ఏ పార్టీకి తొత్తులా వ్యవహరించడం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తన వద్దకు వస్తుంటారని, ఓ అధికారిగా సీఎం దృష్టికి వాటిని తీసుకు వెళ్లడం తన బాధ్యతని చెప్పారు.

తాత్కాలిక హైకోర్టుకు వసతుల పరిశీలన

- గుంటూరు, కృష్ణా జిల్లాల్లో హైకోర్టు న్యాయమూర్తుల పర్యటన
- ఆచార్య ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం వివరాల సేకరణ
- జస్టిస్ సిటీ ప్రాంతం, 'కృష్ణా'లో నిమ్రా కాలేజీల పరిశీలన

ఏఎన్‌యూ (పొన్నూరు)/తుళ్లూరు రూరల్/ఇబ్రహీంపట్నం (మైలవరం) : తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల బృందం శనివారం గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలోని నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల భవనాలను శనివారం పరిశీలించింది. ముందుగా న్యాయమూర్తులు యూనివర్సిటీని సందర్శించారు. అక్కడ న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రహ్మణ్యన్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ సునీల్‌చౌదరి, జస్టిస్ సత్యనారాయణమూర్తిలతో కూడిన బృందానికి ఏఎన్‌యూ దూరవిద్యా కేందం వద్ద వీసీ ఆచార్య ఎ. రాజేంద్రప్రసాద్, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ స్వాగతం పలికారు. అనంతరం వారు దూరవిద్యా కేంద్ర డైరెక్టర్ చాంబర్‌లో వర్సిటీ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. దూరవిద్యా కేంద్ర భవన విస్తీర్ణం, భవనంలో మొత్తం గదులు, వాటిలోని వసతులు, పరిసరాల్లో ఉన్న భవనాల వివరాలు, వాటిలో జరిగే కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. మూడు అంతస్తుల విస్తీర్ణం కలిపి మొత్తం 1.14 లక్షల చదరపు అడుగులు ఉంటుందని అధికారులు వివరించారు. దూరవిద్యా కేంద్రం భవనంపై మరో అంతస్తు నిర్మాణంపై వర్సిటీ ఇంజినీర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అకౌంట్స్, అడ్మిషన్స్ కార్యాలయాలను న్యాయమూర్తులు పరిశీలించారు. సమావేశం అనంతరం న్యాయమూర్తుల బృందం సమీపంలోని రామకృష్ణ హౌసింగ్ ప్రాంగణాన్ని పరిశీలించింది. అక్కడ నుంచి వెలగపూడిలో నిర్మించిన తాత్కాలిక సచివాలయం భవనాలను న్యాయమూర్తులు పరిశీలించారు. అనంతరం నేలపాడు వద్ద జస్టిస్ సిటీ నిర్మాణానికి కేటాయించి స్థలాన్ని, ఎన్జీవోల కోసం చేపట్టిన బహుళ అంతస్తుల భవనాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు.



ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం నుంచి బయటకు వస్తున్న న్యాయమూర్తుల బృందం, వర్సిటీ, ప్రభుత్వ అధికారులు

నిమ్రా కళాశాల భవనం పరిశీలన

ఇదిలా ఉంటే.. కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలోని నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల భవనాలను కూడా న్యాయమూర్తులు పరిశీలించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం కళాశాల భవనాల ప్లాన్‌ను న్యాయమూర్తులు పరిశీలించారు.

అనుకూలంగా లేవా!?

ఇదిలా ఉండగా వర్సిటీలోని దూరవిద్యా కేంద్రంలో వసతులు హైకోర్టు ఏర్పాటుకు అనుకూలంగా లేనట్లు తెలుస్తోంది. హైకోర్టుకు 1.50 లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణం ఉన్న భవనం కావాల్సి ఉండగా ఇక్కడ 1.14 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణమే ఉంది. దీంతోపాటు 25 కోర్టు హాల్స్, దాంతోపాటు న్యాయమూర్తుల విశ్రాంతి గదులు తదితర అవసరాలకు గదులు కావాల్సి ఉంది. వీటన్నింటికి సరిపడా మౌలిక వసతులు భవనంలో లేవు. పైగా హైకోర్టు అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయటం వెంటనే సాధ్యమయ్యే పనికాదని అభిప్రాయపడినట్లు సమాచారం.

హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయండి

రాష్ట్రంలో హైకోర్టును రాయలసీమలో ఏర్పాటుచేయాలని రాయలసీమ హైకోర్టు సాధన సమితి జేఏసీ నాయకులు హైకోర్టు న్యాయమూర్తులను కోరారు. తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకు వసతులను పరిశీలించేందుకు శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి వచ్చిన న్యాయమూర్తుల బృందానికి జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కేరళ, గుజరాత్, యూపీ, ఎంపీ, రాజస్థాన్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో హైకోర్టు క్యాపిటల్ సిటీకి దూరంగానే ఉందని వివరించారు. న్యాయమూర్తులను కలిసిన వారిలో కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి. నాగలక్ష్మి, జేఏసీ నాయకులు జీవీ రాఘవరెడ్డి, పి. సుబ్రహ్మణ్యం, బాలిరెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్

మద్రాసు హైకోర్టు సీజే ఇందిరా బెనర్జీ కూడా..

సాక్షి, తిరుమల: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.భవానీప్రసాద్, మద్రాసు హైకోర్టు సీజే జస్టిస్ ఇందిరా బెనర్జీ శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఓఎస్డీ లక్ష్మీనారాయణ యాదవ్ ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ప్రొటోకాల్ జడ్జి సన్యాసినాయుడు కూడా ఉన్నారు.



ఆలయం వద్ద జస్టిస్ ఇందిరా బెనర్జీ తదితరులు



ఆలయం వద్ద జస్టిస్ భవానీ ప్రసాద్ తదితరులు

రూ.35 వేల ఫీజుతో కాలేజీలు నడపడమెలా?

ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం

సాక్షి, అమరావతి: ప్రభుత్వాలు చేయలేనంతగా భారీగా పెట్టుబడులు పెట్టి ఇంజనీరింగ్ తదితర ప్రొఫెషనల్ కాలేజీల ద్వారా రాష్ట్రంలో ఉన్నత విద్యను అందిస్తున్న తమ సంస్థలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రభుత్వానికి విన్నవించింది. ఫీజులు తక్కువగా ఉండడం, వాటిని సకాలంలో విడుదల చేయకపోతుండడంతో సిబ్బంది వేతనాలు, కాలేజీల నిర్వహణకు వడ్డీలకు అప్పులు తెచ్చి వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే తమ సంఘం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపారు. విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు ఎం.శాంతిరాముడు, ఉపాధ్యక్షుడు సి.గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.విజయభాస్కర్‌చౌదరి, సంయుక్త కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కోశాధికారి ఎం.వి.కోటేశ్వరరావులు మాట్లాడారు. ''రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఏఐసీటీఈ నిబంధనలను పాటిస్తూ విద్యాప్రమాణాలనూ పెంచుతున్నాం. ప్రభుత్వంలో నాలుగు లక్షల మంది ఉద్యోగులుంటే మా కాలేజీల్లోనే 1.20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాం. ఏటా అయ్యే వ్యయానికి తగ్గట్టుగా మాకు ఫీజులు ఉండడం లేదు. కనిష్టం రూ.35 వేలు, గరిష్టం 1.02 లక్షల ఫీజుగా నిర్ణయించారు. ఇందులో రూ.35 వేల ఫీజు ఉన్నవే 75 శాతం కాలేజీలున్నాయి. ఇంత తక్కువ మొత్తంతో కాలేజీలు నడపడం చాలా కష్టమవుతోంది. కనిష్ట ఫీజును రూ.60 వేలు, గరిష్ట ఫీజు రూ.1.25 లక్షలుగా చేయాలి'' అని చెప్పారు.

12న సీఈసీ ముందుకు కమల్

సాక్షి, చెన్నై: విశ్వనటుడు కమల్ రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్‌కు ఈనెల 12న సీఈసీ ముందుకు వెళ్లనున్నారు. పార్టీ పేరు, జెండా, సిద్ధాంతాలను సీఈసీకి సమర్పించి, రిజిస్ట్రేషన్‌కు తగ్గ చర్యలకు నిర్ణయించినట్టు తెలిసింది. ఈనెల 21న భారత రత్న, దివంగత అబ్దుల్ కలాం పుట్టిన రామేశ్వరం గడ్డ మీద నుంచి పార్టీ పేరును ప్రకటించాలని నిర్ణయించారు. ముందుగా పార్టీ పేరు, జెండా, సిద్ధాంతాలు తదితర అంశాలను కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి రిజిస్ట్రేషన్‌కు చర్యలు చేపట్టారు. ఇందుకు ఆయన ఐదు గురితో కూడిన కమిటీని నియమించారు. కమల్ సన్నిహితుడు రాశి అలగప్పన్, జిల్లాకు ఐదుగురు అభిమాన సంఘం నేతల్ని చెన్నైకు శనివారం పిలిపించారు. వారందరి చేత ప్రమాణ పత్రాల మీద సంతకాలు చేయించి ఉండడంతో పాటు, ఆయా జిల్లాల తరపున పార్టీ పేరు, జెండా, సిద్ధాంతాలను బలపరిచే విధంగా ఓ తీర్మానం చేసి, వాటిని సీఈసీకి సమర్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

వెలిగొండ సొరంగాల్లో అక్రమాల ప్రవాహం

- రెండు సొరంగాల కాంట్రాక్టర్లపై ఏపీడీఎస్ఎస్ 60సీ నిబంధన కింద వేటు
- రెండు సొరంగాల్లో మిగిలిన పనుల విలువ భారీగా పెంపు
- ఆ పనులను తన కోటరీ కాంట్రాక్టర్లకే అప్పగించాలని అధికారులకు ముఖ్యనేత ఆదేశం

సాక్షి, అమరావతి: సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలకు ఇదో పరాకాష్ట. పాత కాంట్రాక్టర్లపై వేటు వేయడం.. మిగిలిపోయిన అరకొర పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేయడం.. వాటిని అస్మదీయులకు అప్పగించి కమీషన్‌లు కాజేసే వ్యూహాన్ని 'ముఖ్య'నేత సమర్థంగా అమలు చేస్తున్నారు. తాజాగా వెలిగొండ ప్రాజెక్టులోనూ అదే వ్యూహం అమలుకు రంగం సిద్ధం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు మొదటి సొరంగంలో మిగిలిన 3.6 కిలోమీటర్ల పనులను రూ.116.44 కోట్లతోనూ... రెండో సొరంగంలో మిగిలిన 8.037 కిలోమీటర్ల పనులను రూ.299.48 కోట్లతో పూర్తి చేయవచ్చునని అధికారులు ప్రతిపాదించారు. కానీ ముఖ్యనేత ఒత్తిడితో మొదటి సొరంగంలో మిగిలిపోయిన పనుల అంచనా విలువ రూ.301.01 కోట్లకు, రెండో సొరంగంలో మిగిలిపోయిన పనుల అంచనా విలువను రూ.730.04 కోట్లకు పెంచేశారు. రెండు సొరంగాల పనులను కోటరీలోని ఇద్దరు కాంట్రాక్టర్లకు దక్కేలా నిబంధనలు రూపొందించి మార్చి మొదటి వారంలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో కోటరీ కాంట్రాక్టర్ల నుంచి భారీ ఎత్తున ముఖ్యనేతకు ముడుపులు ముట్టనున్నాయని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

ఇప్పటికి రూ.68.44 కోట్లు సమర్పణ

శ్రీశైలం జలాశయం నుంచి 43.5 టీఎంసీలను తరలించి ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీళ్లు.. 885 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.5150 కోట్ల వ్యయంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వెలిగొండ ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టులో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కొల్లంవాగు మీదుగా కొండలను తవ్వుతూ నిర్మించే రెండు సొరంగాల పనులు ప్రధానమైనవి. మొదటి సొరంగాన్ని 7 మీటర్ల వ్యాసార్థంతో 18.828 కిలోమీటర్ల పొడవున తవ్వే పనులను రూ.624.60 కోట్లకు, రెండో సొరంగం 9.2 మీటర్ల వ్యాసార్థంతో 18.838 కిలోమీటర్ల తవ్వే పనులను రూ.735.21 కోట్లకు కాంట్రాక్టర్లకు అప్పగించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి మొదటి సొరంగం పనులు 13.146 కిలోమీటర్లు, రెండో సొరంగం పనులు 9.413 కిలోమీటర్లు పొడవున లైనింగ్‌తో సహా పూర్తయ్యాయి. ఇద్దరు కాంట్రాక్టర్లు టీడీపీ సానుభూతిపరులే కావడంతో వారితో ముఖ్యనేత కుమ్మక్కయ్యారు. టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం)ల బుష్‌లు అరిగిపోయాయని.. కన్వేయర్ బెల్ట్ పాతబడిందని.. విదేశీ మారక ద్రవ్యంలో మార్పుల మేరకు అదనపు నిధులు ఇస్తే పనులు వేగంగా చేస్తామని కాంట్రాక్టర్లతో ప్రతిపాదింపజేశారు. ఆ తర్వాత ఆ ప్రతిపాదనపై కేబినెట్‌లో ఆమోదముద్ర వేయించి మొదటి సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.50.15 కోట్లు, రెండో సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.18.29 కోట్ల వెరసి రూ.68.44 కోట్లను జూలై 5, 2016న ఒకేసారి అదనంగా దోచిపెట్టారు. అదనపు నిధులు ఇస్తే రోజుకు పది మీటర్ల చొప్పున సొరంగం తవ్వుతామని కాంట్రాక్టర్లు ప్రతిపాదించారు. కానీ ఇప్పటికి మొదటి సొరంగం పనులు కేవలం 1.949 కిలోమీటర్లు, రెండో సొరంగం పనులు 1.177 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తయ్యాయి. ఇదే అదనుగా తీసుకున్న ముఖ్యనేత మరో దోపిడీకి తెరతీశారు. వెలిగొండ ప్రాజెక్టును జూన్ నాటికి పూర్తి చేయాలంటే సొరంగాల పనులను ఇతర కాంట్రాక్టర్లకు అప్పగించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దాంతో రెండు సొరంగాల కాంట్రాక్టర్లకు 60సీ కింద నోటీసులు ఇచ్చిన అధికారులు మొదటి సొరంగంలో 15.200 కిలోమీటర్ల నుంచి 18.800 కిలోమీటర్ల వరకూ.. రెండో సొరంగంలో 10.750 కిలోమీటర్ల నుంచి 18.787 కిలోమీటర్ల వరకూ తవ్వే పనులను పాత కాంట్రాక్టర్ల నుంచి మినహాయించారు. ఇందులో మొదటి సొరంగం పనులను రూ.116.44 కోట్లతోనూ రెండో సొరంగం పనులను రూ.299.48 కోట్లతోనూ పూర్తి చేయవచ్చునని ప్రతిపాదించారు. 2005–06 నుంచి ధరల సర్దుబాటు(జీవో 22) నిబంధనను వర్తింపజేసినా మొదటి సొరంగం పనుల విలువ రూ.186.31 కోట్లు, రెండో సొరంగం పనుల విలువ రూ.479.17 కోట్లకు మించదని లెక్కగట్టారు. ఈ మేరకు టెండర్లు పిలవడానికి అనుమతి ఇవ్వాలని ప్రతిపాదనలు పంపిన అధికారులపై ముఖ్యనేత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అంచనా వ్యయం మరింత పెంచాలంటూ ఒత్తిడి తెచ్చారు. దాంతో మొదటి సొరంగం పనుల అంచనా వ్యయం రూ.301.01 కోట్లకు, రెండో సొరంగం పనుల అంచనా వ్యయం రూ.730.04 కోట్లకు పెంచేశారు. టన్నెల్ బోరింగ్ మెషీన్‌లను పాత కాంట్రాక్టర్ల నుంచి కొనుగోలు చేయడం, కొత్త బుష్‌లు అమర్చడం, కన్వేయర్ బెల్ట్‌ను మార్చడం వల్ల అంచనా వ్యయం పెరిగిందంటూ కాకమ్మ కథలు అల్లారు. అదే ధరలతో టెండర్ల ద్వారా ముఖ్యనేత కోటరీలోని కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టడానికి రంగం సిద్ధం చేశారు.



దీన్నేమంటారు బాబూ?

సొరంగాన్ని వేగంగా తవ్వడం పేరుతో టీబీఎంలకు కొత్త బుష్‌లు అమర్చేందుకు, కన్వేయర్ బెల్ట్ మార్చేందుకు ఇప్పటికే రూ.68.44 కోట్లను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. కానీ.. ఆ నిధులను కాంట్రాక్టర్లు, ముఖ్యనేత పంచుకోవడం వల్ల టీబీఎంలకు కొత్త బుష్‌లు అమర్చలేదు.. కన్వేయర్ బెల్ట్ మార్చలేదు. దీనివల్ల పనులు నత్తనడకన సాగాయి. తాజాగా పనులను వేగంగా పూర్తి చేయడం పేరుతో టెండర్లు పిలిచేందుకు సిద్ధమయ్యారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే సొరంగాల పనులను పూర్తి చేయడం మాటేమోగానీ.. దాన్ని సాకుగా చూపి కాంట్రాక్టర్లకు పదే పదే అదనపు నిధులు ఇస్తూ కమీషన్‌లు కాజేస్తున్నారన్నది స్పష్టమవుతోందని అధికారవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

పిల్లి మాంసంతో బిర్యానీ

చెన్నైలో విక్రయం

టీ.నగర్(చెన్నై): హోటళ్లలో సాధారణంగా చికెన్, మటన్ బిర్యానీ అందుబాటులో ఉంటుంది. కానీ, చెన్నైలో ఫుట్‌పాత్ దుకాణాల్లో పిల్లిమాసంతో బిర్యానీ విక్రయిస్తున్న విషయం బట్టబయలైంది. చెన్నైలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలో పెంచుకుంటున్న పిల్లులు తరచూ కనిపించకుండా పోతున్నాయి. దీంతో పిల్లులు పోగొట్టుకున్న వారు గత నెలలో పోలీసు కమిషనర్ విశ్వనాథన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. విచారణలో నక్కలవాళ్లు చెన్నై, శివారు ప్రాంతాల్లో అనేక ఏళ్లుగా పిల్లులను పట్టుకుని, ఫుట్‌పాత్‌పై బిర్యానీ తయారు చేసే దుకాణ యజమానులకు రూ.50కు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.